# ఎర్రసీత

నవల

\- గొల్లపూడి మారుతీరావు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 157

కౌముది మాసపత్రికలో

జనవరి 2011 సంచిక నుంచి ఆగస్ట్ 2012 సంచిక వరకూ వచ్చిన

సీరియల్‌గా వచ్చిన నవల

*(పదిహేనేళ్ళ క్రిందట పాఠకుల్ని ఉర్రూతలూగించిన నవల)*

**ఈ నవల చదవబోయే ముందు** 'కౌముది' పాఠకులకి ఒక విశేష సమాచారం. ఏ రచనకైనా సార్థకత లభించేది నిర్దేశిత పాఠకుల హృదయాలని చేరినప్పుడే విద్యావంతులు, ఆలోచనాపరులు, మేధావులు ఐన పాఠకలోకాన్ని చేరడమనేది ఏ రచయితకైనా లభించే విశిష్ట గౌరవం. 'ఎర్రసీత', 'సాయంకాలమైంది' నవలాభిమానుల్లో ఈ వర్గాల వారితో బాటుగా, ఒక ప్రత్యేకమైన అభిమాని కూడా ఉన్నారని మారుతిరావుగారికి నాలుగేళ్ళక్రిందట అందిన ఒక ఉత్తరం ద్వారా తెలిసింది. ఆ అభిమాని కరడుకట్టిన హంతకుడుగా ముద్రవేయించుకుని చెర్లపల్లి జైలులో శిక్షననుభవిస్తున్న (ఆ ఉత్తరం వ్రాసినప్పుడు) ఒక ఖైదీ!! హంతకుడి మనసుని సైతం కరిగించిన మరుతిరావుగారి ఈ నవలగురించి ఆ అభిమాని వాక్యాల్లోనే చదవండి. (ఉత్తరంలోని కొన్ని భాగాలని, కావాలని, మాస్క్ చేయడం జరిగిందని పాఠకులు గమనించగలరు).

చివరలో అతడొక వాక్యం వ్రాశాడు..

" మీలాంటి గొప్పవ్యక్తిని నా యీ జీవితకాలంలో ప్రత్యక్షంగా చూసి తరించి, మీ పాదాలని స్పృశించి జన్మ ధన్యం చేసుకునే అదృష్టం నాకు కలుగుతుందో లేదోనని బెంగగా ఉంది..గురువు గారూ..!" అని. అతడు బెంగపడినట్టే మారుతిరావు గారిని ఎప్పుడూ కలుసుకోలేదు. ఇక ముందు ఎప్పటికీ కలుసుకోలేడుకూడా.. ఎందుకంటే ఈ ఉత్తరం వ్రాసిన రెండేళ్ళకే అతడు, జైలునుంచి విడుదల కాకుండానే, ఈ లోకాన్నుంచి నిష్క్రమించాడు..!!

మా ముత్యాల చేతి కర్రతో గొల్లపూడి గారి తల పగలగొట్టాలని పళ్ళు నూరుకున్నాను సినిమా చూసినప్పుడు. ఇంత కోపం ఎందుకంటే ఒక స్త్రీని నాశనం చేస్తే కోపం రాదా మరి. ఆ సమయంలో మీరు కనుక నాకు ఎదురుపడి వుంటే, నేను నాకు కొంతైనా ఓపిక ప్రయత్నం చేసి తెలిసి చేతితో లాగి దెబ్బ ఆడదాని మీద ఒక్క దెబ్బ తగలకుండా పగిలిపోయుండేది.

త్రిశూలం సినిమాలో జయసుధ గారి జీవితాన్ని నాశనం చేసింది మీ పాత్ర మాత్రమేనని, ఖచ్చితంగా మీరు కాదని, ఆ సినిమా చూసిన చాలా కాలానికి గాని నాకు అర్థం కాలేదు. అలా మీరు పాత్రలో జీవించి నన్ను ఇంతగా బాధపెట్టాలా చెప్పండి?


ఇంతకీ మీకెవరూ నాయనా: ఇది మీ ఒక్కరి పైన గల అక్కర్లేని అర్థంలేనిది. నేను మీ మంచి శత్రువుని. ఇంటి ముందు మీ శత్రువుని, ఆ తరువాత మీ మంచి శ్రేయోభిలాషిని. ఒట్టు, సార్, నేను చెప్పేది పచ్చి నిజం, మీ బొమ్మల మీదొట్టు.


గౌరవనీయులు, పూజ్యులైన మా గొల్లపూడి మారుతీరావు గారికి నా నమస్సులు. ముందుగా చెప్పిందంతా ఒకప్పటి నా భావాలు. ఇప్పుడు మీరు నా మనస్సులో ప్రత్యేక స్థానం. నా పేరు శ్రీనివాసరెడ్డి. మిత్రులు, శ్రేయోభిలాషులు ముద్దుగా మొద్దు శీను అంటారు. ప్రస్తుతం పశ్చిమ జైలులో ఖైదీగా ఉండి మీ కలం దెబ్బతో వడదెబ్బ తగిలి వ్రాశాను.

జైలులో కాలక్షేపం కోసం రకరకాల పుస్తకాలు చదువుతుంటాను. ఒక రోజు లైబ్రరీ వెతుకుతుంటే 'ఎర్రసీత' కనిపించింది. రచయిత పేరు చూస్తే మీ పేరుంది. అయిష్టంగానే ఆ రచయిత ఆసక్తిగా, నవల పేరు చూసి ఏదో మాస్టర్ లైఫ్ అనుకొని కాలక్షేపం ఆ పుస్తకం తీసుకున్నాను. అప్పుడు.....

అప్పుడు తెలిసింది మారుతీ బలమెంతో. నవల ఎర్రసీతను నా కన్నీళ్లతో తడి నాలుగైదు సార్లు చదివానంటే ఎంత నన్నెంత అర్థమయింది. కళ్ళు మూసుకుంటే, కర్రవేస్తే సారంగా మాయమయ్యే చేసిందంటే ఆ ఒక్క ముక్కతోనే చదివినా తృప్తిగా నాలుగైదు సార్లు. మీ శైలి నాకు తెలిసినంతవరకు మరో రచయితకు లేదనిపించింది. ఇంతగా కదిలించింది నా మనసు నేటికీ. ఇలా రచయితకు ఉత్తరం రాయటం ఇదే మొదటిసారి. ఇంతగా కదిలించింది నా మనస్సు నేడు. ఎన్నో భావాలు పలికించారు సీతతో. పక్షులను మనుషులుగా సీతని చేయగల్గారు మీ ఎర్రసీత. ఎంత సౌందర్యంగా, ప్రేమగా వర్ణించారండీ మారుతీ గారు!

'ఎర్రసీత' మీద ప్రేమతో మారుతి గారు పాయింటు ఇస్తుంది నా మనసుకు. ఇది మరి మరి మరి నచ్చిందండి నాకు. బాల్యం నుండి అనాథల కష్టాలకి స్పందించే నేను, వారికి చేతనయింత మరి ఎంతో సాయం చేసిందాన్ని మరింతగా స్పందిస్తాను. అనాథల కష్టాలు నా కన్నీళ్లతో ఎన్నోసార్లు స్వయం చేసిందానికి. ఇంకా నన్ను ఒక పుస్తకం నా మనసు మనస్సు కుదిపి, వేదనతో కుంపి కన్నీటిని కార్చేలా చేసింది. మీరు నా ఎదురుగా ఉంటే మీ పాదాలకు ఏది సాష్టాంగ నమస్కారం చేసి ఉండేవాడిని. చిన్నప్పుడు త్రిశూలం వల్ల మీరు చేసిన గాయంతో మీ మీద నాకెప్పుడూ సదభిప్రాయం లేదు. నాకు ఈ రోజు నా కుటుంబం తరువాత ప్రేమించదగిన, అభిమానించదగిన మా గొల్లపూడి గురువుగారికి.


గొల్లపూడి మారుతిరావు గారికి నా వేల వేల వందనాలు.
J. Srinivasa Reddy.
U.T.No: 405
MAHANADI BLOCK
CHERLAPALLI CENTRAL JAIL
HYDARABAD


500
भारत INDIA
CENSORED
Jailor Central Prison
Cherlapally
To
GOLLAPUDI MARUTI RAO
6.SARADAMBAL STREET; GOKULAM COLONY;
T.NAGAR; CHENNAI.
PIN 6 0 0 0 1 7

# (నవలలోకి నడవండి)

**మునాంగహేల సూర్యుడి** వెలుగులో బంగారం పరిచినట్టు మెరుస్తోంది. పిట్స్‌బర్గ్ పచ్చని వాతావరణం ఎప్పుడూ సీతని ఉత్సాహ పరుస్తుంది. జెట్‌లాగ్ ఇప్పటికీ తెలుస్తోంది. బాబీ ఆఫీసుకి వెళ్ళిపోయుంటాడు. ఆకలి మాటదేవుడెరుగు. అయిదారు గంటలు నిద్రపోవాలి. శ్రీను పక్క సీట్లో పడుకున్నాడు హాయిగా. ఎయిర్ పోర్టులో దిగడానికి విమానం పీలూప్ తీసుకుంది. ఆలిగిని, ఓహాయ్

నదులు తెలుస్తున్నాయి. వరసగా కార్లు కొండలోపలి సొరంగంలో మాయమవుతున్నాయి. మూడు నదులూ రెడ్ ఇండియన్ల పేర్లు. మునాంగ హేల మొదటి రూపం 'అనంగ హేల'యేమో. ఇడో తెలుగువాడు బారసాల చేశాడేమో. ఇంతదూరం వెంకటేశ్వరస్వామి రాగా లేనిది - తెలుగువాడు ముందుగా ఎందుకు వచ్చి ఉండకూడదు?

తన సెక్రటరీ జామీలీ ఎయిర్ పోర్టుకి వస్తున్నానని ఫోన్ చేసింది. రెండు నెలల తర్వాత వస్తున్న పెళ్ళాన్ని కళ్ళారా చూడాలనయినా ఆ మగాడికి లేదు. తన కోసం కాకపోయినా, శీను కోసం, నాన్సీ కోసం! అన్నట్టు నాన్సీ... చుట్టూ చూసింది. వెనక సీట్లో ఎవరో ఫ్రెండ్సుతో కబుర్లు చెపుతోంది. నాన్సీని అడివిలో వదిలేస్తే - అరగంటలో ఆరుగురు ఫ్రెండ్సుతో బయటికి వస్తుంది. ఎవరూ లేకపోతే.. చెట్లూ చేమలతో, జంతువులతో చెయ్యి కలుపుతుంది. అంతా వాళ్ళ నాన్న బాబీ పోలికే!

యు.ఎస్ ఎయిర్ విమానాల సేన మధ్యకి తమ విమానం పాకుతోంది. బాబీకి ఇండియా వెళిపోదామని చెప్పాలి. పిట్స్‌బర్గ్ చలి తనకి బొత్తిగా వ్యతిరేకం. పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ స్కాలర్ షిప్ కోసం కాకపోతే తనెప్పుడో పారిపోయేది.

సాఫ్ట్‌వేర్ సిస్టమ్ అంతా మారిపోయిందని చెప్పింది జామీలీ ఫోన్‌లో. అదో తలనొప్పి. ఓ పక్క యూనివర్సిటీలో చదువుకుంటూ, తనకి సెక్రటరీగా పనిచేస్తున్న దక్షిణ కొరియా అమ్మాయి లీ. వచ్చిన సంవత్సరంలోనే ఓ అమెరికన్ కుర్రాడితో స్నేహంలో పడి కడుపయితే, తను సహాయపడి గర్భస్రావం చేయించింది. ఆ రోజుల్లో ఆత్మహత్యదాకా ఆలోచించిన ఆ అమ్మాయికి జీవితం అంటే సెక్స్, ప్రేమ మాత్రమే కాదని నూరిపోసినందుకు తనమీద కృతజ్ఞతతో పనిచేస్తోంది లీ. మరో నెలరోజులు కుస్తీపడితే కాని కంప్యూటర్లు చెప్పినమాట వినవు.

బాబీ ఇంటిని ఎలా ఉంచాడో?! తనకి మధుమీద ఎక్కువ నమ్మకం. డాడీని చెప్పు చేతల్లో ఉంచగలిగినవాడు మధు ఒక్కడే ఆ మాటకి వస్తే తనని కూడా!

శీనుని నాన్సీ ఎత్తుకుంది. "వెల్‌కం టు పిట్స్ బర్గ్ మమ్మీ" అంది నవ్వుతూ.

కోరి ముద్దుగా పెట్టుకున్న నళిని అన్నపేరు నాన్సీకాకుండా ఆపాలని నాలుగేళ్ళు తండ్రి, కూతుళ్ళతో పోరింది సీత. కాని తండ్రి, అమెరికా, ఆమె స్నేహితులు.. అంతా దాన్ని నాన్సీని చేశారు. ఇండియా వెళ్ళినపుడు.. కేవలం ఇండియా కోసం రెండుసార్లు పరికిణి కట్టుకుంది. తను మాత్రం.. లండన్ నుంచే మాక్సీలోకి మారిపోలేదూ! యద్యదాచరతి శ్రేష్ఠః

నాన్సీ ఎయిర్ పోర్టు అంతా కళ్ళతో వెదికేస్తోంది. ఎందుకో సీతకి తెలుసు.

"మీ డాడి రావడంలేదు తల్లీ, ఆయనగారు షికాగో వెళ్ళారు - రేపు రాత్రి వస్తారు."

"ఓహ్ డామ్!" అంది నాన్సీ విచారంగా.

"కమాన్ మమ్మీ - హి కెన్ డూ బెటర్ దాన్ దట్" అన్నాడు శీనూ.

పదేళ్ళ శీను ఇరవై ఏళ్ళ కిందటి అమెరికా గుండెకాయతో పుట్టాడు. వీళ్ళని ఎంత త్వరగా ఇండియా ఎత్తుకు పోతే అంత మేలు. ఇండియా వెళ్ళి వచ్చినప్పుడల్లా ఈ ఆలోచనలు తేనెపట్టులాగ పట్టుకు పీకుతాయి. మళ్ళీ జామీలీ, యూనివర్సిటీ, బాబీ - ఎల్లిస్ స్కూల్ థియేటర్ వర్క్... అన్నీ మళ్ళీ అమెరికాలోకి లాగేస్తాయి.

పిట్స్‌బర్గ్ ఎయిర్ పోర్ట్ ఎప్పుడూ బస్సు డిపోలాగా ఉంటుంది. జామీలీ కోసం చుట్టూ వెదికింది. ఎక్కడా లీ జాడలేదు. కాస్త విసుగొచ్చింది. ఇంతలో శీను అరిచాడు.. "లుక్!" అని, సిగరెట్లు కాల్చుకునే చోట హడావిడిగా సిగరెట్టు ఊదుతూ కనిపించింది లీ. అక్కడినుంచే సీతని గమనించి చెయ్యి ఊపుతూ, సిగరెట్టు ఆఖరి పీల్పుని వదలలేక వదలలేక వదులుతూ పరిగెత్తింది. నీలి రంగు స్కర్ట్, తెల్లని షర్టు.. ఎప్పుడూ పువ్వులాగ ఉంటుంది లీ. శీను ఆ అమ్మాయి ఫేవరెట్.

బాబీ ఎయిర్ పోర్టుకి రాడని తెలుసు. మరో మనిషి కోసం చుట్టూ వెదికింది సీత.. మధు. "ఎక్కడ.. మధు ఎక్కడ?"

"సారీ, మేడమ్, బాబీతో వెళ్ళాడు మధు, రేపు చికాగోలో హార్స్ పోలో మాచెస్ ఉన్నాయట" అంది లీ.

"బాస్టర్డ్!" అని గావుకేక పెట్టింది సీత. హార్స్ రేసులు అన్నా. పోలో అన్నా ఒళ్ళు తెలియదు మధుకి. వాళ్ళ నాన్న దుంప తెంచి ఉంటాడు.

"నాకేమయినా ఫోన్ కాల్స్ వచ్చాయా?" అంటున్నాడు శ్రీను. వాడికి కంప్యూటర్ గేమ్స్ అంటే పిచ్చి. కంప్యూటర్ ఉంటే ఇండియాకి రాడని.. బాబీ, లీ, సీత ఏకమై.. ప్రయత్నంతో వాడి కంప్యూటర్‌ని చెడగొట్టారు. శీను కళ్ళనీళ్ళపర్యంతం అయి, తప్పనిసరిగా మమ్మీతో ప్లేన్ ఎక్కాడు.

"రాగానే మిమ్మల్ని మాట్లాడమన్నారు మేడమ్" అంటూ సెల్ చేతికిచ్చి కారీ బాగ్‌ని అందుకుంది లీ.

సీత నంబర్లు నొక్కింది. ఈ టైముకి కాన్ఫరెన్స్‌లో ఉంటాడు. బాబీ నంబరు మోగుతోంది. సింథియా లైన్‌లోకి వస్తుంది. సెల్ కూడా సెక్రటరీకే ఇస్తాడు బాబీ.

"ఒకె ఓకె.. గివ్ ఇట్ టు యువర్ డామ్నేడ్ బాస్" అంది సీత సింథియాతో - ఆమె కుశల ప్రశ్నల్ని విసుక్కుంటూ.

"హాయ్ డార్లింగ్! నేను ఇండియా రాకపోవడం వల్ల ముప్పయ్ వేలు షేర్ మార్కెట్లో.." ఉపోద్ఘాతం లేకుండానే మొదలెట్టాడు బాబీ.

ఇలాంటి హృదయం లేని కంప్యూటర్‌ని ఎలా పెళ్ళిచేసుకున్నాను నేను?! "అవును.. నువ్వు ఇండియాకి రాకపోవడం వల్ల 30 వేలు లాభం. పెళ్ళాన్ని రిసీవ్ చేసుకోకపోవడం వల్ల పదిహేను వేలు, అసలు పెళ్ళిచేసుకోకపోతే...."

బాబీ నవ్వుతున్నాడు. "నీతో మరో రెండు నిమిషాలు మాట్లాడితే పెంటియమ్ షేర్స్ త్రీ పర్సెంట్ మీదకి పోతుంది. కిస్ నాన్సీ అండ్ శీను ఆన్ మై బిహాఫ్, ఐ లవ్ యూ, రాత్రి మాట్లాడుతాను" లైన్ కట్ అయింది.

సీత నవ్వుకుంది. బాబీని కంప్యూటర్ చేసింది తన ప్రేమేనేమో! అతడి సామర్థ్యాన్ని, దక్షతని రెచ్చగొట్టింది తను. తన కళ్ళలో గర్వం అతనికి ఎడ్రినలిన్.

లీ లగేజీ కోసం వెళ్ళింది. తనకి ఒక సిగరెట్టు కాల్చాలన్న వ్యామోహం లాగుతోంది. ఈ దురలవాటు వేపుకి తనని లాగింది లీ. లీని వారించకుండా ఉండేందుకు ఆ అమ్మాయి తెలివిగా సీతకి ఆ అలవాటు మప్పింది. ప్రస్తుతం పది సిగరెట్లు దగ్గర ఆగింది అలవాటు. సిగరెట్టుని చుట్టకన్నా అధ్వాన్నంగా పట్టుకుని ఎలా కాలుస్తుందో 20 ఫోటోలు తీసి గోడలకి అతికించాడు బాబీ. ఆమెకి తెలీకుండా డ్రాయింగ్ రూంలో వీడియో పెట్టి, ఆమె అమెచ్యూర్ పద్ధతిని వెక్కిరింతగా ప్రదర్శించాడు. నిజమే, సిగరెట్టు కాల్చడంలో తనలో

సోఫిస్టికేషన్ లేదు. మరెందుకు? మనస్సులో ఏ మూలో సంప్రదాయానికి తిరగబడే బలమైన నరాలున్నాయి. సిగరెట్టులో నికోటిన్ వాటిని మత్తెక్కిస్తుంది. సిగరెట్టు కాల్చడం వాటిమీద పగ తీర్చుకోవడం?

ఇప్పుడు రెస్టారెంటు వేపు చూసి గతుక్కుమంది సీత. చేతిలో సిగరెట్టు తనకి తెలియకుండానే జారిపోయింది. నాలుగేళ్ళుగా.. అంటే తను సిగరెట్లు కాల్చడం ప్రారంభించినప్పట్నుంచీ తన నరాలకి ఎక్కిస్తున్న నికోటిన్ ఒక్కసారిగా కరిగిపోయి, నరాలు సళ్ళిచ్చినట్టనిపించాయి. తనకి కనిపించిన దృశ్యం అలాంటిది. *ఒక్క క్షణం తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. ఎక్కడో జయపూర్‌లో మనిషి ఇన్నివేల మైళ్ళ దూరంలో.. పిట్స్‌బర్గ్‌లో - ఇక్కడేం చేస్తున్నాడు!*

జీవితంలో మొదటిసారిగా దేశం దాటి వచ్చిన వాడి వాలకం తెలుస్తోంది కొండలరావులో ఆయన చేతిలో సంచి బహుశా బరంపురం. సునాబెడం పర్లాకిమిడి - అడపాదడపా సాలురు, విజయనగరం ప్రయాణం చేసి ఉంటుంది. ఆ సంచికి అమెరికా పిట్స్‌బర్గ్ కొత్తే. దాని ఓనరుకీ అంతేనని స్పష్టంగా తెలుస్తోంది.

కొండలరావు ఇక్కడేం చేస్తున్నాడు? సంతలో తప్పిపోయిన వాడిలాగ దిక్కులు చూస్తున్నాడు కొండలరావు. ఎస్సెల్సీ తెలివితేటలు అమెరికా వాతావరణానికి చాలడం లేదు. అతని ముఖంలో కాస్తపాటి భయమూ తెలుస్తోంది. ఎవరికోసమో అతని కళ్ళు వెదుకుతున్నాయి. తన కోసమా?

పలకరించాలా వద్దా అని ఇంకా తటపటాయిస్తూండగానే కొండలరావు ఇటు తిరిగాడు. జీన్స్, షర్టులో ఉన్న సీతని గమనించాడు. ఒక్క క్షణం అతని కళ్ళు ఆమెని దాటి ప్రయాణం చేశాయి. అంతలో పదహారేళ్ళ కిందటి జ్ఞాపకమేదో వెనక్కి లాగింది. అతని చూపు ఆమె మీద నిలిచింది. అతని ముఖంలో ఆ క్షణాన కనిపించిన భావాలకి మాటలు వెదకలేకపోయింది సీత. ఆ కళ్ళలో ఆశ్చర్యం ఉంది. సీత అవతారం చూసి షాక్ తిన్నాడు. కాస్తపాటి ఉదాసీనత ఉంది. ఇంకేదో... ఇంకేదో ఉంది.

అతనికి తెలియకుండానే అతని కాళ్ళు ఆమె వేపు అడుగులు వేశాయి. సీత కదలలేకపోయింది. దగ్గరకి వస్తోన్న కొద్దీ తన శరీరం మీద ఉన్న ఎక్‌లెయిర్ సెంటు వాసన విషంలాగా అనిపిస్తోంది.

''పండూ!'' అన్నాడు కొండలరావు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

అంతే.. సీతకి దుఃఖం పెల్లుబికి వచ్చేసింది. కళ్ళు, పెదాలు, చెక్కిళ్ళు ఏడుస్తున్నాయి. అమెరికా సంప్రదాయంలో ఏడుపుని దాచుకునే ఆ అలవాటు కాస్త సహకరించింది. కళ్ళని దాటిరాకుండా నీళ్ళని ఆపగలిగింది.

కొండలరావు గొంతు ముసిలిదయిపోయింది. ఆయన శరీరమూ ముసిలిదయింది. కాని, ఆ పిలుపు.. అది పాతబడలేదు. పాడుబడలేదు. ''పండూ''!

''హౌ ఆర్ యూ?'' అమెరికా అలవాటే ముందుకు వచ్చింది. సమాధానాలు ఇద్దరికీ వెదుక్కునే అవకాశం లేకపోయింది.

''ఒరే కొండ్రావు.. ఇక్కడున్నావా? మనవాడి అడ్రసు దొరికింది - 219 హ్యారో డ్రైవ్. త్వరగా ఫోన్ చెయ్యాలి. లేకపోతే ఆఫీసుకి బయలుదేరిపోతాడు'' అని లాక్కుపోయాడు పక్కనున్నతను.

లీ ఈ లోగా లగేజితో వచ్చింది. సర్దుకునేలోగా సీత కళ్ళలో కన్నీళ్ళు చూసింది. ఆమెనే చూస్తూ టెలిఫోన్లవేపు వెళుతున్న కొత్త ముఖాన్ని చూసింది.

''మాడమ్! ఆర్ యు ఆల్‌రైట్?''

సీత నిలదొక్కుకుంది.

"సంథింగ్ రాంగ్?" అడిగింది లీ.

సీత తల తిప్పింది.

వెళుతున్న వ్యక్తి చూస్తూ "ఎవరతను మాడమ్?" అడిగింది లీ.

ఏమని చెప్పాలి. ఎంత చెపితే తన సమాధానం ఆమెకి అర్థమవుతుంది? ఆ సమాధానం వెనక ఓ జీవితం ఉంది. ఓ ఛాలెంజ్ ఉంది. ఓ తెగింపు ఉంది. ఓ పరిష్కారం ఉంది. అంతకుమించి ఓ ముగింపు ఉంది. అయినా, సమాధానం చాలా క్లుప్తమయిందే!

*"ఆయన నా భర్త" అంది సీత.!!*

## 2

**ఎర్రసీత నల్లగా ఉంటుంది.** తనకూతురు ఎర్రగా ఉండాలని ఆమె తల్లి కల. తీరా సీత పుట్టాక అది తీరదని వాళ్ళమ్మ తేల్చుకుంది. ఆ కాన్పులో ఆవిడకి బిడ్డసంచి కూడా తీసేశారు. కనక పుట్టిన నల్ల సీతని చూసుకుంటూ పేరులో ఎర్రదనాన్ని కలుపుకుంది. ఎర్ర సీత పుట్టుకలోనే ఆమె జీవితంలో ఏర్పడిన మొదటి విపర్యమయం ఇది.

ఎర్రసీత మరో ఆరునెలలకి పుడుతుందనగా వాళ్ళ నాన్న జాలయ్య సాలూరు నుండి మచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌కి వచ్చాడు. ఆ రోజుల్లో ప్రాజెక్ట్ ఆఫీసర్లంతా టౌన్‌షిప్‌లో ఉండేవారు. చిన్న చిన్న పనులు చేసుకునే వాళ్ళంతా ఒనకడిల్లీలో ఉండేవారు - చిన్న ఇంటి వెనక తడికలు కట్టిన వసారాలో చిన్నమ్మ సిబ్బంది ఇళ్ళల్లో పాచి పని చేసేది. జాలయ్య రోజూ కాలి నడకన ఒనకడిల్లీ వెళ్ళి పనిచేసేవాడు. ప్రాజెక్ట్ దాకా దాదాపు ఇరవై మైళ్ళు పైన నడక. తను పాచి పనిచేసే ఇళ్ళలోనే రెండు పూటలు అన్నం సంపాదించేది. జాలయ్య కూలి, తన జీతం పైఖర్చులకి మిగిలేవి.

టౌన్ షిప్పు చాలా చిన్న - ప్రపంచం. మచ్‌ఖండ్ ఒరిస్సాలో చేరినా అంతా తెలుగు కుటుంబాలే, ఉన్న ఒరియా కుటుంబాలూ తెలుగు మాట్లాడగలిగిన వాళ్ళే. ఊరంతా కలసి నాలుగు వందల మంది కంటే ఉండరు. ఏ ఇంట్లో కొబ్బరికాయ పడినా ఊరంతా తెలుస్తుంది. అందరికీ ఒకే దేవుడు - అంతా కలసి కోరి ఏర్పాటు చేసుకున్న జగన్నాధస్వామి ఆలయం. డుడుమా జలపాతం పక్కనే - కాస్త దూరంగా - ఆనకట్ట. ఆనకట్ట దాటగానే ఆంధ్రప్రదేశ్. కొన్నాళ్ళక్కడ చిన్న తనఖీ ఉండేది. క్రమేపీ తనఖీ ఉద్యోగులూ, పోలీసులూ కూడా ఆ ప్రాంతంలో భాగమై పోయారు. ఆంధ్రా వైపు పోరగా పోరగా - చిన్న పాఠశాల ఉంది. దాన్నే మెల్లగా ఇంటర్మీడియట్ వరకు పెంచారు - ఇది మచ్‌ఖండ్ తెలుగువారికి వరప్రసాదం. అటువేపు నడిచినప్పుడల్లా పిల్లలు "శ్రీ రాముని దయతోడను -" పద్యం చదువుతూంటే మాతృభాషని మరిచిపోనందుకూ, ముందు తరానికి ఆ భాషని బాధ్యతగా అందిస్తున్నందుకూ పెద్దలు ఆనందిస్తారు. అయితే ఇక్కడికొచ్చే మేష్టర్లంతా గతిలేక, ఇష్టంలేక వచ్చే వాళ్ళే. వచ్చిందగ్గర్నుంచీ వెళ్ళిపోడానికి ప్రయత్నించే వాళ్ళూ, సెలవుల్లో ఇళ్ళ దగ్గరే ఉండేవాళ్ళు ఎక్కువ. గట్టిగా బెదిరిస్తే చదువుకునేవాళ్ళకి, చెప్పేవాళ్ళకి మధ్య చదువుకి పెద్ద వ్యత్యాసం కనిపించదు.

ఊళ్ళోకి తెలుగు పేపర్లు వస్తాయి. ఊరికి కాస్త దూరంగా చిన్న బంగళా కట్టుకున్న తెలుగు తెలిసిన ఒరియా కంట్రాక్టరు నిషిత్ నాయక్‌కి ఓ ఇంగ్లీషు పేపరు వస్తుంది.

సంవత్సరానికి తప్పనిసరిగా శ్రీరామ నవమికి వసంత నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఆ సమయంలో విజయనగరం నుంచి రెండు మూడు పులి వేషాలూ, ఓ భామాకలాపం, ఓ సాని మేళం వస్తాయి. ఒరియా నుండి ఓ డాన్సు బృందం వస్తుంది. ఇంతే ఆ చిన్న

ప్రపంచంలో కాస్త పాటి ఆట విడుపు. ఆ ఊరు పొద్దున్నే నాలుగు గంటలకి లేస్తుంది. పచ్చి వెదుళ్ళ వాసనా, పట్టపగలే వెలుగుని మరిచిపోయిన కీచురాళ్ళ ధ్వనీ వినిపిస్తుంటుంది. నడిచే వాళ్ళు ఒనకడిల్లీ దాకా నడుస్తారు పనులకి. కాస్త పెద్ద ఉద్యోగులు లారీల్లో వెళతారు. ఏమైనా పదయేసరికి ఊరంతా ఖాళీ అయిపోతుంది. కాస్త నదురుగా ఉన్న నలుగురు మగాళ్ళు - రోడ్డు మీద నిలబడి ఇళ్ళపేర్లు చెప్పి మరీ దోపిడి చేయగలిగినంత ఖాళీగా ఉంటుంది ఊరు. ప్రాజెక్టుకి వెళ్ళే రోడ్డు మొగిలో బెహరా టీ దుకాణం. ఇంట్లోనే కిరాణా సామాన్లు, బియ్యం, చింత పండు, సమస్తం అమ్మే కళింగ కోమటి మాధవరావు దుకాణం. ఊరికి కాస్త దూరంగా తన పాకే చిన్న సారాదుకాణం చేసుకున్న పంతంగి ఇల్లు. పంతంగి ప్రాజెక్టు తొలిరోజుల్లో భర్తతో సునాబెడ నుంచి వచ్చింది. ఆమెలో స్త్రీకి ఉండాల్సిన ఏ లక్షణాలూ - రూపులో, మాటలో, స్వభావంలో - ఉండవు. రెండేళ్ళ తర్వాత ఓ రాత్రి చెప్పా చెయ్యకుండా ఆమె భర్త పారిపోయాడు. ఎక్కడికి పారిపోయాడో, ఎందుకు పారిపోయాడో ఎవరికీ తెలీదు. అప్పటి నుండి వంటి చేతిమీద సారాదుకాణం నడుపుకు వస్తోంది. పంతంగి పాడేరు, అరకు, ఇటు కోరాపుట్ నుండి వచ్చే ఇసుక, సిమెంటు లారీల డ్రైవర్లు, క్లీనర్లు, కూలీలూ, కళాసీలు - అందరికీ సమాధానం చెప్పగల స్తోమతు ఉన్న మనిషి. మనిషి ఆకారంలో ఉన్న పరుషత్వం ఏ కోశానా స్వభావంలో లేని మనిషి. అవసరంలో ఉన్న వాళ్ళకి సారాకి అప్పివ్వడం దగ్గర్నుంచీ, ఖాయిలాపడిన వాళ్ళకి డబ్బు సాయం చెయ్యడం దాకా పంతంగికి పేరుంది. కొందరు డ్రైవర్లు ఆమె దగ్గర డబ్బు దాచుకుంటారని కూడా ప్రతీతి. బాగా హుషారుగా ఉన్నప్పుడు - తను కూడా నులక మంచం వేసుకు తాగి - పారిపోయిన భర్తకోసం శోకాలు పెడుతూ ఏడుస్తుంది. ఆ ఏడుపు పాటలాగా ఉంటుంది. ఆ భాష దాదాపు ఎవరికీ అర్థం కాదు. ఆమె ఎడమ బుగ్గలో ఎప్పుడూ బరంపురం కారా ఉండాల్సిందే - నిద్రపోయేటపుడు కూడా - నిద్రలో కూడా - అప్పుడప్పుడు పళ్ళు ఆ కారాన్ని కదుపుతూ ఉంటాయి.

మచ్‌ఖండ్ సముద్ర మట్టానికి కాస్త ఎత్తుగా ఉన్నా, చుట్టూ కొండల వల్ల వేడిగా ఉంటుంది. సంవత్సరంలో వర్షాలు దాదాపు ఆరునెలలు కురుస్తాయి. వర్షాల కారణంగానే పాడేరు దగ్గర ప్రారంభమైన చిన్ననది బలం పుంజుకుని మచ్‌ఖండ్ దగ్గర ప్రాజెక్టుని ఏర్పరిచే స్థాయికి ఎదిగింది.

ఈ నేపథ్యంలో సీత పుట్టి పెరిగింది. సీతకి చదువుకోవలసిన అవసరాన్ని కాని, ఆలోచన కాని ఎవరూ కలిగించలేదు. సీత పుట్టిన కొత్తలోనే చిన్నమ్మ కూతురు పెంపకానికి ఎక్కువ సంపాదన కావాలని గడుసుగా మొగుడిదీ, తనది ఆదాయం మిగిల్చి - ఓ గేదెని కొన్నది. ఆ గేదె, సీత ఒకే రకంగా పెరిగారు మచ్‌ఖండ్‌లో. గేదెకి నీళ్ళు పోసి, గడ్డితో కడిగి, అదే చెట్టు కింద సీతకి సున్నితో స్నానం చేయించేది చిన్నమ్మ. గేదెకి కుడితి తినిపిస్తూ - సీత అంబలి తాగేది. గేదెని అడివిలోకి దాణాకి తిప్పడం సీత చిన్నతనం నుంచి జ్ఞాపకం. సీత పసితనం జ్ఞాపకాలలో ఒకటి - మధ్యాహ్నం ఎండ చుర్రుమనిపించే దాకా గేదె మీద వెల్లకిలా పడుకోడం. ఏ ముళ్ళతీగో జుత్తుకి తగిలి లాగితే తెలివొచ్చేది. చింతల మధ్య నుండి సన్నగా రాగం తీసే గాలి, ఎండిన ఆకుల గలగలలు. పేరు తెలీని పిట్టల అరుపులూ - ఇవన్నీ సీతకి చిన్ననాటి నేస్తాలు. అమ్మ ఇచ్చిన ఉడికించిన చిలగడ దుంపని పరికిణీ చివర ముడి విప్పి తింటూ చెట్లమీద కూర్చునేది ఒంటరిగా. ఆ టౌన్‌షిప్‌లో ఉండడానికి ఎక్కువ పశువులూ లేవు. పశువుల కాపర్లూ లేరు. ఉన్న వాళ్ళంతా ఒనకడిల్లిలో ప్రాజెక్టు పనికి వెళ్ళేవాళ్ళే.

చుట్టూ ఉన్న ప్రపంచంలో స్నేహితులు దొరకనప్పుడు - ఏ చదువూ రాని, పశువులు కాచుకునే ఆడపిల్ల తనలోకి తాను చూసుకోవడం నేర్చుకుంటుంది. తనలో తాను మాట్లాడుకోవడం అలవాటు చేసుకుంటుంది. తన చుట్టూ ఉన్న చిన్న ప్రపంచంలోనే కొత్త అందాలు వెదుక్కోవడం అలవరచుకుంటుంది. ఉన్నట్టుండి అల్లుకునే మేఘాలూ, వర్షానికి ముందు రేగే పచ్చి ఇసుక వాసనా, వింత రంగులతో ఎగిరే సీతాకోక చిలకలూ, ఎండి రాలిపోయిన పక్షి గూళ్ళూ, వేసవి కాలంలో తాటి ముంజెలూ, శీతాకాలంలో పిచ్చి పువ్వులు అన్నీ, అన్నీ సీతకి నేస్తాలు. ఇవన్నీ కవి హృదయంలో రంగుల కలల్ని సృష్టించవచ్చు. కాని ఓ చదువు రాని... సీత మనస్సులో...

చిన్నతనంలో తనతో పెరిగిన గేదె చచ్చిపోయి, మరో కొత్త గేదెని చిన్నమ్మ కొన్నప్పుడు - సీతకి పరికిణీలు కొని పెట్టింది. అంత వరకు సీతని అంతా ఎర్రమ్మ అని పిలిచే వాళ్ళు. పంతంగి అయితే 'వెర్రమ్మా' అనేది. అయితే సీత వెర్రిదేం కాదు. ఆమె మనస్సులో, మాటల్లో చెప్పడానికి వీలుకాని రంగుల కలలేవో రూపుదిద్దుకుంటున్నాయి.

పన్నెండో ఏట - మిట్ట మధ్యాహ్నం గేదెని మేపుతుండగానే సీత పెద్ద మనిషి అయి, చెట్టు కింద ఏడుస్తూ కూర్చుంటే వెర్రమ్మని మొదట కనిపెట్టింది పంతంగే. సీతని ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించి, మొదటిసారిగా చిన్నమ్మ సిల్కు చీరె కట్టి, జడ నిండా అడివి పువ్వుల్ని పెట్టి, చిమ్మిలి దింపి పదిమందికీ పంచి పండగ చేయించింది పంతంగే.

"అయ్యో ముండా! ఈ పెపంచకంలో ఎలా బతుకుతావే?" అంటూ చిన్నమ్మ ఆనందంగానే కూతుర్ని కావలించుకుని ఆనంద బాష్పాలు రాల్చింది.

అడివి పువ్వుకి ఉన్న అందం తోటలో పువ్వుకి రాదు. ఆ పువ్వులో పొగరు, సహజత్వం, నిగారింపు, నిర్లక్ష్యం - ఇన్ని కనిపిస్తాయి. సీత చక్కగా వికసించిన అడివి పువ్వు. ఆమెలో అందరూ చూస్తుండగానే, ఆడవాళ్ళు బుగ్గలు నొక్కుకుని - రెండోసారి చూసేలాగ - స్త్రీత్వపు లక్షణాలు దూసుకుని నిలదొక్కుకున్నాయి.

సీతకి పధ్నాలుగు వచ్చేసరికి మగాళ్ళు రెండోసారి చూసేలాగ, ఆడవాళ్ళు చూసి ఈర్ష్య పడేలాగ - ఏపుగా పెరిగింది. ఆ తర్వాత చిన్నమ్మ ఎన్నడూ కూతుర్ని 'ఎర్రమ్మా' అని పిలవలేదు. 'సీతా' అనే పిలిచింది. ఆ రోజుల్లోనే - సీత జ్ఞానం తెలిసినప్పట్నుంచీ అలవోకగా వాడే అయిదారు బూతుల్ని దగ్గర కూర్చోబెట్టుకు మానిపించింది చిన్నమ్మ.

వాళ్ళ నాన్న చొక్కాలు సైజు చేసి కుట్టించి కూతురికి ఇచ్చేది కొన్నాళ్ళు. ఇప్పుడిక రవికెలు కుట్టక తప్పలేదు. పాత చీరెలు తీసి ఐదారు కుట్టింది.

ఆ ఊళ్ళో ఇంజినీరు గారికీ, ఓవర్సీరు గారికీ ఉదయమే గేదెల్ని తీసుకెళ్ళి పాలు పితికి రావాలి. ఆ పని ప్రతీరోజు సీతది. ఓవర్సీరు గారి అమ్మాయి నందిత దగ్గర మొదటిసారిగా తెలుగు పాఠం విన్నది సీత.

పాలు పితికే సమయంలో ఆ పిల్లా తనతో రోడ్డు మీదే కూర్చుని - తన చేత అక్షరాలు రాయించింది. నిజానికి నాలుగు - ఎర్రసీత. అది సీత ఊహించకుండా, ఆశించకుండా ఆమెకి జరిగిన అక్షరాభ్యాసం. పది అయిపోగానే నందిత పై చదువుకి వాళ్ళ అమ్మమ్మగారింటికి విజయనగరం వెళ్ళిపోయింది.

ఇప్పుడిప్పుడు ఒంటరితనం విసుగు కలిగిస్తోంది. చుట్టూ ఉన్న ప్రపంచం తన అందానికి 'కురచ' అయినట్టనిపిస్తోంది. శరీరంలో నరాలు పీకుతున్నాయి. ఎందుకని? ఏం జరుగుతోంది?

సమాధానం ఆ వేసవిలోనే సీతకి స్పష్టంగా తెలిసొచ్చింది. అది ఆమె జీవితంలో పెద్ద మలుపు కాబోతుందని ఆమెకి తెలీదు.

## 3

జగన్నాథ స్వామి గుడిని ఆనుకుని చిన్న గుట్టమీదకి రోడ్డు పోతుంది. రోడ్డుకి రెండు వేపులా దట్టంగా చెట్లు, గుట్టమీద - దాదాపు టౌన్‌షిప్‌కి కిరీటంలాగ అందమయిన గెస్ట్ హౌస్ కట్టారు బ్రిటిష్ వారి రోజుల్లోనే. ప్రాజెక్టు పని జరిగే రోజుల్లో ఆఫీసర్లు వచ్చి ఉండడానికి అనువుగా కట్టిన విడిది అది. రోడ్డు మీద నుండి కింద పవర్‌హౌస్ దాకా నడిచే వించ్‌ని నిర్మించేటప్పుడు శామ్యూల్ స్విఫ్ట్. ఆయన భార్య రోసలీన్ అక్కడే ఉండే వారని ప్రత్యేకంగా చెప్పుకుంటారు.

ఆ రోజుల్లో రోసలీన్ ఇక్కడే - ఇండియాలోనే కూతుర్ని ప్రసవించిందట. ఆ కూతురికి ఆ ఇంగ్లీషు దంపతులు స్వతంత్ర అని పేరు పెట్టారు. ఇండియాలో పుట్టిన స్వతంత్ర - క్రమంగా పెరిగి ఇంగ్లండు చేరేనాటికి స్వాత్ అయింది. ఏమయినా ఇది అక్కడ పలుకుబడిలో ఉన్న కథ - కథ కాదు నిజం.

గెస్ట్‌హౌస్ గురించి ఎప్పుడు ఆలోచించలేదు సీత. నిజానికి అవసరమూ రాలేదు. ఎప్పుడయినా గేదె జగన్నాథ స్వామి ఆలయం పొలిమేరల్లో తిరిగినప్పుడు - గెస్ట్‌హౌస్ అరుగు మీద నిద్రపోయేది. అక్కడి వాచ్‌మేన్ - నాళయ్య చల్లటి ముంజెలు ఇచ్చాడు ఒకసారి.

ఓ రోజు గేదెని సాయంకాలం ఇంటికి మరలించుటకు వచ్చి చాటకి కట్టింది. ఈత చెట్టు కింద చాలామంది గచ్చకాయలు ఆడుతున్నారు. వెళ్ళబోతూంటే ఎప్పుడూ లేనిది జాలయ్య కూతురిని పలకరించాడు - "ఎక్కడికి?" అంటూ.

ఆశ్చర్యపోయింది సీత. అసలా వేళకి ఇంటి పొలిమేరల్లోనే ఉండడు తండ్రి. ఉన్నా పంతంగి పాక దగ్గర ఉంటాడు - చీకటి పడే వేళకి చిన్నమ్మ రొట్టి, పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయ అందిస్తే పాకలోకయినా రాకుండా బయటే తిని నులక మంచం మీద బోర్లా పడుకుంటాడు. జాలయ్య అంటే చాలా గారాబం చేస్తుంది చిన్నమ్మ బాగా అలసి పోయి వచ్చిన రోజు - తన పనంతా అయాకా - వేడినీళ్ళు కాచి వళ్ళంతా తడి గుడ్డతో కాపడం పెడుతుంది.

ఇవాళ జాలయ్య మొదటి సారిగా సీతని అడిగే సరికి సీత ఆశ్చర్యంగా చూసింది. తన ప్రశ్న తనకే కొత్తగా వినిపించిందేమో జాలయ్యకి చెంబులో నీళ్ళు తుపుక్కున ఉమ్ముతూ "రాదారీ బంగళా వేపు వెళ్ళొద్దు" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత సీత చింత చెట్టువైపు వెళ్ళలేదు. రాదారీ బంగళా వేపే వెళ్ళింది. సాయంకాలం నాలుగు గంటలకే చుట్టూ పక్కల వాతావరణం నిద్రపోతున్నట్టుంది. చెట్ల మధ్య నుంచి నడుస్తుంటే పగలే కాస్త ఒంటరిగా అనిపిస్తోంది.

బంగళా చేరక ముందే నవ్వులూ, విదేశీ సంగీతం వినిపించాయి సీతకి. ఆమెకి రెండూ కొత్తే. మరి నాలుగు అడుగులు వేసి మలుపు తిరగగానే - తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. బంగళా ముందు రంగు రంగుల గొడుగు నిలబెట్టి ఉంది. దాని కింద వాలుగా పడుకునే కుర్చీ - పక్కనే పెద్ద బక్కెట్ నిండా ఐస్. అందులో పెద్ద సీసా. తను ఒకప్పుడు పడుకున్న అరుగు మీద పెద్ద ట్రానిస్టర్ రకరకాల పాటలు పాడుతోంది. ఆ వాతావరణాన్ని సీత ఎప్పుడూ చూడలేదు. తనకి తెలియకుండానే ఆ దృశ్యం వేపు అడుగులు వేసింది. ఉన్నట్టుండి ఉప్పెనలాగ బంగళా వెనక నుండి ఇద్దరు వచ్చారు - ఒకబ్బాయి, ఒకమ్మాయి, ఇద్దరూ దాదాపు శరీరానికి అంటుకు పోయిన చిన్న లాగూల్లో ఉన్నారు. ఇద్దరూ బనీన్లతోనే ఉన్నారు. ఇద్దరు నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్నారు. శరీరాన్ని పట్టి చూస్తే తప్ప తెలీనంతగా - ఇద్దరూ మగాళ్ళలాగే ఉన్నారు. కాస్త తేరిపార చూస్తే జుత్తువల్ల, బనీను లోంచి పొడుచుకొచ్చి కాస్త పాటి సౌష్ఠవం వల్లా ఒకరు అమ్మాయిని గుర్తుపట్టింది సీత. ఎన్నడూ ఈ ప్రపంచాన్ని చూడలేదు. ఆమెకి సినిమాలు తెలీవు. ఇంగ్లీషు పాటలు తెలీవు. ఈ వాతావరణం తెలీదు. అలా మగాడు ఆడపిల్లని ఎత్తుకోవడం తెలీదు - అతని చేతుల్లో ఒదిగిన ఆడపిల్ల అతని భుజం చుట్టూ చెయ్యి వేసి అతని పెదాల్ని అందుకోవడం తెలీదు. ఆ దృశ్యాన్ని చూస్తూ సీత వణికింది. ఆమెకి తెలీకుండానే కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆమెకి తెలీకుండానే - ఆ సమయంలో వాళ్ళు తనని చూడకూడదని తెలిసింది. చటుక్కున చెట్టుచాటుకి వెళ్ళింది.

అబ్బాయీ, అమ్మాయీ ఇప్పుడు గొడుగు కింద కుర్చీలో వాలిపోయారు. తప్పు - కుర్రాడు వాలిపోయాడు. అతని మీద ఆమె వాలిపోయింది. సంగీతం వరసమారింది. ఇద్దరూ పక్కనున్న బకెట్ లోని సీసా తీసి అలానే తాగుతున్నారు.

సీతకి ఆ దృశ్యం చాలా ముచ్చటగా అనిపించింది. అదేదో తను ఊహించని గొప్ప ప్రపంచంలాగ కనిపించింది. ఆ ఆడపిల్ల ముందు చూసిన కంటె చాలా గొప్పగా కనిపించింది. బనీనులోంచి ఆ కుర్రాడి శరీరం పొంగుతోంది. ఇలాంటి ఆనందం ఉంటుందని సీతకి తెలిదు. వాళ్ళిద్దరి మాటలూ సరిగ్గా బోధపడడం లేదు. అలా ఎంత సేపు వాళ్ళని చూస్తూ కూర్చుందో తనకే తెలీదు. గొడుగుమీద

పడుతున్న సాయంకాలపు నీరెండ క్రమంగా పల్చబడి - మెల్లగా చీకటి తెరలు ముసురుకోవడం ఆమెకి తెలీదు. ఉన్నట్టుండి బంగళా వరండాలో దీపాలు వెలిగాయి. కుర్చీలో ఉన్న ఇద్దరూ తేరుకున్నారు. ఆ అమ్మాయి అతన్ని వాటేసుకునే బంగళామెట్లెక్కింది. ఇద్దరూ లోపలికి బయలుదేరారు. మెట్లమీద నుండి చుట్టూ చూసి "వాచ్‌మన్!" అని అరిచాడు ఆ కుర్రాడు. నాళయ్యకి ఏదో చెపుతున్నాడు ఆ కుర్రాడు. నాళయ్య తలూపి పరిగెత్తాడు.

ఇద్దరూ గదిలోకి మాయమయారు. సీత చాలా నిరుత్సాహపడి పోయింది.. ఏదో గొప్ప అనుభవాన్ని ఎవరో లాక్కొన్నట్టు బాధ పడింది. చెట్ల పక్కనుండి రోడ్డు మీదకి వచ్చింది. నాళయ్య బాల్చీ పట్టుకుని పరుగున ఊళ్ళోకి వస్తున్నాడు.

"మామా!" అంది నాళయ్యతో అడుగువేస్తూ.

సీతని చూసి ఆశ్చర్యపోయాడు నాళయ్య.

"అరె సీతూ! నువ్విక్కడ -" నాళయ్య. అతనికి ఏభై ఏళ్ళుంటాయి. కాని ఏభైకే శరీరం బాగా ఒడలి పోయింది. అతనికి పెళ్ళాం లేదు. పిల్లలు లేరు. రాధారీ బంగళాకి ఎవరయినా వస్తే నాళయ్యకి పండగ. కారణం అక్కడికి వచ్చే వాళ్ళు సాధారణంగా విస్కీతో వస్తారు. చక్కని పట్నం భోజనంతో వస్తారు.

"మామా! ఆ బంగళాలో ఉంది ఎవరూ?" అంది సీత పరుగులాంటి నడక సాగిస్తున్న నాళయ్యతో అడుగులు కలుపుతూ.

నాళయ్య నవ్వాడు. ఊడిపోయిన ముందు పన్ను తెలిసేలాగ నవ్వాడు. "ఆరు మారాజులే సీతూ - వాళ్ళ మామ విశాఖ పట్టణంలో పెద్ద మారాజు. ట్రాలర్ కింగ్. ఈ అయ్య - మైనరు - అబ్బో - కోట్లమీద వ్యాపారం - అది సరే - బాపా ఎక్కడ?"

జాలయ్యకి, నాళయ్యకీ దోస్తీ, పంతంగి సారా కొట్టు దగ్గర వాళ్ళిద్దరికి ఖాతా ఉంది.

"ఇంటి దగ్గరే ఉన్నాడు"

"అన్నం తినొద్దని చెప్పు - బంగళాకి వచ్చెయ్యమను - సార్‌కి వేన్నీళ్ళు కావాల - ఆలస్యమయితే అరుస్తాడు" అంటూ పరిగెత్తాడు. సీత వెనక అప్రిగెత్తింది.

"ఆ దొరసాని ఆ సారు పెళ్ళామా?"

అడివి ప్రతిధ్వనించేలాగ నవ్వాడు నాళయ్య - నరాలు తెగిపోయేలాగ నవ్వాడు. కాళ్ళు తడబడి కూలబడేలాగ నవ్వాడు.

"బాపాని రమ్మను" అని చెప్పి - గుడి వెనక తన ఇంట్లోకి మాయమయాడు. సీతకి అర్థం కాలేదు.

దొరసాని ఆ సారు పెళ్ళామయితే నవ్వెందుకు?

మరునాడు ఆలస్యంగా లేచింది సీత. లేస్తూనే ముందు రోజు సాయంకాలం రాదారీ బంగళాలో దృశ్యం జ్ఞాపకం వచ్చింది. ఎవరితోనూ చెప్పకుండా మంచం మీంచి దూకి చెట్ల మధ్య నుండి, గుడి దాటి బంగళా వేపు పరుగు తీసింది.

బంగళా అరుగు మీద నాళయ్య గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు. బంగళా ఖాళీగా ఉంది. ముందు రోజు అనుభవాలకి గుర్తులుగా - నలిగిన దుప్పట్లూ, పాత బడి, మాగిన ఎక్‌లెయిర్ సెంట్ వాసనా గదిలో గుప్పుమంది.

ఆ వాతావరణం దిగులుగా కనిపించింది సీతకి. గడిచిపోయిన యవ్వనం గుర్తులాగ, మీద పడిన వృద్ధాప్యం మీద వెగటులాగ ఆ గది కనిపించింది.

తలగడ మీద లిప్‌స్టిక్ ఛాయలున్నాయి. గ్లాసులో విస్కీ, అవశేషాలున్నాయి. తడిసిన టర్కీ తువాళ్ళున్నాయి - వెరసి అలసిపోయిన పరువు, డస్సి పోయిన ముందు రోజు సాయంకాలం ఆ గదంతా పరుచుకుని ఉంది.

సీత మధ్యలో బల్లమీద కూర్చుంది. పక్కనే ఉన్న అలమరలో ఎర్రగా ఏదో కనిపించింది. చటుక్కున వెళ్ళి చేతిలోకి అందుకుంది. ఆపిలు పండు. సీత జీవితంలో ఆపిలు పండు చూడడం అదే

చేతిలోకి తీసుకుని - ఆబగా, ఆశగా ఆపిల్ కొరికింది. గోడకి శామ్యూల్ స్విఫ్ట్ గారి కాలం నుంచే వేలాడుతున్న జీసస్ వెలసిపోయిన పటంలోంచి నవ్వాడు. !!

## 4

**నాలుగయిదు వారాల పాటు** ఆ సాయంకాలమే సీత మనస్సులో కదలుతూ వచ్చింది. కదలటం కాదు. ఎందుకనో.. కలవర పరుస్తూంది. ఈ రోజుల్లోనే సీత జీవితం పెద్ద మలుపు తిరిగింది.

దానికి కారణం ఓవర్సీ కుందయ్యగారి మామగారు చచ్చిపోవడం.. కుందయ్యగారికి మామగారిమీదా, అతని బతికున్న కొడుకుల మీదా ఏ కోశానా గౌరవం లేదు. తండ్రి డబ్బు విచ్చలవిడిగా తగలేస్తూ, ఒక్కగానొక్క చెల్లెలు.. తన భార్యకి, బావమరదులు ఏమీ మిగల్చడం లేదని ఆయన బాధ. అయితే కుందయ్యగారి మామగారు బతికుండగానే ఆ పనిని కొడుకులు పూర్తి చేశారు. ఆయన చనిపోయే నాటికి ఆయన తల కొరివి పెట్టే పాటి ఆస్తిని మిగుల్చుకున్నారు.

తను చాలామంది కంటే చాలా అందంగా ఉందనీ, తాను అందంగా సిగ్గుపడగలదని సీత గ్రహించింది. అయితే వాళ్ళందరికీ ఉన్నది. తనకి లేనిది ఒక్కటే... ఒంటి రంగు.. ఎవర్ని చూసినా ఎర్రగా మెరుస్తూ నిగనిగలాడుతున్నారు. అయితే నల్లసీత కూడా ఎర్రసీతలాగా కనిపించే సాధనాలు చాలా ఉన్నాయని సీతకి అప్పటికి అర్థం కాలేదు.

మరో ఆరేడు వారాలకి ఓ సాయంకాలం మైనరు బాబు కారు, సంగీతంలాంటి అరుపు అరుస్తూ ప్రాజెక్ట్ రోడ్లపైన పరిగెత్తింది. ఆ అరుపు సీత చెవిలో పడింది. గేదెని అక్కడే వదిలి అడవికి అడ్డంగా పరిగెత్తింది.

అప్పటికే కారులోని సామాన్లు దించుతున్నాడు నాళయ్య. మైనరు బాబు నల్లనిపాంటూ, అంతే నల్లటి బనీను వేసుకున్నాడు. సిగరెట్టు కాలుస్తున్నాడు. మైనరు బాబు ఏం చేసినా సీతకి బాగున్నట్టు ఉంటుంది ఇప్పుడు "సన్నీ, నా బాగ్ ఎక్కడ?" అంటూ ఓ అమ్మాయి లోపల్నుంచి వచ్చింది. ఈ అమ్మాయి ఇదివరకు వచ్చిన దొరసాని కాదు. ఇలా ఇద్దరినీ చూడటం రుచిగా ఉంది.

"నా బాగ్ ఎక్కడ? అందులో నా బేండ్".. అంటోంది ఆ అమ్మాయి.

మైనరు చిలిపిగా దగ్గరికి వెళ్ళి "ఇక్కడ బాగ్‌లూ, బేండ్‌లూ ఏమీ అక్కరలేదు డార్లింగ్... ఇవి కూడా కాస్సేపటికి వేస్టే" అని ఆమె ఒంటిమీద బనీను లాగి వదిలాడు.

"ఏయ్ రాస్కెల్" అంది కెవ్వుమంటూ.

సీత శరీరం కెవ్వుమంది. ఏమయినా మైనరు బాబు చాలా అదృష్టవంతుడని తేల్చుకుంది సీత.

భోజనం అయాక సీతకి నిద్రపట్టలేదు. ఓ రాత్రప్పుడు ఎన్నడూ చేయని సాహసం చేసింది. సీత మెల్లగా చిన్నమ్మ పక్క నుంచి లేచి వీధిలోకి వచ్చింది. మరెప్పుడయినా ఆ సమయంలో ఆ వీధి ఎవరినయినా బయపెట్టేది. అంతకు ముందు మూడురోజుల క్రితమే ప్రాజెక్టు కార్మికుడు జెనాని తీసుకెళ్ళి కోరాపుట్ ఆస్పత్రిల్లో చేర్చారు.

అయినా ఇప్పుడా ఆలోచనల్లేవు. సరాసరి రాధారీ బంగళా వేపు నడిచింది. ఎందుకు? ఏం చూస్తుంది?

బంగళా లోంచి సంగీతం వినిపిస్తోంది. కీచురాళ్ళు తప్ప ఏ శబ్దమూ లేదు. బంగళాకి దూరంగా చింత చెట్టు అరుగు మీద నాళయ్య గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు. అతని పక్కన ఖాళీ అయిన సీమసీసా తెలుస్తోంది.

బంగళా కిటికీ దగ్గర కొచ్చింది. మైనరు బాబు, కొత్తదొరసానీ మత్తుగా నిద్రపోతున్నారు. ఒకరి మీద ఒకరి చేతులున్నాయి. విసిరేసినట్టు దుప్పటి ఉంది. సీతకి శరీరమంతా వేడెక్కింది. తనకి తెలీకుండానే చెమటలు పోశాయి. తనని తప్ప స్త్రీని నగ్నంగా ఎప్పుడూ చూడలేదు సీత. మగాడ్ని అసలు చూడలేదు.

అలా ఎంతసేపు నిలబడిందో తెలీదు, ఉన్నట్టుండి తన మీద చెయ్యిపడింది. కెవ్వుమని ఇటు తిరిగింది. మందు మత్తులో లేకపోతే మైనరు బాబూ దొరసానీ లేచేవాళ్ళే! నిద్దరలో కదిలారంతే! చీకట్లో తన చెయ్యిమీద చెయ్యి వేసిన తండ్రిని గుర్తు పట్టింది. జాలయ్య కూడా బాగా తాగి ఉన్నాడు.

"ఇక్కడికెందుకు వచ్చావు?" అన్నాడు మత్తుగా, కానీ కటువుగా.

సీత ఇప్పుడు మొదటి ఆపిల్ తిన్న మనిషి. మైనరుబాబునీ, దొరసానినీ చూసిన మనిషి, అబద్ధం చెప్పడం అంత కష్టం కాదు.

"నీ కోసమే.. అమ్మ పంపింది." అంది.

"సరే పద" అంటూ తూలాడు జాలయ్య. తండ్రి చేతిని భుజమ్మీద వేసుకుని నడిపించుకు వచ్చింది సీత.

ఇంటి దగ్గర చిన్నమ్మ సీత కోసం ఎదురు చూస్తోంది. "ఎక్కడి కెళ్ళావే?" అంది భయం భయంగా

"నాన్న కోసం.."

"నాన్న కోసం నిన్నెవడెళ్ళమన్నాడు?"

జాలయ్య ఆశ్చర్యంగా కూతుర్ని చూశాడు. చిన్నమ్మ భర్తని లోపలికి తీసుకెళ్ళలేదు. సీతని తీసుకెళ్ళి తన పక్కలో పడుకోబెట్టుకుంది.

ఇప్పుడిప్పుడు సన్నీ బంగళాకి రావడం ఎక్కువైంది. ఊళ్ళో కూడా సన్నీ గురించి మాట్లాడుకోవడం ఎక్కువైంది. కొందరు అలా రావడాన్ని వ్యతిరేకించారు. ప్రాజెక్ట్ అధికారులకి చెప్పాలన్నారు. అయితే పరోక్షంగా సీత, ప్రత్యక్షంగా నాళయ్య సమర్ధించారు.

"వాళ్ళు పెద్దవాళ్ళు. వాళ్ళ వ్యవహారాల్లో కల్పించుకుంటే మనమే దెబ్బతింటాం" అన్నాడు నాళయ్య. అయినా ప్రాజెక్టులో పని చేసుకునే మగాళ్ళకి రాధారీ బంగళా వ్యవహారాల్లో తలదూర్చేంత తీరిక లేదు. ఆరున్నరకి ఇల్లు చేరిన తర్వాత ఎనిమిది గంటలకు వాళ్ళ రోజు ముగుస్తుంది. సన్నీ రోజు ప్రారంభమవుతుంది. రాను రానూ సన్నీ సీత మనసులో 'హీరో' అయి కూర్చున్నాడు. ఓ రోజు పరాకుగా గేదె మీద కూర్చుని పాటలు పాడుకుంటూ రోడ్డు మీద వెళుతోంది సీత. ఆ పక్కనే కారాగిన విషయం గమనించలేదు.

"ఏయ్" అన్న పిలుపు వినిపించి తలెత్తి చూసింది. చెయ్యి జాపితే తగిలేంత దూరంలో మైనరు బాబు. శరీరంలోంచి గుప్పుమనే ఫ్రెంచి సెంటు వాసన తలస్తుంది. పక్కనే సీటు మీద తలెట్టుకుని మరో కొత్త దొరసాని నిద్రపోతోంది.

ఒక్కసారి గేదె మీంచి దూకి పరికిణీ సవరించుకుంది సీత. ఆ క్షణంలో ఒక్కసారి మాయమై పోయి జరీ బట్టల్లో దేవ కన్యలాగా ప్రత్యక్షమైతే బాగుండుననిపించింది.

"ఏయ్! నిన్నే!" విసుగ్గా అన్నాడు మైనరుబాబు. ఒక్కడుగు కారు దగ్గరికేసింది. "బోయీ ఎక్కడుంటాడో వెదికి పది సోడాలు బంగళాకు పట్టుకు రమ్మని చెప్పు. ఆలస్యమయితే చంపేస్తానని చెప్పు." జేబులోని వంద రూపాయల నోటు తీశాడు.

ఇంకా వెర్రిదానిలాగా చూస్తోంది.

"ఏయ్! మొద్దూ, మాటలూ రావా?" కసిరాడు. చటుక్కున నోటు అందుకుంది. కారు గేరు మార్చి "డబ్బు తీసుకుని పారిపోతావా? నీ పేరేంటి? "

"కమాన్ సన్నీ.. లీవ్ దట్ బిచ్" అంటూంది పక్క అమ్మాయి. కారు దూసుకుపోయింది. తనని మైనరు బాబు మొద్దు అని పిలవడంతో కొత్త దొరసాని 'బిచ్' అన్నమాట ఆమె మెదడులోకి పోలేదు. చేతిలో నూరు రూపాయల నోటు... ఇదంతా కల కాదని చెబుతోంది. పిచ్చిదానిలాగా ఊళ్ళోకి పరిగెత్తింది. సోడాలు ఎక్కడ దొరుకుతాయో తనకి తెలీదు. కానీ ఆ చిన్న ఊరులో పది సోడాలు ఎవరికి కావాలో దాదాపు అందరికీ తెలుసు. వాళ్ళకు అర్థంకాని విషయమల్లా సీత ఆ పనికి పూనుకోవడమే!

ఎట్టకేలకు పది సోడాలూ సంపాదించి కొండంతా పరిగెత్తి బంగళా చేరింది. అప్పుడే స్నానం ముగించుకుని మూడో దొరసాని బాత్ రూములోంచి బయటకు వచ్చింది. ఒళ్ళంతా టర్కిష్ టవల్ చుట్టుకుని ఉంది. సన్నీ పరుగున వచ్చిన సీతను చూసి నిర్ఘాంతపోయాడు ముందు. ఊపిరి తిరగని ఆనందంలో పది సోడాల్ని తీసుకొచ్చి పెట్టిన ఆ పిల్లని ఆశ్చర్యంతో చూశాడు.

"ఎక్కడ ఆ రాస్కెల్ బోయీ?" అన్నాడు.

"లేడు, నేనే తెచ్చాను." అంది సీత గర్వంగా. సన్నీ, ఆ అమ్మాయి ఒకరి నొకరు చూసుకుని భుజాలెగరేశారు "హేయ్! గుడ్ జాబ్" అంటూ ఓ ఇరవై రూపాయల నోటు చేతిలో పెట్టాడు. చాలా సిగ్గుపడిపోయింది.

ఆ క్షణంలో దేవుడు ప్రత్యక్షమయితే – సన్నీ మెచ్చుకునే అందమైన శరీరంలోకి పరకాయ ప్రవేశం చేయించమని అడగాలని మనస్సు వెర్రి కోరికతో రెచ్చిపోయింది.

తన ఉపకారానికి ప్రతిఫలం కేవలం ఇరవై రూపాయలేనా? అటే చూస్తూ నడుస్తున్న సీతతో ఏమనాలో సన్నీకి అర్థం కాలేదు.

"ఏయ్. థాంక్స్.. నీ పేరు..?"

బంగళా మెట్ల దగ్గర ఆగి "ఎర్రసీత" అంది అదేదో జంతువు పేరులాగ.

"ఎ..ర్ర..సీ..త" అంటూ పగలబడి నవ్వసాగింది దొరసాని.

సన్నీ నవ్వు కలిపాడు. అంతలో ఏమనుకున్నారో ఆగిపోయారు. సీతకి అలనాటి సీతలాగా భూమి చీల్చుకు పాతాళంలోకి మాయమయి పోవాలనిపించింది. ఆ క్షణంలో తనకి సీత అని పేరు పెట్టిన వాళ్ళనీ, ఎర్రసీత అని పిలిచే అమ్మనీ, తనకి నల్లటి శరీరాన్నిచ్చిన దేవుడినీ అందరినీ.. అందరినీ మనసు నిండా అసహ్యించుకుంది.

సీత కొండ మలుపు తిరిగి జగన్నాథస్వామి గుడి దాకా వెనక్కి తిరగకుండా పరిగెత్తింది. ఆమె చేతుల్లోని ఇరవై రూపాయల నోటు ఎప్పుడో ఎగిరిపోయింది. గుడి దగ్గర ఆగేసరికి ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి.

తన పేరు విని నవ్విన దొరసానిని జీవితంలో క్షమించలేదు. ఆమెతో నవ్వు కలిపిన తను హీరోలాగా భావించే సన్నీని..?

తర్వాత అనుకోకుండా చాలా సంఘటనలు వరుసగా జరిగిపోయాయి. సీత మైనరు బాబుకి సోడాలు తీసుకు వెళ్ళిన విషయం ఊళ్ళో అందరికీ తెలిసిపోయింది. చిన్నమ్మ తన బిడ్డ ఏదో పాపం చేసినట్లు విలవిలలాడిపోయింది.

జాలయ్యకి ప్రాజెక్టు దగ్గర ఈ వార్త ఎవరో చెప్పారు. అతనికి అర్ధరాత్రి సీత బంగళా పడక గది దగ్గర నిలబడిన దృశ్యం గుర్తొచ్చింది. ఆ నెలలో కుందయ్యగారి కూతురు నందిత కాలేజి చదువుకి విజయనగరం వెళ్ళింది. వయస్సు మీద పడిన అత్తగారికి చెయ్యి సాయానికి, ఇంటిపని చెయ్యడానికి మనిషి కావలసి వచ్చింది. ఆ విషయం తెలియగానే జాలయ్య, చిన్నమ్మ కలిసి కుందయ్య కాళ్ళమీద పడిపోయారు. తమ కూతుర్ని పంపిస్తామని.


కౌముది

ఇది కుందయ్యకు చాలా చక్కగా కలిసొచ్చిన ఏర్పాటు, "మంచిదేరా! ఇద్దరూ కలిసుంటారు" అన్నాడు కుందయ్య. "ఇద్దరూ కలిసుంటారు బాబూ, పండగలకి మా సీతని అక్కడే ఉండనివ్వండి." అంది చిన్నమ్మ.

"అవసరమయితే మేమే చూసొస్తాం బాబూ" అన్నాడు జాలయ్య.

సరేనన్నాడు కుందయ్య. పది రోజులు తిరగకుండానే చిన్న సంచీ తోటి విజయనగరం బస్సు ఎక్కింది సీత. ఆ వెళ్ళడం మళ్ళీ మచ్‌ఖండ్ ముఖం చూడలేదు.

## 5

***చదువుకునే వాళ్ళు రకరకాలు. విజ్ఞానం కోసం చదువుకునేవాళ్ళు, చదువుని ఆయుధం చేసుకునేవాళ్ళూ, చదువుని అవకాశం చేసుకునే వాళ్ళూ, చదువుని వినోదం చేసుకునే వాళ్ళూ, చదువుని అమ్ముకునేవాళ్ళూ - ఇలా చార్లీ చాప్లిన్ తన చదువుకి కారణాన్ని చెపుతూ "నేను చదువు కున్నది చదువు మీద మక్కువతో కాదు, చదువులేని వాళ్ళ మీద నలుగురూ చూపే ఏహ్యాభావం నుంచి నన్ను నేను రక్షించుకోవడానికి చదువుకున్నాను." ఇది చాలా విచిత్రమైన కారణం.***

సీత విజయనగరం రావడానికి గింజుకుంది. ఆమెకి మచ్‌ఖండ్ వదిలి పోవడం సుతరామూ ఇష్టంలేదు. మైనరుబాబు, దొరసానులు, రాధారి బంగళాలో సాయంకాలాల రుచి మరిగింది. అయితే అదే కారణానికి చినమ్మ, జాలయ్య ఆమెను ఊరు నుంచి పంపెయ్యాలనుకున్నారు. వెళ్ళననడానికి ఏమి కారణం చెప్పాలో సీతకి అర్థం కాలేదు.

తప్పని సరిగా తనకి ఇష్టంలేని కొత్త జీవితానికి విజయనగరంలో అలవాటు పడింది. నందిత వాళ్ళ అమ్మను పట్టమ్మగారు చాలా మెత్తటి మనిషి రెండు కళ్ళకీ పువ్వు లేసి చూపు బాగా తగ్గిపోయింది. ఈ దశలో తోడుగా సీత రావడం ఆమెకి దైవికమనిపించింది. స్వభావరీత్యానేకాక, అవసరం కొద్దీ సీతని చాలా ఆదరంగా చూసుకున్నదామె.

సీతకి ఈ ఆదరం మీద అంత దృష్టిలేదు. ఆమెకు విజయనగరం రావడంతో కొద్ది కొద్దిగా అలవాటవుతున్న ఆధునిక ప్రపంచపు పొలిమేరల్లోకి వచ్చినట్టు భావించింది. అయితే విజయనగరం బొంబాయీ కాదు, ఢిల్లీ కాదు, కాని మచ్‌ఖండ్ వదిలి మొదటిసారి బయటి ప్రపంచంలోకి వచ్చిన ఆ పదహారేళ్ళ అమ్మాయికి విజయనగరం చిన్న సైజు లండన్ లాంటిది.

కాగా నందిత ఇప్పుడు సీతకి మరింత చేరికయి పోయింది. పొరపాటు.. నందిత సీతని మరింత చేసుకుంది. రాత్రి సీతని తన పక్కమీదే పడుకోబెట్టుకుని.. తన శరీరాన్ని ఆమె అదిమి పెట్టిపడుకునేది. ఇక రాత్రప్పుడు సీత చేతులు తన ఎద మీద పెట్టుకుని పడుకునేది. తన కాలు సీత మీద వేసేది. వీటన్నిటికీ అర్థం సీతకి తెలుసు.

నందిత కాలేజీకి వెళ్ళడం ప్రారంభించినప్పటి నుంచీ ఆమెలో మార్పుని సీత గమనించింది. నందితది చిన్న జుత్తు. అయినా దాన్నే అందంగా మడత పెట్టి అలంకరించడం గ్రహించింది. అంతేకాదు. నగర జీవితం వ్యసనం, చదువు గొప్ప అలంకారం. తెలీకుండానే కొత్త వెలుగు నందిత ముఖంలో చోటు చేసుకోవడం కనిపెట్టింది. అంతే కాదు, తనని చూసి నవ్విన దొరసాని ముఖంలోని వెలుగునీ ఈ వెలుగుగానే పోలిక కట్టింది. ఎప్పుడు గుర్తొచ్చినా ఆ దొరసాని నవ్వు తనని పదునైన కత్తితో కోస్తున్నట్టు అనిపిస్తున్నది. అంతకంటే సన్నీబాబు ఆమె నవ్వుతో జతకలవడం ఆ కోతపై కారం జల్లినట్టుగా విలవిలలాడుతుంది.

నందితలో సీత గ్రహించే మార్పుకీ రాధారి బంగళాలో దొరసాని నవ్వుకీ మధ్య ఏదో దగ్గర త్రోవ ఉంది. ఏమిటి? సీత తన వేళ్ళ కింద నందిత శరీరాన్ని మరిచిపోయేటంతగా ఆలోచనల్లో పడేది చాలా రోజులు. నిద్రపట్టేది కాదు.

ఓ రోజు నందిత బాత్ రూములో స్నానం చేస్తోండగా మెల్లిగా తలుపు దగ్గరికి వచ్చింది సీత. మెల్లిగా 'నందా' అని పిలిచింది. లోపల స్నానం చేస్తున్న నందితని రహస్యంగా పిలిచిన సీత పిలుపు గిలిగింతలు పెట్టింది. ఒంటిమీద నీళ్ళు ఒక్క క్షణం వేడెక్కాయి.

"సీతూ"

"నేనూ లోపలికి వచ్చేదా?" రహస్యంగా అడిగింది సీత.

నందిత మనసు రెపరెపలాడింది. తలుపు తెరవగానే సీత లోపలికి వచ్చి గడియ వేసింది. నందిత అలానే సీతని ఓ క్షణం గమనించి వాటేసుకుంది.

"దొంగా! ఇన్నాళ్ళూ చెప్పలేదేం?" అంది వంకరగా నవ్వుతూ.

"నువ్వెవరికి చెప్పనంటే ఒక్కటడుగుతాను" అంది సీత.

అర్థమైపోయినట్టు సీతని దగ్గరగా తీసుకుని పెదాలమీద ముద్దు పెట్టుకుంది.

నందిత ఆలోచించేది, తనున్నదీ ఒక్కటి కాదని ఇప్పటికి అర్థమైంది సీతకి. పెదాల మీద అయిన సబ్బుని తుడుచుకుంటూ." నేను చెప్పేది నువ్వనుకునేది కాదు. ముందు కూర్చో" అంది.

నందిత కాస్త బిత్తరపోయి ఆగి ఒళ్ళు తోముకునే స్టూలు మీద కూర్చుంది. అప్పటికి ఒళ్ళు చల్లబడి బాల్చీలోని చెంబుతో వేడి నీళ్ళు తీసి మీద గుమ్మరించుకుంది.

"ఏమిటే నువ్వు చెప్పేదీ?"

"నందా! నేను చదువుకుంటే నాకు చదువు వస్తుందా?"

నిర్ఘాంతపోయి చూసింది నందిత,

"చదువా? ఎందుకు? ఏం చేస్తావు?" అని "ఆలోచించి ఈ పాచి పని నీకు నచ్చలేదా?"

నవ్వింది నందిత. "అసలు ఎందుకే ఆ ఆలోచన వచ్చింది?"

"నాకు చదువు వస్తుందంటావా?"

తువాలుతో ఒళ్ళు తుడుచుకుంటూ నందిత అంది. "పుట్టకతోనే ఎవ్వరూ పండితులు కారు. నీలాగా నేను ప్రాజెక్ట్ టౌన్షిప్‌లో ఉంటే గేదలే కాసుకునేదాన్నేమో! నీకు మా నాన్నలాంటి ఊతం ఉంటే నా కంటే బాగా చదువుకునే దానివేమో!"

ఒక్కసారి నందితని ముద్దుపెట్టుకుంది సీత. "అయితే నాకు చదువు చెపుతావా?"

సీతని తేరిపార చూసింది నందిత

"చెపుతాను, కాని ఒక్క షరతు."

"ఏమిటది"

"రాత్రి చెపుతాను"

రాత్రి సీత ఒంటి మీద బట్టలు తీసేసింది. తన బట్టలు తీసేసుకుంది. సీతని బలంగా కావలించుకుని దుప్పటి కప్పేసింది. నందిత శరీరం కాలుతోంది. కానీ సీత మెదడు మండుతోంది. ఏదో ఆలోచనలు. చదువు రాని ఆమె తలలో ఏవో కొత్త ఛాలెంజ్‌లు, తన శరీరం పడే హింసని మనస్సు దాకా పోనియ్యలేదు. నిజానికి చాలా చికాకుగా, ఇబ్బందిగా ఉంది. కానీ తను చదువుకోవాలి. ఆ చదువుకి ఇది ఒక్కటే ఆలంబన. చితుకుల్ని పోగు చేసి రేపిన మంట మెల్లిగా రాజుకుంటుంది. కానీ అడవిలో రాజుకున్న చిచ్చు కొమ్మల నుంచి చెట్లకీ, చెట్ల నుండి కొమ్మలకి పాకి అడివి అంతా ఆవరించుకుంటోంది.

చదువుకి ఓ పద్ధతుంది. ఓనమాలు దిద్దాక, బాలశిక్ష చదివి, సుమతి శతకం చదువుకుని, మిత్రలాభం చదివి - ఇలా ఓ నిర్దిష్టమైన మార్గం ఉంది. కానీ సీత చదువుకి అడ్డదోవలు పట్టింది. ఓనమాలు చదివాక కనిపించిన ప్రతీ కాగితం చదివింది.. గుణింతాలు వచ్చాక అన్ని పుస్తకాలలోనూ ఆ అక్షరాలను పోలిక పట్టింది. విషయం అర్థమయ్యాయి. ఎక్కడో ఆ మనస్సులో ఇంతకాలం దాచుకున్న ప్రాకృతిక శక్తి ఏదో విరుచుకు పడింది. సీత లేచినప్పట్నుంచీ చుట్టూ కనిపించే జీవితమంతా పుస్తకమే! ***చదువుని జీవితానికి అనువదించుకోవడానికి చాలా మందికి జీవిత కాలం చాలదు. చాలామంది మేధావులకి బజారులో కూరలు బేరం చెయ్యడం రాదు. కానీ కూరగాయలు అమ్ముకునే వాడికి 'మేధావి' అయ్యే అవకాశం వస్తే, అవాలనే కోరిక రెచ్చితే. అట్నుంచీ నరుక్కు రావడం అతి వింతగా, గొప్పగా ఉంటుంది.***

నందిత పదేళ్ళు చదివిన తర్వాత తెలుసుకున్న విషయాన్ని సీత అడ్డంపడి ఆపోశన పట్టింది. మొదటి రోజుల్లోనే నందిత కౌగిట్లో సీత శరీరంలో చైతన్యం లేదని, ఆమె హృదయం మరెక్కడో ఉందనీ గ్రహించింది. అంతేకాదు. చదువు పట్ల సీత ఉత్సాహం, తపన చూస్తే ఆమె మీద అత్యాచారం చేస్తున్నట్టు భావించిందామె. ఆ తర్వాత సీతకి చదువు చెప్పడంలోనే నిమగ్నమైంది. చెపుతున్న కొద్దీ తను కూడా గుర్తుంచుకోలేని విషయాలెన్నో సీత మెదడులోకి దూసుకుపోవడం నివ్వెరపాటుతో గమనించింది.

ఇంగ్లీషు, తెలుగు, చరిత్ర, రాజకీయాలూ, వార్తలూ, రైల్వే టైంటేబులూ అన్ని సీత మెదడులోకి కలగా పులగంగా చోటు చేసుకుంటున్నాయి.

ఊపిరి తిరగనంత క్షుణ్ణంగా అన్నిటినీ, ఆకళించుకుంది. నందిత సెలవులకి మచ్‌ఖండ్ వెళ్ళివస్తోంది.

"నువ్వూ వస్తావా సీతూ?"

మచ్‌ఖండ్ రానివ్వద్దని చిన్నమ్మ, జాలయ్య ఆపారని నందితకి తెలీదు. అయినా సీత ఇప్పుడు వెళ్ళే మూడ్‌లో లేదు. మనస్సులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. విజ్ఞానం రుచిని మరిగి నెత్తురు రుచి మరిగిన పులిలా మారింది.

ఓసారి నందిత విశాఖపట్నం వెళుతుంటే తనూ వెళ్ళింది సీత. నందిత యూనివర్శిటీ పని చూసుకు వచ్చేసరికి బస్సుడిపోలో నిలబడి ఉంది సీత. ముందు నందితే సీతని గుర్తుపట్టలేకపోయింది. సీతకోసం దిక్కులు చూస్తోన్న తనకి తన పక్కన నిలుచున్న అమ్మాయే సీతని గ్రహించడానికి చాలా సేపు పటింది.

"సీతూ! మైగాడ్!" అని గావుకేక పెట్టింది నందిత. కొందరిని వయస్సు మారుస్తుంది. చదువూ, వయస్సు కలిసొచ్చిన అమ్మాయి ఫాషన్‌ని అర్థం చేసుకుని ఆహ్వానిస్తే ఎంత అద్భుతంగా ఉంటుందో... ఆ క్షణంలో సీత అంత అద్భుతంగా కనిపించింది.

విజయనగరంలో రోజులు వారాలయి, వారాలు నెలలయి పరుగులు తీస్తున్నాయి. నందిత బియ్యే పూర్తయేసరికి సీత దైనందిన జీవితంలో విశ్రాంతి అన్నది అరుదైన విషయమయిపోయింది.

ఉన్నట్టుండి ఒక రోజు టెలిగ్రాం వచ్చింది. ప్రాజెక్టు పని చేస్తూండగా జాలయ్య నెత్తిన రాయి పడిందని. అప్పటికి మచ్‌ఖండ్ వదిలి వచ్చి సరిగ్గా రెండు సంవత్సరాలా నాలుగు నెలలయింది. టెలిగ్రాం చూస్తూనే హుటాహుటిన మచ్‌ఖండ్ బయలుదేరింది. నాలుగైదు రోజుల్లోగా తిరిగి వస్తానంటూ.

నాలుగైదు రోజులు కాదుకదా, ఒక జీవితకాలం తిరిగి రాలేని మార్పు అక్కడ ఎదురుచూస్తున్నదని సీతకి తెలీదు.

# 6

**జాలయ్య కుడి భుజం ఎముక విరిగింది.** పనస ఆకులు, వెదురు, బద్దలు, వేసి కట్టుకట్టారు. తలమీద కూడా దెబ్బ తగిలింది. పాదం బాగా చితికి పోయింది. పవర్ హౌస్ వించ్ దగ్గర పని చూస్తుండగా మీద నుడి రాళ్ళుజారాయి. అయిదారు రోజుల ముందు నుంచీ వర్షం పడుతోంది. ఆ వర్షానికి రాళ్ళు జారాయి. మరో ఇద్దరికి దెబ్బలు తగిలినా ఇంతగా ఎవరూ గాయపడలేదు.

మొదట సీతని చూసి ఆ ఊళ్ళో ఎవరూ పోలికపెట్టలేదు. అందరూ నోళ్ళు వెళ్ళబెట్టి చూశారు. ***అందం చూసే కళ్ళలో కాదు, చూపే వాళ్ళ అందం మానసిక వికాసంతో మరింత పెరుగుతుందని*** నిరూపించింది సీత. వాచిన కుడి కన్ను తెరవలేక, ఎడమ కంటితోనే సీతను చూసి ఆశ్చర్యపోయాడు జాలయ్య. కాస్త పాటి గర్వపడ్డాడు.

ఆ రోజుల్లో ఆ ఊరి వాళ్ళకీ, ముఖ్యంగా చిన్నమ్మకి ఓ విషయం తెలిసింది. ప్రాజెక్టులో పని చేసే చోటే జాలయ్య రెండో కాపురం పెట్టాడని, ఇప్పుడతను కదలలేడు కనుక అతని గుంచి వాకబు చెయ్యడానికి ఢిల్లీ నుండి ఒకావిడ వచ్చింది. నోటి నిండా తాంబూలం, నుదుటి నిండా బొట్టు, పాపిడి మీద సింధూరం, ముఖమంతా నవ్వు - మామూలు నేత చీరకట్టుకుని సాదాసీదాగా ఉంది. ఆవిడ సిమెంట్ కలిపే పనిచేసుకుంటూ పొట్టపోసుకునే రోజుల్లో జాలయ్యతో పరిచయం అయింది. ప్రేమలూ పెళ్ళిళ్ళూలాంటి వేమీ తెలీదు వాళ్ళకు. ఇద్దరూ మధ్యాహ్నం భోజనాల వేళల్లో భోజనం పంచుకున్నారు. క్రమేపీ ఆలోచనలు పంచుకున్నారు. ఆ తర్వాత శరీరాలు పంచుకున్నారు.

నలుగురూ జాలయ్యకు మరో పెళ్ళాం ఉందంటే ఆశ్చర్యపోయారు కానీ, ఎవరికీ సైరంధ్రిని చూస్తే ఆశ్చర్యం కలగలేదు. విచిత్రంగా చిన్నమ్మకూడా ఆమెని చూసి ముక్కుపుటాలెగరెయ్య లేదు. కాగా, ఆస్తిపంచుకోవడానికో, ఆవేశాలు పంచుకోవడానికో కలిస్తే మాటా మాటా పెరిగేదేమో! కష్టాన్ని పంచుకోవడానికి కలవడంతో ఆ ఆలోచన రాలేదు. ఇప్పుడు చిన్నమ్మ ఇంటిపనీ, వంటపనిలో పడింది. సైరంధ్రి మరీ సత్తెకాలం మనిషి అని గ్రహించింది. సీత నాలుగు మాటలు మాట్లాడితే ఒక్క మాట మాట్లాడుతుంది. అదీ అర్థంకాని తెలుగులో, సగం ఒరియాలో.

ఇంటిని పోషించే జాలయ్య మంచం పట్టడంతో ఇల్లు జరిగేదెలా? డబ్బున్న వాళ్ళకి ఇది సమస్యేమో కానీ, పేద వర్గానికి సమాధానాలు సులువు దొరుకుతాయి. జాలయ్య స్థానంలో చిన్నమ్మకి నౌకరీ ఇచ్చారు. రాళ్ళుమోసే పనికి ప్రాజెక్టులో చిన్నమ్మ చేరింది. సైరంధ్రి, చిన్నమ్మ కలిసి ఇంటినీ, భర్తనీ పోషిస్తున్నారు.

సీతకి ఇన్ని నెలల తరువాత టౌన్షిప్‌కి రావడం ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఏదో శాపవశాత్తూ మళ్ళీ పాత జీవితంలోకి విసిరేసినట్టు భావించింది. ఎంత త్వరగా విజయనగరం వెళ్ళిపోతే అంత మంచిదనిపించింది. నందిత అక్కడే ఉంది. కాగా తన అవసరం కూడా ఇక్కడ పెద్దగా లేదు. ఇంటి అవసరాలు, డబ్బు అవసరం ఆడవాళ్ళిద్దరూ తీరుస్తున్నారు. కూతుర్ని చూసి జాలయ్య కాసేపు ఆనందపడ్డాడేమో కానీ ఆ తరువాత తన బాధలో తను మునిగిపోయాడు.

ఓ రోజు నాళయ్య జాలయ్యను చుడటానికి వచ్చాడు. మైనరు బాబు గురించి అడగాలని నోటిదాకా వచ్చింది. కానీ ఎలా అడగాలో తెలియలేదు.

"సీతూ! నువ్వు చాలా మారావే!" అన్నాడు నాళయ్య సీత భుజం తట్టి.

అతనితో జగన్నాథ స్వామి గుడిదాకా నడిచింది.

"చేతినిండా పనుంటోందా మామా?" అంది ఏమడగాలో తెలీక.

"నాకేం పనుంటుంది? బంగళాకి ఎవరన్నా వస్తే పని, వచ్చిన ఆఫీసర్లంతా ఆర్డర్లీలతోనే వస్తారు. వేణ్ణీళ్ళు అందించడం ఒక్కటే పని" అని అంతలో ఆగి "మా మైనరు బాబు వస్తే.." అని నవ్వేశాడు.

"వస్తే?"

"చేతినిండా డబ్బు.. కడుపు నిండా విస్కీ, పట్నం భోజనం...."

"రావడం లేదా?"

"ఆయన మేనమామకి ఈ మధ్య ఆపరేషన్ జరిగింది అమెరికాలో. ఈ బాబే వ్యాపారం చూస్తున్నాడు. నెల కిందట పట్నం వెళ్ళి కలిశాడు. ఆయనకేంటి. ఏనుగు." అంటూ ముందుకి సాగిపోయాడు.

అయిదారు రోజుల తర్వాత తల్లితో అంది "నేనిక్కడ ఉండి చేసేదేం లేదు. అక్కడ నా చదువు పోతోంది. ఏమయినా అవసరం అయితే కుందయ్యగారికి చెపితే..."

చిన్నమ్మకి కోపం వచ్చింది, "ఏదో చుట్టంలా వచ్చినట్టు వెళ్ళిపోవడానికి తొందర పడతావేంటీ? నాన్నలేచి తన పని తాను చేసుకునే దాకా అయినా ఉండు. ఆవిడ పుణ్యమా అని నువ్వు చేయాల్సిన పని అంతా ఆవిడే చేస్తోంది" అంది చిన్నమ్మ, సైరంధ్రి నుద్దేశించి.

వారం రోజుల తరువాత ఓ ఉదయాన సైరంధ్రి తనని నిద్రలేపింది. "మీ నాన్నకి భుజానికి మందు కావాలి, తెచ్చి పెడతావా?" అంది వచ్చీ రాని తెలుగులో.

"ఎక్కడి నుంచి తేవాలి?"

"జయపూర్ నుంచి. మార్కండేయ మహంతి పాడేరు వెళుతున్నారు. లాటాఫుట్ బస్సు స్టాండ్ దగ్గర నిలబడితే నీకిస్తాడు."

"ఆయనెవరో నాకు తెలియదు. నేనెవరో ఆయనకి తెలియదు. "

సైరంధ్రి నవ్వింది. సీత బుగ్గలు పుణికి "నిన్ను పోలిక పట్టడం కష్టం కాదు. ఈ చుట్టు పక్కల అందమైన అమ్మాయి అని కబురు పంపాను" అంది.

సీత నవ్వుకుంది. టౌన్‌లోకి వెళుతున్న రాళ్ళ లారీ ఎక్కింది. టౌన్ షిప్పుకి ఇరవై నాలుగుకిలోమీటర్లు లాటాఫుట్ జంక్షన్.

"ఎలా ఉన్నాడు మీ నాన్న?" అడిగాడు డ్రైవర్ జెనా. ఆ చుట్టుపక్కల ఎవరికీ ఏం జరిగినా అందరికి తెలుస్తుంది. అదో చిన్న ప్రపంచం.

జెనాకి అరవయ్యేళ్ళుంటాయి. దగ్గర దగ్గర ముందు పళ్ళు దాదాపు అన్నీ ఊడిపోయాయి. సీత భుజాల చుట్టూ చెయ్యి వేసి, "నన్ను పెళ్ళిచేసుకుంటావా? మా ముసిల్దాన్ని వదిలేస్తాను" అన్నాడు.

"ముందు వదిలేసిరా" అంది సీత నవ్వుతూ. పిడుగు పడ్డట్టు నవ్వాడు.

నాన్నకివ్వమని పర్లాకిమిడి నుంచి తెచ్చిన పచ్చి వక్క పొట్లం సీతకిచ్చి, లాటాఫుట్ దగ్గర దింపేసి "మరో గంటలో రెండో ట్రిప్పు ఉంది. పనయిపోతే ఇక్కడే ఉండు. తీసుకుపోతా" అన్నాడు.

మార్కండేయ మహంతి బస్సులోంచే చెయ్యి ఊపాడు. అరటి ఆకులో చుట్టిన పొట్లం చేతిలో పెట్టాడు. నోట్లో కారా కిళ్ళీ ఉంచుకుని ఒరియాలో చెప్పిన వాక్యాలేవీ సీతకు అర్థం కాలేదు. అర్థమయ్యేట్టు చెప్పాలని ఆయనా ప్రయత్నించలేదు. బస్సు కదిలిపోయింది. అన్నమాట ప్రకారం జెనా లారీ రాలేదు. మసక చీకటి అలుముకుంటోంది. మరో పావుగంటలో టౌన్ షిప్పులో కెళ్ళే విశాఖపట్నం బస్సు వస్తుందన్నారు.

సీత పరాకుగా నిలబడి ఉండగానే ఓ కారు రోడ్డు మీది నుంచి దూసుకుపోయింది టౌన్ షిప్పు వైపు. కారుని సీత గమనించలేదు. వందగజాలు ముందుకుపోయిన కారు కీచుమని శబ్దం చేస్తూ ఆగింది.

సీత గమనించలేదు. కారున్నట్టుండి వెనక్కు ప్రయాణించింది. సీత గమనించలేదు. రేర్ వ్యూ మిర్రర్‌లో నిర్ఘాంతపోయిన రెండు కళ్ళు ఆమెని తదేకంగా గమనిస్తున్నాయి. సీత గమనించలేదు. అబ్బురపాటుతో ఓ మొహం కారులోంచి బయటికి వచ్చింది. మొదటిసారిగా సీత గమనించింది. ఆమె గుండె ఆగి పోతుందా అని అనిపించింది. ఒక్కసారి తుళ్ళిపడింది. రెండున్నర సంవత్సరాల కిందట చూసిన మొహం తనని పలకరిస్తోంది. మైనర్ బాబుని చాలా కాలం తరువాత చూస్తోంది. జుత్తు గాలికి ఎగురుతోంది. ఎక్‌లెయిర్ సెంట్ పరిసరాల్ని చుట్టేస్తోంది. ముందుకు సాగిన కారు తన కోసం వెనక్కి వచ్చిందని గ్రహించడానికి సీతకి కాస్సేపు పట్టింది. అతను తనతో మాట్లాడుతున్నాడని గ్రహించడానికి మరికాసేపు పట్టింది. రెండున్నర సంవత్సరాల క్రితం తనని సన్నీబాబు "హాయ్" అని పలకరించాడు.

"కెన్ ఐ గివ్ యూ లిఫ్ట్ మామ్!"

మాటలు చెవులదాకా పోవడం లేదు.

"ఎక్స్‌క్యూజ్ మీ!"

సీత ఇంకా అతన్నే దిగ్భ్రమతో చూస్తోంది.

"హల్లో ఆర్ యూ దేర్?"

సీత తేరుకుంది. ఈ రెండేళ్ళలో తన జీవితంలో, తనలో చాలా మార్పులు జరిగాయి. సన్నీబాబు తనకిలా తటస్థపడటం ఆశ్చర్యమే కాని, అలాంటి వాళ్ళతో మాట్లాడటం కొత్తకాదు.

"హలో!" అంది సీత. మాట బయటికి రాలేదు. పెదాలు కదిలాయి.

"టౌన్ షిప్పుకి వెళుతున్నారా?"

తలూపింది.

"వెయిటింగ్ ఫర్ ది బస్?" తలూపింది." నేను లిఫ్ట్ ఇవ్వనా?"

"నేను, నేను.. మీకు శ్రమ..?"

"ఇటీజ్ ఎ ప్లెజర్. నా కారుంది చూశారూ? అందమైన వాళ్ళని చూస్తే కానీ ఆగదు. అందం దాని వీక్‌నెస్."

"దాని ఓనరుకు కూడా"

సన్నీ ఆశ్చర్యపోయాడు.

"మీకు నేను తెలుసా?"

"ఈ చుట్టుపక్కల ఎవరిని అడిగినా మీ గురించి, మీ కారు గురించి చెపుతారు."

సన్నీ పగలబడి నవ్వాడు. అలా నవ్వడం చాలా ముచ్చటగా కనిపించింది సీతకి. అంత దగ్గరగా సన్నీని చూడలేదు. మెడలో తాడు పేనినట్టున్న దళసరి బంగారు గొలుసు, దాని చివరన ఎస్ అనే ఇంగ్లీష్ అక్షరం.

"గెటిన్" అని కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. సీత కారెక్కింది. జీవితంలో ఏదో తెలీని కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టుంది. వెనక సీట్లో బిస్కెట్ పాకెట్లు, ఆపిల్ పళ్ళూ, ఓ స్కాచ్ సీసా, లేడీస్ వేనిటీ బాగ్, ఓ పింక్ కార్డిగాన్, వెనక సీటు మీదే జలతారు చెప్పులూ... వాటిని సీత చూస్తోందని గమనించాడు సన్నీ.

"సారీ అవన్నీ నేను.."

సీత నవ్వింది. "అబ్బే ఆడవాళ్ళు వస్తువులున్నాయని ఆశ్చర్యపోవడం లేదు. ఆవిడ లేదని ఆశ్చర్యపోతున్నాను. అంతే!"

"ఇలా మాట్లాడే ధైర్యం, ఆలోచన ఎక్కడి నుంచి వచ్చాయి?" సన్నీ నవ్వాడు.

"రాత్రి కారుకి ఆక్సిడెంటయింది. కుడి చేతి వేపు లైట్ పోయింది. జయపూర్ వెళ్ళి రిపేర్ చేయించుకు వస్తున్నాను..."

ఈ రెండేళ్ళు ఎందుకు చదువుకోవాలనుకున్నదో ఇప్పుడు అర్థమైంది. ఎందుకు ఇంగ్లీషు నేర్చుకోవాలనుకున్నదో ఇప్పుడు తెలిసి వచ్చింది. తన హెయిర్ స్టైల్, తన స్కర్ట్, తనలో వచ్చిన మార్పు అంతటికి ఈ పక్కగా కూర్చున్న వ్యక్తిమీద కసి తీర్చుకోవడమే పరాకాష్ట. అవును. ఈ కారులో ప్రయాణం ఆ ఛాలెంజ్‌కి ప్రారంభం.

"యూ ఆర్ బ్యూటిఫుల్!" అన్నాడు.

ఆ మాటలు తనకి వినిపించాయి. అయినా మళ్ళీ చెప్పించుకుంది.

"ఊఁ?"

"యూ ఆర్ బ్యూటి ఫుల్.."

నవ్వింది సీత.

"ఐ నో అయామ్ బ్యూటిఫుల్" అంది.

ఎక్కడి నుంచి వచ్చింది ఈ అహంకారం? ***లేనిది ఉన్నట్టు భావించడం ఆత్మ వంచన, లేనిది ఉన్నట్టు చెప్పుకోవడం అహంకారం! ఉన్నది ఉన్నట్టు భావించడం ఆత్మ విశ్వాసం.***

సన్నీ దారిని ఎక్కువగా చూడటం లేదు. కారు దూసుకు నడుస్తోంది. ఆ వేగం మట్టుకు కారుది కాదు. అతని గుండెదని తనకి తెలుస్తోంది.

"రోడ్డువైపు చూసి కారు నడపండి" అంది.

"ఇంత అందమైన అమ్మాయిని ఈ ప్రాంతాల్లో చూడలేదు" అన్నాడు. ఉన్నట్టుండి "కోక్" అంటూ వెనక సీట్లో సీసా అందుకొకని, డాష్ బోర్డ్ పక్క నున్న బిల్టిన్ ఓపెనర్‌తో సీసా తెరిచి చేతికి అందించాడు.

సీత అందుకుంది. ఎన్నో అడగాలని, ఏవేవో మాట్లాడాలని సన్నీ ఉత్సాహపడుతున్నాడనీ తెలుస్తోంది.

"మీ పేరు..?"

ఏది జ్ఞాపకమున్నా లేకపోయినా ఆ రోజు సన్నీ పలకరింత, "ఎర్రసీత" అన్న పేరు వినగానే దొరసాని నవ్వుకు వంతగా సన్నీ నవ్వడం అన్నీ జ్ఞాపకం వచ్చాయి. పేరు చెప్పడానికి సిద్ధంగానే ఉందిప్పుడు.

" వైయ్యస్" అంది.

"వైయ్యస్.. వైయ్యస్... నైస్ నేమ్!" సీత నవ్వింది. అతని మీద పగ తీర్చుకుంటోంది.

"వైయ్యస్ అంటే ఏమిటి?"

మళ్ళీ కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పింది. "ఎర్రసీత"

"ఎర్ర - సీత.. ఎర్రసీత" నవ్వాడు. పేరు ఎర్రసీత అయినందుకు నవ్వలేదు సన్నీ. ఎర్ర సీతని వైయ్యస్‌గా మార్చినందుకు, అభినందన పూర్వకంగా నవ్వాడు. సభ్య ప్రపంచంలో ఎంతటి ఆత్మ వంచన ఉంది! "విచిత్రం.. అతనికి ఏ కోశానా పరికిణి కట్టుకుని

చెట్ల మధ్యనుంచి పరిగెత్తే అలనాటి ఎర్రసీత గుర్తురాలేదు పైగా ఎర్రసీత అని చెప్పాక ఆమె పట్ల గౌరవం అతని కళ్ళల్లో కించిత్తు తగ్గలేదు.

"ఎక్కడుంటారు?"

"ప్రస్తుతం విజయ నగరంలో చదువుకుంటున్నాను."

"గ్రాడ్యుయేట్."

"డిగ్రీలు లేని గ్రాడ్యుయేట్.."

"ప్రాజెక్టు టౌన్ షిప్ లో ఎవరైనా ఉన్నారా?:

"మా అమ్మా నాన్నా. నాన్న ఒనకఢిల్లీలో పవర్ హౌస్ దగ్గర పనిచేస్తాడు. లేబర్.."

ప్రశ్నలు అడుగుతున్నాడే కాని, సమాధానాలు అతని మనస్సుదాకా వెళ్ళటం లేదు. తన నిజాయితీని కసిగా ప్రదర్శిస్తోంది సీత. వీలయినంత వరకు అతనిని ఆక్రమించుకున్న మత్తు పరదాలని చింపివేయడానికి ప్రయత్నం చేస్తోంది. అలా చిరగనందుకు ఆశ్చర్యం కలగలేదు. గర్వంగా కూడా ఉంది. తనలో మోసం లేదు. ముసుగు లేదు. రెండేళ్ళ కిందటి ఎర్రసీత వైయ్యస్ అయే వరకూ ప్రయాణం చేసిందంతే!

టౌన్ షిప్ కి వచ్చేసరికి చీకటి పడింది

"నేను రాధారీ బంగళాలో ఉంటున్నాను."

"నాకు తెలుసు."

"అక్కడ...."

"మరో దొరసాని ఉంటుందనీ తెలుసు. ఈసారి అమ్మాయి పేరేంటి?"

"మంజూ"

"ఒకప్పుడు నా పేరు విని నవ్వినమ్మాయి ఎవరో మీకు గుర్తుండకపోవచ్చు."

నవ్వాడు సన్నీ. తన బలహీనతల గురించి చెపితే సిగ్గుపడే మనస్తత్వం కాదతనిది. పైగా ఒక అమ్మాయి వాటిని అర్థం చేసుకోవడం తన లక్ష్యానికి దగ్గర తోవ.

టౌన్ షిప్ కనుచూపు మేరకు వచ్చిందనగా సీత చేతి మీద చెయ్యి వేశాడు సన్నీ. చీకట్లో అతను సన్నగా ఈల వేస్తున్నాడు. సీత నవ్వుకుంది. తన చేతి మీద చెయ్యివాలడం ఇంత ఆలస్యం చేశానేమిటా అనుకుంది. తను చెయి వెనక్కి తీసుకునే ప్రయత్నం చెయ్యలేదు.

తన చేతిని సీత తోసివేయలేదని సన్నీకి కూడా అర్థమవుతోంది. సన్నీ నవ్వుకున్నాడు అంతకుమించి ఆనందించాడు. అతని కారులో, గౌరవించే స్థాయిలో కూర్చుని ఊళ్ళోకి ప్రయాణం చేయడం సీత మనస్సులో అందమయిన కల. అయితే 'కల' అంత వరకేనా?

సన్నీ సీత ఇంటి ముందు కారాపాడు. సీత వెంటనే దిగలేదు. ఊళ్ళో అందరికీ సన్నీ తెలుసు. అతని చరిత్ర తెలుసు. అతని కారు తెలుసు, అంతకు మించి సీతని తెలుసు. అయితే సన్నీ కారులో సీత రావడం తెలీదు.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తారు?" అన్నాడు.

"ఎప్పుడు కలవమంటారు?"

ఈజీ - ఈజీ - పల్లెటూరి అమ్మాయిలతో పరిచయం చాలా ఈజీ.

"సాయంకాలం?"

"బాగా చీకటి పడ్డాక?"

"ఓ.కె."

"రాధారి బంగళాలోనా?" సీత నవ్వింది. సన్నీ నవ్వాడు.

"మరి మంజూ"

"మధ్యాహ్నం పంపేస్తాను"

సీత అతన్ని చూసి నవ్వింది. "నాకు తెలుసు, మీరు పంపెయగలరని" అంటూ కారు దిగింది. సన్నీ కారు దిగి ఆమెకి చెయ్యి ఊపాడు. అందరూ తనని చుశారో లేదో రూఢి చేసుకుంది సీత.

ఆ సాయంకాలం చాలా ఆలశ్యంగా చీకటి పడింది. ఆ రోజు మధ్యాహ్నం తిట్టుకుంటున్న మంజూని మరో వెయ్యి రూపాయలు ఎక్కువ ఇచ్చి విశాఖపట్నం బస్సు ఎక్కించాడు.

ఆ రోజు చాలా సుళువుగా చీకటి పడింది. కోరి కల్పించుకుని సైరంధ్రిని పక్కకి తోసి వంట చేసింది సీత. తనే స్వయంగా తండ్రికి కట్టుకట్టింది. ఉప్పూ కారం సరిగా లేని వంటని తింటూ చిన్నమ్మ, సైరంధ్రీ నవ్వుకున్నారు.

"అమ్మకి నువ్వు ఇంత సాయం చేస్తే నేను ప్రాజెక్టుకి పోతాను" అంది సైరంధ్రి.

ఆ సాయంకాలం ఒకటి రెండుసార్లు సన్నీ కారు ఆ ఇంటి చుట్టూ తిరిగింది. ఆ సాయంకాలం నాలుగయిదు సోడాలు ఎక్కువ రవాణా అయాయి బంగళాకి.

ఆ సాయంకాలం సన్నీ శరీరంలో రగిలే ఆకలి తెలుసు సీతకి. తన శరీరంలోనూ ఏదో మూల ఆ ఆకలి ఉంది. అంతకంటే సన్నీని హింసించడంలో ఆ ఆకలి ఎక్కువ తీరింది.

నులక మంచం మీద సైరంధ్రి పక్కలో పడుకుని ఆమె చేత తన కర్ధం కాని పాటలన్నీ పాడించుకుంది సీత. ఓ రాత్రికి తనకీ నిద్రపట్టలేదని గుర్తొచ్చింది. బయటికొచ్చి నాలుగడుగులు వేసి చూసింది. రాధారీ బంగళాలో దీపాలు వెలుగుతున్నాయి.

వెనక్కి వచ్చి సైరంధ్రి మీద చెయ్యి వేసుకుని పడుకుంది.

మరునాడు తెల్లవారు ఝామునే ఒనకఢిల్లీ బయలు దేరిన సైరంధ్రితో తనూ వస్తానంటూ వెంటబడింది సీత.

పవర్ హౌస్ నుంచి బయటి కొచ్చి కాలువలు కట్టే మచ్ఖండ్ నది, ఎక్కడో దక్షిణ అమెరికా లోయల్లాగ కనిపించే కొండల మధ్య మాయమయ్యే సన్నటి నీటి ప్రవాహం. చిన్న రామమందిరానికి రంగులు వేస్తున్న ఆచారి గారి భార్య పగలే ఒళ్ళు విరుచుకుని మత్తు నిద్రపోతోంది ఒనక ఢిల్లీ.

ఆ ఉండడం నాలుగు రోజులు ఉండిపోయింది.  ఈ నాలుగు రోజుల్లో నలభై సార్లు సన్నీ గురించి ఆలోచించి ఉంటుంది. మరి సన్నీ? చిన్నమ్మ వచ్చి పలకరించి కూతుర్ని తిట్టింది. "ఎనాళ్ళు ఉండిపోతావు. నేనొక్కదాన్నే పని చేసుకోలేకపోతున్నాను" అని.

"నాకిక్కడ నూట పాతిక రావాలి. తీసుకుని తెల్లారుతూనే వస్తాను సీతతో" సైరంధ్రి చెప్పింది చిన్నమ్మతో.

ఆ సాయంత్రం చీకటి పడే వేళకి, ఒనక ఢిల్లీ తొందరగా నిద్రపోయే సమయానికి, రామమందిరం మలుపు తిరగగానే సీత భుజం మీద చెయ్యి పడింది. సీత తుళ్ళి పడింది. అటు తిరగక ముందే ఆ చెయ్యి బలంగా తన భుజాన్ని పట్టుకుని కారు సీటు మీదకి తోసేసింది. కారుకి అటు తిరిగి వచ్చి సన్నీ డ్రైవింగ్ సీటులో కూర్చున్నాడు.

సీతకి ఆశ్చర్యం కలగలేదు. సన్నీ ముఖంలో కోపం తెలుస్తోంది. తన కోసం నాలుగు రోజులూ, ఇరవై కిలో మీటర్లు వచ్చినందుకు ఆనందపడి పోయింది.

కారును డుడుమా ఆనకట్ట వేపు తిప్పాడు. కొండ సొరంగంలోంచి నీళ్ళు దూసుకు వస్తున్నాయి.

"నేను బంగళాకి రావాలని అనుకోలేదు" అంది సీత

"వస్తావని ఎదురు చూడలేదు"

"మరి మంజూని ఎందుకు పంపేశారు?"

"వస్తే మంజూ అడ్డుకాకూడదని"

"యూ ఆర్ ఎ బాస్టర్డ్!" అంది సీత.

సన్నీ ఆమెని దగ్గరకి లాక్కొని పెదాలు కందిపోయేంత గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు, సీతకి ఆశ్చర్యం కలగలేదు. ఆశ్చర్యం కలిగించిన విషయమల్లా తనూ ఆ క్షణానికై ఎదురు చూస్తోందని. ఆమె చేతులూ అతని చుట్టూ బిగుసుకున్నాయి.

జీవితమంతా ఆ అనుభవం కోసమే ఎదురు చూస్తున్నట్లు కారు వణికింది – చీకటిలో కొండ చరియలోంచి దూసుకు వస్తున్న నీటి ప్రవాహం చప్పుడూ, దూరంగా ఆంధ్ర రాష్ట్రం వేపు కొండల మీద చెట్లని తగులబెడుతున్న మంటలూ, కీచురాళ్ళ శబ్దాలూ – సీతకి ఇది ఎదురు చూస్తున్న ఆనందం.

నలిగిపోయిన శరీరం మీద నలిగిపోయిన బట్టల్ని సరి చేసుకుంది. జుత్తు చుట్టూ నల్లటి ప్లాస్టిక్ రింగు తిప్పుకుంది.. ముందు సీట్లోంచి కోక్ తెరిచి ఇచ్చాడు. కారు వెలుగులో అతని కింద పెదవి మీద చిట్లి కారిన రక్తం మరకని తుడిచింది.

టౌన్ షిప్‌కి శివారులో కారు ఆపాడు సన్నీ.

సీత కారు దిగింది. చెయ్యిపట్టుకుని – "థాంక్స్" అన్నాడు.

వెళ్ళబోతున్న సీత వెనక్కి తిరిగి అతని ముఖంలోకి చూసింది. సన్నీ కళ్ళల్లో తృప్తీ, కాస్తపాటి గర్వం కనిపించాయి. ఒక్క అడుగు ముందుకు వేసి చాచి చెంప దెబ్బ కొట్టింది. ఆ శబ్దం చీకట్లో టౌన్ షిప్ అంతా ప్రతిధ్వనించింది తుపాకి పేలినట్లు.

"నేను మంజూ, డాలీ, లైలా, జిమ్మీ కాదని గుర్తుండటానికి" అంటూ వెళ్ళిపోయింది.

సన్నీ ఆశ్చర్యపోయాడు. ఆ దెబ్బకీ, ఆ బలానికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అయినా ఆమెలో గర్వం, హుందా అతనికి ఆకర్షణీయంగా కనిపించాయి. పుట్టి బుద్ధి ఎరిగాక ఎవరూ తనని కొట్టలేదు. సీత కొట్టినందుకు కోపం రాలేదు. దూరంగా చీకట్లోకి నడిచి వెళుతున్న సీత మరింత ఎత్తుగా, గొప్పగా కనిపించింది సన్నీకి.

మర్నాడు సైరంధ్రి మొదటి బస్సుకే వచ్చేసింది. "రాత్రంతా నీ కోసం ప్రాజెక్టంతా తిరిగాను. చెప్పకుండా వచ్చేశావేం?" అంది సీతతో.

సీత ఏమీ చెప్పలేదు. ఎక్‌లెయిర్ పట్టి పీడిస్తున్న క్రితం సాయంకాలం స్కర్టుని ఉతుక్కొంటోంది. జాలయ్య ఇప్పుడు భార్య సాయంతో మంచం మీద కూర్చున్నాడు.

రోజూ నిషిత్ నాయక్ ఇంటికి వెళ్ళి ఇంగ్లీషు పేపరు చదవడం అలవాటు చేసుకుంది సీత. నిషిత్ నాయక్‌కి భార్య లేదు. విధవరాలయిన చెల్లెలు ఉంది. ఆమె పేరు ప్రీతి లత. ఆమెకి ప్రతి రోజూ కొత్త రకం 'రెసిపీ'లు చెయ్యడం నేర్పింది సీత. ప్రతిఫలంగా అమెరికా నుండి దిగుమతి అయిన నిటెడ్ బ్రాలు సీతకి ఇచ్చింది. విజయనగరాన్నీ, అక్కడ అలవాటు చేసుకున్న నాగరిక జీవనాన్ని

కాస్తయినా రుచి చేసే విడిది నిషిత్ నాయక్ ఇల్లు. అక్కడ మైకేల్ క్రిష్టస్, డిస్ క్లోజర్, రాబర్ట్ టాడ్‌లమ్ 'దిరోడ్ టు ఒహామా' ఎరిక్ సెగాల్ 'లవ్ స్టోరీ' రాబర్ట్ కుక్ 'హార్మ్‌ఫుల్ ఇన్ టెంట్' వగయిరాలన్నీ చదివింది.

డుడుమా దగ్గర సంఘటన సీతకి సంబంధించినంత వరకూ అడివిలో ఎక్కడో ఎప్పుడో పూచిన బంతి పువ్వులాంటిది. మరో పువ్వు పూయాలని ఎదురు చూడనూ లేదు, అనిపించనూలేదు. వ్యక్తిలో సహజంగా, జాగృతంగా ఉన్న సంస్కారమేదో చదువుతో, లోక జ్ఞానంతో మరింత బలపడింది. ఆ తర్వాత ఒక్కసారి కూడా సీత సన్నీ గురించి ఆలోచించలేదు. ఓ గొప్ప ఛాలెంజ్‌ని చేపట్టాక - అతి శ్రమతో విజయాన్ని సాధించాక వచ్చిన పూర్తి 'ఆటవిడుపు'లాంటిది ఆమె స్థితి. అపురూపంగా ఎదురు చూసి కలలు గని, తపించాక దక్కిన అనుభూతితో అన్ని ఆలోచనలూ సడలి పోయిన నిర్లిప్తత ఆమెది.

ఏడు రోజుల తర్వాత నిషిత్ నాయక్ ఇంటికీ టౌన్ షిప్‌కీ మధ్య దారిలో కారు నిలుపుకుని సన్నీ ఎదురు చూస్తున్నాడు. కారుని అనుకుని నిలబడి ఉన్నాడు.

చూసి "హల్లో" అని పలకరించింది సీత.

కారు తలుపు తీశాడు. సీత నవ్వింది. కాదు నవ్వుకుంది. సుతారంగా కారు తలుపు మూసి "ఇంకా ఇక్కడేం చేస్తున్నారు? మీరు వెళ్ళిపోయారనుకున్నాను"

"వెళ్ళిపోతాననుకున్నావా?"

"సాధారణంగా ఈ బంగళాలో మీరుండేది ఒక్క రాత్రేగా?"

"ఇది సాధారణం కాదు."

సీత పెదాలు బిగుసుకున్నాయి.

"వైయ్యస్, నన్నెందుకు తప్పించుకు తిరుగుతున్నావు?"

సీత మాట్లాడలేదు.

"ఆ తర్వాత - నిజం చెప్పు - నన్ను కలుసుకోవాలనిపించలేదా?"

సీత కళ్ళల్లోకి రక్తం దూసుకుంది.

"చూడు మిష్టర్ సన్నీ - ఓ సాయంకాలం సెక్స్ కారణంగా మనిద్దరి మధ్యా మరిచిపోలేని ప్రేమ, విరహం, కోరిక -"

మాట పూర్తికాలేదు - "అంతా ట్రాష్ - నేను సినిమా కబుర్లు చెప్పడానికి సిద్ధంగా లేను" సన్నీ నవ్వాడు. "కమాన్ వై, ఆ రోజు.. నీకు ఇష్టం లేదంటావా?"

"స్టాపిట్!"

సన్నీ సిగరెట్ వెలిగించాడు.

"లుక్ సన్నీ, నీకు ఆడది కొత్తేమో కాని, సెక్స్ కొత్తకాదు. నాకు అన్నీ కొత్త, ఓకే. నీకు ఓ సాయంకాలం సరదా రొటీను. నాకు కాదు. నీకు ప్రేమ కబుర్లు, విస్కీ సీసాలూ, మంజూాలు, వాళ్ళతో సరసాలు - సారీ ఇవన్నీ నాకు సంబంధించిన విషయాలు కావు. ఐ డోంట్ కేర్ - గుడ్‌బై"

ముందుకు నడిచింది. చర చరా, ఆమెతో నడవబోయి అంతలో కారెక్కి ఆమె కంటే ఫర్లాంగు ముందు కారు నడిపి, ఆగి వెనక్కి ఆమెకి ఎదురుగా నడిచి వచ్చాడు. "వై - ఐ వాంట్ యూ - ఐ లవ్ యూ" అన్నాడు.

సీత నవ్వింది. పగలబడి నవ్వింది "ఈ మాటల అర్థం నాకు చాలా కాలం తెలీదు సన్నీ. ఇప్పుడవన్నీ బూతు మాటల్లాగ వినిపిస్తాయి. ఆ రాధారీ బంగళాలో గోడల్నడిగినా నువ్వు డజన్ల కొద్దీ అమ్మాయిల్తో చెప్పిన ఈ మాటలు ప్రతిధ్వనిస్తుంటాయి. వద్దుసన్నీ - నీ మనస్సులో నిజాయితీ ఉన్నా - ఆ నిజాన్ని స్పష్టంగా చెప్పే మాటలు నీ దగ్గర లేవు - కారు వేడెక్కింది. అమ్మాయి లేకుండా బంగళాలో ఉండడం ఇదే మొదటి సారేమో! గోటు వైజాగ్, బై!"

కారు దాటి వెళ్ళిపోతున్న సీతని చూసి, "యూ బిచ్!" అని అరిచాడు. సీత ఆగింది. వెనక్కి తిరిగి రెండడుగులు వేసింది.

"ఇది నిజాయితీగా నీ నోట్లోంచి వచ్చిన మొదటి మాట. ఈ భాష నీది" కారు లోపల చెయ్యి పెట్టి ఇగ్నీషన్ ఆపి "చూడు సన్నీ. మంచి చెడూ తెలీని రోజుల్లో 'కల్లు' రుచి ఎలా ఉంటుందో చూడాలనిపించింది. ఆ చాపల్యం అప్పటిది. ఎర్ర సీతది, ఇప్పుడు ఈ వైయస్‌కి కల్లు ఎవరు తాగుతారో తెలుసు ఎందుకు తాగుతారో తెలుసు. నీమీద నాకు కోపం లేదు. లీవ్ మీ ఎలోన్" అంది.

రెండడుగులు వెయ్యగానే బలంగా సన్నీ చెయ్యి ఆమె భుజం మీద పడింది. చుట్టూ చూసింది. డుడుమాలో లాగే చీకటి కారు చుట్టూ ముసురుకుంది. డుడుమాలో లాగే సన్నీ వేళ్ళు ఒణుకుతున్నాయి. డుడుమాలోలాగే ఆమె శరీరంలో రక్తం వేడెక్కింది. అయితే ఈ శరీరానికి కోరిక అప్పటి అలవాటు. దాన్ని తొక్కిపెట్టడం ఆమె సంస్కారం నేర్పింది.

"వద్దు సిన్న బాబూ - నేను అడివిలో గేదెలు కాసిన దాన్ని - విస్కీ గ్లాసు పట్టుకున్న చేతులు నాతో పోటీ పడడం కష్టం" అని అతని చెయ్యి మెల్లగా తప్పించి, చీకట్లోకి నడిచిపోయింది.

ఆ చీకటి తనకి బాగా అలవాటయిన చీకటి. దారి వెతుక్కోవలసిన అవసరం లేదు, తెలుస్తోంది.

## 7

త్రివేండ్రం నుంచి మాలేకి విమానంలో గంట ప్రయాణం. ఎయిర్ బస్ సీట్లో కూర్చున్న పాసింజర్ సిబ్బందికి పరిచితుడే! అంతేకాదు. పక్క సీట్లో మరో అమ్మాయి. ప్రతీసారీ మరో అమ్మాయి ఉండటమూ సిబ్బందికి పరిచయమే! అయితే ఈసారి సన్నీ ఒక్కడే ఉన్నాడు. ఎప్పుడూ ఉండే సరదా మూడ్ లో లేడు. పక్కన అమ్మాయి లేదు. విమానం లేస్తూనే హోస్టెస్ జోసఫిన్‌ని పిలిచాడు.

"నాకు స్కాచ్ కావాలి" అన్నాడు.

"కానీ బాస్.. హార్డ్ లిక్కర్ సర్వ్ చెయ్యడానికి.."

"నీ కంటే నాకు రూల్స్ బాగా తెలుసు. సన్నీ అడుగుతున్నాడని కెప్టెన్‌కి చెప్పు."

సరైన మూడ్‌లో లేడని గ్రహించింది జోస్ఫైన్. ఆకాశంలోకి విమానం లేవగానే గ్రాంట్స్ సన్నీ చేతికి వచ్చింది. ఆన్ రాక్స్, గటగటా తాగి మరొకటి అడిగాడు. జోస్ఫైన్ నవ్వుకుంది.

"గర్ల్ ఫ్రెండ్ మోసం చేసిందా బాస్?" అంటూ గ్లాసు అందించింది. మొదటి సారిగా సన్నీ ముఖంలో కాస్తపాటి ప్రసన్నత వచ్చింది.

"గర్ల్‌ఫ్రెండ్ కావడానికి ఒప్పుకోవడం లేదు బిచ్" అన్నాడు.

"సుఖానికి అర్థం తెలీని మనిషి. పూర్ డార్లింగ్.." అంది.

గ్రాంట్స్ తలలో నరాల్ని సవరిస్తోంది. మెదడులో చాలా సమస్యల్ని సర్ది పెడుతోంది. చాలా చిక్కు ప్రశ్నలకి దగ్గరి తోవల్ని సూచిస్తోంది. విమానంలాగే మనసు క్రమంగా ఆకాశంలోకి లేచింది. గంట ప్రయాణంలో ఎప్పుడూ రెండు పెగ్గులు తాగలేదు. మూడో గ్లాసు చేతిలో పెట్టి, "ఫర్ పీస్ ఫుల్ స్టే బాస్!" అంది జోస్ఫైన్ చెవిలో. ఆమె కళ్ళలోకి కృతజ్ఞతతో చూశాడు. జోస్ఫైన్ తనకు దాదాపు

నాలుగు సంవత్సరాలుగా తెలుసు. ఆరేళ్ళ క్రితం యు.పి పైలెట్‌ని చేసుకుంది. ఆకాశంలో విమానాల్ని నడిపే భర్త నేల మీద కారుని నడపలేకపోయాడు. నాలుగేళ్ళ కూతురితో కారు ప్రయాణం చేస్తూ ఆక్సిడెంట్‌లో ఇద్దరూ పోయారు. అప్పటికి జోస్‌ఫైన్‌కి ఆరోనెల. రెండు నెలలు సైకిక్ వార్డులో ఉంది. ఒక నెల ముందుగా పుట్టిన కొడుకుని ఇన్‌క్యుబేటర్‌లో ఉంచారు. వాడి పేరు కెప్టెన్‌కపూర్ అని పెట్టింది. తర్వాత క్రమ క్రమంగా కోలుకుంది.

"కెప్టెన్ ఎలా ఉన్నాడు?" అన్నాడు సన్నీ. పనంతా పూర్తి చేసుకుని పక్కన కూర్చున్న జోసఫైన్‌తో.

"బాస్టర్డ్, ఇప్పట్నించి విమానాలు నడుపుతానంటాడు. ఇంట్లో ఉన్న నడిచే వస్తువులన్నీ దాచేశాను." అంది.

"నువ్వా నడుస్తావుగా?"

"బాస్.. వాడు వాళ్ళ నాన్న అడుగు జాడల్లో నడవకూడదు."

"ఏం చేస్తావు వాడిని?"

"టీచర్"

***ఆశ్చర్యపోయాడు. మనిషి దుఃఖం నుంచి కోలుకోవడానికి రకరకాల మార్గాలు ఆలోచించుకుంటాడు. కానీ రూఢయిన విషయం ఏమిటంటే కోలుకుంటాడు. కోలుకోకపోతే బతకలేడు.***

విమానం దిగుతోంది లేత ఆకుపచ్చటి ద్వీపాలు నేల మీద చుక్కల్లాగా కనిపిస్తున్నాయి. పొరపాటు... సముద్ర మధ్యంలో చుక్కల్లా కనిపిస్తున్నాయి. హిందూ సముద్రపు బుగ్గన చుక్కలాగే ఉంది మాలే. 1600 ద్వీపాలు. అందులో దాదాపు 700 ద్వీపాల్లో నర సంచారం లేదు. ఆకుపచ్చ నీటి తెరలా ఉన్న సముద్రం మధ్యని కొండ చిలువలా నల్లటి చార. అదే హుల్ హులే ద్వీపం. రన్ వే మీద విమానం పాకింది. రన్‌వే, ఎయి పోర్టు ఒక్కటే ఓ చిన్న ద్వీపం. అక్కడికి కాస్త దూరంగా కనిపించేదే మాలే ముఖ్యపట్టణం. ఆ ద్వీపం వైశాల్యం 1.65 కిలో మీటర్లు, ఎటు అరగంట నడిచినా సముద్రం దగ్గరికే చేరుతాం.

ఎయిర్ పోర్టు బయటికి రాగానే షుక్రీకి సమాచారం వస్తుంది. సన్నీ వస్తున్నాడంటే అతనితో ఎవరో ఒక అమ్మాయి వస్తున్నట్టు లెక్క. అతను రాగానే స్పీడ్ మోటార్ బోట్ సిద్ధంగా ఉంచుడు. ఆయన కిష్టమైన బోటు మాలే క్వీన్ - 1.

ఈసారి ఒంటరిగా వచ్చాడు - అదీ చెప్పా చెయ్యకుండా

"బాస్! ఫోన్ కాల్ లేకుండా.."

"షుక్రీ! వెంటనే వెళ్ళాలి."

"హన్సస్‌కి ఫోన్ చేస్తాబాస్. కానీ బియాదూలో జపాన్ బృందం ఉంది. ఖాళీ ఉందో లేదో మీ నంబరు కాటేజీ.."

"ఈ సారి విల్లి వారులో ఉంటాను."

షుక్రీ ఆశ్చర్యపోయాడు. సన్నీ ఎప్పుడూ బియాదూ ద్వీపంలో ఉంటాడు. అది ఇరవై మూడు ఎకరాల ద్వీపం. ఒకటో నంబరు కాటేజీ ఓ పక్కకి ఉంటుంది. రెస్టారెంటుకీ బార్‌కి దగ్గర. సన్నీకి అది ఫేవరెట్ కాటేజీ. కానీ ఇవాళ మొదటి సారిగా విల్లివారులో...

విల్లివారు పన్నెండు ఎకరాల చిన్న ద్వీపం అయితే చక్కటి టెన్నిస్ కోర్టు. బిలియర్డ్స్, బాడ్ మింటన్ కోర్టులున్నాయ్. మంచి బార్, రెస్టారెంటు ఉన్నాయి. ఎటు చూసినా సముద్రం మధ్య ఉన్నట్టే ఉంటుంది. మాలే క్వీన్ కూడా ఎయిర్‌పోర్టు దగ్గర లేదు. "పాసింజర్స్‌తో పోతాను." అన్నాడు సన్నీ.

స్విట్జర్ లాండ్ నుంచి రాండొల్ఫ్ అనే సివిల్ ఇంజినీరు, రోసలీన్ అనే సెక్రెటరీ ఎక్కారు బోటులో. రోండోల్ఫ్ కంటే రోసలిన్ వయస్సులో పెద్ద. ఆ తేడా తెలుస్తూనే ఉంది. బోటులో ఆమెను వదలకుండా పొదివి పట్టుకున్నాడు. మధ్య మధ్య అతన్ని మత్తుగా ముద్దు పెట్టుకుంటోంది.

సముద్రం నురుగలలో చెయ్యి జాపి ఓ పక్కకు కూర్చున్నాడు. మాలేకి ఎప్పుడూ ఒంటరిగా రాలేదు సన్నీ. ఈ మూడ్‌లో రాలేదు. ఇలా అర్థాంతరంగా రాలేదు.

దూరంగా చిన్న చిన్న ద్వీపాలు పలకరించి తప్పుకుంటున్న స్నేహితుల్లాగా ఉన్నాయి. స్పీడ్ బోట్ దాదాపు గంటన్నర సేపట్నుంచీ ప్రయాణిస్తోంది. అది రంజాన్ నెల. మాలేలో ఎక్కడా ఎవరూ పచ్చి మంచి నీళ్ళు తాగకూడదు. తాగినట్టు తెలిస్తే ప్రభుత్వం అరెస్టు చేస్తుంది. మాలేని పరిపాలిస్తున్నది ముస్లిం ప్రభుత్వం. మాలే ఆదాయమంతా టూరిజం ద్వారానే. కనక ద్వీపాల్లో హాలిడే హోటళ్ళలో బ్రాంది, విస్కీ అనుమతిస్తారు.

దూరంగా విల్లి వారు ద్వీపం కనిపిస్తోంది. బోటులో మాలే మనిషి ఆతృతగా సన్నీ చేతిలోని ఇంగ్లీష్ పేపరు లాక్కొని చదివేస్తున్నాడు. ఎవరయినా టూరిస్టు తెస్తేనే ఇంగ్లీషు పేపర్ వస్తుంది. మాలే ద్వీపంలో నాసిరకం టీవీ ప్రసారాలే వాళ్ళకి గతి. అందుకనే విమానంలో వచ్చే ప్రయాణికుల చేతుల్లో పేపరు వాళ్ళకి అపురూపం.

సన్నీ వస్తున్నట్లు షుక్రీ విల్లీ వారు మేనేజరు హన్సన్ జిత్ సింగ్‌కి సమాచారం అందించాడు. ఒడ్డునే హన్సన్ కొబ్బరి నీటి బొండాంతో, ఎర్రటి మందారాలతో, చిరునవ్వుతో పలకరించాడు.

"సర్‌ప్రైజ్ బాస్" అన్నాడు కొబ్బరి బొండాం అందిస్తూ.

"హన్సన్! చాలా పీస్‌ఫుల్‌గా ఉండే సూట్ కావాలి" అన్నాడు సన్నీ.

"ఎట్వన్స్ బాస్" అంటూ పరిగెత్తాడు హన్సన్. ఎప్పుడూ దంతపు రంగు జోధ్‌పూర్ సూటులో అప్పుడే కోసిన పువ్వులాగా ఉంటాడు హన్సన్. కర్నాటక నుండి రెండేళ్ళ కిందట వచ్చాడు. ప్రతి సంవత్సరం వేసవికి అతని కుటుంబం ఇక్కడికి వస్తుంది. క్రిస్‌మస్‌కి తను వెళతాడు. సన్నీ వచ్చినప్పుడల్లా చక్కటి స్కాచ్, రెండు మూడు కార్టన్ల సిగిరెట్లు అందుతాయ్ హన్సన్‌కి.

"వాంగ్‌కి చెప్పు నేను వచ్చానని. మధ్యాహ్నం స్పాగట్టా, మష్రూమ్స్, లివర్.."

"వాంగ్‌కి అప్పుడే తెలిసిపోయింది బాస్, లాబ్‌స్టర్ కోసం మనిషిని బియాదూకి పంపారు. మీకేం కావాలో మీకన్నా అతనికే తెలుసు. డోంట్ వర్రీ" అన్నాడు హన్సన్.

గదిలోకి రాగానే షర్ట్ తీసి పక్క మీద విసిరేశాడు. కేరీ బాగ్ కుర్చీలో పారేశాడు సరాసరి బాత్ రూములోకి వెళ్ళాడు.

సన్నీ సూట్ కేసు మాలే బాల్ వాలీ తీసుకు వస్తున్నాడు. అప్పుడే గదిలోకి అడుగుపెడుతున్న హన్సన్ నిశ్చేష్టుడై ఆగిపోయాడు. సన్నీ విసిరేసిన కారీ బాగ్ లోనుంచి రివాల్వర్ మంచం మీద పడింది. ఒక్క క్షణం హన్సన్‌కి నోట మాట రాలేదు. ఈలోగా లోపలికి వచ్చిన వాలీకి మంచం కనిపించకుండా అడ్డంగా నిల్చున్నాడు.

కష్టమ్స్ నుంచి ఎలా తప్పించి తీసుకురాగలిగాడు? చాలా తరుచుగా వచ్చే మనిషిని చూడగానే వదిలేసి ఉంటారు. రివాల్వర్ కష్టమ్స్ అధికారులు చూస్తే సన్నీ గొడవలో పడేవాడు. అయినా సన్నీ ఎప్పుడు సరదాగా గడపడానికే వచ్చేవాడు. అలాంటిది... ఈసారి.. రివాల్వర్‌తో..

"ఎన్నాళ్ళుంటారు బాస్" అడిగాడు బాత్ రూం దగ్గరగా వచ్చి పగలబడి నవ్వి "ఎన్నాళ్ళో తెలీదు హన్సన్, నన్నెవరూ డిస్టర్బ్ చేయకండి వాంగ్ కూడా." అన్నాడు.

సన్నీ అంకుల్ కూడా తెలుసు హన్సన్‌కి.

ఇప్పుడేం చెయ్యాలి?

హడావుడిగా తన గదిలోకి వచ్చి లోపల్నుంచి తలుపు గడియవేశాడు. ఫోన్ ముందు కూర్చుని ఇండియా నంబర్లు తిప్పాడు.

## 8

**కారులో సెక్స్ సీతకి ఆషాఢంలో మొదటి వర్షపు తుంపర.** సన్నీకి మనిషి రక్తం మరిగిన పులి రుచి, ఆ అనుభవంలో సీత ఆవేశం పాలే ఎక్కువ. సన్నీకి ఇది కొత్తకాదు. కారుకీ కొత్తకాదు. ఆడపిల్ల ఎలాంటి సందర్భంలో తన కారెక్కుతుందో, ఎలా తన కౌగిట్లోకి వస్తుందో అంతా సన్నీకి తెలుసు. అతని ఆనందంలో కాస్తపాటి అహంకారం ఉంది. అతని నడవడికలో "ఇవన్నీ ఇలాగే జరుగుతాయిలే!" అన్న నిర్లక్ష్యం ఉంది. ఆడపిల్లకీ ఆడపిల్లకీ తేడా ఒకప్పుడు డబ్బు, ఒకప్పుడు విస్కీ, ఒక్కొక్కప్పుడు చిన్న చిన్న వ్యామోహాలు .. కానీ ఎప్పుడూ ముగింపు రాధారీ బంగళాయే! సన్నీకి సీత కొత్త. సీతలాంటి వ్యక్తులు కొత్త. ఆ మనస్తత్వం కొత్త.

సీతకి అది మొదటినుంచీ తెలిసిన అనుభవం, తెలుసుకున్న అనుభవం కాదు. ఆమెకు వయస్సు తెలిసి వస్తున్న కొద్దీ శరీరం ఆ అనుభవానికి ఆరాటపడింది. కానీ సహజమైన సంస్కారం, ఆమెను ఆ అనుభవానికి దూరంగా జరిపింది. కాగా సన్నీ చేతుల్లో వాలడం చాలా మంది ఆడపిల్లలకు ఆట విడుపు. కానీ సీతకు మొదటి విజయం. తనని వంకరగా చూసిన, చదువుకున్న కుర్రాడు తనకోసం పడిగాపులు పడటం ఎంతో కొంత ఆమె అహంభావానికి అందిన రుచి. దానికి కారణం సెక్సేనని ఫ్రాయిడ్ పెట్టిన పేరు. అది సీతకి తెలీదు.

కనక మొదటి అనుభవం సీతకి ద్విగుణీకృతమైన ఆనందాన్ని ఇస్తే, సన్నీకి రొటీను ఆనందాన్నిచ్చింది. కాగా తన నుంచి దూరంగా జరిగే ఆడపిల్ల తన చేతుల్లో వాలిపోవడంగా సరిపెట్టుకున్నాడు.

సాధారణంగా అక్కడే రొమాన్సు ప్రారంభమౌతుంది సిటీ పిల్లల్లో, కానీ సీతకి మొదటి అనుభవమే ప్రారంభమూ, ముగింపూనూ. అంతకంటె ఎక్కువ విలువనివ్వలేదు. ఆ అనుభవంవల్ల పట్ల ఎక్కువ ప్రాముఖ్యాన్ని చూపలేదు.

భక్తిలో తన్మయుడైన భక్తుడికి దేవుడు ప్రత్యక్షమైతే, ఆ దర్శనం కంటే భక్తి రుచే ఎక్కువగా మనస్సుకు నాటినట్టు - సన్నీ ఆకర్షితుడయే స్థాయికి తాను కసిగా పెంచుకున్న సంస్కారం, ఆకర్షితుడైన సన్నీ చేతుల్లో లభించిన ఆనందం కన్న గొప్పగా కనిపించింది.

ఇదుగో ఇక్కడా సంఘర్షణ ప్రారంభమైంది. మొదటిసారిగా సన్నీ జీవితంలో తన వయస్సు, అంతస్తూ, ఐశ్వర్యమూ, విస్కీ, వైభోగం - అన్నీ ఓడిపోయిన సందర్భం ఎదురైంది. ఇది పెద్ద దెబ్బ. తను గేదెలు కాసుకున్న అమ్మాయినని చెప్పినా అతని కళ్ళకు ఊర్వశిలాగా కనిపించింది. ఆనందాన్ని పంచుకున్న అమ్మాయి తన చేతుల్లోనే ఉంటే ఊర్వశిగానే అంగీకరించే వాడు. కానీ ఎప్పుడైతే ఎదిరించిందో.. అనాసక్తి చూపిందో.. ఓటమి కారణంగా 'ఓ గేదెలు కాసుకునే అమ్మాయి తనని ఎదిరించిందే' అన్న ఆలోచన గొడ్డలి పెట్టయింది. పట్నం ఆడపిల్ల పేద స్థాయిమనిషి, ఆమె జీవనానికి మొదటి మెట్టు విశ్వాసం. అవసరాన్ని చెప్పు దెబ్బకొట్టి ఆపుకోగలగడం ఆమెకు గర్వకారణం. అందుకనే మరోసారి అనుభవానికి అర్రులు చాచలేదు.

మరొకసారి తనని తలెత్తయినా ఆ అమ్మాయి చూడనందుకు సన్నీ విలవిలలాడిపోయాడు. ఇలాంటి అమ్మాయిని లొంగదీసుకునే ఆయుధాలు తన దగ్గర లేవు. మొదటిసారిగా తన సంపద, తన సెక్సు , తన అంతస్తు ఓడిపోయిన సందర్భమిది. సాధారణంగా ఖరీదైన మనుషుల్లో ఈ ఓటమి తాగుడికి దారి తీస్తుంది. ఆ సందర్భాలలో తాగుడుకు తల వంచడం పిరికితనానికి నిదర్శనం.

తనకు బాగా నచ్చిన, తను మెచ్చిన అమ్మాయిని శాశ్వతంగా తన దాన్ని చేసుకోవాలనుకోవడం పాత కథ. కానీ సన్నీలాంటి వాళ్ళకి పెళ్ళి ఓ గుదిబండ. కాకపోతే తనని లక్ష్యం చేయని సీతని తన వైపుకు తిప్పుకోవాలి. ఎలా ఆమెని దారికి తీసుకురావాలి? చాలా రాత్రులు ఆలోచించాడు. ఆ కారులో ఆమె ఇచ్చిన సుఖం గొప్పదే! కానీ అపూర్వమైనదేమీ కాదు. కారణం సీత ఆ అనుభవంలో తాను ఎక్కువ ఆనందపడింది. సన్నీ అనుభవంలో చాలామంది అమ్మాయిల్ని చూశాడు. బహుశా ఇదే భార్యకి, వేశ్యకీ తేడా ఏమో! ఏమైనా సీత తన భార్యకాదు. కానీ సన్నీ ప్రతికారం తీర్చుకోవడానికి సంప్రదాయం బిగించిన ఆ చట్రమే అవసరమైంది. తన ఆయుధాలు చేయలేని 'డామేజీ' ఆ పిల్లకి మరొక్కటే చేయగలదు.... అదేమిటీ? పెళ్ళి.

ఓ రాతి ఊసుపోక పాత ఫ్రెండుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని స్కాచ్ చప్పరించే వేళ ఈ ఆలోచన స్ఫురించింది. అప్పటికి ఒళ్ళో ఉన్న పిల్ల చప్పగా కనిపించింది. ఎదురుగా ఉన్న సముద్రం మీద నుంచి వస్తున్న గాలులు వెచ్చగా అనిపించాయి. మెసానిక్ లాడ్జి పక్క చిన్న గెస్టు హౌస్ ఉక్కగా అనిపించింది. డ్రైవర్ని పిలిచి ఈ అమ్మాయిని దింపేసి రమ్మన్నాడు.

తన అవసరాలకి, తన మేనమామకీ మధ్య ఓ రాయబారి ఉన్నాడు. అతని పేరు భైరవ శాస్త్రి, ఆ అర్ధరాతి శాస్త్రిని పిలిపించాడు.

శాస్త్రి ఏభయిలో పడి ఆఖరి దశలో ఉన్న మనిషి, రెండుపూటలా సంధ్యావందనం చేస్తాడు. బుద్ధిగా పెళ్ళాంతో కాపురం చేస్తాడు. బుద్ధి తెలిసినప్పటి నుంచి సన్నీ మేనమామ వీరాస్వామి నాయుడు గారికి సేవ చేస్తున్నాడు. శాస్త్రికి స్కాచ్ అంటే వ్యామోహం ఉంది. ఎప్పుడైనా అందమైన ఆడపిల్లని పుణికి ముద్దుపెట్టుకోవడమంటే సరదా ఉంది. ఆ అలవాటు ఆ రోజుల్లో వీరాస్వామినాయుడుగారి కాలం నుంచి వచ్చింది. వారి నాన్నగారి రోజుల్లో సముద్రం దగ్గర దిగిన చేపల కొనుగోలు అయాక మిలట్రీ జీపు తీసుకుని కశింకోట రామప్పడు ఇంటికి రాత్రికి వెళ్ళి దారిలో బిస్కట్ బ్రాందీ తాగి, జల్సా చెయ్యడం వీరాస్వామికి అలవాటే! ఆయనకు చేతి సాయం శాస్త్రి. మూడోఝాము వరకు రామప్పడు పిన్ని బుగ్గల్ని సవరించేవాడు శాస్త్రి.

అందుకనే సన్నీ చెడుతిరుగుళ్ళు తిరుగుతున్నాడని నాయుడుగారు ఎగరబోతే.. అది వారసత్వమని చెప్పి ఒప్పించాడు శాస్త్రి. కాగా పెళ్ళయిన కొద్ది కాలానికే కాన్సర్‌తో పోయిన తన ఒక్కగానొక్క చెల్లెలు కొడుకు సన్నీ. సన్నీ నాయుడుగారి వీక్ పాయింట్. అదే అదనుగా శాస్త్రి సన్నీ వ్యసనాలకు పెట్టుబడిపెట్టసాగాడు. మధ్య మధ్య రెండు మూడు వందలు స్వాహా చెయ్యడం మరిగాడు. స్వాహా చేస్తున్నాడని నాయుడుగారికి తెలుసు. ఆయనకి తెలుసునని శాస్త్రికి తెలుసు. చెడు తిరుగుళ్ళకు పోయే సొమ్ము కాస్తయినా సద్వినియోగం అవుతోందని నాయుడుగారి ఉద్దేశ్యం.

అర్ధరాత్రి పిలుపు రాగానే ఆదరా బాదరగా బయలుదేరాడు శాస్త్రి. హఠాత్తుగా డబ్బు కావలసి వచ్చినా, వచ్చిన అమ్మాయితో తగువు వచ్చిన మధ్యవర్తిగా శాస్త్రి ఉంటాడు. శాస్త్రి రాగానే అసంతృప్తి కలిగించిన విషయం బుగ్గలు పుణకడానికి అమ్మాయి లేకపోవడం.

"పాపేదీ?" అన్నాడు శాస్త్రి వస్తూనే. ఏ అమ్మాయి అయినా శాస్త్రికి పాపే!

"పంపించేశాను. ముందు ఈ గ్లాసు లాగించు" అన్నాడు చేతికందిస్తూ వీరస్వామి నాయుడు శాస్త్రిని 'ఏమండి' అని పిలుస్తారు. సన్నీ మాత్రం నువ్వు అంటాడు. అది కుర్రతనం తీసుకునే చొరవకింద సరిపెట్టుకుంటాడు శాస్త్రి. కాగా రసికత్వానికి, పెద్దరికానికీ చుక్కెదురు.

"ఏమిటి బాబూ?" అన్నాడు.

అప్పుడు ఎర్ర సీత గురించి చెప్పాడు సన్నీ. కథంతా చెప్పి "సీతని పెళ్ళి చేసుకోదలచుకున్నాను." అన్నాడు.

అదేదో బూతు మాట విన్నట్టు పగలబడి నవ్వాడు శాస్త్రి. సన్నీ రెండో చేతిలో గ్లాసు లాక్కుని గడ గడ తాగేశాడు.

"కొంప తీసి అలాంటి మాటేమైనా ఆ అమ్మాయికి ఇచ్చావా బాబూ?" అన్నాడు.

తల అడ్డంగా తిప్పాడు సన్నీ.

"మరి ఇంతోటిదానికి పెళ్ళెందుకు బాబూ?" అన్నాడు.

"ఏం చేసినా సీత నా దారికి రావడం లేదు. నన్ను కాదనే అమ్మాయి ఉందన్న ఆలోచన తట్టుకోలేకపోతున్నాను."

శాస్త్రికి మత్తు నసాళానికి ఎగదోస్తోంది. "బాబూ! ఈ ప్రపంచంలో వ్యామోహానికి కొన్ని లెవెల్స్ ఉన్నాయి. ఆశలకి కొన్ని స్టేజిలున్నాయి. ఆకలి వేస్తోన్న కుక్కకు రొట్టె ముక్క చూపిస్తే దారికొస్తుంది. అవసరంలో ఉన్నవాడికి డబ్బిస్తే కడుపునిండుతుంది. నీతిని కొనడానికి సవాలక్ష బేరాలున్నాయి. ధర్మాన్ని నెత్తిమీద కాలేసి పాతాళానికి తొక్కేసిన జాతి మనది. ఆ పిల్ల మీ పక్కలోకి రావాలా? మీ ఇంట్లోకి రావాలా?"

మర్నాడు శాస్త్రి వీరాస్వామి నాయుడి బ్రాందీతో స్నేహం కలిపాడు. ఆయన అరసీసా బ్రాందీ తాగి, అరకోడిని ఆరగించి నిద్రపోతాడు. ఆ రోజుల్లో అమ్మాయిల గొడవ ఉండేది. ఇప్పుడు రక్తంలో తియ్యదనం పెరిగాక జీవితంలో తియ్యదనం తగ్గించేశాడు - లేదా తగ్గిపోయింది. కారణం అరకోడి అయ్యాక అప్సరస పక్కలో ఉన్నా ఆయనలో ఎలాంటి చలనమూ కలగకపోవడమే!

అంతా విని "ఆ లంజాకొడుకు అమ్మాయిల్తో తిరిగినా మీరు ఊరుకోమన్నారని నోరుమూసుకున్నాను. ఇప్పుడు ఎవరో గొడ్లుకాసుకునే దాన్ని పెళ్ళిచేసుకుంటానంటే ఎలా ఊరుకోనయ్యా?" అని వాపోయాడు.

"అయ్యా! మీకు మీ మేనల్లుడి సంగతి తెలుసు. అమ్మాయిల సంగతి తెలుసు. ఎవరిని ఎక్కడుంచాలో తెలుసు. అనుకున్నది జరిగే దాకా నిద్రపోకపోవడం మీ రక్తంలో ఉంది. మీ రక్తమే మీ మేనల్లుడిలో కూడా ఉంది. ఆ తర్వాత మీ ఇష్టం..."

"ఆ నా కొడుకుని పీక నులిమి చంపేస్తాను" అని ఎగిరాడు వీరాస్వామి. మాటలో మృదుత్వం లేకపోయినా, మనస్సులో ఎంతో మార్ధవం, గుండె నిండా మేనల్లుడంటే అభిమానం కల మనిషి నాయుడు. ఆ విషయం శాస్త్రికి తెలుసు.

మూడు రాత్రులు బ్రాందీ మీద హోరాహోరా పోరాటం సాగించాడు శాస్త్రి నాయుడుతో. మరో మూడు రాత్రులు స్కాచ్‌తో హోరా హోరి రాజీ ప్రయత్నాలు చేశాడు సన్నీతో. రెండూ పొసిగే విషయాలు కావని నిర్ణయానికి వచ్చేసరికి తాగుడు ఎక్కువై కడుపులో అల్సర్ మళ్ళీ బయటపడింది.

ఈ మామా అల్లుళ్ళ తగాదా తన ప్రాణానికి వచ్చిందని తేల్చుకుని - ఇద్దరి బలహీనతలూ తెలిసిన శాస్త్రి ఓ గంభీరమయిన నిర్ణయానికి వచ్చాడు. నాయుడూ పడుకునే సమయానికి, ఆయన రివాల్వర్‌ని దొంగతనంగా బయటికి లాగి, సన్నీకిచ్చి, మొదటి సారిగా అమ్మాయి లేకుండా మాలేకి వెళ్ళిపొమ్మన్నాడు. తన ఫోన్ కాల్ వస్తేనే అక్కడి నుండి తిరిగి రావాలి. అంతవరకూ అతని జాడ ఎవరికీ తెలియాల్సిన అవసరం లేదు.

మర్నాడు వీరాస్వామి నాయుడికి తెలిసిన విషయం, లేదా శాస్త్రి తెలిపిన విషయం సన్నీ ఆయన రివాల్వర్ సూట్ కేసులో పెట్టుకుని ఎక్కడికెళుతున్నాడో చెప్పనయినా చెప్పకుండా మాయమైపోయాడని.

వీరాస్వామి నాయుడు ఆకులాగా ఒణికిపోయాడు. అతని కాళ్ళూ చేతులూ చల్లబడిపోయాయి. ఒక్కసారిగా కూలబడి పసిపిల్లాడిలా ఏడ్చేశాడు.

నాయుడు బేలకావడం శాస్త్రి ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు నాయుడు పరిస్థితి చూసి శాస్త్రి కంగారు పడిపోయాడు.

"పట్నం బాబూ నీ మీద కన్నేశాడటగా?" అంది పంతంగి సీతతో, సీత నవ్వింది. "ఛాన్స్ పోనివ్వకు. లటుక్కున పెళ్ళి సేసేసుకో. పాతికేళ్ళ కిందట మిల్రటీకి వెళుతున్న షికారీ బాబుని కట్టుకుని ఉంటే నా బతుకు ఇలా ఉండేది కాదు. మగాళ్ళు మనసు మార్చుకునే లోగానే మనం అతుక్కుపోవాలి." అని హితువు చెప్పింది. నందిత ఒళ్ళంతా తడిమింది. "ఇంక విజయనగరం రావటగా?"

"ఎవరు చెప్పారు?"

"నాన్న"

"ఎందుకని?"

నందిత నవ్వి ఊరుకుంది.

ఓ రోజు నాళయ్య వచ్చి "అయ్య.. రమ్మంటున్నారు." అన్నాడు.

"ఏ అయ్యగారు?"

"పట్నం అయ్యగారు!"

నాళయ్య సరాసరి ఇంటికి వచ్చి చెప్పడం ఇదే మొదటి సారి. ఆశ్చర్యపోయింది. అంతకంటే కోపం వచ్చింది. సన్నీ సాహసాన్ని, కబురు పంపితే వచ్చి వాలుతుందన్న అహంకారాన్ని ఆపాలనుకుంది.

"ఎక్కడున్నారు? వస్తానని చెప్పు"

కావాలని, చాలా అందంగా, చాలా అధునాతంగా తయారయింది సీత. లిప్‌స్టిక్ పెట్టుకుంది. నందిత ఇచ్చిన సెంటురాసుకుంది.

బంగళాలో అడుగుపెడుతూనే షాకయిన విషయం ఏమిటంటే - మధ్య హాల్లో పడక కుర్చీ మీద వీరాస్వామినాయుడు కూర్చుని ఉన్నాడు. సన్నీ ఉంటాడని ఎదురు చూసిన సీతకు ఇది పెద్ద షాక్. పైగా ఈ కొత్త వ్యక్తిని తనెప్పుడూ చూసి ఉండలేదు.

నాళయ్య మెట్ల పక్కనే ఆగి "ఇదే బాబూ సీత" అన్నాడు భయం భయంగా.

వీరాస్వామి గళ్ళలుంగీ, గుడ్డ బనీనూ వేసుకున్నాడు. లంక చుట్ట కాలుస్తున్నాడు. సీతని మొదటిసారి చూసి నిర్ఘాంతపోయాడు. ఆ మారుమూల... మచ్‌ఖండ్ ప్రాజెక్టు ప్రాంతంలో సన్నీని ఓ అమ్మాయి ఆకర్షించిందంటే నమ్మలేకపోయాడు. పల్లెటూరి మనిషి సన్నీలాటి మోడర్న్ అబ్బాయిని ఎలా ఆకర్షించిందా అని ఆశ్చర్యపోయాడు. వీరాస్వామి దృష్టిలో, అనుభవంలో కేవలం డబ్బు, అంతస్తు ఈ రెండే ఎవరినైనా ఆకర్షిస్తాయని తెలుసు. కానీ సీతను చూసి, మిసమిసలాడే ఆమె యవ్వనాన్ని చూసి - సన్నీని గాక ఎవరైనా ఆకర్షించగలదని అర్థం చేసుకున్నాడు.

షాక్ నుంచి తేరుకోవడానికి కాస్సేపు పట్టింది వీరాస్వామికి, సీత ఆశ్చర్యంగా నాళయ్య కేసి చూసింది. "పెదబాబుగారు.. దండమెట్టు" అని గొణిగాడు.

కానీ దండం పెట్టలేదు సీత.

"దీని బాబేడిరా?" అన్నాడు వీరాస్వామి.

"మంచం మీదున్నాడు బాబూ, కాలు చితికిపోయింది."

"ఈడ్చుకురా ఆ నా కొడుకుని, దీనితో ఏం మాట్లాడతాను.. వాడితో తేల్చుకోవాలి" అన్నాడు ఒళ్ళు విరుచుకుంటూ.

తుపాకీ పేల్చినట్లు తుళ్ళి పడ్డాడు నాళయ్య. వీరాస్వామి కూడా ఒక్క క్షణం బిత్తరపోయి అంతలో తేరుకుని పగలబడి నవ్వాడు.

"ఊఁ. కూత నేర్చిన గుంటే! సన్నీగాడు బోర్లా పడ్డాడంటే ఆశ్చర్యం లేదు. మగాడిని మరగడం కూడా కొత్తకాదేమో!" అన్నాడు దగ్గరికి వచ్చి. సీత రక్తం మరిగింది.. దగ్గరికి వచ్చిన వీరాస్వామి నాయుడూ చెంప పగిలేలా కొట్టింది. అది చూసి నాళయ్య ఏడుపు లంకించుకున్నాడు.

"ఓర్నాయనో! ఇది బతకదు. సచ్చిపోతుంది. పెదబాబు సంపేత్తారు. ఓసి నీ యవ్వ. చిన్నంతరం, పెద్దంతరం లేని నా!" అంటూ హాల్లోకి పరిగెత్తుతూ వచ్చాడు. వీరాస్వామి నాయుడు ద్వారం దగ్గరే నాళయ్యని ఆపాడు. "వెళ్ళి నీ పని చూసుకోరా" అన్నాడు సీతనే గమనిస్తూ.

"బాబూ.. ఇది మంచి పిల్లే బాబూ! దూకుడు మనిషి. దాని బదులు నేను కాళ్ళట్టుకుంటాను. అది సచ్చిపోతే ఆళ్ళయ్య.."

"పోరా" అని కసిరాడు నాయుడూ. ఏడుస్తూనే శాపానార్థాలు పెట్టుకుంటూ మెట్లు దిగి వెళ్ళాడు నాళయ్య.

ఆశ్చర్యం.. సీతకి భయం వెయ్యలేదు. చదువు నేర్పిన సంస్కారం, చదువురాని ఆడపిల్ల మొండి ధైర్యాన్ని చంపలేదు. కాగా.. అన్యాయాన్ని, కుసంస్కారాన్ని ఎదిరించే సాహసాన్ని ఇచ్చింది.

"క్షమాపణ చెపుతావే?"

"చెప్పను. అంతేకాదు. మీరు కూసిన తప్పుడు కూతలకు. క్షమాపణ చెప్పేవరకూ మీతో మాట్లాడాల్సిందేమీ లేదు." అని చరచరా బయటికి నడిచింది.

"ఆగు..." దారికి అడ్డువచ్చాడు. వీరాస్వామికి ఇలాంటి వ్యక్తిత్వం కొత్త.

"ఏంటే నీ పొగరు?"

"కేవలం డబ్బున్నంత మాత్రన మీకింత పొగరుంటే – నిజాయితీగా నేలమీద నిలబడి బతికే నాకు పొగరుంటే తప్పా?"

"ఆ డబ్బుని చూసే కదా  మా వాడి పక్కలోకి దూరావు?"

వీరాస్వామి నాయుడికి ఎక్కువ చదువులేదు. ఉన్న చదువూ, దానివల్ల వచ్చిన కాస్త పాటి 'పాలిష్' కోపం ఎక్కువవుతున్న కొద్దీ పోతుంది. ఇప్పుడా స్థితిలో ఉన్నాడు.

ఆ మాటతో చాలా విషయాలు అర్థమయ్యాయి సీతకి.

"ఓహో! ఇది మీ మేనల్లుడు మీకు చెపితే తెలుసుకున్న విషయమా? మీ అంతట మీరే తేల్చుకున్న విషయమా?"

"ఏం నిజం కాదా?"

"చూడు మిష్టర్ మైనర్ బాబు డబ్బున్న మేనమామా! ***పేడ పురుగు అతి నీచమైన వాతావరణంలో బతుకుతుంది. కానీ దాని బతుకులో దానికో గర్వముంది.*** కానీ గొప్పగా బతుకుతున్నామనుకునే మీలాంటి గొప్పవాళ్ళ మధ్య చాలా పేడపురుగులున్నాయి."

"నువ్.."

"మాట పూర్తికానివ్వండి! కారెక్కి విశాఖపట్నం సరాసరి వెళ్ళండి. మీకున్న డబ్బూ, అంతస్తూ మూడు జన్మలదాకా ఉన్నా, మీ సన్నీ నీడ కూడా చూడడానికి సిద్ధంగా లేదని నా మాటగా మీ మేనల్లుడితో చెప్పండి. ప్లీజ్ దయచేసి ఈ కారణంగా ఈ బంగళాకి మళ్ళీ రాకండి!" అని చరచరా వెళ్ళిపోయింది సీత. బయటికి వచ్చిందే కానీ ఆవేశం, ఆ మనిషి అన్న మాటలూ చెవుల్లో గింగుర్లెత్తిస్తున్నాయి. చెట్ల మధ్య నుంచి నడిచి నడిచి జగన్నాధ స్వామి గుడి అరుగు మీద కూర్చుని బోరుమని ఏడ్చేసింది. ***ఒక్కొక్కప్పుడు అవమానాన్ని ఎదిరించే సాహసం కూడా బాధపెడుతుంది.***

*****

ఆ సాయంకాలం పళ్ళు పట్టుకుని జాలయ్య ఇంటిముందు కారు దిగాడు వీరాస్వామి నాయుడు. ఈ పాటికి విశాఖపట్నం వెళ్ళిపోయి ఉంటాడనుకుంది సీత. కారునీ, అతన్ని చూసి, ముఖ్యంగా తన ఇంటి ముందు చూసి ఆశ్చర్యపోయింది. అంతకు మించి భయపడింది.

తండ్రి ఆరోగ్యం బాగాలేదు. ఇలాంటి సమయంలో ఈ పిడకల వేట ఇక్కడ జరగడం బొత్తిగా ఇష్టంలేదు.

నాళయ్య కారు వెనుక నడిచి వచ్చాడు. జాలయ్యకి వీరాస్వామి నాయుడు గారి పేరు తెలుసు. ఆయన్నెప్పుడూ చూడలేదు. ఇప్పుడాయన తాను ఇంటికి స్వయంగా రావడం చూసి కంగారు పడిపోయాడు. సైరంధ్రి. పక్కన ఉంది. మెల్లిగా లేచి, వీపు దగ్గర తలగడా వేసి కూర్చోపెట్టింది.

చాలా ఇబ్బందిగానే రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాడు జాలయ్య.

నాళయ్య వీధి గుమ్మం దగ్గర నిలబడిన సీత పక్కకి వచ్చి అన్నాడు "నువ్వు నక్కని తొక్కావే! అయ్యగారికి నీ మీద కోపం రాలేదు. ఇప్పటికన్నా మించిపోయింది లేదు. ఆయన దేవుడూ మా రాజు, కాళ్ళమీదపడిపో!" అన్నాడు.

సీతకి నవ్వొచ్చింది. ఇలాంటి దేవుళ్ళ గురించి చాలా విన్నది ఇప్పటికే. సీత జుత్తు అందలేదు నాయుడికి. కాళ్ళ బేరానికి వచ్చాడు. కానీ తన అవసరం అతనికేమిటి?

కారెక్కుతూ ఆగి, సీతని చూసి, "నీ పేరు కూడా అడగలేదు" అన్నాడు వీరాస్వామి.

"ఎర్రసీత, బాబూ!" అన్నాడు నాళయ్య, సైరంధ్రి, చూరు పట్టుకు నిలబడింది. అప్పటికే వీధిలో పది పదిహేనుమంది పోగయ్యారు. జాలయ్య ఏదైనా తప్పుచేశాడేమోనని ముక్కు మీద వేలేసుకు చూస్తున్నాడు. రోడ్డు మీద హత్య జరిగితే ఏర్పడే ఉద్రిక్తత వాతావరణంలో కనిపిస్తోంది. జాలయ్య ఇంటి ముందు నాయుడి కారు – ఆ ఊరి వాళ్ళకి ఆరునెలలు మాట్లాడుకునే గ్రాసం.

కారు తలుపు తీసి, "కారెక్కు!" అన్నాడు సీతతో. ఎక్కనని మొరాయించడం కన్నా ఎక్కడం వల్ల సమస్య త్వరగా పరిష్కారమవుతుందనిపించింది. మరోమాట చెప్పకుండా కారెక్కింది.

కారు లాసన్స్‌బేవ్ వైపు నడుస్తోంది. సీత మాట్లాడలేదు. ముందు కూర్చున్న వీరాస్వామి నాయుడు మాట్లాడలేదు. దాదాపు పదికిలో మీటర్లు దాటాక ఎడమ చేతి వైపు కారుతో పాటు పరుగులు తీస్తున్న జీడి మామిడి తోటల దగ్గర కారు ఆపించాడు.

అప్పటికి సాయంకాలం మాగన్ను పెట్టింది.

"చూడు, సీతా! నిన్ను.. నేను.. నాకు మాట్లాడడం సరిగా రాదు."

"అదే మంచిది. ఏం చెప్పాలనుకున్నారో సూటిగా చెప్పండి."

"నిన్ను మావాడు పెళ్ళి చేసుకుంటానంటున్నాడు."

సీత నిర్ఘాంతపోయింది. "వాట్?"

"అది నాకిష్టంలేదు."

అంతే రూఢిగా చెప్పింది – "నాకూ ఇష్టంలేదు. ఇంక ఊళ్ళోకి పోదామా?" అంది.

వీరాస్వామి నాయుడు కంగారు పడిపోయాడు. అసలు సమస్య ఏమిటి? ఇష్టంలేని సీతని పెళ్ళికి ఒప్పించడమా? అది తన కిష్టం లేదు. అది ఆమెకీ ఇష్టంలేదు. సన్నీని వదిలి పెట్టడానికి సీతకి ధర కట్టాలని, అవసరమైతే బెదిరించాలనీ వచ్చాడు కానీ సమస్య ఇంత తేలికగా పరిష్కారమైపోతుందని...

"డామిట్! నిన్ను చేసుకోకపోతే ఆ నా కొడుకు చచ్చిపోతానంటున్నాడు" విసుగ్గా అన్నాడు.

"మీరు దిగిన బంగళాలో ఎంత మందితో మీ మేనల్లుడు ఆ మాటన్నాడో మీకు తెలుసా? అమ్మాయిల శరీరం రుచి మరిగిన వాడు చచ్చిపోడు. డోంట్ వర్రీ మీ మేనల్లుడు చచ్చిపోయే రకం కాదు!"

"నా రివాల్వర్ ఎత్తుకు పోయాడు."

నవ్వింది సీత, "అది ఎటువైపు పేలుతుందో కూడా మీ వాడికి తెలిసి ఉండదు."

వీరాస్వామి నవ్వాడు. "సీతా! నీలాంటి అమ్మాయిని చూస్తాననుకోలేదు" అన్నాడు.

"కానీ మీ సన్నీకి మీలాంటి పెద్దలెవరో ఉండే ఉంటారని నేననుకున్నాను."

"అంటే...?"

"డబ్బుండి, డబ్బు ఏం చెయ్యాలో తెలియని, దానితో గర్వాన్ని పెంచుకుని ఆ గర్వాన్ని తన వాళ్ళకీ వారసత్వంగా ఇచ్చి, తను దురలవాట్లను తమ వాళ్ళలో చూసుకుని ఆనందిస్తూ... మీరంతా సైకిక్ పెర్వర్ట్స్. మీలాంటి వాళ్ళని అమ్మాయిలు ప్రేమించరు. మీ డబ్బుని ప్రేమిస్తారు. మీ పెళ్ళాలూ మీరంటే బోర్రై ఉంటారు. చేతనైతే మీ నుంచి పారిపోవాలనుకుంటారు. మీ ఆత్మ వంచన వాళ్ళకి పెద్ద కారాగారం. ఐ యామ్ గ్లాడ్ ఐ హేట్ సన్నీ! ఇది వరకు కన్నా ఇప్పుడు మరింత అసహ్యించుకుంటున్నాను!" కారులో ఎక్కి కూర్చుంది.

వీరాస్వామి వెంటనే కారెక్కలేదు. తలుపు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

"సీతా! ఈ ప్రాజెక్ట్ దగ్గరకి వచ్చినప్పుడు నిన్ను డబ్బుతో కొనాలని చాలా ధైర్యంగా చెక్కుబుక్కు పట్టుకొచ్చాను. వీలైతే, నిన్ను పెళ్ళిచేసుకోకుండా తప్పించాలని వచ్చాను. నీ మీద నాకు గౌరవం పెరిగిపోయిందనుకోకు! కానీ, నిన్ను పెళ్ళి చేసుకోవడం వల్ల మా వాడికేం నష్టం లేదని తెలుసుకున్నాను. నీ కభ్యంతరం లేకపోతే... సన్నీని..."

సీత చటుక్కున కారుదిగింది, "మీకంటే మీ మేనల్లుడు చాలా రెట్లు నయం! తను అనుభవించిన దాన్ని తనకి కావాలనుకున్నాడు. అతను కావాలనుకున్న దాన్ని మీరు ఖరీదు చెయ్యాలనుకుంటున్నారు. ఇద్దరికీ తెలియని విషయం ఏమిటంటే, నేను కొనుగోలు చేసే వస్తువును కాదని. మీరు ప్రస్తుతం పడే రాజీలోనూ మీ అహంకారం ఉంది. నాకు అర్హత లేని అంతస్తుని - మీ గొప్ప మనస్సుతో సంపాదించి పెడతారన్న ఔదార్యం ఉంది. మీ పెద్దరికం ఉంది. కానీ మైడియర్ మైనరు బాబు మేనమామగారూ! మీ దయ, బిచ్చం నాకక్కరలేదు. కారు డ్రైవర్ని పిలుస్తారా? నన్ను నడిచి ఊరు చేరమంటారా?"

కారు వెనక్కి తిరిగింది. మరునాడు వీరాస్వామి నాయుడు పట్నం వెళ్ళిపోయాడు. తెల్లారేసరికి ఊరు ఊరంతా గుప్పుమంది. ఎర్రసీత నాయుడింటి కోడలు కాబోతుందని. నెల రోజుల్లో వియ్యమందడానికి సన్నీ బాబుతో సహా సర్వలాంఛనాలతో నాయుడు వస్తాడని. చిన్నమ్మ, సైరంధ్రి, అంత అస్వస్థతలోనూ జాలయ్య ఉప్పొంగిపోయారు. సీతకి దక్కబోయే అదృష్టానికి నాళయ్య, పంతంగి, యాదయ్య, నిషిత్ నాయక్ అంతా ఆనందపడ్డారు. కాస్త ఆశ్చర్యపోయినా, నందిత ముందుగా నమ్మలేదు. కానీ అది నిజమేనని అలిసి సీత జీవితం బాగుపడుతున్నందుకు ఆనంద పడింది.

సీత మాత్రం కుతకుత ఉడికిపోయింది. నసాళానికి పాము విషం ఎక్కినట్టు విలవిలాడిపోయింది. ఈ పెళ్ళి ఆత్మ గౌరవానికి తీరని దెబ్బ నాయుడు అంతస్తుకి ఆస్తికీ గొప్ప కితాబు.

సీత చాలా రాత్రులు నిద్రపోలేదు. ఏది ఏమైనా నెల రోజులు తిరగనివ్వలేదు. నాయుడూ, సన్నీతో బయలుదేరి మచ్ఖండ్‌కి వచ్చే ఆగత్యం రాలేదు.

నెలతిరగకుండా సీత పెళ్ళి కొండలరావుతో జరిగిపోయింది.

# 10

**కొండలరావు మద్రాసు బకింగ్ హామ్** అండ్ కర్ణాటక మిల్స్‌లో స్పిండిల్స్ సెక్షన్ ఫోర్‌మెన్. మిల్స్ లాకౌట్ కారణంగా మద్రాసులో ఏం చెయ్యాలో తెలీక మచ్ ఖండ్ ప్రాజెక్టు టౌన్‌షిప్‌కి వచ్చాడు. ప్రాజెక్టులో పని చేస్తున్న మునిస్వామికి దూరపు చుట్టం. మునిస్వామి బంధువులు కుప్పం నుంచి రెండు మూడు తరాల కిందటే ఈ ప్రాంతాలకి వచ్చేశారు. కొండలరావుని రమ్మని మునిస్వామి మద్రాసు వెళ్ళినప్పుడల్లా ఆహ్వానిస్తూ వచ్చాడు. మునిస్వామికి క్షయ కారణంగా ఒక ఊపిరి తిత్తి తీసేశారు. అలా తీసెయ్యడానికి కొండల రావు సహకరించాడు. ఒక్క ఊపిరితిత్తితో బతికే అవకాశం కల్పించిన కొండలరావు మీద బంధుత్వం కంటే కృతజ్ఞత కారణంగా పదే పదే రమ్మని ఆహ్వానించాడు మునిస్వామి. అదిప్పుడు కుదిరింది.

వచ్చాడే కాని ఈ ప్రాజెక్ట్ ఏరియా అంతా మరో దేశంలాగ అనిపించింది. మునిస్వామికి పెళ్ళాం లేదు. పొద్దుటే వంట చేసి పెట్టి ఒనక ఢిల్లీ వెళ్ళిపోయేవాడు. మళ్ళీ సాయంత్రానికి రాక. వచ్చిన ఒకటి రెండురోజుల్లో ఆ ప్రాంతాలన్నీ తిప్పాడు మునిస్వామి. పెద్ద చూడాల్సిన విశేషాలేవీ లేదు. గుప్తేశ్వరాలయానికి ఇద్దరూ ఓ రోజంతా నడిచారు. నడిచిన కారణంగా రెండు రోజులు ఖాయిలా పడ్డాడు మునిస్వామి. కొండలరావు వండిపెట్టాడు. ఆ తర్వాత ఏం చెయ్యాలో తెలీలేదు. వచ్చాడు కనక, ఇంకా మిల్స్ లాకౌట్‌లోనే ఉంది కనక అక్కడ ఉండిపోయాడు కొండలరావు.

అంత చిన్న స్థలంలో పనీపాటా లేని వాళ్ళు తేలిగ్గా దొరికిపోతారు. మరో పనీ పాటా లేని మనిషి ఆ ఊళ్ళో ఉంది. ఆమె సీత. అనుకోకుండా వచ్చిన ప్రచారం ఆమెని మరింత కోత పెడుతూండగా, వీలయినంతగా ఊరి వాళ్ళ నుంచి పారిపోడానికి - ఒనక ఢిల్లీ రోడ్డుమీద అడవుల్లోకి పారిపోయేది. జరిగే ప్రతీ క్షణం - తను ఊహించని నరకం వేపు తను నడిపిస్తున్నట్లు అనిపించేది.

***మొదటి ఆపిల్ పండు తిన్న ఆడమ్‌కి ఆకలే ఉంది. ఆలోచన లేదు. అది అదృష్టం. జరగబోయే అవినీతి వేపు నిర్దుష్టంగా నడిచాడు. నిప్పులో చెయ్యి పెట్టే పసివాడి ధైర్యంలో గొప్ప నిర్దుష్టం ఉంది.*** విజయనగరం వెళ్ళని సీతకి ఈ పెళ్ళి - ఇప్పుడు నాయుడు నిర్ణయం తనకొక ఛాలెంజ్ లాగ అనిపించింది. పిచ్చిదానిలాగ - దారి తోచక - అడవుల్లో తిరిగేది, ఇదిగో, ఈ సమయంలోనే కొండలరావు ఆమెకి కనిపించాడు.

కొండలరావు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ ఆకర్షించగల మనిషి కాదు. అసలు అటువంటి ప్రయత్నమూ అతను చెయ్యడు. నిజానికి చెయ్యాలని తెలీదు. ఈ ప్రపంచంలో తనకి సంబంధించని భూమి మీద నడుస్తున్నందుకు క్షమాపణ చెప్పుకుంటున్నట్టు కనిపిస్తాడు. దానికి కారణం అతను పుట్టక ముందే అమ్మా, నాన్నా చచ్చిపోయారు. ఎక్కువ బంధుత్వం లేని, కేవలం ధర్మ చింతనతో సాత్విక వాతావరణంలో పెరిగాడు. 'తనకి' 'తనది' అని దేన్నీ గట్టిగా అడగాలని, దాని కోసం పోరాటం సాగించవచ్చునని తెలీని వాడు. అతని కొక్కటే తెలుసు. పరోపకారం చెయ్యడంలో పుణ్యం వస్తుందని. ఎందుకంటే అలాంటి పరోపకారమే తననింత వరకు బతికించింది కనక.

చదువు కూడా ఎక్కువ సాగకపోవటానికి కారణం తనని పోషించే వాళ్ళని వీలయినంత త్వరగా విముక్తుల్ని చెయ్యాలన్న తాపత్రయం. ఎక్కువ చదువుకోనందుకు ఏనాడూ బాధపడలేదు. తను సంపాదించిన మొదటి పచ్చ కాగితాన్ని చూసి చాలా గర్వపడ్డాడు. అది అతని స్వేచ్ఛకి గుర్తు. ఆ క్షణం నుంచీ తన భోజనాన్నీ తను సంపాదించుకున్నందుకు సంతోషించాడు. కొండలరావు జీవితంలో ఏదో విజయంసాధించాలనే గొప్ప లక్ష్యానికి మొదటి గుర్తూ, ఆఖరి గుర్తూ - ఆ పచ్చనోటే.

పిల్ల వాయువులూ, మల్లెపువ్వులూ, వసంత రాత్రులూ, అమ్మాయి చిరునవ్వు, యౌవనపు ఉద్రేకాలూ - ఇలాంటివి కొండలరావుకి తెలీవు. అతని జీవితం పసితనం నుంచి సరాసరి మధ్య వయస్సుకి బలమయిన అంగవేసింది. అందుకు అతను విచారించలేదు. స్వయంగా అతనికి విచారించే వ్యవధిలేదు.

అలాగని కొండలరావ్ తెలివి తక్కువ వాడు కాదు. వయస్సుకి మించిన తెలివి తేటల్నీ, వీలయినంతగా చుట్టు పక్కలున్న ప్రపంచానికి బాకీ పడకుండా బతకడానికి ఆయుత్తం చేసుకున్నాడు. బి అండ్ సి మిల్స్‌లో చాలా నిచ్చెనల్ని అవలీలగా ఎక్కాడు. చాలా ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు పుచ్చుకున్నాడు. చాలా తక్కువ వ్యవధిలో ఫోర్‌మన్ అయ్యాడు.

కొండలరావు జీవితంలో ఓ విచిత్రమయిన రొమాన్సు ఉంది ఒకానొక ఫస్టు తారీకు నాడు జీతాలు పుచ్చుకునే రద్దీలో అకౌంట్సు డిపార్టుమెంటులో పనిచేసే ఇళవరిసి అనే ఆవిడ స్థనానికి అతని చెయ్యి తగిలింది. నిజానికి ప్రయత్నించినా కొండలరావు చెయ్యలేని పని అది. ఆ రోజు వర్కర్ల అందరి మధ్యా గావుకేకలు పెట్టి గొడవ చేసింది ఇళవరిసి. ఇళవరిసి ఏమీ అందంగా ఉండదు. కానీ ఏ ఆడదీ ఊహించలేనంత సెక్సీగా ఉంటుంది. మిల్స్‌లో చాలామంది కోరిక - కొండలరావు అనుకోకుండా చేసిన పనే. అందువల్ల ఆ రోజు కొందరు అతన్ని చూసి ఈర్ష్యపడ్డారు. కొందరు ఆనందించారు. అసమర్థులు చాలామంది అలిగారు. ముసిలి వాళ్ళు కోపం తెచ్చుకున్నారు. ఏమయినా ఆ ఫస్టు తారీకు జీతం పుచ్చుకున్న రోజుగా కాక- ఇళవరిసిని కొండలరావు రెచ్చగొట్టిన రోజుగా అందరి మనుసుల్లో నిలిచిపోయింది.

ఇళవరిసికి తను అందంగా ఉండనని తెలుసు. సెక్సీగా ఉంటుందని తెలుసు. ఉంటుందని అంతా అనుకుంటారని తెలుసు. ఆమెకి ఓ భర్త, ఓ మాజీ ప్రియుడు, ఓ బాయ్ ఫ్రెండూ ఉన్నారు. కాగా, ఆ రోజు ఫస్టు తారీఖు సంఘటన మిల్స్ అందరిలో ఏదో చైత్యన్యాన్ని తీసుకురాగా, కొండలరావులో ఎటువంటి మార్పూ రాకపోవడాన్ని ఆమె గమనించింది. అంతకు మించి ఆమె మనస్సు చివుక్కుమంది. అతను అనుకోకుండా చేసిన పనిని ఆమె అలవోకగా చెయ్యనిస్తే, మిల్స్‌లో కనీసం పన్నెండు మందయినా తమ నెల జీతాన్ని నష్టపోతారని ఆమెకు తెలుసు.

***ఒక వ్యక్తిపట్ల అలక్ష్యం కూడా అమితమయిన ఆకర్షణకి కారణమని ఫ్రాయిడ్ రాయడం మరిచిపోయాడు.***

కొండలరావు తాటస్థ్యం కారణానికి ఆ సంఘటన తర్వాత లాంఛనంగా నయినా తన వేపు చూడని కారణానికి, ఏ ఉద్దేశం లేకపోయినా నిశ్శబ్దంగా తన ముందు తిట్లు తిని మరిచిపోయిన కారణానికి - కొండలరావు ప్రత్యేకంగా కనిపించాడు ఇళవరశికి. ***ఆకర్షణకి మూలస్రోతం అందంకాదని, మరేదోనని, అది ఆ వ్యక్తి కళ్ళతో చూసినప్పుడే అర్థమవుతుందని దేవికారాణిని అడిగినా చెప్తుతుంది.*** ఇళవరిశిని అడిగినా చెప్తుతుంది.

తరువాత చాలా కాలం పాటు ఇళవరిశి కొండలరావు వెనక పడింది. ఆ కారణంగా అసహనంతో ప్రస్తుత బోయ్ ఫ్రెండు ఆమెని దారి కాసి కొట్టాడు. భర్తకి కోపం వచ్చి ఆమె మీద మనుషుల్ని పెట్టి ఆసిడ్ పోయించాడు. ఆమె మొదట ఆఫీసులో అల్లరయింది. తరువాత ఆసుపత్రిలో పేషంటయింది. చివరగా ఉద్యోగం నుంచి బర్తరఫ్ అయింది.

ఆ రోజుల్లోనే కొండలరావు పన్నీర్ పొగైళ్ అలవాటు చేసుకున్నాడు. ***కొందరు దమ్మున్నవాళ్ళు మంచి మత్తుకి విస్కీని సేవిస్తారు. కొందరు అమ్మాయి ఆశయిస్తారు. మరి కొందరు అలవాట్లని ఆహ్వానిస్తారు. ఇది అసమర్థుడి ఆటవిడుపు.*** పొగైళ్ తీసుకోవడం అలవాటు లేక, రెండు మూడుసార్లు వాంతి చేసుకుని, చెమటలు పట్టినా ప్రయత్నించి ప్రయత్నించి దురలవాటుని సెటిల్ చేసుకున్నాడు కొండలరావు.

అయితే ఎర్ర సీత ఇళవరిశి కాదు. తను అడవిలో తచ్చాడుతున్నప్పుడల్లా తనలాగే తిరుగుతున్న మరో వ్యక్తి ఆమె దృష్టిలో పడకపోలేదు. ఆమె ఆలోచనల నుంచి పారిపోవటానికి తిరుగుతోంది. అతనికి ఏ ఆలోచనా లేక తిరుగుతున్నాడు.

ఒరిస్సా పొలిమేరల్లో ఉన్న ఆ ప్రాంతానికి, అక్కడి మనుషులకి, కారా కిళ్ళీ కొత్తకాదు. కాని పొగైల్ కొత్త. ఒకటి రెండుసార్లు తన పక్కనుంచి వెళుతున్న ఆమెని పన్నీర్ పొగైల్ వాసన ఆకర్షించింది. నిజానికి ఆకర్షణ కాదు - ఆశ్చర్యపరిచింది. అయినా దాని గురించి ప్రత్యేకంగా ఆలోచించే స్థితిలో ఆమె లేదు. కాని ఒక్కటి మాత్రం సీతకి అర్థమయింది. అతను ఈ ప్రాంతపు మనిషి కాదని. ఆ విషయం మర్నాడే రుజువయింది.

చెట్ల మధ్య కూర్చుని ఉన్న ఆమె దగ్గరికి వచ్చి "ఇక్కడ తమలపాకులు దొరకవాండీ?" అనడిగాడు.

మొదట ఆశ్చర్యపోయింది. అయితే అతని ప్రశ్నలోనూ అడిగే తీరులోనూ వేరే ఉద్దేశమేమీ లేదని తెలుస్తోంది.

"బంగళా ఆకు ప్రతి శనివారం పలాస నుంచి దిగుతుంది. రాజు కొట్లో తడిగుడ్డ చుట్టి ఉంచుతాడు. అరవై నాలుగో నెంబరు ఇల్లు. అక్కడయిపోతే పంతంగి దగ్గర కాశీ ఆకు దొరుకుతుంది" అంది.

కొండలరావు థాంక్స్ చెప్పి కదిలాడు. "మీరు వేస్తున్నది?"

"పన్నీర్, మద్రాసు నుంచి తెచ్చాను. వేస్తారా?" అన్నాడు.

సీతకి నవ్వొచ్చింది.

"మీది మద్రాసా?"

తలూపాడు. "కుంభకోణం ఆకు నాకలవాటు. పొగైల్ కూడా అయిపోవచ్చింది. మద్రాసు వెళ్ళిపోవాలి."

"పొగైల్ లేదని వెళ్ళిపోతారా?"

కొండలరావు నవ్వాడు. "ఈ అలవాటు కోసం అమెరికాలో ఉద్యోగాలు వస్తే వెళ్ళని వాళ్ళున్నారు తెలుసా?"

"అంత బలహీనులన్నమాట - దరిద్రం" అంది సీత.

కొండలరావు ఆశ్చర్యంగా ఆమెని చూశాడు.

అయిదారు రోజుల తరువాత మళ్ళీ కొండలరావు కనిపించాడు సీతకి.

ఈసారి జగన్నాథ స్వామి గుడి దగ్గర. "తమలపాకులు దొరికాయా?" అంది.

"నేను ప్రయత్నం చెయ్యలేదు" అన్నాడు కొండలరావు. ఆశ్చర్యపోయింది సీత. "ఏం?"

" పొగళై మానేశాను"

"ఎప్పట్నుంచీ?"

"మీరు దరిద్రం అన్నప్పట్నుంచీ"

షాక్ అయింది సీత. "నేను ఆ రోజు తొందరపడి అన్నానని బాధపడ్డాను. అయినా మీ అలవాటుతో నాకేం సంబంధం? నా నోటి దుడుకుతనం అది. మా పంతంగికి చెప్పి ఆకులు ఇప్పిస్తాను రండి" అంది చాలా అపాలజిటిక్‌గా.

కొండలరావు నవ్వాడు. "చూడండి, మీరెవరో నాకు తెలీదు. మీ పేరు నాకు తెలీదు. మిమ్మల్ని మెప్పించాలని నేను నా అలవాటు మానుకోలేదు. అది దరిద్రమయిన అలవాటని నా మనసులో చాలాకాలంగా ఉంది అది గుర్తుచేశారు మీరు. అంతే మానేశాను."

"ఒక్కమాట కోసం అలవాటు మానెయ్యడం సాధ్యమా?"

"ఒక్క మాట కోసం పెళ్ళిమానేశాడండి ఒకాయన - భారతంలో ఆయన పేరు భీష్ముడు."

సీత అతన్ని ఆశ్చర్యంగా చూసింది. "మీరు బాగా చదువుకున్నారా?"

"రైల్వే టైం టేబిలు తప్ప ఏదీ చదవలేదు. పేపరు అలవాటు కూడా లేదు. మా పెదనాన్న నా చేత తరవాణీ అన్నం తినిపించడానికి చిన్నతనంలో ఈ కథ చెప్పాడు. రోజు తింటానని మాట తీసుకున్నాడు. మా అమ్మ చచ్చిపోయేదాకా, తరవాణీ అన్నం దొరికేదాకా తిన్నాను మాట మీద నిలబడి"

సీత గింగుర్లు తిరిగిపోయి గుడి అరుగుమీంచి దొర్లి దొర్లి నవ్వింది. "మీరు దద్దోజనం అన్నమాట!" అంటూనే మళ్ళీ తొందర పడినందుకు నాలిక కొరుక్కుంది.

కొండలరావు నవ్వాడు.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ నాలుగయిదు సార్లు తారసపడ్డారు. అతనిలో సీతని ఆకర్షించిన విషయం - తాను శరీరాన్ని చూసినట్టు ఆమెకి తోచలేదు. పంతంగిలో కనిపించిన చలనం కూడా అతనిలో లేదు. అసలు అతనికా దృష్టే ఉన్నట్టు లేదు. కాని కొండలరావు విషయం వేరు. ఆమెని చూడగానే - మొదట ఆమెనూ చూశాడు. మొదటిసారి ఆమె ఆకర్షణీయంగా - ఒంపులన్నీ నరాల్ని సడలించేవిగా కనిపించాయి. అయితే ఇళవరిశి ప్రభావం అతని మనస్సులో ఉంది. కనక - ఆమెని చూస్తూనే ఆమెని చూడకుండా ఉండడం అతనికి కష్టమేమీ కాదు. ఆ పనే చేస్తూ వచ్చాడు.

***ఆకర్షించిన అమ్మాయి ఆకర్షించిన విషయం దాచిన కారణంగా ఆమెని ఆకర్షించాడు కొండలరావు.*** ఇది విచిత్రమయిన మెలిక.

కాగా, సీతకి ఇప్పుడు రెండు కావాలి. ఒకటి సన్నీ మీదా, వీరాస్వామి మీదా పగ తీర్చుకునే ఆయుధం. రెండు ఈ వాతావరణం నుంచి విడుదల. కొండలరావు ఆ ఆయుధంలాగ కనిపించాడు. మద్రాసు ఆ ఆటవిడుపులాగ కనిపించింది.

"మీ మద్రాసు గురించి చెప్పండి" అని గుచ్చి గుచ్చిఅడిగింది.

"మద్రాసులో మీకు చాలా ఇష్టమయినదేమిటి?"

"సాంబారు వేండా" అనే అరవం మాట" అన్నాడు కొండలరావు నవ్వుతూ.

"అదేమిటి?"

వచ్చిన కొత్తల్లో హోటల్లో భోజనం పెట్టి సాంబారు గుమ్మరించేవాళ్ళు. మొదట సాంబారు వద్దు బాబోయ్ అనేమాట నేర్చుకున్నాను. భోజనం పెట్టినప్పట్నుంచీ 'సాంబారు వేండా' అని చెపుతూ వచ్చాను. తర్వాత బొత్తిగా సాంబారు వెయ్యడం మానేశారు. అరవ భోజనంలో సాంబారు మానేస్తే తినేదేమీ ఉండదు"

సీత నవ్వుకుంది.

మద్రాసులో రాయపేటలో శంభునాథన్ వీధి, తన్ని తెర మార్కెట్టు, పాండీ బజారు, కొత్వాల్ చావిడి, తంబుచెట్టి స్ట్రీట్, బర్మా బజార్, పూక్కడై - అన్నీ వివరంగా చెప్పాడు. వారం రోజుల్లో అడ్రసు చెప్పకుండా సెంట్రల్‌లో దింపితే ఇంటిని వెదుక్కుని వెళ్ళేంతగా మద్రాసుని ఆకళించుకుంది.

"మద్రాసులో మీకు నచ్చినదేమిటి?"

"ఆడవాళ్ళు నుదురు నిండా పెట్టుకునే బొట్టు, డబ్బున్నా, లేకపోయినా తెలతెలవారగానే స్నానం చేసి పవిత్రంగా తయారవడం, జలజలా జారే సన్నజాజి పూలమాల వదులుగా జుత్తు పొడువునా జారడం - (ఒరిస్సాలో ఆడవాళ్ళు పువ్వులు పెట్టుకోరు అది కనీసం వాళ్ళకి ముఖ్యమయిన అలంకరణ కాదు)"

కొండలరావుకి అర్థమయిన విషయం ఒకటుంది. ఆమె సమక్షంలో తను మైకంలో ఉన్నవాడిలాగ మాట్లాడుతున్నాడని.

ఇన్నిరోజులూ ఏకాంతంగా వాళ్ళు కూచుని మాట్లాడుకున్నా ఒక్క రోజయినా కొండలరావు ఆమెని తాకలేదు. తాకాలని అనిపించలేదు. తాకే ఉత్సాహమూ చూపించలేదు.

ఒకసారి అతని చేతిని తన చేతిలోకి తీసుకుని "మీకు అన్నం ముద్ద కలిపి చేతిలో పెడితే ఇష్టమే?" అంది సీత.

కొండలరావు నవ్వాడు "తరవాణీ అన్నం చేతిలో నిలవదు కదండీ" అన్నాడు. అలా అన్నప్పుడు అతని కళ్ళలో నీరు చెమర్చినట్టు అనిపించింది సీతకి. అతని తలని గుండెలకి హత్తుకుని భోరుమని ఏడవాలనిపించింది.

కొండలరావు మాటేమో కాని ఆమె మనస్సు అతని కంటే ముందు మద్రాసు వెళ్ళిపోయింది.

"మీ లాకౌట్ ఎప్పుడయి పోతుంది?" అంది ఓసారి.

"కాకపోయినా - పొగైళ్ కోసం మద్రాసు వెళ్ళిపోవాలనుకున్నాను. కాని ఇప్పుడు వెళ్ళాలని లేదు"

ఎందుకని సీత అడగలేదు.

పదిరోజుల తరువాత విజయ దశిమి వచ్చింది. ఆ రోజు పట్టుచీర కట్టుకుని, పెద్ద బొట్టు పెట్టుకుని గుడి దగ్గరకి వచ్చింది సీత. కొండలరావు పాత బట్టలతోనే వచ్చాడు.

గుడిలో జగన్నాధుడు ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తున్నాడు. సీతని చూసి కొండలరావు ఆశ్చర్యపోలేదు.

తన కిష్టమయిన చాలా వాటిని ఆమెలో చూశాను. అందంలో ఆ బొట్టూ, కట్టూ ఉన్నాయి.

"నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అని సీత సుభద్రమ్మ అందమయిన కళ్ళని చూస్తూ అడిగింది. అతని సమాధానానికి ఎదురుచూడకుండానే అతని గుండెమీద తల ఆనించింది.

ఆ వెంటనే రెండూ జరిగాయి.

ఆ గుడిలోనే చిన్నమ్మ, సైరంధ్రి సాక్షిగా పెళ్ళి.

జాలయ్య బతికుండగానే చేసిన ఆఖరిపని - సీతని, కొండలరావునీ చూసి బాధపడడం. సన్నీ బాబుని తలదన్ని చేసుకున్న ఈ కొండలరావు దిష్టి బొమ్మలాగ కనిపించాడు. ఏమయినా అది చెప్పే అవకాశమతనికి రాలేదు. రెండోరోజే జాలయ్య కన్నుమూశాడు.

## 11

శంభూనాథన్ వీధిలో తమిళం తెలియని అమ్మాయి కొత్త జీవితం ప్రారంభమైంది. అది బ్రహ్మచారి గది. గదిలోంచి బయటికి కాలు పెడితే నాలుగిళ్ళ వసారా - ఎదురుగ్గా పెద్ద నుయ్యి. బాత్ రూంలు, వంట గదులు లేవు. వసారాలోనే చిన్న తడిక కట్టి వంట గది ఏర్పాటు చేసుకున్నాడు కొండలరావు. ఇంటి యజమాని వడివేలు కార్పొరేషనులో బిల్లు కలెక్టరు పనిచేసి ఇటికా ఇటికా పోగుచేసి ఇల్లు కట్టాడు. అతనికి సీత చూసీ చూడగానే నచ్చింది. అతనికి సీత నచ్చడం వాళ్ళావిడ మీనాక్షమ్మకి నచ్చలేదు. ఎందుకంటే వయస్సులో వడివేలు రసికత్వం నెరపినవాడు. ఇప్పుడు 'వృద్ధనారీ పతివ్రత 'గా చెలామణీ అవుతున్నవాడు.

ఏమైనా సీతని చూడగానే వాత్సల్యంతో ఆమె భుజం మీద చెయ్యి వెయ్యడాన్ని గమనించింది. "మా ఆయన దొంగముండా కొడుకు. నిన్ను ముట్టుకోనివ్వక!" తమిళంలో చెప్పి, కొండలరావు చేత అనువాదం చేయించింది.

వడివేలు నవ్వుకున్నాడు. నూతి దగ్గర సీతని పలకరించి, "మా ఆవిడ నేను వెధవనని చెప్పిందా?" అన్నాడు.

సీత నవ్వుకుంది, ఏ విధంగానూ ఆడదాన్ని ఆకర్షించే ఛాయలు వడివేలు పర్సనాలిటీలో లేవు. కానీ అతను మాట్లాడి చాలామందిని పడగొట్టేశాడని అతన్ని వింటున్నపుడు అనిపించింది.

***"పెళ్ళాం మనల్ని శ్రీరామచంద్రుడు అనుకోవడంలో సుఖం లేదు. భార్య మనం కృష్ణ భగవానుడు అనుకోడంలో సేఫ్టీ ఉంది"*** అంటూ వచ్చీ రాని తెలుగులో చెప్పాడు సీతకి. భార్య మీద చాలా నయం - తెలుగుని ఖూనీ చెయ్యడంలో.

ఏమైనా కొత్త జీవితం - సంసార జీవితం - వింతగా, గొప్పగా ప్రారంభమంది సీతకి. కొండలరావుకి ఓ సైకిలు ఉంది. ఆ సైకిలు మీద వివేకానంద హౌస్, లేబర్ స్టాచ్యూ, అణ్ణా సమాధి - అన్నీ తిప్పాడు. బీచ్ లోవార్ మెమోరియల్ దగ్గర కూర్చుని ఇద్దరూ 'సుండల్' తింటూ సంసారం గురించి పథకాలు వేసుకున్నారు. ఇంటికి వస్తూ కణ్ణగి విగ్రహం దగ్గర చిన్న ఎల్క్ట్రిక్ దీపం వెలుగులో సీతని సైకిలు సీటు మీద నుంచి వంగి ముద్దు పెట్టుకున్నాడు. కొండలరావు జీవితంలో అది నోబెల్ బహుమతిలాంటిది. తన సైకిలు మీద భార్యని తిప్పుతూ బీచిలో, చీకట్లో ముద్దు పెట్టుకోవాలన్నది అతను సంవత్సరాలుగా పెంచుకున్న కోరిక. వారిద్దరి వైవాహిక జీవితంలో కొండలరావు ప్రమేయంతో సాధించిన 'రొమాన్స్' అదే

సీతకి ఈ పెళ్ళి మరొకరి మీద సాధించిన సవాలు.

చిన్నతనంలో పక్క పాపని ఎదిరించి సాధించిన బొమ్మలాట - చాలా సేపు ముచ్చటగా ఉంది. బొమ్మలతో ఆటకంటే పక్క పాప మీద విజయం దానికి రాణింపునీ, రుచినీ ఇస్తుంది. సీత మనస్సు  ఎప్పుడూ ఆకాశంలో లేదు. కానీ ఆమె సంస్కారం విజయనగరంలో సాధించిన చదువుతో ఆకాశంలో ఉంది. ఈ రెండూ ఊహించలేని విపర్యయాలు. అల్బర్ట్ ఐన్స్టీన్ని డిస్నీలాండ్ లో చిన్నపిల్లల మధ్య వదిలేస్తే? డిస్నీ మేధ గురించి ఆలోచిస్తాడా, పిల్లల మనస్సులో సారళ్యంతో తనూ చిన్నవాడవుతాడా?

ఏమైనా సీత కొండలరావు జీవితాన్ని చక్కగా అలంకరించింది, అతని మీసం స్టైల్ మార్చింది. బట్టలు తీరు మార్చింది. మొదటి నుంచీ ఒక్క విషయం అతనికీ అర్థమైపోయింది. తనకంటే సీత తెలివైనది. ఆమె చెప్పు చేతల్లో తన శ్రేయస్సుకి భంగం లేకపోగా ఇనుమడిస్తుందనీ.

ఒక్క విషయంలోనే అతని పెద్దరికాన్ని కాస్త పాటయినా చూపించగలిగాడు.- ఆ గదిలో ఓ మూల తీర్చిన మంచం మీద. సీత అతని సుఖానికి అర్థం మార్చేసింది. కొండలరావుని కొత్త మగాడిని చేసింది. సీతకి ఈ జీవితం - తను కోరి సాధించిన కొత్త బొమ్మల కొలువు. దాన్ని ప్రతిరోజూ తీర్చిదిద్దుకుంటుంది. ప్రతిరోజు కొత్త ఆనందాన్ని ఆలోచించి సాధించుకుంది.

ఇరవై రోజుల్లో తమిళ భాషని నేర్చుకునే పుస్తకాన్ని కొన్నది. కానీ పదిరోజుల్లోనే నేర్చుకుంది. ఆమె మెదడులో నేర్చుకునే అర ఏదో కొత్త జవాన్ని పుంజుకుని చాలా రోజులైంది. ఈ పని ఆమెకి కష్టంఖాదు. అలాగే ఒరియా భాషని కొండలరావుకి నేర్పాలని ప్రయత్నం చేసింది. కానీ అక్షరాభ్యాసం తర్వాత పాఠం సాగలేదు. కాగా, పాఠం చెప్పే మాష్టారు తన కొంగు బంగారం అని తెలిసిన విద్యార్థికి చదువు రాకపోవడంలో ఆశ్చర్యంలేదు. సీత చెప్పే అక్షరాల్ని కాక, కదిలే పెదాల్ని అందుకోవడం అలవాటైపోయింది కొండలరావుకి. ***అందమైన మాష్టారు చదువుకి అంతరాయమని ఆలస్యంగా తెలిసి వచ్చింది*** సీతకి.

సీతకి పట్నంలో ఈ జీవితం ఏనుగుకి సర్కసు బల్ల మీద చేసే విన్యాసంలాంటిది. ఇంత కురచయిన జీవితం చాలడం లేదు. మళ్ళీ విజయనగరంలో వదిలి పెట్టిన 'ఆర్తి' ఏదో పుంజుకుంది.

***చదువుకి గురువు కావాలి. ఆవేశానికి గురువు అక్కరలేదు. ఆవేశాన్ని అదుపులో పెట్టడానికి గురువు కావాలి.*** సీత  చదువు ఆవేశం. అయితే విజయనగరం చదువు లక్ష్యం సన్నీ. మరి మద్రాసు చదువుకి?

చాలా ఎదిగిన వ్యక్తి - వయస్సులో, అనుభవంలో - పసివాళ్ళతో సమంగా ఆడుకోడానికి అభిరుచితో పాటు కాస్త పాటి ప్రయత్నం కావాలి. ఏమైనా - తన అనుభవాన్ని పసిమనసుకి కుదించుకోడానికి కొంత కృషి అవసరం. కొండలరావు స్థాయికి తన ఆలోచనల్ని, జీవితాన్ని, సెక్స్‌నీ - అన్నిటినీ - దించుకుంది సీత. తొలిరోజుల్లో కుదించుకునే ప్రయత్నం చేస్తున్నందుకే ఆనందపడింది. అలా సవరించుకోవడం ఓ సవాలుగా భావించింది. క్రమేపీ - ఆ జీవితంలో చిన్న అలసట కనిపించింది. ఇదిగో, ఈ రోజుల్లోనే మరొక బృహత్తరమైన ప్రణాళిక అనాలోచితంగా, ఆయాచితంగా ఆమెకు చేరువయింది.

ఓ సాయంకాలం వార్ మెమోరియల్‌కి ఎదురుగా ఉన్న ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి కొండలరావు, తనూ వెళ్ళారు. 'ములగ బజ్జీ' తింటూ, అరవపాటలు వింటూ కొండలరావుని తన కొంగున కట్టుకుని ఎగ్జిబిషన్ అంతా తిప్పింది సీత. బకింగ్‌హాం మురికి కాలువ మీద కట్టిన వంతెన దాటి వెళుతుండగా సీతకి లౌడ్ స్పీకర్‌లో ఓ ప్రకటన చెవుల్లో పడింది.

రేణు అనే అమ్మాయి తప్పిపోయింది. ఆమెకి సంబంధించిన వాళ్ళు వచ్చి ఆమెను వెంటనే తీసుకెళ్ళాలి. రేణుకి బొత్తిగా తమిళం రాదు. తెలుగు అమ్మాయి. ఇదీ ప్రకటన. వినగానే తమిళం వచ్చిన తెలుగు అమ్మాయిగా సీతకి ఉత్సాహం కలిగింది. వంతెనకి దగ్గరలోనే ఎంక్వయిరీ ఆఫీసు. కొండలరావుతో చెపితే తాను నడవలేనని మురికి వంతెన పక్కనే చతికిలబడ్డాడు. సీత ఆఫీసు దగ్గరికి వెళ్ళింది. అక్కడ ఆమెకి ఎదురైన దృశ్యం ఆశ్చర్యపరిచింది. ప్రకటన వింటున్నప్పుడు ఎవరో చిన్న పిల్లని అక్కడ చూస్తాననుకుంది సీత. కానీ తనకంటే రెండేళ్ళు పెద్దగా ఉన్న (ఆ విషయం ఇద్దరూ మాట్లాడుకున్నాక తెలిసింది) ఆవిడని చూసి నిర్ఘాంతపోయింది.

"ఎవరమ్మా మీరు?"

మాట పూర్తికాకుండానే తెలుగులో భోరుమంది రేణు. ఆమె భర్త మల్యాద్రిరావు ఏదో కంప్యూటర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీ పేరు చెప్పలేకపోయింది. ఉంటున్న వీధి పేరు చెప్పలేకపోయింది. ఇంట్లో ఫోన్ ఉంది కానీ నంబరు చెప్పలేకపోయింది. ఇద్దరూ స్కూటరు దిగారట. ఆయన స్కూటరు స్టాండులో పెట్టి వస్తానని లోపలికి నడవమన్నారట. అప్పట్నుంచీ ఎగ్జిబిషన్ అంతా నడుస్తూనే ఉంది. రెండు గంటలయింది. కానీ భర్త జాడలేదు. ఆమె భాష ఎవరికీ రాదు. వాళ్ళ భాష తనకి తెలియదు. పేరు మాత్రం చెప్పి ఎంక్వయిరీ ఆఫీసులో కూర్చుంది. రేణుకి తెలియని విషయాలు చాలా ఉన్నా! తెలిసిన విషయాలు బడబడా చెప్పడం తెలుసు. సహారా ఎడారిలో సహాయం దొరికినట్టుగా - తన కథంతా ఏకరువు పెట్టేసింది. ఆమెది శ్రీకాకుళం జిల్లాలో లోలుగు అనే ఊరు. వాళ్ళాయనది చిత్తూరు జిల్లాలో పీలేరు. మరి ఇద్దరూ ఎలా కలిశారు? తిరుమల ఘాట్ రోడ్డులో మోకాళ్ళ పర్వతం ఎక్కుతూ కూలబడిన మల్యాద్రికి సహాయపడింది రేణు. అప్పుడామె పక్కన అక్కా, బావ ఉన్నారు. అంతా కలసి తిరుమల చేరారు. కలిసి దర్శనం చేసుకున్నారు. కలిసి కొండ దిగారు. ఆ తర్వాత జీవితమంతా కలిసి ఉండాలని ఈ మధ్యలో ఎప్పుడో ఎక్కడో నిర్ణయానికి వచ్చారు. శాస్త్రయుక్తంగా అన్నవరంలో పెళ్ళయింది. పెళ్ళికి మాల్యాద్రికి తన నాన్న స్కూటరు కట్నంగా ఇచ్చాడు. ఇదంతా జరిగి రెండేళ్ళయింది. మరి పిల్లలు? మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది రేణు. "రెండేళ్ళయినా పిల్లలు లేకపోవడం ఏమిటి చెప్పండి? మా అక్కలు నను ఆట పట్టిస్తున్నారు!" అంది. రేణులో చిన్న అమాయకత్వం ఉంది. లోకజ్ఞానం లేక కాదు. సరైన ఎక్స్‌పోజ్ లేక, ఇంతకీ ఆమె భర్త ఎక్కడ? కొండలరావు కూడా వాళ్ళతో కలిసి వెదికాడు. అనవసరంగా ఆమె తలకి చుట్టుకున్నందుకు మొదటిసారిగా భార్యమీద విసుక్కున్నాడు. ఆమెని మళ్ళీ ఎంక్వయిరీ ఆఫీసు దగ్గర విడిచి పెట్టిపోదామన్నాడు. కానీ సీత వదలలేకపోయింది. కారణం - ఆమె భర్త కోసం వెదుకుతుండగా -

"నేను అందంగా లేనాండీ?" అనడిగింది రేణు ఉన్నట్టుండి.

ఆశ్చర్యపోయింది సీత. "అదేం ప్రశ్న?"

"మా ఆయన ఊరికే నన్ను వెక్కిరిస్తూంటారండి! ఈ జాకెట్టు పొట్టిగా ఉండాలంటారు. జుత్తు ఇంకా షోగ్గా ముడి వేసుకోవాలంటారు. రోడ్డు మీద నడుస్తుంటే నాకు దూరంగా నడుస్తారు."

అప్పుడే రేణూ భర్తని చూడాలనిపించింది సీతకి. ***ఆడవాళ్ళలో ప్రత్యేకతల్ని చూసి ఆనందించే మగాళ్ళేకానీ, ఆడవాళ్ళలో ప్రత్యేకతల్ని ఆశించే మగాళ్ళు తెలియదు సీతకి,*** మాల్యాద్రి ఎలా ఉంటాడు?

సన్నగా నాజూగ్గా ఆడపిల్లలాగా ఉంటాడు. గొంతు కూడా కళ్ళు మూసుకుని వింటే ఆడపిల్లలాగా ఉంటుంది. ఎడమపక్క పన్ను పెదవిని కాస్త బయటికి తోసింది. న్యాయంగా అది ఎబ్బెట్టుగా ఉండాలి. కానీ మాల్యాద్రికి అది అందంగా అమిరింది.

పదిన్నరకి – దాదాపు ఎగ్జిబిషన్ మూసేసి అంతా ఇళ్ళకు తరలిపోయే టైముకి మాల్యాద్రి కనిపించాడు. నిజానికి మాల్యాద్రి ఇద్దరు కానిస్టేబుల్స్ ని వెంటబట్టుకుని కలయ తిరుగుతున్నాడు. భార్య కనిపించగానే, దాదాపు మీద పడి, కరిచినంత పని చేశాడు. "నీకు బుద్ధి లేదూ? నేనేం చెప్పాను. నువ్వేం చేశావు? గేటు దగ్గర నిలబడి చావమన్నానా?"

రేణుకి బాధ కలగలేదు. భర్తని చూసి ఆనందం కలిగింది. వెనుక వస్తున్న సీతని చూసి "ఏమండీ, ఈయనే మా ఆయన!" అంది.

అప్పుడు మాల్యాద్రి గమనించాడు కొండలరావునీ, సీతనీ. "చదువుకున్న వారిలాగా ఉన్నారు. భాష రాని భార్యని వదిలిపెట్టడానికి మీకు బుద్ధి ఉండాలి. రెండు గంటల నుంచీ ఆమె కంగారు పడుతోంది. పైగా మీరు చేసిన పనికి ఆ అమ్మాయిని తిడతారేమిటి ?"

ఒక్క క్షణం మొహం తెలియని స్త్రీ తనని దుమ్మెత్తి పోస్తున్నందుకు మాల్యాద్రి దిమ్మెరపోయాడు. కొండలరావు కంగారు పడిపోయాడు. సీతకూడా ఆవేశంలో అన్నదే కానీ, ఒక్క క్షణం బిత్తరపోయింది.

"ఐ యాం సారీ!" అంది అంతలో.

రేణు సీతని చూసి గర్వంగా ఫీలైంది.

"నా స్కూటర్ స్టాండులో పెడుతూండగా, జీపు వెనక నుంచి వచ్చి గుద్దింది. పోలీసులు కేసు రాశారు. గొడవ జరిగింది. అదంతా అయ్యేదాకా మా ఆవిడ గుర్తు రాలేదు. నిజానికి గేటు దగ్గర ఎదురు చూస్తూ ఉంటుందనుకున్నాను. అసలు ఈ మొద్దుకి.." మళ్ళీ నాలిక కొరుక్కుని, "ఐయాం సారీ!" అన్నాడు.

ఉద్యోగరీత్యా మాల్యాద్రి కొండలరావు కంటే మంచి స్థాయిలో ఉన్నాడు. ఆ విషయం మాల్యాద్రిని చూసినప్పటినుంచీ కొండలరావుకి అర్థమవుతోంది. కానీ భార్యల విషయంలో రేణు కంటే సీత నాలుగడుగులు ముందే ఉంది. ఆ విషయం మాల్యాద్రికీ అర్థమైంది.

రేణు సీతకి థాంక్స్ చెప్పి వెళ్ళబోతుంటే, సీత ఒక్క క్షణం ఆపింది. మాల్యాద్రిని చూసి, "పొట్టి జాకెట్లు కుట్టే టైలర్ రాయపేటలో ఉన్నాడు. అడ్రసు మీ ఆవిడకి చెప్పాను!" అనేసి కొండలరావుతో అడుగు కలిపింది. మాల్యాద్రి నిర్ఘాంతపోయాడు.

రేణుకి నవ్వొచ్చింది.

కొండలరావు మాత్రం మొదటిసారిగా సీతని మందలించాడు – ముక్కూ మొహం తెలియని పెద్ద మనిషిని నిలదీయడమే కాకుండా జాకెట్లు కుట్టే టైలర్ అడ్రసులు ఇవ్వాల్సిన అవసరం ఏముంది?

సీతకి తన ప్రవర్తన దురుసుగానే కనిపించింది. మొదటిసారిగా భర్త తనని మందలించినందుకు ఆనందపడింది. పురుషాధిక్యానికి ఆనందంగా ఒదిగే ఆడపిల్ల సంస్కారం రుచి అది.

ఏమైనా చాలా రోజులు రేణు సీతకి జ్ఞాపకం వస్తూనే ఉంది. అయితే ఆమెకి తను ఉంటున్న వీధి పేరు చెప్పింది కానీ, ఇంటి అడ్రసు చెప్పలేదు. చెప్పాల్సిన అవసరమూ కనిపించలేదు. ఆ సాయంకాలం జరిగిన సంఘటన తేలికగా మనస్సులోంచి జారిపోయే సంఘటన. అయితే ఇరవై రోజుల తర్వాత కొండలరావు రేణుని వెంటబెట్టుకుని ఇంటికి వచ్చాడు. సీత ఆశ్చర్యపోయింది. శంభునాధన్ వీధిలో నలుగురు టైలర్లు ఉన్నారు. నలుగురినీ వాకబు చేసిందట రేణు - పొటి జాకెట్ల గురించి కాదు. పొట్టి జాకెట్లు కుట్టించుకునే సీత గురించి. ఈ లోకంలో చాలామంది సీతలున్నారు. రాయపేట టైలర్లు సీత గురించి చెప్పలేకపోయారు.

ఆ సాయంకాలం ఫ్యాక్టరీ నుంచి సైకిలు మీద వస్తున్న కొండలరావుని గుర్తుపట్టింది రేణు. ఆయన పేరు తెలియదు. అయినా ఆపింది. ఆ విధంగా మళ్ళీ రేణూ, సీతా కలుసుకున్నారు.

"ఆ రోజు మీరేం చేశారో కానీ, మీ మీద మా ఆయనకి పీకలదాకా కోపం వచ్చింది. "ఊరూ, పేరూ తెలియని ఆవిడకు నన్ను నలుగురి ముందూ నిలదీయడానికి ఎంత ధైర్యం?" కనీసం నాలుగు సార్లయినా అని ఉంటారు. ఆయన కారణంగానే మిమ్మల్ని మరింత గుర్తుంచుకున్నాను" అంది రేణు.

ఆ రోజు రేణుని తేరిపార గమనించలేదు. మొదటిసారి ఆమెలో ఉన్న స్వచ్ఛతనీ, నైర్మల్యాన్నీ గమనించింది సీత. రేణూ అందగత్తేం కాదు. కానీ ఆ వయస్సులో సాధారణంగా కనిపించని సరళత్వం ఆమెకి కొత్త అందాన్నిచ్చింది. ఆమెని చూస్తుంటే, ఇంకాస్త ప్రయత్నిస్తే అందంగా ఉండగలదనిపించింది. బహుశా అదే వాళ్ళాయన కూడా అనుకుంటున్నాడేమో!

కాఫీ కలిపి ఇచ్చింది రేణూకి. కొండలరావు కూరలు తెచ్చి ఇస్తానని వెళ్ళాడు.

"ఇంత చిన్న ఇంట్లో ఉంటున్నారా?" అని ఆశ్చర్యపోయింది రేణు - మోడామీద కూర్చుంటూ.

"పెళ్ళికాకముందు మా ఆయన ఈ గదిలో ఉండేవారు. అయ్యాక కూడా ఇక్కడే సర్దుకుపోవడం అలవాటు చేసుకున్నాం. ఆయనకు ఆదాయం ఎక్కువేం కాదు. పైగా మా ఇద్దరికి ఈ మాత్రం చాలు!"

"పిల్లలు?"

"ఈ మధ్యే పెళ్ళయింది" అంది సీత.

రేణూ గోడలూ, పటాలూ గమనిస్తోంది.

"మీ ఇద్దరిదీ ప్రేమ వివాహమా?"

"ఏం చెప్పాలో తెలియదు. కానీ పెద్దలు కుదిర్చిన పెళ్ళి మాత్రం కాదు. ఆయన్ని చేసుకోవాలనుకున్నాను. ఆయనకి చెప్పాను. సరేనన్నారు" నవ్వింది సీత.

ఉన్నట్టుండి పక్కకి వచ్చి కూర్చుని అడిగింది "రోజూ మీ ఆయన మీతో ఉంటారా?"

సీత నిర్ఘాంతపోయింది.

"మనిద్దరం ఆడవాళ్ళం, చెప్పడానికి మీరు సిగ్గుపడక్కరలేదు"

"నేను కోరుకుంటే" అంది సీత.

రేణూ స్టౌ వైపు చూస్తూ అంది - "నేను కోరుకున్నా మా ఆయన ఉండరు. మిమ్మల్ని చూడగానే మీ సమాధానం గ్రహించాను, జాకెట్ల కోసం కాదు - కావాలనే మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చాను" అంది రేణూ, సీత కళ్ళని తప్పించుకుంటూ.

## 13

***కొందరికి ఆకలి అవసరం. కొందరికి ఆకలి వ్యసనం. కొందరికి కల. కొందరిని చూస్తుంటే తినడానికే పుట్టినట్టుంటారు. కొందరు పుట్టారు కనక తింటూంటారు. కాని అందరికీ తినక తప్పదు.***

సెక్స్ స్త్రీ జీవితంలో భాగం. అయితే చాలామందికి అది దినచర్యలాంటిది. అంతకన్న ప్రాముఖ్యమూ లేదు. చాలా మందికి ఆకర్షణని 'ఆకలి'గా తర్జుమా చేసుకోవడం తెలీదు. ('ఆకలి' అన్నమాట తెలిసే వాడుతున్నాను) చాలామందికి ఆ అవసరం తెలీదు.

అలాంటి వ్యక్తి రేణు. రేణూ వల్ల సీతకి ఒక ఉపకారం జరిగింది. తనలో అన్ని విధాలా వస్తున్న మార్పు - బహుశా ప్రతి స్త్రీలోనూ ప్రతి పురుషుడు వాంఛించే మార్పుగా రేణూ గుర్తు పట్టడం - సీతకి ఏదో శక్తినిచ్చింది.

రాత్రి పడక గదిలో మంచం మీద భర్తచెయ్యి తన మీద పడడమే సెక్స్‌కి అర్థంగా భావించేవాళ్ళు చాలామంది ఉంటారు. వాళ్ళు బతకడానికి అన్నం తినే కోవ. తప్పులేదు. అయితే - ప్రతి వ్యక్తి చుట్టూ ఉన్న చిన్న ప్రపంచంలో తన 'రుచి'ని తాను ఎరగడం, తన 'ఆకలిని' తను అలంకరించడంలో గొప్ప తనం ఉంది.

చాలా తక్కువ మంది భర్త చెయ్యి కోసం ఎదురుచూస్తారు. ఇంకా తక్కువ మంది భర్త చెయ్యి తనవేపు వచ్చేటట్టు చేసుకుంటారు. ఇంకా తక్కువమంది భర్త చెయ్యి ఎప్పుడు ప్రయాణం చెయ్యాలో నిర్ణయిస్తారు. జీవితంలో ప్రతి మాధుర్యాన్నీ సెక్స్‌తో ముడి పెట్టిన ఫ్రాయిడ్ మనస్సులోని రహస్యం ఇదే

రేణు శరీరంలో సెక్స్ ఉంది. స్వభావంలో సెక్స్ లేదు. ఆ నిజాన్ని ఇన్ని మాటల్లో కాక ఏదో తన జీవితానికి అవసరమని తన మనస్సు తనకి చెప్పక చెప్పడం మరొక కారణం.

రేణూలో కొత్త అందాన్ని సంతరించడానికి ప్రయత్నించినప్పుడల్లా - అలాంటి అందమేదో కొండలరావులో లోపించిన విషయం సీత గుర్తు పట్టింది. ఇది కొత్త వైద్యాన్ని కనిపెట్టిన వైద్యుడు ఆ రోగాన్ని తనలోనే గుర్తుపట్టిన సందర్భంలాంటిది.

కొండలరావు తను కోరుకున్న భర్తకాడు. కాని తనకి అవసరమయిన భర్త. ***అవసరాన్ని అలవాటు చేసుకోవడం సంప్రదాయం. పెళ్ళిని 'సంప్రదాయం'తో ముడి పెట్టే సమాజం ఆడపిల్లకి నేర్పే మొదటి పాఠం ఇదే! స్త్రీకి మగాడు అవసరం. ఆ విషయం చెలంగారిని అడిగినా చెపుతారు. ఆ 'అవసరం' తీరడానికి 'పెళ్ళి' అవసరం. ఇది సాంఘికమయిన ఏర్పాటు. పెళ్ళి నిలదొక్కుకోడానికి స్త్రీ మగాడికి అలవాటు పడడం అవసరం. దీనికి దైవికం, విధి, అదృష్టం, వ్రతఫలం - ఏవయినా, ఎన్నయినా, ఎన్నయినా కారణాలు చెపుతారు. కాని అలవాటుని అలంకరించుకోడం ఎవరూ నేర్పరు. కొందరు స్త్రీలకి అది జన్మతః వస్తుంది. కొందరు సంస్కారంతో అలంకరించుకుంటారు. కొందరికి రాదు ఎన్నేళ్ళయినా.***

సీతకి అది సులువుగానే అలవడింది. అలా అలవరుచుకోవాలనే మనసు రేణూకుంది. ఇద్దరు చాలా చనువుగానే దగ్గరయారు. సీత రేణూకి మొదటి పాఠాలు నేర్పింది.

***భార్యకి తన మీద శ్రద్ధ ఉన్నదన్న ఆలోచన మగాడిని తృప్తి పరుస్తుంది. ఆ శ్రద్ధ అతని బట్టల్ని చలవచేయడంలో, ప్రత్యేకంగా పూనుకుని ఆయన జుత్తు దువ్వడంలో, ఆఫీసుకి వెళుతున్న భర్తగారి షర్టుమీద లేని దుమ్ముని దులపడంలో, ఆఫీసు నుంచి వచ్చే భర్తగారికి అలవోకగా గుమ్మం దగ్గరే చిరునవ్వుని అందించడంలో, రుచి మరిగిన భర్తయితే ముద్దునే ఇవ్వడంలో - వీటికి 'జండర్' ప్రాబ్లమ్స్‌కి సంబంధం లేదు. ఆమె మనస్సులో తనకు ప్రత్యేక స్థానం ఉన్నదన్న ఆలోచన మగాడికి తృప్తినీ, కాస్త బాగా గర్వాన్నీ ఇస్తుంది.***

*ఇంకొక అడుగు ముందుకు వేసి, ఆ శ్రద్ధకి కారణం - అతనిలో ప్రత్యేకత అని అతనికి తెలిసేటట్టు చేస్తే? ఉదాహరణకి - అతని నడకలో, పలకరింతలో, కూర్చుని భోజనం చేయడంలో, చూసే చూపులు - ఏదయినా - అతని జీవనంలో ఒక 'ఫోకస్' వస్తుంది. అభిమానుల మధ్య హీరోగారి హీరోయిజం పెరిగినట్టుగా, 'దృష్టి'గల భార్య సమక్షంలో ప్రతీ మగాడూ హీరో అవుతాడు.*

*భుజం మీద చెయ్యి పడినప్పుడు భార్య చూసే చూపు ఎంత మందిలో లేని మగతనాన్ని రెచ్చగొడుతుంది. ఆ 'స్పర్శ' గురించి ఎంతమంది మాట్లాడుకుని ఉంటారు? మాట్లాడుకోవచ్చని ఎంతమందికి తెలుసు? ఆరాధించే వ్యక్తి సమక్షంలో మగాడి మగతనం రెచ్చుతుంది. దీనికి ఫ్రాయిడ్ నే సాక్ష్యం తెచ్చుకోనక్కరలేదు.*

*మీ వారికి ఉప్మాలో జీడిపప్పు ఇష్టమా? స్నానాల గదిలో వీపు తోమడం ఇష్టమా? - కాఫీని మీరు స్వయంగా తాగించడం ఇష్టమా? దీనికి ఎయిర్ కండిషన్డ్ గదులూ, లక్షల ఆస్తీ అక్కరలేదు. ఈ మధురమయిన సమన్వయం మనస్సులో ప్రారంభం కావాలి.*

*మాటల కందకుండా, మూగగా ఉండిపోయే ఈ ఆకర్షణని తెలిసీ సాధించుకోగలిగితే?*

శ్రద్ధగా రేణూతో కూర్చుని ప్రతి చిన్న విషయానికీ సీత గుర్తుపెట్టింది. ఆఫీసు నుంచి రాగానే మాల్యాద్రి ఏం చేస్తాడు? - స్నానం చెయ్యాలనుకుంటాడు. వేడి నీళ్ళా, చన్నీళ్ళా? వేడి నీళ్ళు. నీళ్ళు ఎవరు కాచుతారు? తనే కాచుకుంటాడు. ఈసారి ఆయన బాత్ రూములో వేణ్ణీలు సిద్ధంగా ఉన్నాయి. ఇస్త్రీ చేసిన తువాలు తుడుచుకోడానికి సిద్ధంగా ఉంది. వేణ్ణీళ్ళ బకెట్‌లో అతని కిష్టమయిన ఉడుకులాం వాసన ఉంది. అంతకు మించి - అతను స్నానం చేసి బయటికి వచ్చాక - నవ్వుతున్న భార్య తలుపు దగ్గర ఉంది.

మాల్యాద్రి నవ్వాడు "ఏమిటివాళ ప్రత్యేకం?"

ఆ ప్రశ్న, ఆ నవ్వు, ఆ రోజు బోనస్. 'ఇవాళ' గుర్తుపట్టడం ఆమె సాధించిన విజయం.

అతనికి పెళపెళలాడే ప్రింటెడ్ చీరలంటే చాలా ఇష్టం. దగ్గరికి వచ్చే భార్యకీ తనకీ మధ్య చీరె సిగ్గుపడాలి. రాత్రి ఫైళ్ళు తిరగేస్తున్న మాల్యాద్రి మంచం దగ్గరికి ఫెళఫెళలాడే చీరె వచ్చింది. దానితో పాటు 'లేడీ బాలెన్సియాగా' సెంట్ గుప్పుమంది. ఆ సెంటు మాల్యాద్రికి కొత్త. అది ముఖ్యం కాదు. రాత్రికి భార్య అలా అలంకరించడం కొత్త. రాత్రికి ఆమె ప్రత్యేకతను సంతరించడం కొత్త, జరుగుతున్న చాలా రాత్రుల్లో ఇదీ ఒకటే - అని అనిపించకపోవడం కొత్త.

ఆ తర్వాత మంచం మీద కార్యక్రమంతా రివర్స్. రోజంతా పనిచేసుకు వచ్చి - అలసిపోయి పడుకున్న ఆమె శరీరం అతని స్పర్శ కోసం రోజూ ఎదురు చూసేది. ఆయన పలకరిస్తే, ఆయన చెయ్యి తన మీద కదిలితే - కాస్త ఉపశమనం కలగదా అని ఉవ్విళ్ళూరేది. కాని ఇవాళ పద్ధతి అంతా మారిపోయింది. సన్నజాజులు ముడుచుకున్న తను మంచం మీద అటువేపు తిరిగివుంది. ప్రింటెడ్ చీర పెరపెరలాడుతోంది. అతని ఫైళ్ళ మీద కలం కదులుతోంది. ఇటు తిరిగిన ఆమె మనసు పెరపెరలాడుతోంది. రోజూలాగ అతని స్పర్శ కోసం ఎదురు చూడలేదు. ఆమె స్పర్శ కోసం అతను ఎదురు చూడడానికి ఎదురు చూసింది. ఓ రాత్రికి ఆమె నడుం చుట్టూ అతని చెయ్యి బిగుసుకోవడం గమనించింది. ఆ చేతిలో వణుకు గమనించింది. ఆ చెయ్యి తన శరీరాన్ని వెదుక్కోవడం గమనించింది. రేణుకి ఆనందంతో కంట తడి నిండింది. తర్వాత ఏమీ జరగలేదు. ఏమీ జరగనివ్వలేదు సీత. ఆ రాత్రి రేణూ మత్తుగా నిద్రపోయింది. ఆ రాత్రి మొదటి సారిగా మాల్యాద్రి నిద్ర చెదిరింది - కాస్తపాటి.

●●●

కొండలరావు మిల్లు నుంచి ఇంటికి వస్తూనే స్నానం చేస్తాడు నూతి దగ్గర. కట్టుకున్న బట్టలు తనే ఉతుక్కుంటాడు. దండానికి వేసిన ఉతికి ఆరేసిన బట్టలు తొడుక్కుంటాడు. అవి నలిగి ఉంటాయి. చలవ చేసి ఉండవు. అయినా రోజూ చలవ చేసుకునే స్తోమతులేదు కొండలరావుకి.

ఆ రోజు - నూతి దగ్గర స్నానం చేస్తూండగానే - అతను విడిచిన బట్టల్ని సబ్బుతో ఉతికింది సీత. సీతకి ఈ పని చెయ్యాలని ఎప్పుడూ అనిపించలేదు. ఏ పని చేస్తే ఎదుటి వ్యక్తి దృష్టిని ఆకర్షించవచ్చునో, రేణూకి చెపుతున్నప్పుడు.. తను ఏం చెయ్యడం లేదో గుర్తొచ్చింది. ***మనస్సుని రంజింప చేయడం కళ అయితే ఆ కళ కొత్త దారులు వెదకడానికి ఎప్పుడూ అలిసిపోదు. ఏటిలో స్నానం చేసే భర్త వీపును తోమే భార్య ఆనందానికి, ఫైవ్ స్టార్ హోటల్ బాత్ టబ్‌లో భర్తకి పెదాలు అందించే భార్య మనస్సులో తృప్తికీ మధ్య - డబ్బే ఉంది. హృదయం ఒక్కటే - ఆనందం స్థాయి ఒక్కటే.***

మిల్లులో నూనె వాసన కొట్టే తన బట్టల్ని ఉతుకుతున్న సీతని ఆశ్చర్యంగా చూశాడు కొండలరావు. ఆమె చేతిలో తన మురికి పడినందుకు సిగ్గుపడ్డాడు. "ఈ పని నీకెందుకు సీతా?" అని లాక్కోబోయాడు. ఆ ప్రయత్నంలో ఇద్దరూ నూతి చుట్టూ పరిగెత్తారు. నూతి అంచుమీద ఉన్న బాల్చీ సీత మీదకి జారి చీరె తడిసింది. కొండలరావు ఒంటి సబ్బు సీత బుగ్గలకి అంటుకుంది. తన తప్పులాగ ఆమె బుగ్గల్ని తుడవాలని ప్రయత్నించాడు. - ఆమె ముఖాన్ని దూరంగా లాక్కుంది. ఈసారి మెడ తడిసింది. మరో ఆలోచన లేకుండా నూతిలోంచి బాల్చీతో నీళ్ళు తీసి తన మీద గుమ్మరించుకుంది. మరో బాల్చీతోటి భర్తమీద గుమ్మరించింది. ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు. ఇద్దరి మధ్యా సౌహార్థం ఆరు పిక్‌నిక్‌లూ, ఏడు మీటింగ్స్ జరిగినంత పెరిగింది. తడిసిన సీత ముత్యంలాగ కనిపించింది కొండలరావుకి. కొండలరావు బుగ్గలకి చిన్న సొట్ట ఉందని, అతను నవ్వినప్పుడు అవి అందంగా కనిపిస్తాయని సీత మొదటిసారి గ్రహించింది. పొద్దుట తను తల రుద్దుకున్న కుంకుడు కాయల పులుసుతో కొండలరావు వీపు రుద్దింది.

కిటికీ అవతల్నుంచి వడివేలు - ఇదంతా సినిమా దృశ్యంలాగా చూస్తున్నాడు. అతనికిది శాంతారామ్ సినీమాలాగా ఉంది. ఆ సాయంకాలం సీత తలకి సాంబ్రాణి పొగ వేసుకుంది. తడిసిన ఆమె కురుల్ని ఆరేదాకా తన చేతిమీద పరుచుకున్నాడు కొండలరావు.

తర్వాత పెరపెరలాడే ప్రింటెడ్ శారీ కట్టుకోవాలి. ఆనాటి పాఠంలో తరువాయి అంశం రేణూకి. కానీ సీత దగ్గర ప్రింటెడ్ శారీ లేదు. కొండలరావు దగ్గర ప్రింటెడ్ బర్మా లుంగీ ఉంది. దాన్ని చూడగానే సీతకి నవ్వొచ్చింది. కొండలరావుని గదిలోంచి బయటికి తోసింది. లుంగీ కట్టుకుంది. మరి మీద బ్రాలేకుండా చొక్కాయే వేసుకుంది. మొదటిసారిగా పెళ్ళాన్ని కొత్త తరహాగా చూసే భర్త కళ్ళలోకి చూడలేకపోయింది. ఈ కొత్తదనానికి ఏం ఖరీదుంది? చూసే మనస్సుంటే ఈ ఆనందాన్ని పూరి పాకకీ బదిలీ చెయ్యవచ్చు. కొండలరావుని పంపించి - కుంకుమ పువ్వు వేసిన మిఠాయి కిళ్ళీ కట్టించి తెప్పించింది.

భోజనం దగ్గర మసాలా దట్టించిన కోడిగుడ్డు కూర నసాళాన్ని పలకరించింది. తింటూ రుచి మరిచిపోయాడు కొండలరావు. కదులుతున్న సీత ఒంటిమీద ఉన్న షర్టు - ఆమె కదలికలకి తూట్లు పడిపోతోంది. ఇంకెప్పుడూ ఆ షర్టుని మనశ్శాంతితో వేసుకోలేడతను. బటన్సు దూరంగా ఉన్నాయని ఆమె ఒంటిమీద ఉన్నప్పుడు తనకర్థమయింది. తనకి వడ్డిస్తున్న సీత ముఖాన్ని దగ్గరికి లాక్కుని - రెండో బటన్, మూడో బటన్‌కీ మధ్య శరీరం మొహమాటపడుతోందని చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

సీత నవ్వింది. గదికి ఉన్న ఒక తలుపూ వేసేసింది. రెండో బటన్ తీసేసింది. కొండలరావు ఉక్కపోస్తోంది. నుదుటిమీద చెమటలు పట్టాయి. పెళ్ళయిన కొత్తలో కూడా ఇంతగా శరీరం వేడెక్కలేదు. విచిత్రం! - సీతకీ చెమటలు పట్టాయి. రేణూకి చెప్పిన పాఠాలు వీరికీ వర్తిస్తున్నాయి.

కొండలరావు వేసుకున్న - మిగిలిన లుంగీ చిరిగింది. తొడ మీద శరీరం కనిపిస్తోంది. సూదీ దారం తీసుకుంది సీత. కొండలరావు ఆశ్చర్యంగా చూశాడు. లుంగీని చూపించింది... తనే కుట్టుకుంటానని సూది అందుకోబోయాడు. సూదిలోకి దారం ఎక్కించింది. పాంటు తొడుక్కుని లుంగీ ఇవ్వబోయాడు. అతన్ని అలాగే మంచం మీద కూర్చోపెట్టింది. తొడ మీద చిరుగు మూతపడు

తోంది. ఇంకా పెద్దది ఉంటే బాగుణ్ణనిపించింది కొండలరావుకి. శరీరం కనిపించనంతగా లుంగీ కుట్టుపడేసరికి - శరీరానికి లుంగీ అవసరం తీరిపోయింది.

రేణూ శరీరం మీద మాల్యాద్రి వణికే వేళ్ళు దారులు వెదుక్కుంటున్నాయి. సీత శరీరం మీద నుంచి అలసిపోయిన కొండలరావు వేళ్ళు సెలవు తీసుకుంటున్నాయి.

తీరా.. ఇదింకా సీత మొదటి పాఠం!

రేణుకా కనిపించినంత అమాయకురాలేమీ కాదు. తను సాహించాలనుకున్న విషయాన్ని సీతకంటే త్వరగా, చక్కగా సాధించగలదు. సీత ఆవేశంతో దూకుతుంది. రేణు మెలుకువతో వల పన్నుతుంది. అయితే ఇద్దరిలోనూ దొంగతనం లేదు. లాలూచీ లేదు.

రేణూ వెంట వెంటనే రెండు పనులు చేసింది. నాలుగు గదుల ఇంటిని భర్త చేత అద్దెకు తీసుకునేలా చేసి, అందులో రెండు గదులను కొండలరావు ఉంటున్న ధరకే అద్దెకి ఇచ్చేటట్టు చేసింది.

వడివేలుకి ఎంత ప్రయత్నించినా సీత భుజం దొరకలేదు. తను సానుభూతి చూపే కష్టాలేవీ సీతకి లేవు. పైగా తను దొంగ ముండాకొడుకని భార్యే సీతకి చెప్పింది. వడివేలుకి - ఆ ఇంటికి కేవలం అద్దె మాత్రమే కట్టడం సుఖంగా లేదు. కనుక వాళ్ళు ఇల్లు ఖాళీ చేస్తున్నారని రేణూ చెప్పినప్పుడు ఆనందపడ్డాడు. అభ్యంతరం చెప్పలేదు.

మొదట ఈ ఏర్పాటుకి సీత అంగీకరించలేదు. కొండలరావు తలూపినప్పుడు సీత కాస్త ఎదురు తిరిగింది. పైగా ఏదో స్నేహంగా తను చేస్తున్న సహాయానికి అడగకుండానే ఇలాంటి సహాయం చేస్తున్నందుకు రేణూ మీద విసుక్కుంది. అలాంటి పనే అటు మాల్యాద్రి చేశాడు. నిజానికి అతనో మెట్టు ముందుకు వెళ్ళాడు. కొండలరావు ఎలాంటి వాడో తెలీకుండా అంత పెద్ద పోర్షన్ అద్దెకు తీసుకోవడం రిస్క్ అన్నాడు. వాళ్ళు మధ్యలో ఖాళీ చేసిపోతే అద్దె నెత్తిన పడుతుందన్నాడు. కొండలరావుకి కొన్ని పిచ్చి షరతులు పెట్టాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె నాలుగో తేదీ దాటకూడదు. కరెంటు చార్జీలో సగం ఇచ్చుకోవాలి. ఉదయం లేచినప్పటి నుంచి ఆఫీసుకు వెళ్ళే హడావుడి ఉంటుంది కాబట్టి బాత్ రూమ్ ఏడున్నర వరకూ వాడకూడదు. ఇవన్నీ విని కొండలరావు బెదిరిపోయాడు. సీతయితే ససేమిరా ఆ ఇంటికి రానంది. కొండలరావు సీతని ఒప్పించాడు. జీవితంలో విశాలమైన ఇళ్ళల్లో ఉండటం అదృష్టం. అంత ఆవరణ ఉన్న ఇంట్లో ఉండే అవకాశం ప్రతీసారీ రాదు. కోరి రేణూ అడుగుతున్నప్పుడు తప్పేముంది? అనుకున్నాడు.

ఇంటి ముందు పెద్ద గానుగ చెట్టు - అసలు ఇంటి పోర్షనే బిల్డింగ్‌కి వెనక పక్కన ఉంది. అందులో సౌకర్యంగా ఉన్న రెండు గదులూ, వంట గదీ తమ కింద కేటాయించుకున్నాడు మాల్యాద్రి. దూరంగా విసిరేసి నట్టున్న పెద్ద హాలులాంటి గది కొండలరావుకి కేటాయించాడు. తమ వంట గది పక్కనే ఉన్న సామాన్ల గది సీత కోసం వంట గది చేశాడు. ఇక బాత్ రూం చాలా పెద్దది. గదులంత విశాలమైనది. అది రెండు వాటాలకీ ఒకటే!

ఏమయినా రేణూ మాల్యాద్రినీ, కొండలరావు సీతనీ ఒప్పించారు. రెండు కుటుంబాలూ గృహప్రవేశం చేశాయి. ఇంట్లో దిగినప్పట్నుంచీ స్థాయిలో కొండలరావు, సీత తమకంటే తక్కువని ఎప్పటికప్పుడు గుర్తుకొచ్చేటట్టు చేశాడు మాల్యాద్రి. మాల్యాద్రికి స్కూటరుంది. కొండలరావుకి పాత సైకిలే ఉంది. ఉమ్మడి బాత్ రూములలో ఇద్దరి సబ్బు పెట్టెలూ ఉంటాయి. దిగిన మర్నాడే అందమైన సబ్బు పెట్టెలో శాండల్ ఉడ్ సబ్బు బిళ్ళ తళతళా మెరిసింది. బాత్ రూములో బాంబే డయింగ్ టర్కీస్ టవల్ వేలాడింది. ఓల్డ్ స్పైస్ ఆఫ్టర్ షేవ్ బాత్ రూముని గుప్పుమనిపించింది. ఇవన్నీ సీతను రెచ్చగొట్టిన అంశాలు. వచ్చిన వారంలోనే సీత తమ సబ్బుని లక్స్ సుప్రీమ్‌కు

మార్చింది. భర్తకోసం మొదటిసారిగా పాండ్స్ ఆఫ్టర్ షేవ్ కొంది. కొండలరావు జీవితంలో ఎప్పుడూ ఆఫ్టర్ షేవ్ వాడలేదు. నిజానికి వారానికి ఒకేసారి గెడ్డం చేస్తాడు. అయితే ఈ ప్రయత్నం మాల్యాద్రి దృష్టిలో తమ స్టేటస్ పెంచడానికని అతను గుర్తించలేదు.

ఇంట్లో కలిసి ఉన్నప్పుడు సీతకి ఓ కొత్త విషయం తెలిసి వచ్చింది. మాల్యాద్రికి తెలీని విషయం అంటూ ఏదీ లేదని. ఆ ఇంట్లో ఉన్న చిన్న బల్ల దగ్గర్నుంచీ.. రేణూ వాడే చేతి అద్దం వరకూ అన్నీ మాల్యాద్రీ స్వయంగా చేశాడని. అంతేకాదు. అతను కీ ఇస్తే నడిచే కొన్ని ఎలక్ట్రానిక్ బొమ్మలు చేశాడు. ఓ చిన్న రేడియో, కేవలం పార్టులన్నీ కొని స్వయంగా తయారుచేశాడు. అంతే కాదు, రేణూని కూర్చోబెట్టి ఓ నెలరోజులపాటు ఆమె బొమ్మని పెయింట్ చేశాడు. అయితే ఆ బొమ్మ రేణూలా కాక, రేణూ ఎలా ఉండాలని మాల్యాద్రి ఆశిస్తున్నాడో అలా ఉంది. చిత్రంలో రేణూ పట్టుదల మనిషి, కళ్ళు పెద్దవి. జుత్తు పిరుదులు దాకా జారుతోంది, చిన్న పెదవి, ఎప్పుడూ నవ్వే పెదాలు.. మాల్యాద్రి తన చిత్రం చేస్తే ఏం చేస్తాడు? తనలో లేని ఏ కోణాన్ని ఊహిస్తాడు? తను ఎలా ఉంటే బాగుంటుందనుకుంటాడు? వెంటనే అలాంటి ఆలోచన వచ్చినందుకు తన మీద తనే కోపం తెచ్చుకుంది.

కొండలరావు ఇంట్లో అలంకరించే వస్తువులేవీ లేవు. ఉండే స్తోమత కొండలరావుకీ లేదు. ఆ ఇంట్లో దిగే వరకూ ఉండాలనే ఆలోచన ఇద్దరికీ లేదు. ఏమయినా రేణూ కుటుంబానికి పక్కన ఉండటం వల్ల సీత జీవితంలో ఊహించలేని ఓ క్రమశిక్షణ వచ్చింది. నిజానికి అది క్రమశిక్షణ కాదు. పక్కవారితో పోల్చుకోవాలనే సామ్యం.

కొండలరావు కంటే ముందు వెళ్ళి కొండలరావు కంటే ఆలస్యంగా వస్తాడు మాల్యాద్రి. నిజానికి ఆ ఇంట్లో చేరాక మాల్యాద్రి కనిపించేదే తక్కువ. ఏడున్నర వరకూ బాత్ రూం వాడకూడదనే ఆంక్ష పెట్టాడే కానీ, మాల్యాద్రి కాలకృత్యాలు అయిదున్నరకే పూర్తవుతాయి. మరి రాత్రి ఎప్పుడు వస్తాడు? ఎప్పుడు నిద్రపోతాడు? ఎప్పుడు లేస్తాడు?

కొండలరావుకి ఆ గొడవలేవీ లేవు. మిల్లు షిప్టు పూర్తయిన గంటలో ఇంట్లో ఉంటాడు. తరువాత ఎక్కడికి వెళ్ళేదేమీ లేదు. ఎప్పుడయినా భోజనం అయ్యాక మౌంట్ రోడ్డుదాకా వెళతారు. ఓసారి ఇలియట్స్ బీచిలో రాత్రి పదిగంటలవరకూ కూర్చుంటే పోలీసులు ఇద్దరినీ నిలదీశారు. సీత తన భార్యని అరవంలో నిరూపించే వరకూ విడిచి పెట్టలేదు. ఆ తర్వాత రాత్రి బీచి షికార్లు ఇద్దరూ మానుకున్నారు.

ఓసారి అర్ధరాత్రి ఏడుపులతో లేపింది రేణు. సీత, కొండలరావు కంగారుపడపోయారు. అప్పుడే గాఢంగా నిద్రపడుతోంది సీతకి. తుళ్ళి పడి లేచి కూర్చుంది. కొండలరావు మొదట పరిగెత్తాడు. ఇద్దరు మనుషులు మాల్యాద్రిని తీసుకువస్తున్నారు. వెనకనే ఒకాయన వెస్పాని నడిపించుకుని వస్తున్నాడు. మాల్యాద్రి మోచేతి నుంచి రక్తం కారుతోంది. పై పళ్ళు పెదవిలో గుచ్చుకున్నాయి. కళ్ళజోడు బద్దలయింది. షర్టు చిరిగింది. భర్తను చూసి భోరుమంది రేణు. నోరు మూయమని మందలించాడు మాల్యాద్రి. వీధి చివర మలుపు తిరుగుతోంటే రోడ్డు మీద మురుగు సొరంగం మూత తీసి ఉందట! స్కూటరు బోల్తాపడింది. దెబ్బలు తగిలాయి. వెనక నుంచి వస్తున్న కారు 1గింది. అతన్ని ఇంటికి తీసుకొచ్చాడు. రేణూ భర్తని మంచం మీద పడుకోబెట్టింది. సీత మొదటిసారిగా వాళ్ళ వంట గదిలోకి వెళ్ళి వేడి నీళ్ళు కాచింది. కొండలరావు స్కూటరు స్టాండు వేసి, వచ్చిన వాళ్ళకు థాంక్స్ చెప్పి పంపాడు. మరొకరి సహాయం తీసుకోవలసి వచ్చినందుకే విసిగిపోతున్నాడు మాల్యాద్రి. ఆ సమయంలో సీతకి అర్ధమైన విషయం మాల్యాద్రి తాగి ఉన్నాడని. అయితే తూలి పడేటంత తాగలేదు. స్కూటరు మీంచి పడిపోయే పాటి తాగుడు. అప్పుడు మొదటిసారిగా కొండలరావు సామర్ధ్యాన్ని గమనించింది సీత. చాలా ఒడుపుగా మాల్యాద్రి ఒంటిమీది షర్టును తీశాడు. సీత తెచ్చిన వేడి నీళ్ళలో డెట్టాల్ వేసి, చాలా నైపుణ్యంగా మాల్యాద్రి మోచేతి మీద రక్తాన్ని తుడిచాడు. మందు పెట్టాడు. పాంటు తీసినప్పుడు తెలిసిన విషయం అతని మోకాలికి బలంగా దెబ్బ తగిలిందని. కాలి కింద తలగడ పెట్టాడు. ఇబ్బంది పడినా మాల్యాద్రి కొండలరావు సామర్ధ్యాన్ని చూసి ఒక్క క్షణం బిత్తరపోయాడు.

అతన్ని మంచం మీద పడుకోబెట్టాక తన పోర్షన్ లోకి వెళ్ళి ఏదో మాత్ర తీసుకొచ్చి ఇచ్చాడు మాల్యాద్రికి కొండలరావు.

"వాటీజ్ దిస్?" అన్నాడు మాల్యాద్రి.

"వంకాయ పులుసు, వేసెయ్యండి సార్" అని బలవంతంగా నోట్లో తోశాడు కొండలరావులో ఆ మాత్రం హాస్యం చూడటమూ అదే మొదటిసారి. మాల్యాద్రి నవ్వుతూనే మాత్రను మింగాడు.

సీత మొదటిసారిగా భర్తని చూసి గర్వపడింది. అప్పుడు రేణూని చూసింది సీత, రేణూ తన మొదటి పాఠాన్ని తు.చ తప్పకుండా పాటిస్తోంది. తలనిండా మల్లెపూలు ప్రింటెడ్ చీర, వదులుగా జడ.

మాల్యాద్రి ఆక్సిడెంట్ వల్ల ఒక రాత్రి నష్టపోయింది రేణూ. సీతకి నవ్వొచ్చింది. రేణూకి ఆ నవ్వుకి కారణం అర్థమయింది.

తన పోర్షన్ లోకి వెళుతూ "మరేం ఫరవాలేదు. ఒక రాత్రిని నష్టపోయినట్టు ఆయనకు తెలిసేలా చెయ్యండి. శరీరాన్ని తగిలేట్టు నిద్రపోండి." అంది చెవిలో. నష్టపోయిన మగాడిని రెచ్చగొట్టే విషయం - అతనేం నష్టపోయాడో గుర్తుచేయడం అది నపుంసకుడికి రాజ నర్తకి పరిష్వంగంలాంటిది.

మాల్యాద్రి త్వరగానే కోలుకున్నాడు. మర్నాటి ఉదయమే తలుపు చప్పుడయితే తీసింది. మాల్యాద్రిని చూసి విపరీతంగా సిగ్గుపడిపోయింది. అతని కుడి బుగ్గమీద రేణూ కుంకుమ ఇంకా అలాగే ఉంది. మాల్యాద్రి విసుగుదలతో పొగరుగా లేడు.

"కొండలరావుగారికీ, మీకూ థాంక్స్ చెప్పాలని.. రాత్రి అయామ్ సారీ" అన్నాడు.

***మగాడి మీద స్త్రీ విజయం అతని బలహీనతని గుర్తుపట్టిన విషయం అతనికి తెలియజేయడం.***

"వెళ్ళి వెంటనే అద్దంలో మీ ముఖం చూసుకోండి." అని తలుపు వేసేసింది.. వస్తున్న నవ్వుని ఆపుకుంటూ. అద్దంలో చూసుకున్న మాల్యాద్రి పిపీలకంలాగా అయిపోతాడని తెలుసు.

●●●

రేణూ సీతని కొంగు బంగారం చేసేసుకుంది - పాఠాలు చెప్పే మాస్టారిని ఇంట్లో కట్టేసుకున్నట్టు.

ఆ రోజుల్లోనే రెండో పాఠం చెప్పింది సీత రేణూకి. ***భర్త ఎటువంటి వాడయినా కానీ, ఏ బలహీనతలయినా ఉండనీ.. ఆ లోపం లోనే ఏదో ప్రత్యేకతను చూడగలగడం గొప్ప అదృష్టమయితే, చూపగలగడం గొప్ప చాకచక్యం. మగాడిలో శక్తి ఉద్వేగం స్త్రీ చూపులో ఉంటుంది. చూడటంలో ఉంటుంది. చూసిన దాన్ని చెప్పడంలో ఉంటుంది.***

"మీకెప్పుడయినా చెప్పారో లేదో.. మాటలు సరిగ్గా రాక.. మీరు 'అప్పుడు' అనే మాట దగ్గర పదే పదే ఆగిపోతారే..' మగాడుసిగ్గుపడతాడు.

"అప్పుడు మీ పెదాలు వంపులు తిరగడాన్ని మీరెప్పుడైనా అద్దంలో చూసుకున్నారా?" మగాడు ఆశ్చర్యపోతాడు.

"మీరు అప్పుడు దగ్గర ఎప్పుడు ఆగుతారా అని ఎదురు చూస్తూంటాను నేను."

మగాడు గర్వపడతాడు. ***ఎదుటి వ్యక్తి బలహీనతని స్త్రీ బలమూ చెయ్యగలదు. ఆ ఒక్క కారణంగా నాశనమూ చెయ్యగలదు. ఒక్క వ్యక్తి సంతోషపెట్టలేని కారణాన జీవితాన్ని అవ్యవస్థ చేసుకున్న మగాళ్ళున్నారు. జ్వరి గొడ్డుని పడగ్గదిలో చిరుత పులిని చెయ్యగలిగిన అదృష్టానికి లోకాన్ని ధిక్కరించిన మగాళ్ళూ ఉన్నారు.***

దీపం ఆరాక అనుభవాన్ని ఎంతమంది మాటల్లోకి తర్జుమా చేసుకుంటున్నారు? అవి మాటల కందని సంగతులుగానే చాలామంది సరిపెట్టుకుంటారు. తియ్యటి రసగుల్లా ఒక్కసారే తినగలం. దాని జ్ఞాపకాన్ని ఎన్నాళ్ళయినా, ఎన్నిసార్లు మననం చేసుకున్నా కొత్తగానే ఉంటుంది.

ఆ రోజుతో రేణూ దీపం ఆర్పనివ్వలేదు.

"ఒక్కసారి మీ ముఖం చూడనివ్వండి."

"ఏమిటి కొత్తగా చూసేది."

రేణూ చూపులతో కాస్త కదిలాడు మాల్యాద్రి.

"ఏమండీ ఎప్పుడయినా ఆలోచించారా?"

"ఏమిటి?"

"మీరు ఇలా జుత్తు దువ్వుకుంటే ఎంత బాగుంటుందో!"

తర్వాత మాల్యాద్రి ఎప్పుడూ అలా దువ్వుకోలేదు. ఇలాగే దువ్వుకున్నాడు.

"ఆఫీసు నుండి రాగానే .. ప్లీజ్.. మీ ముఖం నేను కడుగుతానండి.."

"ఎందుకు?"

నోరు మూసింది. చెవిలో చెప్పింది. "అలసిపోయిన వచ్చినప్పుడు మీ పెదాల్ని ముద్దుపెట్టుకోవాలని.." చెపుతూ చెపుతూ అతని చెవికొరికింది.

ఆ రాత్రి త్వరగా చీకటి పడింది. వాళ్ళిద్దరికీ ఇంకా త్వరగా చీకటి పడింది. చాలా ఆలస్యంగా తెల్లారింది.

నిజంగా ఏడున్నరకి మాల్యాద్రి పరాకుగా బాత్ రూం వేపు వచ్చేసరికి... లోపల్నుంచి సీత వస్తోంది. సీతని చూసూనే బుగ్గల మీద లేని కుంకుమ తుడుచుకున్నాడు. సీత నవ్వలేదు. ఉన్నట్టుండి ఆమె ఒళ్ళు వేడెక్కింది.

కొండలరావు నైట్ డ్యూటీ చేసి వచ్చాడు. సాధారణంగా వచ్చేసరికి తెల్లవారు ఝాము మూడవుతుంది. అప్పుడు స్నానం చెయ్యడానికి బద్దకిస్తాడు. అలాంటప్పుడు మంచం మీద కాక దూరంగా పడుకుంటాడు. గదిలో చాపమీద వెల్లకిలా పడుకుని ఉన్నాడు కొండలరావు. చిన్న గుర్రు పెడుతున్నాడు.

గదిలోకి వచ్చి తలుపు వేసింది. ఇంకా కిటికీ కన్నాల్లోకి చీర కుక్కింది. ఉదయం ఏడున్నర గంటలకే వాళ్ళకి అర్ధరాత్రిని ఆహ్వానించింది. రాత్రి నలిగిన సన్నజాజి పువ్వుల వాసన గుండెల మీద గుప్పుమనే సరికి కళ్ళిప్పాడు కొండలరావు. దృష్టి నిలవనంత దగ్గరగా సీత పెదాలున్నాయి. తుళ్ళి పడిలేవబోయాడు. మాట్లాడబోయిన అతని నోటిని తన నోటితో మూసివేసింది సీత.

"ష్!! లేవకండి. ఇప్పుడింకా అర్ధరాత్రే అయింది" అని అతని గుండెల మీద తనని పరుచుకుంది.

***ఆరోగ్యకరమైన ఆనందానికి చలువ గదులు, బాంక్ ఎకౌంట్లూ, బెంజి కారూ, బఫే డిన్నర్లు అసరం లేదు. పూరిపాకలో అలసిన శరీరంలో ఆరంగుళాల గుండె కాయలో చిన్న ప్రకంపన చాలు.***

***ఆ క్షణాన్ని సిద్ధపరుకోవడం తెలియాలే కానీ, ప్రపంచంలోని సొత్తంతా ఆ క్షణంలో ఆ తులాభారంలో వీగిపోతుంది.***

ఆగదిలో.. అప్పుడు మొదలయిన అర్ధరాత్రి  ఆ రోజు అర్ధరాత్రిగానే నిలిచిపోయింది.

## 14

స్త్రీకి మాతృత్వం ఓ కొత్త సామ్రాజ్యానికి పట్టాభిషేకంలాంటిది. సృష్టిలో చాలా పురుగులుంటాయి - ముఖ్యంగా సీతాకోక చిలుక. అది సీతాకోకచిలుకగా మారాక దాదాపు ఆరేడు వారాలే బతుకుతుందట. రంగులు పూసుకుని, రెక్కలు విదిలించుకుని గాలిలోకి ఎగిరే

సీతాకోక చిలుక మైళ్ళ దూరంలో ఉన్న మగ సంపర్కం కోసం అర్రులు చాస్తుందట. ఆ సంపర్కమే ఆఖరి ఘటన. అక్కడితో ఆ జీవితం పరిపూర్ణమవుతుంది.

ఈ పరిణామంలో తాత్వికత ఉంది. శాంతం ఉంది. స్త్రీకి తల్లి దశ పరిపూర్ణత్వం. ఆ తర్వాత? ఇంకేమీ లేదు. ఆ పరిపూర్ణతని పరిపూర్ణంగా ఆవరించుకుని గడపడమే!

రేణూ నెల తప్పింది. ఓ ఉదయం తడి చీర పట్టుకుని బాత్రూంలోంచి వస్తున్న సీతని గుమ్మం దాటి రాకుండా ఆటకాయించింది రేణూ. "మీ చెయ్యి ఇలా ఇవ్వండి.." అంది.

తన కొంగు విప్పి , సీత చాచిన చేతి చిటెకిన వేలుకి సన్నని ఉంగరం తొడిగి ఈ రహస్యాన్ని చెవిలో చెప్పింది రేణూ.

"ఇదెందుకు నాకు?" అంది సీత ఆశ్చర్యపోతూ.

"ఉంచండి. అది నా తృప్తి కోసం, నా కడుపులో బిడ్డ పెరుగుతున్నా అది మీ బిడ్డే!" అని చిటికెన వేలు సుతారంగా కొరికి, "ఇప్పుడు చెప్పండి, ఇలాంటప్పుడు ఆయన్ని రానివ్వచ్చా? నా కిష్టంలేదు" అంది నవ్వుతూ.

సీత ఇబ్బంది పడింది. "చూడండి, కొన్ని విషయాలు అడగనికి బాగుండవు. కొన్ని చెప్పడానికి బాగుండవు. అది మీ ఇష్టం!"

"ఈ విషయం తెలిసినప్పటి నుంచి రెచ్చిపోతున్నారు. నన్ను చంపకండి బాబూ అంటున్నాను!"

***మాతృత్వంలో చిన్న అహంకారం ఉంది. తనని కోరే మగాడిని తాను కోరడం లేదని చెప్పడంలో చిన్న గర్వం ఉంది. ఇది అనుకోవడంలో ఉన్న అహంకారం కాదు. అనడంలో వచ్చే ఆనందం.***

ఏమైనా రేణూలో కొత్త అందం కనిపించింది. ఈ విషయం తెలిశాక మాల్యాద్రి ఒకటి రెండుసార్లు తటస్థ పడ్డాడు సీతకి. అతనిలో రేణూ చెప్పే యావ ఏమీ కనిపించలేదు. అయితే పడకగదికీ, వీధి వసారాకీ చాలా దూరం ఉంది. మాల్యాద్రి మెత్తటి తేలు అనుకుంది సీత - రేణూ మాటల్ని బట్టి.

●●●

ఓ రోజు కుందయ్యగారిని వెంట బెట్టుకుని వచ్చాడు కొండలరావు. సీత ఆశ్చర్యపోయింది. కుందయ్యగారిని కొండలరావుకి తెలసని ఆమెకి తెలియదు. "నేను పట్నం వెళుతున్నానని తెలిసి, మునిస్వామిని అడిగి నీ అడ్రసిచ్చింది మీ అమ్మ" అన్నాడు కుందయ్య.

అయితే ఇచ్చి ఆరేడు నెలలయిందట. ఈలోగా మునిస్వామి చచ్చిపోయాడు. ఆ రోజుల్లో నందిత పెళ్ళికి పట్టు చీరలు కొనడానికి మద్రాసు రావాలనుకున్నాడు కుందయ్య. కానీ పెళ్ళి ఆగిపోయింది. పెళ్ళికొడుకు పిలానీలో ఇంజనీరు. నందిత లావుగా ఉందని చివరి క్షణంలో చేసుకోనన్నాడట. కుందయ్య కుంగిపోయాడు. కసిగా ఆరునెలలు సంబంధాలు వెదికి వెదికి మద్రాసు సంబంధమే ఖాయం చేశాడు. కుర్రాడు ఫుడ్ కార్పోరేషన్‌లో క్లర్కు. నందితని చూసి మరీ మరీ ఆనందించాడు. పెళ్ళి వారు కంచి పట్టుచీరలు ప్రత్యేకంగా కోరి కొనిపించుకున్నారు కుందయ్య చేత. పెళ్ళివారు కుందయ్యకి ఒకే షరతు పెట్టారు. పెళ్ళి కూతురుకి ముక్కు కుట్టించి వజ్రపు ముక్కు పుడుక పెట్టాలని. నందిత చస్తే ముక్కు కుట్టించుకోనంది. కుందయ్యగారు గడ్డం పట్టుకుని బతిమాలి బతిమాలి ముక్కు కుట్టించారు. పెళ్ళికి ముందే ముక్కు పుడుక పంపించాడు కుందయ్య. నిజంగా నందితలో కొత్త కళ వచ్చినట్టనిపించింది సీతకి. ఏమైనా పాత స్నేహితురాలు మద్రాసులో తనలాగే స్థిరపడటం చాలా ఆనందమనిపించింది. వాళ్ళమ్మ ఇచ్చిందని ఓ చీర, రెండు వందలు సీతకి ఇచ్చాడు కుందయ్య. ఇది నందిత ప్రత్యేకంగా సిద్దం చేసిన అబద్దం. ఆ రోజు పరమాన్నం వండి, ఫలహారానికి పొంగల్ చేసింది సీత. రాత్రి గానుగ చెట్టు కింద మంచం వేసింది కుందయ్యగారికి. ఆయన్ని చూస్తుంటే మనసు మరోసారి ప్రాజెక్ట్ టౌన్ షిప్‌కి పోయింది.

అక్కడి కబుర్లన్ని రాత్రి డ్యూటీ నుంచి కొండలరావు వచ్చేదాకా చెప్పాడు కుందయ్య. పంతంగికి రక్తపోటు ఎక్కువయిందట. ఓ రాత్రి ఎవరో భాష తెలియని ఇద్దరొచ్చి, తాగి, పాకనంతా అల్లకల్లోలం చేసి పోయారట. నిజానికి పంతంగి ఒక్కతే వాళ్ళతో పోరాడగలదు. కానీ ఆమెకీ వయస్సు పెరిగింది. ఆ దెబ్బతో మరికోలుకోలేదు. మరో నెలరోజులకి బాలాసోర్‌లో ఉంటున్న ఆమె చెల్లెలు కొడుకు తీసుకెళ్ళిపోయాడు. ఇప్పుడు కల్లుపాక ఉంది కానీ పంతంగి లేదు.

విశాఖపట్నం వీరాస్వామి నాయుడుగారు పోయారు. సన్నీని ఓ బెంగాలీ అమ్మాయి ప్రాజెక్టు బంగళాలోనే చావకొట్టింది. దెబ్బలు తిన్న అతన్ని కారులో వేసుకుని పట్నం వెళ్ళిపోయింది. మరో పదిహేనురోజులకే వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిగిపోయింది.

పగలబడి నవ్వింది సీత. ఆమె కెందుకో ఆ బెంగాలీ అమ్మాయిని చూడాలని అనిపించింది. ***చిరుతిండికి అలవాటు పడిన వాళ్ళకి రెండు రకాల పరాభవాలు జరుగుతాయి. ఒకటి: ఆ చిరుతుండే అసలు ఆకలిని మింగేస్తుంది. రెండు: అసలు ఆకలే ఆ చిరుతిండి అయి కూర్చుంటుంది.*** ఎందుకో సన్నీ బుద్ధిమంతుడైన భర్తగా మారి ఉంటాడనుకుంది సీత. అది ఎంత నిజం కాదో సీతకి తెలియడానికి మరో ఆరేళ్ళు పట్టింది. అది వేరే విషయం.

●●●

రేణూకి దూరపు అక్క వరస బంధువులొచ్చారు. చాలా పద్ధతిగా సీమంతం జరిగేటట్టు చూసుకుంది రేణు. రెండు చేతులు నిండా గాజులు తొడుక్కుని, అయిదు నెలల కడుపులో రేణూలో ప్రత్యేకమైన అందమేదో కనిపించింది సీతకి, పురిటికి బందరు వెళతానని చెప్పింది. అలా చెపుతున్నప్పుడు మాల్యాద్రి మీద కసితీర్చుకుంటున్న చిలిపితనం ఆమె మాటల్లో కనిపించింది.

"ఎన్నాళ్ళకి వస్తారు?" అంది సీత.

"ఆయన వచ్చి రమ్మని ప్రాధేయపడినప్పుడు" నవ్వేసింది రేణు. "బిడ్డ శరీరం నాలుగో నెలవరకు గట్టి పడదంటోంది అక్క. ఆయనకి ఆఫీసు. ఇబ్బంది పడతారు. త్వరగానే వచ్చేస్తానులెండి!" అంది – సీత ఏదో ఆమె రాకకి బెంగపెట్టుకున్నట్టు.

పురిటికి వెళ్ళే ముందు రోజున చాటెడు శెనగలు తెచ్చి సీత ఇంట్లో ఉంచింది. కొబ్బరికాయ, రవికెల గుడ్డ ఇచ్చి దండం పెట్టింది.

"మీరు నాకో సహాయం చెయ్యాలి!" అంది బెరుకుగా.

"ఏమిటి?"

"మీ కింతవరకు చెప్పలేదు. ఆయన రాత్రివేళల్లో తాగి వస్తారు. మరీ ఎక్కువకాదు కానీ తరచుగా.."

తనకా విషయం తెలుసు. రాత్రి ఆక్సిడెంటు నాడే అర్థమైంది.

"ఉదయం పాలవాడు వచ్చే సమయానికి.. ఏమీ అనుకోకపోతే ఒక్కసారి మా వాటా తలుపుతట్టాలి. ఆయనకి కాస్త నిద్ర ఎక్కువ. నా భయమల్లా పొద్దుట ఎలా లేస్తారు అని!" అంది రేణు.

"లేచాకైనా ఆయన పనులు ఆయన చేసుకుంటారుగా?" అంది సీత వెటకారం తెలిసేలాగా.

"ఒక్క వీపు తోముకోవడం తప్ప!" అంటూ పగలబడి నవ్వేసింది రేణు.

"చూడండి, నాకిలా రెండుకుటుంబాలూ కలిసి ఉండడం ఇష్టం లేదు. మీరు తిరిగి వచ్చేసరికి మేం వేరే వాటా చూసుకుని .."

నోరు మూసింది రేణు.

"వద్దు వద్దు! సహాయం చెయ్యమన్నానే కానీ, చెయ్యకతప్పదనడం లేదు. మీరేం చెయ్యొద్దు. పొద్దుటే అన్నయ్యగారిని ఒక్కసారి తలుపు తట్టమనండి. ఆ తర్వాత ఆయన తంటాలు ఆయన పడతారు!" అంది రేణు.

అంతలో కోపం తెచ్చుకున్నందుకు నొచ్చుకుంది సీత.

వెళుతూ ఒక్క క్షణం ఆగి, "ఆయన బిడ్డని మోస్తున్న తల్లిగా చెపుతున్నాను. మావారు శ్రీరామచంద్రుడు!" అనేసి వెళ్ళిపోయింది రేణు.

సీత ఆశ్చర్యపోయింది క్షణకాలం.

●●●

ఉన్నట్టుండి హఠాత్తుగా నిద్రలేచింది సీత. కడుపులో కలవరంగా ఉంది. వాంతి వచ్చేట్టయింది. పక్కన చూసుకుంది. ఇంకా కొండలరావు రాత్రి డ్యూటీ నుంచి రాలేదు. వాంతి తోసుకు వస్తోంది. బాత్ రూమ్ దాకా వెళ్ళడమే కష్టమయ్యేటట్టుంది. అతి ప్రయత్నం మీద లేచి పరుగెత్తింది.

ఆ హడావుడిలో మూసి ఉన్న బాత్రూం తలుపు ఒకటి నుదుటికి బలంగా కొట్టుకుంది. ఇక అడుగు ముందుకు పడలేదు. అక్కడే భోళ్ళుమంది. నుదుటికి తగిలిన దెబ్బ, నీరసం, వాంతి - అన్నీ ఏకమైపోయాయి. సీతని రెండు చేతులు బలంగా పొదివి పట్టుకున్నాయి. సమయానికి భర్త రాగలిగినందుకు ఆమె ముఖంలో చిన్న ఆనందం కలిగింది. తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. ఆత్మీయుల్ని చూడగానే జరిగే విధంగానే ధైర్యం సడలింది. మరొక్కసారి అతని బట్టలమీద వాంతి అయింది. అతని గుండెల మీద తల ఆనించి భోరుమంది. అంతే ఆమెకు గుర్తు. అదాటుగా తనని ఆసరా చేసుకున్న ఆమెని సరిగ్గా ఆదుకోలేకపోయాడు. నేలమీదకి జారిపోయింది. అతని చొక్కా చిరిగింది.

మరో గంటకి తెలివొచ్చి చూసేసరికి సీత రేణూ ఇంట్లో మంచం మీద ఉంది. చుట్టూ చూసి ఒక్కసారి షాక్ అయింది. నుదుటి మీద ఉడుకులాం పట్టి ఉంది. తన ముఖం, మూతీ చాలా పల్చటి సువాసనతో ఎవరో తుడిచారు. అయితే తనని ఆదుకున్నది భర్త కాదన్నమాట. సిగ్గుతో, బాధతో వణికిపోయింది. అతని కళ్ళల్లోకి చూడటం, అతని మీద వాంతి చేసుకోవడం, అతని చొక్కా చిరగడం.. అన్నీ గుర్తొచ్చాయి. ఇంకా కుచించుకుపోయింది. ఒంట్లో బలహీనంగా ఉన్నా లేవబోయింది. కళ్ళనుంచి గుండెలదాకా ఊలు రగ్గు కప్పి ఉంది. పక్కనే ఆఫ్టర్ షేవ్ లోషన్, పత్తి అన్నీ ఉన్నాయి.

ప్రాణం పోయినా అక్కడ ఉండకూడదు. ఒక్కసారి రగ్గు విదిలించుకుంది. ఇప్పుడు తలుపు తెరుచుకుని కొండలరావు వచ్చాడు. అతని వెనకనే మాల్యాద్రి. కొండలరావుని చూడగానే ఎక్కడలేని దుఃఖం తోసుకు వచ్చింది. తెరలు తెరలుగా పొంగిన దుఃఖాన్ని భోరున వెళ్ళగక్కేసింది.

సీతని పొదివి పట్టుకున్నాడు కొండలరావు.

"మిల్లులో మిమ్మల్ని వెదికే సరికి తల ప్రాణం తోకకి వచ్చింది. రాత్రికి రాత్రి డాక్టరు దొరకడం అసాధ్యం. బిలాల్ పక్కన ఒక మందుల షాపు తెరిచి ఉంది. టెంపరరీగా ఈ మాత్రలు వెయ్యమన్నాడు. రేపు డాక్టర్ని పిలవండి!" అంటున్నాడు మాల్యాద్రి.

సీత భర్త ఆసరాతో కదులుతూ మాల్యాద్రి ముందు ఆగింది. ముఖం ఎత్తడానికి సిగ్గు అడ్డు వచ్చింది.

"మీకు చాలా.." మాట పూర్తికాకుండానే మాల్యాద్రి అంటున్నాడు -

"అవును, చాలా శ్రమ ఇచ్చారు. నేను లోపలకి వస్తుండగానే మిమ్మల్ని చూసి కంగారు పడిపోయాను. మీ ఆయన కోసం మీ పోర్షన్‌లోకి పరుగెత్తి వచ్చే సరికి వేళమించిపోయింది. మీరు వాంతి చేసుకున్నారు. నా చొక్కా పాడైంది. బాత్ రూం అంతా.. ఓకే! కృతజ్ఞతలు తర్వాత చెబుదురుగాని. పదండి!"

కౌముది
www.koumudi.net

ఆ నీరసంతో ఎక్కువ శ్రమ పడనక్కరలేకపోయింది సీతకు. పైగా పక్కన కొండలరావు ఉన్నాడనే ధైర్యం. సీత పిరికిదేం కాదు కానీ, అనౌచిత్యం ఆమెని బాధపెట్టినంతగా అసమర్ధత బాధ పెట్టదు. నీరసంలో స్పృహ కోల్పోయే ముందు అతని కళ్ళు గుర్తున్నాయి. కొండంత ధైర్యం చెప్పే మగాడి ఓదార్పు ఆ కళ్ళల్లో కనిపించింది.

చేతనైతే, సాధ్యమైతే తన ముఖాన్ని, పెదవుల్ని పట్టుకు వేలాడుతున్న పరిమళాన్ని కోసేసుకోవాలని ఉంది.

"ఇంకెప్పుడూ రాత్రి డ్యూటీలకి వెళ్ళకండి!" అంది విసుగ్గా. ఆ పని అతని చేతిలో లేదని సీతకి తెలుస్తూనే ఉంది.

అయినా, ఉన్నట్టుండి ఈ వాంతులేమిటి? ముందురోజు ఏం తిన్నది? ఇంతగా ఆరోగ్యంలో మార్పు రావడానికి కారణం? అ

సమాధానానికి పెద్ద శ్రమపడాల్సిన అవసరం లేకపోయింది. మర్నాడు లేడీ డాక్టరు ఆ విషయం చెప్పేసింది. - సీత త్వరలో తల్లికాబోతోందని!

## 15

**నందిత భర్త సినిమా యాక్టర్ లాగా ఉంటాడు.** ఆనందానికి ఆవలిగట్టులాగా ఉంటాడు. ప్రపంచాన్ని జయించినట్టుంటాడు. అన్ని సమస్యలకీ పరిష్కారం తెలిసినవాడిలాగా ఉంటాడు. అన్నిటికి మించి ఆనందంగా కనిపిస్తాడు.

ఈ లక్షణాలన్నీ లక్ష్మీపతిలో ఉన్నాయి. ఎప్పుడూ జీన్సే వాడతాడు. రేబాన్ కళ్ళజోడు పెడతాడు. జ్ఫ్రానీ పత్తీ బీడా వేస్తాడు. దిలీప్ కుమార్‌లాగా వంకర చిరునవ్వు నవ్వుతాడు. నుదుటిమీద జుత్తు పడేటట్టు చూస్తాడు. ఎప్పటికప్పుడు పడకపోయినా ఆ జుత్తును ఎగరేస్తూంటాడు.. బులెట్ మోటారు సైకిలు నడుపుతాడు.

ఇంతకీ ఇతనెవరు? ఫుడ్ కార్పొరేషన్‌లో గుమాస్తా. ఇంత డబ్బు ఇంత షోకు ఎలా వచ్చింది? పెద్ద ఆస్తిపాస్తులున్న కుటుంబం కాదు. మరి కుందయ్య ఎక్కువ కట్నం ఇవ్వలేదు. అయినా నందితని ఎందుకు చేసుకున్నాడు? కారణం నందిత సీతకి చెప్పింది. ఆయనకి నందిత చిరునవ్వు నచ్చింది. నందిత బాబ్డ్ హెయిర్ నచ్చింది. మచ్‌ఖండ్‌లో ఉన్నా మద్రాసు కల్చర్ ఆమె ముఖంలో కనిపించింది. వెరసి - బులెట్ వెనక సీటు మీద నందిత కూర్చుంటే 'బులెట్' కోసమే పుట్టినట్టు కనిపించడం నచ్చింది.

కాపరానికి వచ్చిన రెండో వారంలోనే భర్తని తీసుకుని ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది నందిత. ఆ రావడం రావడం పెద్ద నాటకం జరిపేశాడు పతి - ఉద్దేశించికాదు, అనుకోకుండా.

నందిత, పతి ఇంటికి వచ్చినప్పుడు మాల్యాద్రి ఇంట్లోంచి బయటికి వస్తున్నాడు.

"హల్లో మిస్టర్ సీతాపతీ! నా పేరు పతి. ఈమె నా భార్య. మీ భార్య స్నేహితురాలు." మాల్యాద్రి నిర్ఘాంతపోయాడు. ఈ కొత్తమనిషి ఎవరో తెలియలేదు. నందితని కానీ, లక్ష్మీపతిని కానీ ఎప్పుడూ చూడలేదు. తెల్లబోతున్న అతన్ని చూసి చిరునవ్వు నవ్వాడు పతి.

"మీరెందుకు తెల్లబోతున్నారో తెలుసు. నేను మీకు తెలియదు కానీ, మీరు నాకు పరోక్షంగా తెలుసు. మీ ఉద్యోగం తెలుసు. మీ అలవాట్లు తెలుసు.." విచిత్రం ఏమిటంటే, నందిత కూడా కొండలరావుని చూడలేదు.

"నందితా! మీ ఫ్రెండు చాలా లక్కీ. సీతాపతి గారు ఇంత ఆధునికంగా ఉంటారు అనుకోలేదు. ఈయనకి జీన్స్ అలవాటు చేసి, చిన్న విస్కీ బాటిలు బహుమతిగా ఇస్తే నా సర్కిల్‌కి వచ్చేస్తారు."

అప్పటికి మాల్యాద్రికి కాస్త అర్ధమైంది - ఈ వచ్చిన దంపతులు సీత కోసం వచ్చారని.

సీత అప్పుడే బాత్ రూం లోంచి ముఖం కడుక్కుని వస్తోంది.

"సీతాజీ! మీ పేరు సీతని నా కెవరూ చెప్పనక్కరలేదు. నేను ఆర్టిస్టుని కాదు కానీ, నన్నర్థం చేసుకునే ఆర్టిస్టు పక్కనుంటే మీ బొమ్మని అచ్చుగుద్దినట్టు వేయించేయగలను. "

నందిత నవ్వుతోంది. సీత కంగారు పడుతోంది. జరుగుతున్న గందరగోళం అర్థమైన మాల్యాద్రి ముఖంలో కూడా చిన్న చిరునవ్వు మొలిచింది.

మెడలో వేలాడుతున్న పోలరాయిడ్ తీశాడు. "ఫోటోలు తీస్తాను కానీ, ఫోటో కోసం రెడీగా లేని దంపతుల ఫోటోలు తియ్యడంలో, వాటిని చూసుకుని ఆ సందర్భాన్ని గుర్తుచేసుకోవడంలో థ్రిల్ ఉంది."

ఇప్పటికి సీతకి అర్థమైంది జరుగుతున్న భాగోతం, "చూడండి, మీరు.." అని పతికి ఏదో చెప్పబోయింది.

"మిసెస్ సీతా! మనం రాబోయే పది సంవత్సరాల్లో వెయ్యి సార్లు కలుస్తాం. కానీ మొదటిసారి కలిసిన సందర్భం మళ్ళీ రాదు" అంటూ జేబులోని బాల్ పాయింట్ పెన్ తీసి నుదుటిమీద నీలి రంగు చుక్క దిద్దాడు. సీత కంగారు పడిపోయింది. నందిత భర్త హడావుడి చూసి ఆనందిస్తోంది.

సీతని మాల్యాద్రి పక్కకి లాగాడు పతి. "నవ్వండి సార్! ఈ పెయింటింగ్ దేవుడు చాలా అద్భుతంగా చేశాడు. మీ ఆవిడ మీద చెయ్యి వెయ్యండి, సార్! రొమాంటిక్ గా ఉంటుంది."

"ఛీ! ఛీ ఏమీటిదంతా?" అని దూరంగా జరగబోయింది సీత. పతి ఆమె దారికి అడ్డం నిలిచాడు. సీత అనుకోకుండా మాల్యాద్రి వైపు జరిగింది. నందిత మాల్యాద్రి చేతిని సీత భుజం మీద వేసింది. ఆక్షణంలో పోలరాయిడ్ కన్ను జిగ్గుమంది. "అమ్మయ్య! నా కిప్పుడు మనశ్శాంతిగా ఉంది!" అని గుమ్మంలో చతికిలపడ్డాడు పతి – కెమెరాలోంచి బయటికి వస్తున్న ఫోటోని చూసుకుంటూ.

సీత ఇంట్లోకి పారిపోయింది. నందిత సీత వెనక లోపలికి వెళ్ళింది నవ్వుతూ.

"ఇంక చెప్పండి సార్, మీ కథ! మద్రాసులో ఉండే మీరు నాలాగే మచ్ఖండ్ అమ్మాయి వలలో ఎలా పడ్డారో?"

మాల్యాద్రి, పతి పక్కనే కూర్చున్నాడు. "మీరు బాగా మాట్లాడుతారు. ఫోటోలు బాగా తీస్తారు. కానీ ఏ భార్యకి ఎవరు భర్తో సరిగ్గా తెలుసుకోలేరు. కారణం – తెలుసుకోవడానికి మీరెక్కువ శ్రమ పడరు. ఒక్క మాటలో చెప్పాలంటే యు ఆర్ స్టుపిడ్!"

పతి ముఖంలో నవ్వు ఉన్నట్టుండి మాయమైంది. అతని చేతిలో ఫోటోలో స్ఫుటంగా బొమ్మలు తేలాయి. నిర్ఘాంతపోతున్న సీత చెయ్యి, ఆ చేతిని కదిపే నందిత చెయ్యి, పిచ్చి నవ్వు నవ్వుతున్న మాల్యాద్రి ముఖం..

"సీత నా భార్య కాదు. నేను పెళ్ళాం కోసం మచ్ఖండ్ దాకా పోలేదు. మచిలీపట్నం దాకా వెళ్ళాను. అంతే!"

లక్ష్మీపతి తేరుకునేలోగా మాల్యాద్రి మాయమయ్యాడు. విషయం అర్థం కాగానే ఇల్లు ఎగిరిపోయేలాగా పిడుగు పడ్డట్టు పతి ఇవ్వడం ప్రారంభించాడు. అప్పటికి సీత చీర మార్చుకుంది. నందిత, సీత వరండాలోకి వచ్చారు.

"భలేవారండీ మీరు! మీ గడబిడతో నేనూ కంగారు పడిపోయాను. ఆయన ముఖం నాకూ గుర్తులేదు. పాపం సీతని ఇబ్బంది పెట్టేశాం. ఆయనెవరో తెలుసా?"

పతి ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

మరో కారణానికి నవ్వు ఉన్నట్టుండి ఆగిపోయింది. అప్పుడే ఇంటిముందు కొండలరావు మిల్లు యూనిఫారంతో సైకిలు దిగాడు. మరకలు పడిన అతని బట్టలు అలసిపోయిన ముఖం, రెండు నెలలుగా క్షవరం లేని జుత్తు. సీత అతన్ని కలిశాక మొదటిసారిగా అసహ్యంగా కనిపించాడు.

నందిత, పతి ఇద్దరూ తెల్లబోయారు, నవ్వడం సీత వంతయింది. "ఇప్పుడు కావాలంటే మా ఇద్దరికీ ఫోటో తియ్యండి!" అంటు కొండలరావు టిఫిన్ కారియర్ అందుకుంది. కొండలరావు లక్ష్మీపతిని చూస్తూనే సైకిలుని స్టాండు వేసి నిలబెట్టాడు.

"మీరు కుందయ్యగారి అమ్మాయి, అవునా?" అన్నాడు నందితని చుస్తూ, నందిత లేని నవ్వు తెచ్చిపెట్టుకుని తలూపింది. పతిని చూపిస్తూ "మావారు" అంది పతిలో ఇంతవరకు కనిపించిన హాస్యమల్లా మాయమైంది. "హలో!" అన్నాడు పతి.

"ఇప్పుడే వస్తాను" అంటూ బాత్ రూంలోకి మాయమయ్యాడు కొండలరావు. అతని వెనక తువ్వాలుతో నడిచింది సీత.

"కమాన్! నటించడం నేను మీకు నేర్పాలా? ఎవరి భర్తలు ఎలా ఉండాలో నిర్ణయించేది మీరా, దేవుడా? కాస్త నవ్వండి బాబూ!" అంది నందిత భర్త చెవిలో.

సీత వచ్చేసరికి పతి తేరుకున్నాడు. "సీతగారూ! మీ గురించి నాకు నందిత అంతా చెప్పింది. కానీ మీ వారి గురించి మీరు నందితకి చెప్పలేదు. కనుక ఆవిడ నాకు చెప్పలేదు!" అని చేతిలో ఫోటోని చూస్తూ "ఈ ఫోటో బ్రహ్మదేవుడికి పంపెట్టు! వెంటనే మీ వారికి చూపించండి. కాపరాలు చెడిపోవు!" అని ఆమె చేతికిచ్చాడు. చేతికి అందీ అందగానే నలిపేసి గిరాటువేసింది సీత.

ఆ తర్వాత కొండలరావు గళ్ళలుంగీ కట్టుకుని వచ్చాడు నవ్వుతూ. కానీ ఆ తర్వాత చచ్చుపడిన సాయంకాలానికి ఎవరూ ప్రాణం పోయలేకపోయారు.

నందిత తాము ఉంటున్న ఫ్లాట్ నంబరు ఇచ్చింది. "ఫోన్ చెయ్యవోయ్! మా వారికి ఫ్రెండ్స్ ఉన్నారు. కారులో వచ్చి పికప్ చేస్తాం. నువ్వూ, మీ ఆయనా రావాలంటే - అన్నానగర్ సౌత్ ఎక్స్ టెన్షన్‌కి వచ్చి. కొఠారీ అపార్ట్ మెంట్స్ అంటే ఎవరైనా చెపుతారు" అంది.

ఏమైనా, ఆ సాయంకాలం మొదటిసారిగా కొండలరావు భార్య అయినందుకు సీత కుంచించుకుపోయింది. సీతకి అంత నాగరికమైన స్నేహితులు ఉన్నందుకు కొండలరావు మొదటిసారిగా గర్వపడిపోయాడు.

●●●

నీళ్ళు పోసుకున్నాక కొందరిలో మార్పు కనిపించదు. నెలలు నిండకపోయినా కొందరు నీళ్ళు నిండిన పూర్ణకుంభంలాగా కనిపిస్తారు. కానీ ***మాతృత్వం స్త్రీత్వానికి పట్టాభిషేకం. ఆ దశలో ఆ ముఖాల్లో కనిపించే సంపూర్ణత్వం అపూర్వం. భగవంతుడు తన కర్తవ్యానికి ఎన్నుకున్న ఈ లోకపు అద్భుతమైన ప్రతినిధి స్త్రీ. ఆయన సాధించాలనుకున్నది సాధించడానికి స్త్రీ ఒక కారకం.***

సీత నెలలు నిండుతున్నకొద్దీ నీళ్ళు నిండిన కుండలాగా బరువెక్కింది. నందిత వచ్చి వెళ్ళినప్పటినుంచీ ఆ ఇంటి మీదా, రేణూ, మాల్యాద్రితో కలసి ఉండే ఏర్పాటు మీదా ఓ విధమైన వెగటు ప్రారంభమైంది.

ఏ రోజూ మాల్యాద్రి కంటపడకుండా జాగ్రత్త పడింది. నిజానికి ఆ అవసరం, ప్రయత్నం చెయ్యవలసిరాలేదు. కారణం - పదిహేను రోజులపాటు మాల్యాద్రి కాంపుకి వెళ్ళాడు.

మధ్య మధ్య కొండలరావు చెయ్యి కాల్చుకుంటుంటున్నాడు. వీలైనంతగా సీతకి విశ్రాంతి ఇవ్వాలని అతని తాపత్రయం. ఓసారి అడిగాడు. "పురిటికి మచ్‌ఖండ్ వెళతావా?"

మచ్‌ఖండ్‌లో తను గేదెలు కాసిన అడవులూ, సరదాగా రోజంతా చెట్ల మధ్య పరుగులూ, డుడుమా పరిసరాలూ, డ్యూటీ నుంచి వచ్చినప్పుడల్లా తన కోసం ప్రత్యేకంగా తాటి ముంజెలు కేరేజీలో నింపుకుని తెచ్చిన తండ్రీ, నిషిత్ నాయక్ గారింట్లో ఒరియా చేప వేపుడు కూరా.. అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఒక్కసారి ఆ పరిసరాలన్నీ తిరగాలని మనస్సు ఉవ్విళ్ళూరింది. కానీ ఉన్నట్టుండి కొండ మీద గెస్ట్ హౌస్ జ్ఞాపకం వచ్చింది. ఆ గెస్ట్ హౌస్ వల్ల కాకపోతే తను ఇంతదూరం వచ్చేది కాదేమో!

స్టౌ ముందు కూర చేస్తూన్న కొండలరావుని చూసింది. ఈ పెళ్ళి వల్ల తనేమైనా నష్టపోయిందా? కొండలరావు దీపం వెలుగులో పదేళ్ళ చిన్నవాడిలాగా కనిపిస్తున్నాడు. తన కష్టాన్ని తెలిసి, తన మనస్సు ఎరిగి, ఏనాడైనా తనని దగ్గరకు తీసుకున్నాడే కాని.

''ఏమండీ!'' పిలిచింది.

కొండలరావు చూశాడు. దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసింది. నుదుటి మీద మసి కొంగుతో తుడిచింది. కిరసనాయిలు వాసన కొడుతున్నాడు. తన పెదాలతో అతని పెదాల కిరసనాయిలు వాసన తుడించింది.

''కడుపులో పాప కదులుతోంది. చూశారా?'' అంది.

అది నిజంకాదు.

అతని తలని తన కడుపు మీద ఆనించుకుంది. ప్రపంచంలో ఎక్కడా లేని ప్రశాంతత, నమ్మకం మనస్సు నిండాయి.

గుమ్మం దగ్గర ఎవరో నిలబడినట్లయింది. చూస్తే - మాల్యాద్రి. ఆ రోజు తర్వాత అదే చూడడం, చటుక్కున కొండలరావు లేచాడు. సిగ్గుతో చచ్చిపోయింది సీత.

''తాళాలు..?''

ఆ సాయంకాలం నగిషీలు చెక్కిన ముక్కాలి పీట లోనికి తీసుకొచ్చాడు కొండలరావు. మాల్యాద్రి ఇచ్చాడట. కాంప్‌లో స్వయంగా కూర్చుని తయారుచేశాడట. చాలా అందంగా, చాలా గొప్పగా ఉంది ముక్కాలిపీట. మాల్యాద్రి పనితనమంతా ఆ పీటలో కనిపించింది.

ఆ పీటకి అంత పనితనం అక్కరలేదు. కానీ మాల్యాద్రి ఎంత మనసు పెట్టాడో దాన్ని చూస్తే అర్థమవుతుంది. దాని మీద కూర్చుంటే - తల్లిలాగా - శరీరాన్ని తనలో ఇముడ్చుకునే పల్లం ఉంచాడు.

సీత స్నానం చేసినప్పుడల్లా ఇబ్బంది పడుతోంది. బరువెక్కిన శరీరంతో కూర్చుని స్నానం చెయ్యడంలో శ్రమ బాగా తెలుస్తోంది. కానీ ఆ సమస్యకి పరిష్కారం తెలియలేదు. పొడుగ్గా ఉన్న భర్త పొట్టి భార్యని ముద్దుపెట్టుకోవడం వాళ్ళిద్దరికే తెలిసిన ఒడుపు. ముక్కుమీద కోపం ఉందంటే భర్త కోపాన్ని ఎంత సుళువుగా తీర్చాలో భార్యకి తెలియడం ఆ దాంపత్యంలో రహస్యం. బరువెక్కిన సీత శరీరానికి చక్కని సౌకర్యం, ఒడుపు ఎరిగి కొండలరావు చెయ్యాల్సిన, చేస్తే చెల్లే ప్రక్రియ. కానీ ఆ పని మాల్యాద్రి చేశాడు. ఆ ఆలోచన సీత మనస్సులో వచ్చినప్పుడు కోపంతో ఆ మనస్సు కుతకుతలాడింది. తన శరీరం బరువు. తన శరీరంలో అలసటా, తనకి అక్కరకు వచ్చే సౌకర్యం - ఒక్కరికే తెలియాలి. ఆ ఒక్కరూ మాల్యాద్రి కాదు. ఈ ముక్కాలి పీట తనకు ఉపకారం కాదు. తన భర్త అసమర్థతకి ఎత్తిపొడుపు. వెక్కిరింత.

ఆ ఉదయం బాత్ రూములో కూర్చుని శ్రమపడి ఆ ముక్కాలి పీటని విరగ్గొట్టింది. అంతేకాదు. ముక్కాలి పీట విరిగిపోయిందని మాల్యాద్రికి తెలిసేటట్టు బాత్ రూములోనే అతనికి కనిపించే చోట పడేసింది.

రెండు రోజులైనా ముక్కాలి పీట అక్కడే ఉంది. మాల్యాద్రిలో అనుకంపన తనకి తెలియలేదు. అసలు మాల్యాద్రి ఛాయలే ఇంట్లో కనిపించలేదు. ఇల్లు వదిలి కాంప్‌కి వెళితే తాళాలు ఇంట్లో ఇచ్చిపోతాడు. ఇవ్వలేదంటే మాల్యాద్రి ఊళ్ళోనే ఉండి ఉండాలి.

అతని జాడ తెలియకపోవడం, ముక్కాలి పీట అక్కడే పడి ఉండడం సీతని మరింత బాధపెట్టింది.

తన కోపానికి పర్యవసానం ఎప్పుడు? ఆ కోపం ఎదుటి వ్యక్తి మీద ప్రతిఫలించినప్పుడు. ***నీ అధికారానికి పర్యవసానం ఎదుటి వ్యక్తి ఒదుగుబాటు. నీ పగకి పర్యవసానం ఎదుటి వ్యక్తి బాధ. నీ కసికి పర్యవసానం ఎదుటి వ్యక్తికి నువ్వు కలిగించిన హింస.***

ముక్కాలి పేట విరగొట్టినప్పుడు - అలా విరగ్గొట్టడం మాల్యాద్రికి తెలియాలనీ, తెలిసి అతను బాధపడాలనీ ఆమె మనస్సులో ఆలోచన. ఆ సూచనలు కనిపించనప్పుడు ఆమెలో ఓ విధమైన ఉదాసీనత రేగింది.

ఉన్నట్టుండి ఆమెకి దుఃఖం పెల్లుబికింది.

ఆ రాత్రి డ్యూటీ నుంచి వచ్చినప్పుడు కొండలరావుని ఓ కోరిక కోరింది "భార్య నిండు చూలాలిగా ఉన్నప్పుడు కోరే కోరికను భర్త కాదనకూడదు!" అని హెచ్చరించింది.

కొండలరావు భయపడ్డాడు. అయినా సీత తన స్థాయిని, అంతస్తునీ తెలుసుకోకుండా ఆకాశానికి ఎగిరే మనిషి కాదు.

"అలాగే తీరుస్తాను, ఏమిటది చెప్పు?" అన్నాడు.

"మనం వెంటనే ఈ ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికైనా పోదాం!" అంది ఆవేశంగా.

## 16

పురిటికి మచ్‌ఖండ్‌కి వెళ్ళనంది సీత. కారణం అక్కడ సౌకర్యాల మాట ఎలా ఉన్నా, కొండలరావు కంటే కావలసిన వాళ్ళెవరూ లేరు. చిన్నమ్మకి ఉండుండి ఫిట్స్ వస్తున్నాయి. ఈ సమయంలో సైరంధ్రే ఆమెకి తోడయింది. సవతిని తీసుకుని సైరంధ్రి రథాకోల్ చేరింది. అదంతా అడివి. మచ్‌ఖండ్‌కి ఉన్నపాటి సౌకర్యాలూ లేవు. సీతకి ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేకపోయింది. కాక, మద్రాసు కంటే సౌకర్యాలు ఎక్కడ కుదురుతాయి? ఆ నిర్ణయం ఎంత మంచిదయిందో ఆ నిర్ణయం కారణంగానే తనూ, బిడ్డ బతికి బట్టకట్టిన విషయం పురిటి రోజు కానీ తెలిసి రాలేదు.

రేణూకి కూతురు పుట్టింది. మాల్యాద్రి ఆ రోజంతా విసుక్కుని కన్న పెళ్ళాం మీద, ఇచ్చిన దేవుడి మీదా విరుచుకుపడి మొదటిసారిగా ఇంట్లో మందు తాగి, రాత్రి బాత్ రూంలో జారిపడి చెయ్యి విరుచుకున్నాడు. అక్కడికి ఆ వీరంగం పూర్తయింది. అంతేకాదు. ***కొందరికి జాతకాల మీదా, దైవికమయిన పరిణామం మీదా నమ్మకం ఉండకపోవచ్చు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఓ సంఘటనకి తర్వాతి జీవితమంతా పర్యవసానంగా కనిపిస్తుంది.*** మాల్యాద్రికి ఆడపిల్ల ఇష్టంలేదు. కాని ఆడపిల్లే పుట్టింది. ఆ అమ్మాయిని వెంకట నరుసు అని పిలుద్దామనుకున్నాడు. కానీ రేణూ మొదటిసారిగా గొడవపెట్టి దీప అనిపేరు పెట్టింది. ఆ అమ్మాయి పుట్టిందని తెలిసిన రోజునే చెయ్యి విరిగింది. ఉద్యోగానికి రాజీనామా చేసి తన మిత్రుడు ప్రారంభించిన ఏదో ఎలక్ట్రానిక్ వ్యాపారంలో పార్టనర్‌గా చేరాడు. ఆరేడు నెలలు ఆదాయం లేని కారణంగా స్కూటరు అమ్మేశాడు. ఆ రోజుల్లోనే రాత్రివేళ మందు డోసుని నాలుగు నుంచి ఆరు పెగ్గులకి పెంచాడు. గెడ్డాన్ని మూడేసి రోజులకి ఓసారి చెయ్యడం ప్రారంభించాడు. ఇవన్నీ అతని జీవితం క్రమేపీ దిగజారుతోందనడానికి నిదర్శనాలు కావు. నిజానికి ఓ గొప్ప జీవితానికివి పురిటి నొప్పులు. కాని అప్పటికి అతనికి ఆ గొప్ప జీవితం ఏమిటో తెలీదు. పురిటినొప్పులే తెలుసు. అవి దుర్భరంగా ఉండడం తెలుసు.

ఇప్పుడిప్పుడు మాల్యాద్రి తరచు కొండలరావు మీదా, సీత మీదా ఆధారపడడం ప్రారంభించాడు. చాలాసార్లు రాత్రివేళ మజ్జిగ కోసం, పొద్దున్నే నిమ్మకాయ కోసం గుమ్మం దగ్గర నిలబడ్డాడు. ఆ సందర్భాలలో అతని మీద సీతకి జాలి కలగలేదు. కష్టానికి లొంగిపోయే మనుషుల మీద సీతకి సానుభూతి లేదు. కష్టాలకి అడ్డంపడి నష్టపోయాకయినా ఎదిరించే స్వభావం ఆమెది. అయితే ఇదివరకటి పొగరు, హుందాతనం మాల్యాద్రిలో తగ్గింది. చాలా గంటలు ఇంట్లోనే గడపడం హాంగోవర్ వల్లా, నిరుద్యోగంవల్లా జరుగుతోంది.

సీతకి పురుడు రెండో జన్మ. నెలలు నిండేనాటికి ఒంట్లో నీరు పట్టింది. కళ్ళువాచాయి. ఇద్దరి మనుషుల బరువెక్కింది. తీరా నొప్పులు వచ్చే టైంకి కొండలరావు సెలవు పెట్టాడు. కాని అతను సెలవు పెట్టిన టైంలో నొప్పులు రాలేదు. మధ్యాహ్నం కూడా తాగి

మాల్యాద్రి ఇంట్లో పడుకున్న టైంలో నొప్పులు ఎక్కువయాయి. ఉన్నట్టుండి సీత గావుకేకకి అంత మత్తులోనూ తుళ్ళిపడి లేచాడు. చెప్పడం తప్పు. అంత మత్తులోనూ తుళ్ళి లేచేంత గావుకేక పెట్టింది సీత. నేలమీద ఉన్న పరువు మీద విలవిలలాడుతున్న సీతని చూసి మాల్యాద్రి కంగారుపడ్డాడు. ఏం చెయ్యాలో తెలీలేదు.

అంత బాధలోనూ "అలా చూస్తారేం, ఫూల్. రిక్షా పిలవండి" అంది సీత పెదాలతో బాధని బిగపడుతూ. అది బాధ ఆమెకిచ్చిన చొరవ. సంస్కారం సెలవు తీసుకున్న క్షణం కాదు.

'ఫూల్' అన్న పిలుపు అతని మత్తుని విడగొట్టింది. స్వతహాగా మాల్యాద్రి అసమర్థుడేం కాదు. దక్షతగల మగాడు దక్షత చూపగల కారణంగా గర్వపడే మగాడు. ఆ క్షణంలో మాల్యాద్రి అది అయాడు.

తూకంగా మాల్యాద్రి సీతని ఒడిసి పట్టుకుని లేపాడు. ఆమె చేతిని తన భుజం చుట్టూ వేసుకున్నాడు. ఆమె కూడా ఆశ్చర్యపోయేటంత ఒడుపుగా ఆమెని నడిపించుకుని రోడ్డుమీదకి వచ్చాడు. మరో పదినిముషాల్లో ఇద్దరూ రిక్షాలో ఉన్నారు. ఉబ్బిన ఆ శరీరం ఇరుకయిన రిక్షాలో సగం మాల్యాద్రి ఒడిలోనే ఉంది. అయితే ఆ క్షణంలో సీత కష్టపడే తల్లి. మాల్యాద్రి ఆదుకునే బిడ్డ.

కల్యాణి ఆసుపత్రిలో చేరడం సీతకి తెలీదు. తర్వాత ఆరురోజులకు కాని ఆమె కళ్ళు విప్పలేదు. ఈలోగా ఆమెకి నాలుగు సీసాల రక్తం ఎక్కించడం, జ్వరం 106 దాకా పోవడం, ఆమె ఒంటిమీదా, నుదుటి మీదా ఐసుపెట్టడం, ఆమె మగపిల్లాడిని ప్రసవించడం, కనీసం రెండుసార్లయినా డాక్టర్లు పెద్ద ప్రాణం మీద ఆశ వదులుకోవడం, ఒకేసారి కొండలరావు పసిపిల్లవాడిలాగా భోరుమనడం, ఆరురోజులూ డ్రింకు మానేసి మాల్యాద్రి ఆసుపత్రిలోనే ఉండడం - ఇవేవీ తెలీవు.

కొడుక్కి సీత అందం రాలేదు. కాని కొండలరావు తెలుపు వచ్చింది. సీత కళ్ళు వచ్చాయి. కొండలరావు నాజూకుతనం తెలిసింది. వెరసి కొడుకు అందంగా ఉన్నాడు. తల్లిని చంపి బతికించిన కొడుకుని ఎందుకనో ఆప్యాయంగా దగ్గరికి తీసుకోలేదు కొండలరావు. కొడుకు పుట్టినందుకు ఆనందంగానే ఉన్నా సీత పట్ల చూపిన ప్రేమని కొడుకు మీద చూపలేకపోయాడు.

సీత మామూలు మనిషి కావడానికి చాలా రోజులు పట్టింది. అన్ని రోజులూ ఆసుపత్రిలో వైద్యసౌకర్యాలు పొందడం కొండలరావు తాహతుకు మించిన పని. అందుకని సీత ఏ కాస్తో కోలుకోగానే ఆమెనీ, బిడ్డనీ ఇంటికి తీసుకొచ్చేశాడు.

తల్లి శరీరంలో రక్తం తగినంత లేని కారణంగా బిడ్డ ఆరోగ్యంగా మారడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అయితే సీత శరీరంలో బలం కంటే, మరొకరి మీద ఆధారపడకూడదన్న పట్టుదల బలం ఎక్కువ. అది శరీరాన్ని ఏదో విధంగా, కాని విచిత్రంగా తగినంత ప్రయోజనకరంగా లేపి కూర్చోపెట్టింది. నెల తిరగకుండా కొండలరావు అభ్యంతరం తెలుపుతున్నా సీత తన పని, తన భర్త పనీ చేసుకునే స్థితికి వచ్చింది.

ఆ రోజుల్లోనే ఓ రాత్రి 24 గంటల్లోనే కనీసం 23 గంటలు మూలుగులాగా ఏడుస్తూ గడిపే కొడుకుని గుర్తుపెట్టుకోడానికి ఏదో ఒక పేరు అవసరమని తల్లితండ్రులిద్దరూ అనుకున్నారు. బారసాల, నామకరణ మహోత్సవం ఏమీ లేదు. ఆ బిడ్డ ఎన్నాళ్ళు బతుకుతాడో, అసలు బతుకుతాడో లేదో తెలీదు. అయితే పోయినా వాడిని గుర్తుంచుకోవడానికి ఓ పేరు కావాలి. ఆ పేరు మధుసూదనరావు అని నిర్ణయించుకొన్నారిద్దరూ.

నిస్సహాయత, అనారోగ్యం భార్యాభర్తల్ని మరోవిధంగా దగ్గర చేస్తోంది. ఆ రోజుల్లో ఎవరు వంట చేసేవారో, ఎవరు మధుని సాకేవారో, ఎప్పుడూ ఏడుస్తూ గడిపే బిడ్డని ఎవరు వంతులవారీగా ఎత్తుకునే వారో వీటికి ఎల్లలు లేవు. తన కాళ్ళ మధ్య పడుకుని నిద్రపోయే బిడ్డని ఆ మాత్రమయినా విశ్రాంతి తీసుకోడానికి (బిడ్డకి కాదు - తనకి) ఒక్కోసారి తొడుక్కున్న లుంగీ విప్పి లేచి మరొకటి

కట్టుకునేవాడు కొండలరావు. అలాంటి సందర్భాలలో మధు చచ్చిపోయినా బాగుణ్ణని అనిపించిన సందర్భం, బతికి ఏం ఉద్ధరిస్తాడులే అనిపించిన సందర్భం లేకపోలేదు

వారి ఆత్మకథలు సంవత్సరాల తర్వాత ఎవరయినా వ్రాయడానికి ఉపక్రమిస్తే ఈ ప్రశ్నలకి అపూర్వమయిన సమాధానాలు తప్పనిసరిగా దొరికేవి.

●●●

ఈ రోజుల్లోనే కొండలరావుకి ప్రమోషన్ వచ్చింది. మరో 32 రూపాయల ఆదాయం పెరిగింది. ఈ రోజుల్లో ఆ పెరుగుదల కొండంత సహాయం. ఈ అదృష్టం కొడుకు వల్ల కలిసొచ్చిందనుకోవాలా? కొండలరావు నవ్వుకొన్నాడు. ఆ డబ్బు తల్లీకొడుకుల అనారోగ్యానికి, మందులకు సరిపోయేది. ఇంక్రిమెంటుతో పాటు షిఫ్టు ఇన్‌చార్జి అయినందుకు గాను చిన్న విక్కీ మోపెడ్ ఇచ్చారు. ఇప్పుడు కొండలరావు డ్యూటీ యూనిఫారం మీద మరకలు తగ్గాయి. జుత్తు ఇది వరకటి కంటే తక్కువ నలిగేది.

ఈ రోజుల్లోనే సీతకి కొండలరావు మొదటి గాజుల జత చేయించాడు. పురిటిలో నీరు పట్టిన శరీరంలో నీరు, రక్తం ఇంకిపోగా పుల్లల్లాగ అయిన చేతులకు ఎక్కువ బంగారం అవసరంలేకపోయింది. అయితే వాటి విలువ బంగారానికి కాదు ఆ దశలో.

పురిటిలో పెద్ద గండం గడిచాక, మధుతో గడుస్తున్న ఈ రోజులు క్రమేపీ వాన వెలిసిన తర్వాత ప్రశాంతతలాగ అనిపించేది ఇద్దరికీ. ఇప్పుడిక ఆర్థికమయిన సమస్యలూ లేవు.

మధుని చూసిన డాక్టరు నాలుగోనెలలోనే మంచి మందు చెప్పారు. అన్న ప్రాశన ప్రసక్తి లేకుండా తినేవన్నీ తినిపించమన్నారు. సీత కొడుకుని కంచం ముందు వదిలేసింది. డాక్టర్లు అంతకంటే మంచి వైద్యం మధుకి చెప్పలేరనిపించింది. రెండు నెలల్లో బంతిలాగా తయారయాడు మధు.

అంతేకాదు, సీత ఆరోగ్యం కూడా విచిత్రంగా మలుపు తిరిగింది. ***అనారోగ్యానికి ముందు ఆనందం.***

మాల్యాద్రి కుర్రాడికి పలకరించే కోతిని స్వయంగా తయారుచేసి ఇచ్చాడు. ఈ కోతి నవ్వుతుంది. గెంతుతుంది. పాకుతుంది. కీ అయిపోతే తలవొంచుకు కూర్చుంటుంది. పురుడు అయాక మాల్యాద్రి మీద ఉన్న విముఖతాభావం సీతకి తగ్గింది. కాగా, ఓ విధమయిన కృతజ్ఞత చోటు చేసుకుంది. ఆ రోజు మాల్యాద్రి ఆదుకోకపోతే తను ఆసుపత్రికి చేరగలిగేదా?

తను అపస్మారంలో ఉండగా మాల్యాద్రి చేసిన ఉపకారం కొండలరావు చెప్పినప్పుడు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

కూతురు పుట్టి నెలలు గడిచినా రేణూ ఇంటిముఖం పట్టలేదు. మాల్యాద్రి కూడా పట్టించుకున్నట్లు కనిపించలేదు.

మధు ఆడే కోతిని చూసినప్పుడు మాల్యాద్రి ఎంత సమర్థుడో అర్థమయింది. ఒకరోజు ప్రత్యేకంగా కోతిని అడగడానికి వచ్చాడు మాల్యాద్రి. సీత ఆశ్చర్యపోయింది. పసివాడికి బహుమతిగా ఇచ్చిన కోతిని అడిగి తీసుకోవడం విడ్డూరంగా కనిపించింది కొండలరావుకి. కాని ఆ సాయంకాలం ఇద్దరికీ కారణం తెలిసింది. నవ్వి, గెంతి, బుద్ధిగా తలవంచే కోతికి ఆ రోజు ఏడుపు నేర్పాడు మాల్యాద్రి. పెదాలు సాగదీసి, కళ్ళల్లో నల్లగుడ్లు కిందకి వేలాడేసి దిగాలుగా ముఖం పెట్టడం ఎలక్ట్రానిక్ ఏర్పాటుతో సాధించాడు మాల్యాద్రి. ఇది అద్భుతం! మాల్యాద్రి సామర్థ్యం మీదా, అతని పనితనం మీదా విపరీతమయిన గౌరవం పెరిగిపోయింది.

మాల్యాద్రిలో మరో ప్రత్యేకత ఉంది. ఏ గౌరవాన్నీ ఎక్కువ కాలం నిలుపుకోక పోవడం. మధుని ఎత్తుకుని బజారు వెళ్ళి వచ్చేసరికి కొండలరావు, మాల్యాద్రి కలిసి మందు తాగడం గమనించి నిర్ఘాంతపోయింది. కొండలరావు మందు తాగడం ఎప్పుడూ చూడలేదు సీత. బీరుసీసా ఎత్తుకుని తాగుతూ, సిగరెట్టు పొగ వదులుతూ, నవ్వుతూ కబుర్లు చెపుతున్న కొండలరావు తనకి కొత్త. కొండలరావుని చూసి

సీతకి కోపం రాలేదు. నవ్వొచ్చింది. కారు మెకానిక్కు విమానంలో కూర్చున్నట్లు బీరు సీసా కిరసనాయిలు బుడ్డిలాగ పట్టుకుని, లేని ప్రత్యేకతని తాగిన సరుకువల్ల వచ్చే మత్తుతో కాక, తాగడంలోనే ఎంజాయ్ చేస్తున్నారు కొండలరావు.

"ఇక చాలు రండి. భోజనం చేద్దురుగాని" అంది.

"మాల్యాద్రిగారు మనింట్లో భోజనం చేస్తారివాళ" అన్నాడు కొండలరావు.

సీతకిమ్మనలేదు. ఇద్దరికీ వడ్డించింది.

మధ్యాహ్నం కొండలరావు డ్యూటీకి వెళ్ళాడు. మాల్యాద్రి నిద్రపోయి లేచేసరికి గుమ్మం దగ్గర సీత నిలబడి ఉంది. కొండలరావు బీరు తాగాడు కాని, తను తాగింది విస్కీ. నిజానికి నిద్రచాలలేదు. కాని గుమ్మం దగ్గర సీతని చూశాక మత్తు దిగిపోయింది.

"చూడండి, కోతికి ఏడవడం నేర్పడం మీకు చాలా సుళువు కావచ్చు. కొండలరావు గారికి మందు నేర్పడం అంత ఆనందించే విషయం కాదు" అంది.

మాల్యాద్రి పగలబడి నవ్వాడు. సీత ఒక్క క్షణం నివ్వెరపోయింది. మాల్యా నవ్వు ఆమె ముఖం చూస్తుంటే ఇంకా ఎక్కువయింది. మాల్యాద్రి అందంగా నవ్వుతాడు నవ్వుతూంటే చూడాలనిపించేంత అందంగా నవ్వుతాడు. కాని ఇప్పుడు నవ్వుతున్న మాల్యాద్రిని చూస్తుంటే సీతకి ఒళ్ళు మండింది.

"సీతా! కొండలరావు గురించి నీకేం తెలుసు?"

సీతకి కోపం వచ్చింది. మొదటిసారిగా ఏకవచనంలో పిలిచినందుకు. రెండు తన భర్త గురించి తనకి తెలుసా అని అడిగినందుకు.

"మీకేం తెలుసు?"

"నాకు చాలా తెలుసు. నీకు తెలియకూడనివి తెలుసు. నీకు తెలియనక్కరలేనివి తెలుసు. నీకు తెలియకపోవడం వల్ల, నాకు భర్తగురించి అంతా తెలుసన్న గర్వాన్ని పెళ్ళాలకి భర్తలే కోరి మిగులుస్తారని తెలుసు."

"మేల్ చావనిజమ్ - హిపోక్రసీ!" అరిచింది.

"ఓ.కె. పెళ్ళి కాక ముందు కొండలరావు కల్లు తాగేవాడు. బీడీకాల్చేవాడు. కొచ్చిన్‌లో రెండేళ్ళు డిప్యుటేషన్ మీద ఉన్నప్పుడు అలవాటయింది. నిన్ను పెళ్ళిచేసుకునే దాకా తాగాడు. ఇప్పటికీ తాగాలని ఉంది. కాని అంతకు మించి నీమీద గౌరవం ఉంది. ఆ ఒక్క కారణానికే తాగలేకపోతున్నాడు.నువ్వు చూసిన బీర్ బాటిలు అతనిందాకా తాగిన ఆరో బాటిలు - చాలా?"

సీతకి తల తిరిగింది.

"పెళ్ళికాక ముందు కొండలరావుకి కొచ్చిన్‌లో స్థిరపడిన తెలంగాణా అమ్మాయి - పేరు సరవ్వ - ఆమెతో పరిచయముంది. అది చాలా చిన్న పరిచయం. సరవ్వ సెక్సీగా ఉంటుంది. నీకన్న సెక్సీగా ఉంటుంది. మంచం మీద సరవ్వ ఇవ్వగల సుఖం.."

"స్టాపిట్!" అని అరిచింది సీత. ఆమెకి దుఃఖం పొర్లు కొచ్చింది. మధు ఏడుస్తున్నాడు. కాళ్ళకి చుట్టుకున్నాడు. మధుని వదిలించుకుని తనవాటాలోకి పారిపోయి ఓ మూలకి కూలబడి భోరుమంది.

మధుని ఎత్తుకుని మాల్యాద్రి వచ్చాడు. ఆమె ముందు చాక్లెట్ కోసం మారాం చేసే పసిబిడ్డని సముదాయించే గార్డియన్ లాగ (తండ్రి అనడం లేదు!) కూర్చున్నాడు.

"సీతా! నీకు గర్వం ఉంది. ప్రతి స్త్రీకి భర్తపట్ల ఉంటుంది. దానిని స్త్రీకంటే భర్తే ఎక్కువ పోషిస్తాడనీ, కాపాడతాడనీ స్త్రీకి తెలీదు. ఇది పురుషాహంకారంతో మాట్లాడే భర్తల తరపున మాటే. కొన్ని విషయాలు తెలీకపోవడం వల్ల కాపురాల్లో ఆనందం మిగులుతుంది. నీ అహంకారం చూస్తున్నాను. నీ గర్వాన్ని చూస్తున్నాను. నిన్ను హింసించాలనే ఈ మాటలు చెప్పాను. కాని అబద్ధాలు మాత్రంకావు."

లేచాడు. మధుని ఇంకా చేతుల్లోనే ఉంచుకు బయటికి రెండడుగులు వేసి "ఒక్కటి మాత్రం అబద్ధం" అన్నాడు.

సీత అంత దుఃఖంలోనూ తలెత్తింది.

"సరవ్వ నీ కంటే సెక్సీ ఉంటుందన్నది - ఈ మాట కొండలరావు అనలేదు. నేనన్నాను. అది అబద్ధం" నవ్వి "కొండలరావుకి నీ మీద చాలా ప్రేమ, దాన్ని కాపాడుకునే బాధ్యత ఇప్పట్నుంచీ నీది. ఎలాగంటే నీకు తెలిసిన విషయాలు నీకు తెలీనట్టు ఇక నుంచీ నటించడం నీకు మంచిది. మరోమాట కోతి బొమ్మని ఏడిపించడం నాలాంటి వాడికి చాలా సుళువు. గాడి తప్పితే నువ్వు తప్పిస్తే కొండలరావుని నవ్వించడం చాలా కష్టం, ఏడవడం పూర్తయాక ముఖం కడుక్కోనిరా, అంతవరకూ మధు నా గదిలో ఉంటాడు."

మాల్యాద్రి తలుపు దగ్గరికి లాగి వెళ్ళిపోయాడు.

## 17

**మీరెప్పుడయినా ఆసిర్ అరాఫత్, ఫిడల్ కాస్ట్రోల్ అందాన్ని వెదకడానికి ప్రయత్నించారా? వాళ్ళలో ఆకర్షణ పదవి!**

ప్రతీ స్త్రీకీ అందాన్నిచ్చే పదవి ఒకటుంది. దాని పేరు మాతృత్వం. అంతేకాదు. మాతృత్వం కొందరిని స్వార్ధపరుల్ని చేస్తుంది. కొందరిని గుడ్డివాళ్ళని చేస్తుంది. తన మాతృత్వపు మమకారాన్ని తనకే మిగుల్చుకోవాలనే ఆతురతతో కట్టలు తెంచుకున్న మాతృత్వం ఒక మాతృమూర్తి చేత పెళ్ళిచేసుకోబోతున్న తన బిడ్డని హత్య చేయించింది. (దాదాపు ముప్పై అయిదు సంవత్సరాల క్రిందట నేను రాసి 'మృత్యువు ఆత్మహత్య' నాటికకు ఈ అంశం మాతృక.)

మాతృత్వం జీవశక్తి, ఆవేశం, కొండొకచో ఆయుధం - ఏదయినా..

తల్లి అయాక రేణూలో వచ్చిన మార్పు విచిత్రం, అనూహ్యం. పురుడయాక రేణూ శరీరం బరువెక్కింది. మామూలుగా అందరకూ జరిగే స్థాయికి మించి శరీరం నిలిచిపోయింది. అయితే విచిత్రంగా పెళ్ళయిన కొత్తలో ఆమెలో కనిపించే బెరుకుతనం, అనిశ్చిత స్థితీ, తల్లయిన దశలో పూర్తిగా మాయమయింది. చాలా ఆత్మవిశ్వాసంతో, నిర్ధారణగా, నిర్దుష్టమయిన వ్యక్తిత్వం ఆమెలో ఏర్పడింది.

సీతాకోకచిలుక ఆ దశకు చేరడానికి చాలా కాలం పడుతుంది. అయితే రంగులు దిద్దుకున్న రూపానికి వచ్చాక ప్రతీ క్షణం పురుష సమాగమానికి వెదుకులాడుతుంది. అదొక్కటే పని, తీరా సమాగమం జరిగాక పరిపూర్ణంగా, నిండుగా బిడ్డని ప్రసవించే కార్యంలో మునిగిపోతుంది. బిడ్డని ప్రసవించడమే తనకి అంతిమ లక్ష్యం. ఆ తర్వాత జీవితం లేదు. జీవన లక్ష్యమూ లేదు. చచ్చిపోతుంది.

రేణూ జీవనలక్ష్యమూ బిడ్డే ఆ తర్వాత రేణూ తన చుట్టూ ఉన్న అన్ని తలుపుల్నీ మూసేసుకుంది. భర్త సమాగమం కోసం పరితపించి, యాతనపడి, పాఠాలు నేర్చుకుని, సీతని దేబిరించి, ఇంటికి తెచ్చుకుని మాల్యాద్రికి తనని తాను అర్పించుకున్న 'సీతాకోక చిలుక' (కావాలనే రేణూ అనడంలేదు) బిడ్డని ప్రసవించాక భర్తని దగ్గిరకు రానివ్వలేదు. స్పర్శని కూడా భరించలేకపోయింది. లేదా భర్త స్పర్శకూడా అవసరం లేకపోయింది. లేదా ఆశించలేదు.

ఒక స్త్రీగా ప్రొక్రియేట్ చేసే దశకు తెరజార్చేసింది. తన చుట్టూ ఓ అందమయిన గూడును అల్లుకుంది. అది తను కోరుకున్న ప్రపంచం. దానిలోనికి ఎవరికీ ప్రవేశంలేదు. భర్తకి కూడా.

"మీ కోరిక తీర్చుకోవాలంటే ఇంకో చోట వెదుక్కోండి బాబూ. నా ప్రాణం తియ్యకండి" అనే మాట ఓ విచిత్రమయిన తదాత్మ్యాన్నీ, తృప్తినీ సాధించుకున్న మాతృమూర్తి నిర్లక్ష్యపు తిరస్కారం.

విచిత్రంగా అంత శరీరంలోనూ, ఆ నిర్లిప్తతలోనూ రేణూ ఇదివరకటి కంటే హుందాగా, అందంగా, చాలా ధీమాగా, అంతకు మించి కొత్త సౌందర్యంతో కనిపించింది.

ఇప్పుడు రేణూని మిస్ అవుతున్నందున మాల్యాద్రి విలవిలలాడాడు. నిషేధించి ఆడం ఈవ్‌ని ఆపిల్ వనంలోకి వదిలిన క్రూరపు ఆంక్షలాగ ఫీలయాడు మాల్యాద్రి.

అందువల్ల ఎంతటి అనూహ్యమయిన అవాంఛితమయిన పరిణామాలు ఏర్పడనున్నాయో ఇద్దరికీ అర్థం కావడానికి ఒక జీవితకాలం పట్టింది. అప్పటికి వేళ కూడా మించిపోయింది. ఆ దశ ఇంకా ముందుంది.

●●●

సీతకి ఓ సరదా ఉంది. రాయపేట నుంచి పూనమల్లికి ప్రయాణం చేసి దశప్రకాశ్ హోటల్‌లో హైదరాబాదు మస్కా వేయించుకుని మసాలా దోసె తినడం. అయితే మధు తిననిచ్చేవాడు కాదు. మస్కానో, మసాళానో చీరెనిండా అయేది. అయినా అదో సరదా. అలవాటు. అది మధ్య తరగతి జీవితంలో ఆమె భద్రంగా దాచుకున్న ఖరీదయిన వ్యసనం. ఇది ముందు కొండలరావుకి తెలీదు. తెలిశాక అలాంటి లగ్జరీని సీత పదిలంగా కాపాడుకున్నందుకు ఆనందించాడు. ఆ రోజుల్లో ఆ అభిరుచి ఖరీదు దాదాపు అయిదు రూపాయలు. అది సరిపెట్టుకోగల వ్యసనమేం కాదు.

ఆ సాయంకాలం - కొండలరావు సాయంకాలం డ్యూటీలో ఉన్నప్పుడు బిడ్డని ఎత్తుకుని పరశువాకం బజారు పనిమీద వచ్చింది సీత. న్యాయానికి రాయపేటలో దొరకని వస్తువు లేదు. కానీ ఆ రోజుల్లోనే పరిచయమయిన ఓ నెల్లూరు వెంకటేశ్వర్లు పరశువాకం వస్తే పది రూపాయల తక్కువకి పాలసన్నాలు ఇప్పిస్తానన్నాడు. అడ్రసు వెదుక్కుంటూ, బిడ్డని మోసుకుంటూ తిరిగేసరికి చీకటి పడిపోయింది. ఆ సాయంకాలం సీత చెయ్యాలనుకున్న పనులలో దశప్రకాశ్ మస్కా మసాలా దోసె కూడా ఉంది.

తీరా హోటల్‌కి చేరేసరికి రెస్టారెంట్‌లో భోజనం సెక్షన్‌లో రద్దీ పెరిగింది. మసాళా దోసె కాస్త పల్చబడి, మస్కాకు ఆస్కారం లేకపోయింది. అది ఆ సాయంకాలం సీతకి గొప్ప అసంతృప్తి. కాగా మధు ఆగడం ఎక్కువయింది. మసాళా దోసెకి కక్కుర్తి పడినందుకు తనని తానే తిట్టుకుంటూండగా చేతిలో ఉండనంటూ జారిపోతున్న మధుని ఎవరో అందుకున్నారు. కునేగా పరిమళం గుప్పుమంది. తీరా చూస్తే నందిత. సీత పొంగిపోయింది.

'దోసె కోసం ఇంత దూరం వచ్చావా సీతా!' అంది నందిత ఎదురుగ్గా కూర్చుంటూ.

నందిత క్రితం సారి చూసినప్పటికంటే 'విశాలంగా' ఉంది. ఇదేమిటీ వర్ణన? అని చెప్పాలని తాపత్రయం. నందిత కళ్ళు ఎర్రబడి ఉన్నాయి. పెదాలు నలిగి ఉన్నాయి. ముడతలు పడని జార్జెట్ చీరె కూడా కసిగా నలిగినట్టుంది. నందిత అప్పుడే నలిగిపోవడం ప్రారంభించిన పువ్వులో కనిపిస్తున్న ఒడలిన వయ్యారం కనిపించింది. నందిత ఇప్పుడు బావుంది. ఇప్పుడే బావుంది.

"ఏమిటి ఇక్కడున్నావ్. ఎలావుంది శ్రీవారితో జీవితం?" అంది సీత.

"అద్భుతంగా ఉంది సీతా! ఎంత అద్భుతంగా ఉందో చెప్పలేను. ఎప్పుడేనా ఇద్దరం కలిసి మళ్ళీ విజయనగరంలో లాగ రెండు రోజులు గడపాలి" అంది.

"అన్ని విషయాలున్నాయా చెప్పడానికి?" అని నవ్వింది.

"ఏరీ మీ శ్రీవారు?"

"ప్రతిచోటుకీ శ్రీవారు రావాలా?"

"అయితే మద్రాసు బాగా ఒంటబట్టిందన్నమాట!"

"నా దగ్గర చదువు నేర్చుకున్న మచ్ ఖండ్ అమ్మాయి మసాలా దోసెకోసం రాయపేట నుండి పరశువాక్కం రాగాలేంది, నేను మద్రాసుని లొంగదీసుకుంటే ఆశ్చర్యమా?"

నందిత గొంతుతో ఏమయినా నిష్టూరంగా ఉందా అని ఓ క్షణం అనుమానపడింది సీత. కాని అదేం లేదు. నందిత మాటలో, ప్రవర్తనలో నిర్లక్ష్యం ఉంది. విపరీతమయిన ఆత్మవిశ్వాసం ఉంది. అంతకుమించి చదువు, నగర సంస్కారం ఇచ్చిన ధైర్యం ఉంది.

మధు నందిత చీరెని తడిపేశాడు. నందిత కంగారుపడిపోయింది. నడిరోడ్డు మీద బట్టలు ఊడదీసినంతగా కలవరపడిపోయింది. గాభరాగా మధుని సీత ఒళ్ళో కూలేసి చీరె దులుపుకుంది.

"ఏమయినా చీరెమీద మచ్చ నిలిచిపోతుందంటావా? మరేం ఫరవాలేదు కదా? ఈ చీరె - ఓగాడ్" ఇలా సాగింది ఆమె కంగారు.

సీత నవ్వుకుంది. "నీకు కొడుకు పుట్టిననాడు ఈ ప్రశ్నలన్నీ నేను అడుగుతాలే" అని నవ్వింది.

"నాకా! నాకు పిల్లలు వద్దు బాబూ. ఇప్పుడే కాదు - ఎప్పుడూ" అంది నందిత. ఆ మాట చెపుతున్నప్పుడు లాంఛనంగా ఆడపిల్ల చెప్పే మాటలాగ కాక, నిర్ధారణగా తీసుకున్న నిర్ణయం లాగా కనిపించింది. సీత ఆశ్చర్యపోయింది. పిల్లలు వద్దనడానికి ప్రత్యేకమయిన కారణం ఏమయినా ఉందా? అని కాసేపు మధనపడింది.

చెనా బటోరా ఆర్డరు చేసింది నందిత. మసాలా దోసె పని అయిపోయింది. ఆలశ్యం అవుతోంది. లేచి బయలుదేరాలి గాని "నా కోసం కాస్సేపు ఆగవోయ్" అని కూర్చోబెట్టింది నందిత.

ఉన్నట్టుండి చీరె కొంగు వెనక్కిలాగి, ఊపిరి బిగపట్టి, శరీరాన్ని నిటారుగా నిలిపి "నాలో మద్రాసు వచ్చాక ఏమయినా మార్పు గమనించావా చెప్పు?" అంది నందిత.

సీత ఆలోచిస్తోంది.

"ఆలోచించకుండా చెప్పాలి" సీతకి వెంటనే స్ఫురించలేదు. నందిత కుర్చీని మెల్లగా సీత పక్కకి జరిపి ఎవరయినా చూస్తున్నారేమోనని చుట్టూ చూసి, సీత చేతిని తన పొత్తికడుపు దగ్గర్నుంచి మెడదాకా నడిపింది. సీతకి - ఆడపిల్లకి సిల్కులాంటి ఆ శరీరం తగిలినప్పుడు గుండె ఝల్లుమంది. శరీరం మరింత నాజూకయిందా? కొత్త లోషన్లు ఏమయినా వాడుతోందా?

సమాధానం దొరకలేదు. "తెలీడం లేదు"

"మరొక్కసారి సరిగ్గా చూడవోయ్ - బ్రాసైజు మారింది" అంది చెవిలో. నిజమే చేతికి మెత్తగా, అలిసిపోయిన - ఇంకా అలసిపోతున్న బ్రా తగిలింది.

"ఒక్కటి చెప్పు. మీ ఆయనకి నువ్వు అందిస్తావా? లేదా ఆయన చేతుల్ని వాటి మీదకి లాక్కుంటావా?"

ఆ క్షణంలో నందిత రెండు కళ్ళూ మరింత ఎరుపెక్కి రక్తాన్ని చిమ్మాయి. సందేహం లేదు. ఈ అమ్మాయి చక్కగా జీవితాన్ని ఆపోశన పడుతోంది.

కొందరికి సెక్స్ జీవితంలో ఒక భాగం. కొందరికి సెక్సే జీవితం. కొందరికి సెక్స్ రొటీను. కొందరికి ఆర్ట్. కాని అందరికి సెక్స్ అవసరం. సెక్స్ అంటే కేవలం రెండు శరీరాలు కలవడమే కాదు. ముఖ్యంగా మనస్సులూ, ఆలోచనలూ, అభిరుచులూ అన్నిటికీ మించి

ఏంగ్యులారిటీలు కలవడం. ఇద్దరు ఒకే కొబ్బరి బొండాంలో నీళ్ళు తాగడం. ప్రేయసీ ప్రియులు స్విమ్మింగ్ ఫూల్‌లో కిందికి జారి ముద్దుపెట్టుకోవడం, భార్య జుట్టు పట్టుకుని తలని వెనక్కి విరిచి పెదాల్ని కొరకడం, దూరంగా కూర్చునే చక్కని పల్లవిని పంచుకోవడం, భర్తని నగ్నంగా కూర్చోపెట్టి తలంటు స్నానం చేయించడం, భర్త వ్యసనానికి ఆదుకోవడం - ఎన్ని ఏంగ్యులారిటీలు! సెక్స్‌లో ఎంత విచిత్రం? నలిగే శరీరాల మధ్య సెక్స్ ఎంత సంకుచితం! ఎంత అపరిమితం! అదే సెక్స్ అయితే ఓ తాజ్‌మహల్‌కీ, ఓ క్లియోపాత్రకీ, బిళ్వమంగళుడు వర్షం రాత్రి పామును పట్టుకు ఎగబ్రాకడానికీ, అజామీళుడి అబ్రాహ్మణ్యానికీ అర్థంలేదు.

సీత నవ్వేసి "మీ ఆయన అదృష్టాన్ని మెచ్చుకోమంటావా? నువ్వు మీ ఆయనకి గొప్ప లక్కీ ఛాన్స్ అని అనుకోమంటావా?" అంది.

నందిత చెనా బటోరా ఎంగిలి పెదాలతో సీత బుగ్గమీద ముద్దుపెట్టుకుంది. "పిచ్చి సీతా - పిచ్చి సీతా - నువ్వు అర్జెంటుగా పిల్లల్ని కని చాలా నష్టపోయావు" అంది.

నిశ్శబ్ధంగా ఉన్న రెస్టారెంటు హాలులో ఆ ముద్దు తుపాకీలాగ పేలింది. కనీసం పదిమంది ఆశ్చర్యంగా అటు చూశారు. అయిదారు మంది నందితని గమనించి ఈర్ష్యగా సీతని చూశారు. సీత సిగ్గుపడిపోయింది. కాని అన్నదానం చేస్తున్న బిర్లాగారు చుట్టూ పోగయిన పేదల్ని చూసినట్టు రెస్టారెంటుని గమనించింది నందిత.

"ఏయ్! ఏమిటాపని?" అంది సీత చెనా బటోరాని తుడుచుకుంటూ.

నందిత చిలిపిగా నవ్వి "వీళ్ళలో నలుగురికయినా నాతో అలా ముద్దుపెట్టించుకోవాలని నోరూరి ఉంటుందిలే" అంది రహస్యంగా.

***ప్రతీ స్త్రీ యవ్వనాన్ని, అందాన్ని ఆనందంగా తర్జుమా చేసుకుంటుంది. అది సహజం. అయితే అది తనకీ, తను కోరుకున్న లేదా తనని కోరుకున్న భర్తకి పరిమితం చేసుకోవడం సమాజం ఏర్పరిచిన ఆంక్ష. నేర్పించిన సంస్కారం. కాని ఆ యవ్వనాన్నీ, అందాన్నీ మరింత సువిశాలమయిన పరిధిలో స్త్రీ ఆలోచించేటప్పుడు..***

సీతకి భయం వేసింది. ఆ భయాన్ని ఇట్టే పసిగట్టేసింది నందిత.

'మరీ పోలీసు ఆలోచనలు చెయ్యకు. నేనిక్కడున్న వాళ్ళందర్నీ రేప్ చెయ్యనులే'

ఎర్రసీతలో ప్రాథమికమైన భయాలన్నీ మేల్కొన్నాయి. నందితలో ఏదో మార్పు వచ్చింది. అదేమిటో అర్థం కావడం లేదు. అర్థమయితే ఆ విషయం వింతగా, విచిత్రంగా ఉంటుంది.

చెనా బటోరా తినడం పూర్తయింది. "మీకు ఫోన్ మేడం" అన్నాడు బేరర్ ఎంతో తెలిసినవాడిలాగ. కుస్తీ పోటీ రింగులో మహమ్మదాలీ లాగ ఠీవిగా గర్వంగా అందరి మధ్య నుంచీ నడిచి వెళ్ళింది. మధు మరోసారి తన చీరె తడిపాడు. వెళ్ళాలని మారాం చేస్తున్నాడు. బిల్లుతోపాటు చిల్లర తెచ్చిన బేరర్ అన్నీ రూపాయలే తెచ్చాడు. తన టిప్పు కనీసం రూపాయికి తక్కువ ఉండదని. తన చేతిలో పావలా వేసి అన్నీ అందుకుంది. కౌంటర్ దగ్గర ఫోన్‌లో మాట్లాడుతున్న నందిత అక్కడి నుంచే 'టాటా' చెప్పింది. గాలిలో ఓ ముద్దు ఎగరేసింది. మళ్ళీ కలుస్తానని సంజ్ఞ చేసింది.

హడావిడిగా బయటికి వచ్చింది సీత. రోడ్డు మీదకి వచ్చీరావడంతోనే బస్సు స్టాండులో ఆగిన బస్సు కనిపించింది. పరుగున వచ్చి బస్సు ఎక్కింది. బాగా చీకటయింది. వెంటనే బస్సు దొరికినందుకు చాలా ఆనందపడింది. నందిత గురించిన ఆలోచనలే మనస్సులో కదులుతున్నాయి. నందిత తృప్తిగా ఉంది. ఆనందంగా ఉంది. ఆనందాన్ని సంపాదించుకున్న గర్వంతో ఉంది. అలా ఆనందంగా లేని ప్రపంచాన్ని ఉదారంగా క్షమించే పెద్ద మనస్సుతో ఉంది. కానీ ఈ వ్యవహారంలో ఎక్కడో ఏదో..

బస్సు దిగీదిగగానే తుళ్ళిపడిపోయింది సీత. చేతిలో రేషన్ సంచి లేదు. అందులో బియ్యం, కాఫీ పౌడరు పాకెట్టూ. వణికిపోయింది. ఎక్కడ మరిచిపోయింది? బస్సులోనా? సీతకి ఏడుపొచ్చినంత పనయింది. బస్సుస్టాండు దగ్గరే కూలబడిపోయింది. భుజం మీద మధు నిద్రపోతున్నాడు. బస్సు ప్రయాణంలో చల్లని గాలి తెరకి మధుకి నిద్రపట్టింది.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది సీతకి. దశప్రకాశ్ హోటల్‌లో టిఫిన్ చేస్తున్న టేబుల్ పక్కన పెట్టింది. చివరలో నందిత ఫోన్‌కాల్, బిల్లు తెచ్చిన ప్లేటులో రూపాయి నోట్లూ, వెళ్ళాలనే హడావుడీ - అవును. అక్కడే మరిచిపోయింది.

దాదాపు తొమ్మిది అయింది కొండలరావు రావడానికి ఇంకా చాలా టైముంది. ఏమయినా సంచి వదిలేసే స్థలం కాదు. ఫోన్ చేసినా ఉంటుందన్న నమ్మకం లేదు. సీతకి ఏడుపొచ్చేసింది. అతి నిస్సహాయంగా మళ్ళీ పరశువాక్కం బస్సు ఎక్కింది. ఇంకెప్పుడూ మస్కా మసాలా దోసె తిననని ఒట్టు పెట్టుకుంది. నందిత ఆనందం మీద కోపం వచ్చింది ఎవడిక్కావాలి ఆ ఆనందం?

రెస్టారెంటులో మనుషుల రద్దీ తగ్గింది. విచిత్రంగా తను వెళ్ళినప్పటి నుంచీ తగ్గుతున్నట్టే ఉంది. తనకి బిల్లు ఇచ్చిన బేరర్‌కి సంచి మాట చెపితే ఆశ్చర్యపోయాడు. ఒక్క పరుగున ఆ టేబులు దగ్గరికి వచ్చి పడ్డాడు. సంచి తను పెట్టినట్టే ఉంది. ముఖం ఆనందంతో వెలిగింది. ఇంతసేపు తను చూడలేదేం అన్న నిరాశ బేరర్ ముఖంలో కనిపించింది. తీసుకోబోతుంటే గోడ వేపు ఉన్న కుర్చీలో చిన్న వేనిటీ బాగ్ కనిపించింది. అది తనదికాదు. కానీ ఎవరిదో సీతకి అర్థమయిపోయింది. బాగ్ సగం తెరిచే ఉంది. అందులో లిప్‌స్టిక్ లూ, మోయిశ్చరైజర్‌తో పాటు చిన్న వందరూపాయి నోట్ల బొత్తి ఉంది. బేరర్ ముఖంలో ఇంకా నిరుత్సాహం కనిపించింది.

"మేడమ్‌కి నేను అందజేస్తాను" అన్నాడు.

"మేడమ్ ఎక్కడుంటారో నీకెలా తెలుసు?"

"302 మేడమ్" అన్నాడు.

అంత డబ్బున్న సంచి బేరర్ కి ఇవ్వడం మంచిది కాదు. తనే లిఫ్టు ఎక్కింది. 302 గది వెదకడం పెద్ద కష్టం అనిపించలేదు. గది ముందు కాలింగ్ బెల్ నొక్కింది. లోపల ఎవరయినా ఉన్నారా లేదా అని సందేహం వచ్చేంత వ్యవధి దాటాక తలుపు తెరుచుకుంది. బొమ్మల లుంగీ, కత్తెర బనీను వేసుకున్న ఓ గెడ్డపు మనిషి తలుపు తీశాడు. అపరిచిత వ్యక్తిని చూసి కంగారుపడిపోయింది సీత. బేరర్ పొరపాటు పడ్డాడేమో, తను తప్పు గదికి వచ్చింది.

"ఎస్!" అన్నాడు గెడ్డం మనిషి.

ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచించే లోగానే 'హూ ఈజిట్ డియర్!' అన్న గొంతు గదిలోంచి వినిపించింది. ఆ గొంతు నిస్సందేహంగా నందితదే!

కొయ్యబారిపోయింది సీత.

గుమ్మంలో సీతని చూడగానే ఆనందంతో గావుకేక పెట్టింది నందిత "హాయ్, సీతా! అమ్మదొంగా! కనిపెట్టేశావన్నమాట! నీకు కథంతా తర్వాత చెపుతామనుకున్నా.." అంటూ చెయి పట్టుకుని గదిలోకి నడిపించింది. సీతకి చెయ్యి వదిలించుకుని పారిపోవాలనుంది.

గదంతా కమ్మని లావెండర్ పరిమళంతో తేలిపోతోంది. మచ్ఖండ్ సువాసనలు దీనికి దీటురావు. ఒక పక్క సగం విప్పి పారేసిన చీర, బ్రా, స్కర్ట్ అతని బట్టలు మాత్రం పొందికగా హేంగర్లకి వేలాడుతున్నాయి. ఏదో ఆదరా బాదరగా గదిలో చొరబడినట్టుగా కాక, చక్కని నైటీ వేసుకుంది. ఇందాక రెస్టారెంటులో నందిత అడిగిన ప్రశ్న గుర్తుకు వచ్చింది సీతకి. నిజమే! నందిత బ్రా సైజు మారింది. అంతేకాదు. చాలామంది గుండెల్ని కోసేంత అందంగా మారింది. నందిత సీత దృష్టిని గమనించకపోలేదు. నైటీ శరీరానికి బిగించుకుని, 'ఇప్పుడైనా ఒప్పుకుంటావా? అంది. నిద్రపోతున్న మధుని సోఫాలో పడుకోబెట్టింది. తన రేషన్ సంచిని నేలమీద పెట్టింది సీత.

ఈ మాటల మధ్య గడ్డం ఆయన బాత్ రూములోకి వెళ్ళివచ్చాడు.

"సుధాకర్! దిస్ ఈజ్ మై ఫ్రెండ్ - లైక్ హర్!" అంది నందిత - కాటా కుస్తీలో పోటీదారుడి రెండు రెక్కలూ వెనక్కి విరిచి పట్టుకున్నట్టుగా సీతని పట్టుకుంటూ, రెండు అందమైన శరీరాలు అదే మూడ్‌లో ఉన్న యువకుడిని నిలదీసి ఛాలెంజ్ చెయ్యడం అతనికి కొత్తలాగా లేదు. నవ్వేశాడు.

సీత సిగ్గుతో, కోపంతో వికవికలాడిపోయింది. "ఏమిటి? ఏమిటిదంతా?" అంది ఏమనాలో తెలియక.

నందిత చిన్నపిల్లలాగా నవ్వుతోంది. విచిత్రం. ఇలా మరో మగాడితో పట్టుబడినందుకు భయంకానీ, సిగ్గు కానీ, తడబాటు కానీ, నేరం చేస్తున్న వణుకు కానీ ఆమెలో ఏ కోశానా కనిపించలేదు. పైగా, చెప్పకముందే పొడుపు కథ సమాధానం పసిగట్టేసిన అమ్మాయితో పరిహాసం ఆడుతున్నట్లుగా సోఫాలో కూలబడింది.

"చెప్పాలంటే చాలా కథ ఉంది. ఎక్కడ మొదలు పెట్టాలో తెలియదు. కానీ, చాలా రంజైన స్టోరీ. మరోసారి చెపుతాను. టైం లేదు. మావారు మరో అరగంటలో వచ్చి పికప్ చేస్తానన్నారు!"

"ఇక్కడికా!" అంది సీత షాక్ అవుతూ.

"నేనిక్కడ ఉంటే మరెక్కడికో వచ్చి ఎలా పికప్ చేస్తారోయ్! ఇక్కడికే. మరో గంటలో సుధాకర్ బెంగుళూరు ఫ్లైట్ ఎక్కాలి సీతూ!" చెవిదాకా వచ్చి "సుధా బెడ్ మీద మాంచి.. ఏంటి?" అని ప్రశ్నార్థకంగా ఆగింది.

"ఛీ! ఛీ!" అంది సీత

సుధాకర్ సిగరెట్టు కాలుస్తూ ఇద్దరినీ గమనిస్తున్నాడు.

"సుధా! మా సీతని నువ్వు క్షమించాలి. ఈవిడ మచ్‌ఖండ్‌లో బొంబాయి సంస్కారానికి శ్రీకారం చుట్టిన అమ్మాయి. కానీ మద్రాసులో లండన్ సంస్కారానికి ఇంకా దూరం. కొంచెం టైమియ్యి!" అని సీత వైపు తిరిగి, "ఒకే! రేపు మీ ఇంటికి వచ్చి కలుస్తా! నా అరగంటా చెడగొట్టకు. అది సరే. నన్ను వెదుక్కుంటూ ఇంత దూరం వచ్చావెందుకు?"

అంతవరకు చేతిలో రేషన్ బాగ్‌లో ఉన్న ఆమె బాగ్‌ని మరిచిపోయింది సీత. బయటికి తీసింది.

"ఇదా! థాంక్యూ, సీతా!" అంటూ సుధాకర్ వైపు తిరిగి, "సుధా! యూ ఆర్ లక్కీ! మంజూ నంబరు నీకు దొరికే అదృష్టం ఉంది. పోయిన బాగ్ దొరికింది!" అంటూ సీతని బుగ్గ మీద ముద్దు పెట్టుకుని, గుమ్మమ దాకా నడిపించింది.

"నైస్ మీటింగ్ యూ!" అంటు సుధాకర్ దారికి అడ్డొచ్చాడు.

"చేతులు కలపవోయ్! నీ పాతివ్రత్యం మైలపడిపోదు!" అంటూ సీత చేతిని అతని చేతికి అందించింది.

సుధాకర్ చేయి తగలగానే షాక్ తగిలినట్టయింది. వేళ్ళు దూది పింజల్లాగా ఆమె వేళ్ళ చుట్టూ అల్లుకున్నాయి. ఓదార్చే పెద్ద దిక్కులాగా ఆమె చేతి చుట్టూ పరుచుకున్నాయి. రహస్యాన్ని దాచే హృదయంలాగా వెచ్చగా ఆ చేతిని పొదవి పట్టుకున్నాయి. అప్రయత్నంగా సుధాకర్ ముఖం చూసింది. అతని కళ్ళు నవ్వుతున్నాయి. అతని పెదాలు నవ్వుతున్నాయి.అతని కనుబొమలు నవ్వుతున్నాయి. అతని చెక్కిళ్ళు నవ్వుతున్నాయి.

'మైగాడ్! ఇది జారుడు బల్ల!' త్వరగా తనని తాను కాపాడుకోవాలి. తలుపు దగ్గరికి పరిగెత్తినట్టు అడుగువేసింది.

నందిత చెవిలో అంటోంది. "సీతూ! చేతికి దక్కిన అరగంట స్వర్గాన్ని నష్టపోయావు అతని వేళ్ళు చూడు. తర్వాత మాట్లాడతాను!" అంది.

అతని వేళ్ళు చూసింది సీత. ఆ వేళ్ళ మధ్యే ఇంకా తన చేయి ఉండిపోయింది. తన ఆలోచనలు ఉండిపోయాయి. తన మనస్సు ఉండిపోయింది. మధుని ఎత్తుకుని చేతిలో సంచితో పాటు బయటికి అడుగుపెట్టింది సీత. ఏదో ఆలోచించేలోగానే తలుపు మూతపడింది. తను కారిడార్‌లో ఉంది.

ఉన్నట్టుండి శరీరం సాగింది. కాళ్ళు పట్టిచ్చాయి. కారిడార్‌లో వచ్చాక ఫోన్ ముందున్న కుర్చీలో కాస్సేపు కూలబడిపోయింది. జరిగింది, జరుగుతున్నదీ, చూసిందీ, వింటున్నదీ అన్నీ ఒక్కసారిగా తన మెదడుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. తెలియకుండానే ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. ఆ నీళ్ళకి అర్థం బాధ కాదు. దుఃఖం కాదు, హృదయం పట్టలేని ఆర్ద్రత కాదు. ఆనందం కాదు. మనస్సు తట్టుకోలేని ఆశ్చర్యానికీ, షాక్‌కీ కళ్ళనీళ్ళు వస్తాయా? మనస్సులో రహస్యంగా రెచ్చగొట్టబడిన 'ఆకలి'కీ కన్నీళ్ళు వస్తాయా? తరాల తరబడి ఊరబెట్టిన సంప్రదాయపు వెల్లువ ఒక్కసారి చెల్లాచెదరైపోతోందని తెలిసినప్పుడు కన్నీళ్ళు వస్తాయా? ఏమో? వస్తే ఈ కన్నీళ్ళకి అర్థం అదేనేమో!

●●●

## 18

నందిత చాలా తక్కువ రోజుల్లో మద్రాసు నగర సంస్కారంలో భాగం కావడమే కాదు. చాలా సంవత్సరాలు ముందుకు దూసుకుపోయింది. మరో పది సంవత్సరాలకు కానీ మన దేశంలో నగరాల్లో తొంగి చూసి, పీట వేసుకు కూర్చున్న కొత్తరకం సెక్స్ క్రీడకి ఆమె ఆ రోజుల్లోనే నాంది పలుకుతున్న విషయం ఆమెకు తెలియదు. ఇవాళ కూడా కొంతమందికి తెలిసినా, ఎక్కువమంది అంగీకరించని విచిత్రమైన వికారానికి ఆ రోజుల్లో నందిత తన వంతు ప్రాతిపదికను వేసింది. దానికి పరోక్షంగా కారణం లక్ష్మీపతి.

లక్ష్మీపతి ఆదాయం, జీవితం మధ్య తరగతి మూసలో ఉన్నా, మనస్సు మాత్రం చాలామంది మధ్య తరగతి మనుషుల్లాగే ఆకాశంలో ఉంది. అతని మనస్సు అనునిత్యం ఖరీదైన స్కాచ్ విస్కీ తాగాలని కలలు కంటుంది. మెర్సిడస్‌లో షికార్లు తిరగాలనుకుంటుంది. ఇంటి ముందు డాబర్ మాన్, కారు సీట్లో ప్రేయసీ ఉండాలనుకుంటుంది. ఎప్పుడూ డన్‌హిల్ సిగరెట్లు కాల్చాలని ఉంటుంది. అర్ధరాత్రి సినీతార రేఖ నిద్రలేపి, 'ఐ లవ్ యూ!' అని చెప్పాలని ఉంటుంది. తాజ్ మహల్ నీడలో యమునా నది పక్కన పేరు చెప్పని ప్రేయసి నడుం చుట్టూ చెయ్యేసి విహరించాలని ఉంటుంది.

లక్ష్మీపతికి ఇవన్నీ పంచరంగుల కలలు. ఆ కలలకి అతనికి తెలియకుండానే నందిత పెట్టుబడి అయింది.

ఆ రోజుల్లో హిగ్గిన్ బాథమ్స్‌లో '21 రోజుల్లో తమిళభాష' కొనుక్కోడానికి లక్ష్మీపతి, నందిత వెళ్ళినప్పుడు వాళ్ళకి తెలియకుండానే ఓ గొప్ప మలుపు వారి జీవితంలో తిరిగిపోయింది. ప్లేబోయ్ మాగజైన్‌ని తిరగేస్తున్న ఓ అందమైన మగ భుజం నందిత వీపుకి అనుకోకుండా తగిలింది. ఆ వీపు క్షమాపణ చెప్పింది. ఆ భుజం పట్టించుకోలేదు. మరో పది నిముషాల తర్వాత ఆ వీపే భుజానికి తగిలినప్పుడు భుజం క్షమాపణ చెప్పలేదు. వీపుని పరికించింది. పరిశీలించింది. ఆ క్షణమే ప్రేమించింది. ఆ వీపు పేరు నందిత, ఆ భుజం పేరు సుధాకర్. సుధాకర్ అప్పుడు ఇండియా పిస్టన్స్‌లో మెటీరియల్స్ మేనేజర్‌గా ఉంటున్నాడు. లక్ష్మీపతి ఆశించే అన్ని హంగులూ అతని జీవితానికి ఉన్నాయి. అతనికి మెర్సిడిస్ ఉంది. అందులో పెళ్ళాం ప్రేమిచే 'లైలా' అనే పామేరియన్ ఉంది. డాష్ బోర్డులో బ్లాక్ డాగ్ ఉంది. పెళ్ళానికి చేతుల్లేని జాకెట్టు ఉంది. అన్నిటికీ మంచి సుధాకర్ మనస్సులో ప్రస్తుతం చేతిలో ఉన్న ప్లేబోయ్ మనస్తత్వం ఉంది.

అతనికి నందిత వీపు నచ్చింది. నందిత రెండోసారి తనకు తగలడం అప్పటికి అతనికి అలవాటైన ఢిల్లీ సంస్కారంలో కొత్తకథకి సూచనలాగా అనిపించింది.

ఆమె చేతిలో పేరు తెలియని పుస్తకాన్ని పొగిడాడు. నందిత పొడిగా నవ్వింది. హిగ్గిన్ బాథమ్స్ గొప్పతనాన్ని ఇంగ్లీషులో చెప్పాడు. నందిత మరింత పొడిగా నవ్వింది. అలాంటి అందమైన అమ్మాయిలు హిగ్గిన్ బాథమ్స్‌కి ఎంత అందాన్ని సంతరిస్తారో చెప్పాడు. నందిత నవ్వలేదు. అక్కడి నుంచి వెళ్ళిపోయింది. సుధాకర్ ఆమెకి తన కార్డ్ ఇచ్చాడు. దాన్ని చచ్చిపోయిన బొద్దింకని పట్టుకున్నట్టు నందిత పట్టుకుంది. ఈలోగా లక్ష్మీపతి బయట మోటర్ సైకిలుతో కనిపించాడు. నందిత లేడిపిల్లలాగా చెంగున దూకి, ఆ మోటారు సైకిలు మీద కూర్చుంది. సుధాకర్‌కి ఆ క్షణంలో రెండు అర్థమయ్యాయి. నందిత సౌందర్యానికీ, లక్ష్మీపతి ఆర్థిక స్థితికీ పొంతన లేదు. అది ఒకటి.

రెండు: ఏ మాత్రం అవకాశం ఉన్నా లక్ష్మీపతి ఆ స్థాయికి దూకే మనస్తత్వం ఉన్నదని, అతని ఆదాయానికి మించిన ఖరీదు ఉన్న అతని కూలింగ్ గ్లాసెస్ చెప్పాయి. సుధాకర్ మనస్సులో ఆ మోటారు సైకిలు నంబరు మిగిలిపోయింది. తర్వాత అతి చిన్న ప్రయత్నంతో లక్ష్మీపతి గురించీ, నందిత గురించీ తెలుసుకోవలసినదంతా తెలుసుకున్నాడు సుధాకర్.

ఒకరోజు ఉన్నట్టుండి లక్ష్మీపతిని వెతుక్కుంటూ అతని ఆఫీసుకి వచ్చేశాడు సుధాకర్. అతని విజిటింగ్ కార్డు చూసి ఒక్క క్షణం బిత్తరపోయాడు లక్ష్మీపతి. అంత పెద్ద ఆఫీసరు తన టేబుల్ దగ్గర ఎప్పుడూ కూర్చోలేదు. అంతేకాదు, అంత ఖరీదైన కారులో ఎప్పుడూ మెరీనా బీచ్‌లో తిరగలేదు. అంత ఖరీదైన స్కాచ్ విస్కీ, న్యూ ఆర్లీన్స్ రాక్ ఆర్కెస్ట్రాని వింటూ ఎన్నడూ తాగలేదు. అంత అందమైన నాప్‌కిన్‌తో చికెన్ సిక్స్‌టీ ఫైవ్ ఎంగిలిని తుడుచుకోలేదు. వెరసి ఆ సాయంకాలం అతని జీవితంలోకి మరోలోకంలోంచి తెగిపడిన రంగుల ఉలిపిరి కాగితం లాగా ఫీలయ్యాడు.

ఆ రాత్రి లక్ష్మీపతి ఇంటిముందు మెర్సిడెస్ ఆగింది. గర్వంగా మిత్రుడిని భార్యకి పరిచయం చెయ్యాలని మనసు ఆరాటపడింది. బితుకు బితుకు మంటూనే లోనికి ఆహ్వానించాడు. పూనా నుంచీ పాట్నా నుంచీ కాల్స్ రావాలంటూ కారు దిగకుండానే వెళ్ళిపోయాడు సుధాకర్.

***విషం నసాళానికి ఎక్కడానికి వ్యవధి కావాలి. ఎక్కడానికి వ్యవధి లేకపోతే వృధా అవుతుంది.*** సుధాకర్ చాలా శ్రద్ధగా వాడిన మూడు పెగ్గుల స్కాచ్ మూడు వారాలు పనిచేసింది. కావాలనే లక్ష్మీపతికి తప్పుడూ ఫోన్ నంబరు ఇచ్చాడు. టెలిఫోన్ డిపార్టుమెంట్‌ని పట్టుకుని అసలు నంబరు కనుక్కోడానికి లక్ష్మీపతికి గగనమైంది. తీరా నంబరు దొరికాక సుధాకర్ దొరకలేదు. సుధాకర్ కాంపులో ఉన్నారన్న తప్పుడు సమాచారాన్ని బుద్ధిమంతురాలైన ఓ సెక్రటరీ అందిస్తూ వచ్చింది. మూడు వారాల వ్యవధిలో ముప్ఫైసార్లు లక్ష్మీపతి స్కాచ్‌నే మనసులో తాగాడు. చూడని గొప్ప మిత్రుడి గురించి నందితకి చాలా గొప్ప కథలు చెప్పాడు. క్రమేపీ అతని ఫోన్ కోసం ఎదురు చూశాడు. ఓ సాయంకాలం సుధాకర్ సెక్రటరీ ఫోన్ చేసింది. ఆయన్ని ఫోన్ దగ్గరే ఉండమని బాస్ చెప్పారని, ఢిల్లీ ఫ్లయిట్‌లో దిగాక ఫోన్ చేస్తానన్నారని, సుధాకర్ సుబ్బారావు ఎవిన్యూ నుంచే కావాలని అరగంట ఆలస్యంగా లక్ష్మీపతికి ఫోన్ చేశాడు. లక్ష్మీపతి నరాల్లో ఆ గొంతు వినగానే ఎడ్రినలిన్ కొండచిలువ లాగా పాకింది.

"బాస్!" అన్నాడు.

"కాస్మా పాలిటన్‌లో టేబుల్ చెప్పడం మరిచిపోయాను" అని ఫోన్ లో విచారించాడు సుధాకర్. మరో ఆలోచన లేకుండా "మా ఇంట్లో కూర్చుందాం!" అన్నాడు లక్ష్మీపతి.

"మీ ఆవిడకి ఇబ్బంది కాకాపోతే.."

లక్ష్మీపతి ఎగిరి గంతేశాడు. మధ్యతరగతి మనిషికి సుధాకర్‌తో స్నేహం, రోడ్డుమీద కుక్కపిల్లకి బ్రిటానియా బిస్కట్ల రుచి మరగడం.

ఆ రాత్రి మొదటిసారిగా గృహప్రవేశం చేశాడు సుధాకర్. నందితని చూస్తూనే ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. నందిత మాత్రం నిస్సందేహంగా ఆశ్చర్యపడింది. ఆ రాత్రి పార్టీలో ఆమె కర్థమైన విషయాలు రెండు. ఒకటి అతని భుజం, తన వీపు తాకిన అతని భుజం నిజంగానే 'మగతనం'తో ఉన్నదనీ, రెండు లక్ష్మీపతి ఆయన అంతస్తుతో, స్థాయితో ప్రేమలో పడ్డాడనీ.

ఆ రోజు సంథింగ్ స్పెషల్ తాగాడు లక్ష్మీపతి. అలాంటి స్కాచ్ తాగడం తెలియదు లక్ష్మీపతికి. తాగించడం తెలుసు సుధాకర్‌కి. ఆనందాన్ని ఎక్కువ పాళల్లో తక్కు వ్యవధిలో పంచుకోడానికి ఆబ చూపించాడు లక్ష్మీపతి. ఆ రోజు భోజనం చేసే వరకు లక్ష్మీపతి స్పృహలో లేడు. ఆ రాత్రి చాలా నాజూకుగా లక్ష్మీపతికి తాగే తాహతు లేదనీ, ఏనాడైనా తన తాహతు కంటే వారి తాహతు కింద చెయ్యేనని నందితకి తెలిసేటట్టు చేశాడు.

లక్ష్మీపతి స్పృహ తప్పి పడిపోగా, ఆ ఇంట్లో మిగిలింది ఇద్దరూ - నందిత, సుధాకర్. ఆ సమయంలో కనీసం రెండోసారి కూడా ఆమె వైపు చూడలేదు. తనొక్కడే లక్ష్మీపతిని సాయంపట్టి పక్కమీదకి చేర్చాడు. ఆమె వండిన వంటకాల్ని పేరు పేరునా మెచ్చుకుంటూ భోజనం చేశాడు. భోజనం చేశాక తనే స్వయంగా డిష్‌లు కడిగాడు.

***నాసిరకం సరుకు పక్కన అంతకంటే కాస్త మెరుగ్గా ఉన్న మరో నాసిరకం సరుకుకు సులువుగా రాణిస్తుంది.*** లక్ష్మీపతి అరాచకం ముందు సుధాకర్ ప్రవర్తన అపూర్వంగా కనిపించింది.

వెళుతూ వెళుతూ 'సంథింగ్ స్పెషల్'ని తనతో తీసుకుని వెళ్ళడం మరిచిపోలేదు సుధాకర్. రెండు రోజులు తన ఫోన్ మోగలేదు. తన ప్రవర్తన గురించి క్షమాపణ చెప్పడానికి లక్ష్మీపతికి వ్యవధికావాలి.

కాగా, వంగ మొక్క వేస్తే చిక్కుడు కాయ మొలవదు. ఫోన్ కాల్ ఎలా వస్తుందో, ఎవరు చేస్తారో తనకు తెలుసు.

పదో రోజు నందిత సుధాకర్‌కి ఫోన్ చేసింది చాలా చాలా అణకువగా. సెక్రటరీ సమాధానంతో రెడీగా ఉంది. ''బాస్ ఊళ్ళో లేరు. ఓ అందమైన గొంతు ఫోన్ చేసిందని చెపుతాను!''

నందిత సిగ్గుపడింది. ఆసిగ్గులో పరోక్షంగా సుధాకర్ అనే ఎత్తయిన మనిషి పట్ల మనస్సులో చిన్న ప్లస్ మార్క్ పడింది.

ఇది సుధాకర్ నందిత మీద సాధించిన తొలి విజయం మాత్రమే!!!

## 19

**మరో వారం రోజుల తర్వాత టీచర్స్ పట్టుకుని** సరాసరి లక్ష్మీపతి ఇంటి ముందే ఆగాడు సుధాకర్. అప్పటికి లక్ష్మీపతి ఇల్లు చేరలేదు. నందిత చాలా మామూలు చీరలో ఇంటి పనులు చేసుకుంటోంది. ఇంటి ముందు బెంజ్ కారు. అందులోంచి గ్రీకువీరుడిలాగా దిగుతున్న సుధాకర్‌ని చూసి షాక్ అయింది. ఏం చెయ్యాలో తెలియక కంగారు పడిపోయింది.

తనని తాను చూసుకుని సిగ్గుపడిపోయింది. అతనంతట అతను వచ్చినందుకు ఆనందపడిపోయింది. న్యాయంగా భర్త ఇంట్లో 'మందు కొలువు' తీర్చినందుకు ఆమె విసుగు చెందాలి. బాధపడాలి. కానీ అతను రావడమే తమ అదృష్టమనే వాతావరణాన్ని అత్యద్భుతంగా తయారుచేశాడు సుధాకర్.

ఆయన్ని కూర్చోమని చెప్పి, బాత్ రూములోకి దూకేసింది. చక్కగా స్నానం చేసి, సాధారణంగా పెళ్ళిళ్ళలో మాత్రమే కట్టుకునే ఖరీదైన వాయిల్ చీర కట్టుకుని చక్కగా బొట్టు దిద్దుకుంది. ఎందుకు? సుధాకర్ అనే పెద్దమనిషి కోరి తన ఇంటికి వచ్చాడు కనుక. 'ఫూల్! ఆయన విషాన్ని చేత్తో పట్టుకు వచ్చాడు' అని ఆమె మనస్సు చెప్పడం మరిచిపోయింది.

భర్త ఎక్కడికెళ్ళాడో తెలీదు. భర్త వచ్చేవరకు అతనితో కబుర్లు చెప్పడం తన బాధ్యతగా భావించి, ఎదురుగా కూర్చుంది. సుధాకర్ వచ్చిందే దీని కోసం. అయితే లక్ష్మీపతి కోసం ఎదురు చూస్తున్న గంటన్నరలో సుధాకర్ చాలా హుందాగా వరండాలో విరిగిన ఒకే ఒక కుర్చీలో కూర్చున్నాడు. ఆ విరిగిన కుర్చీయే అద్భుతమైన సోఫాలాగా నందిత ఫీల్ అయ్యేటట్టుచేశాడు. ఆమె ముందు సిగరెట్టు కూడా కాల్చడం తనకిష్టం లేదని, రెండుసార్లు సిగరెట్టు పెట్టె తీసి జేబులో పెట్టుకున్నాడు. ఆయన్ని సిగరెట్టు కాల్చుకోవచ్చని నందిత బతిమాలింది, ప్రాధేయపడింది. అగ్గిపెట్టె తెచ్చి ఇచ్చింది. అయినా కాల్చలేదు. అతని సంస్కారానికి ఆమె మనస్సులోనే అభినందనలు తెలిపింది. ఇప్పుడు నందిత మనస్సులో రెండో ప్లస్ మార్కు పడింది.

లక్ష్మీపతి మోటారు సైకిలు ఆపకముందే బెంజ్ కారు చూసి తల్లకిందులైపోయాడు. తన కోసం ఎదురు చూస్తున్న సుధాకర్‌ని చూసి ఆనందంతో దాదాపు కళ్ళనీళ్ళు వచ్చినంత పనయింది. వెంటనే పరుగెత్తుకు వెళ్ళి చిప్స్, లేపర్స్, చీజ్ స్టిక్స్ కొనుక్కు వచ్చాడు. ఆ ఆనందంలో లక్ష్మీపతిని టీచర్స్ చాచికొట్టినట్టయింది. ఆరో పెగ్గు తర్వాత ఏం జరుగుతోందో లక్ష్మీపతికి తెలియదు. ఆరో పెగ్గు ఏం చేస్తుందో సుధాకర్‌కి తెలుసు. ఆరో పెగ్గుదాకా అతన్ని తీసుకువెళ్ళడం తెలుసు. యథాప్రకారంగా లక్ష్మీపతిని సుధాకర్, నందిత మోసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టారు. నందిత భర్త ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకుంది. సుధాకర్ మరేం ఫరవాలేదని చిరునవ్వు నవ్వాడు.

ఖరీదైన వెల్వెట్ పరుపు మీద కుర్రాడు వాంతి చేసుకుంటే సిగ్గుపడే తల్లిలాగా, ఖరీదైన పార్టీలో దారి తప్పిన భర్త ప్రవర్తనకి క్షమాపణగా అతి గౌరవంగా సుధాకర్‌కి భోజనం పెట్టింది. తనగాలి కూడా ఆమెకి తగలనంత దూరంలో నడిచాడు సుధాకర్.

ఇంత చెపుతున్నప్పుడు సుధాకర్ అమ్మాయిని వలలో వేసుకోవడానికి కుట్ర పన్నే దుర్మార్గుడని చెప్పడం ఉద్దేశం కాదు. స్త్రీ తన మనస్సులో కన్నుగొట్టే మగాడికన్నా, తన నిర్లక్ష్యాన్నీ, హుందాతనాన్నీ, సంస్కారాన్నీ, సభ్యతనీ ప్రదర్శించే మగాడి పట్ల ఎక్కువ ఆకర్షితురాలవుతుందని సుధాకర్‌కు తెలుసు. కాగా, ఈ పాయింట్లన్నీ తన పక్షాన ఉన్నాయి. ఈ ఆకర్షణకి మొగ్గే స్వభావం నందితకి ఉంది. ***మధ్య తరగతి వర్గానికి ఓ బలహీనత ఉంది. పెరగాలనే ఆత్రం. పెరిగిన వాళ్ళ పట్ల గౌరవం. పెరగడంలో ఛాలెంజ్. పెంచుకోవాలనే తొందర. ఇది అందరికీ సామాన్యం కాదు. కానీ చాలా మందిలో చాలా తరచుగా కనిపించే వ్యసనం.*** ఇది లక్ష్మీపతిలో మెండుగా, నందితలో నిండుగా ఉన్నదని సుధాకర్‌కి తెలుసు. అతనికేం తొందర లేదు. కంగారు లేదు. నెమ్మదిగా, నిలకడగా, నమ్మకంగా తన లక్ష్యం వైపు ప్రయాణించేశాడు సుధాకర్.

ఈ సంఘటన తర్వాత, చాలా తరచుగా లక్ష్మీపతి ఇంటికి వచ్చాడు సుధాకర్. తప్పనిసరిగా ప్రతిసారీ లక్ష్మీపతి తాగి సగంలో స్పృహ తప్పాడు. ఎప్పుడూ నందిత సుధాకర్ కలిసి అతన్ని మంచం మీదకి చేర్చేవారు. ఎప్పుడూ క్షమాపణలతో నందిత సుధాకర్ ముందు కూర్చుని వడ్డన చేసేది. ఈసారి ఇంట్లోనే స్కాచ్ విస్కీ సీసా వదిలి వెళ్ళడం అలవాటు చేశాడు సుధాకర్. సుధాకర్ రాకముందుగానే స్కాచ్ తాగడం అలవాటు చేసుకున్నాడు లక్ష్మీపతి, పార్టీ ప్రారంభంలోనే స్పృహ తప్పడం ఆనవాయితీ అయిపోయింది. మిగిలిన రాత్రంతా సుధాకర్ కోసం నందిత కూర్చునేది. సుధాకర్‌కి వడ్డన చేసేది. ఓసారి సుధాకర్ నిద్రపోతున్న లక్ష్మీపతిని మంచం మీదనే వదిలేసి, నందితని రాత్రి పదకొండుగంటలకి ఇలియట్స్ బీచికి తీసుకువెళ్ళాడు. ఓ రోజు రాత్రి ఇద్దరూ బిలాల్‌లో టీ తాగారు. క్రమంగా ప్రతి రాత్రీ నందిత, సుధాకర్‌లు షికార్లు తిరిగే రాత్రులుగా తయారయ్యాయి.

వయస్సులో ఉన్న స్త్రీ, అంతస్తునీ, అర్హత లేని స్నేహాన్నీ, అలవాటు లేని స్కాచ్‌నీ మరిగిన భర్తతో కాపరంలో ఏం నష్టపోతుంది? తననితనే నష్టపోతుంది.

ఓ చల్లటి రాత్రిలో బీచ్ గాలికి వణికే నందిత భుజం చుట్టూ గ్వాలియర్ కోటుని కప్పాడు సుధాకర్. ఆ రాత్రే కారులో ఇంటికి తిరిగి వస్తూ అతని భుజం మీద తల పెట్టుకుంది. ఇంటికి వచ్చాక గ్వాలియర్ కోటుని తీసేసింది. దానితో పాటు ఆకలితో, ఉడికే రక్తంతో వణికే శరీరం మీద ఉన్న షిఫాన్ చీరనీ తొలిగించింది. జాకెట్టు హుక్స్ పిగిలిపోయాయి. ఆ రాత్రి సుధాకర్ ఇంటికి వెళ్ళడం మరిచిపోయాడు. బెంజికారు విండ్ స్క్రీన్ మీద మంచు బొట్లని తెల్లవారు ఝామున మూడు గంటలకి తన చీరకొంగుతో తుడిచింది నందిత.

**అది కేవలం ప్రారంభం.**

●●●

## 20

***నీతి కూడా ఓ అలవాటు. గాంధీగారిని జేబులు కొట్టమంటే ఆయనకి గుండెపోటు రావచ్చు. మంచి బతుకూ వ్యసనమే. అలాగే అవినీతి కూడా, అలవాటుగా మారాక దాన్ని అలంకరించుకోడానికి ప్రయత్నిస్తారే కానీ, వదులుకోడానికి ప్రయత్నించరు. దాన్ని సమర్థించుకోడానికి ప్రయత్నిస్తారు. కాపాడుకోడానికి ప్రయత్నిస్తారు. పంచిపెట్టడానికి ప్రయత్నిస్తారు. చుట్ట కాల్చేవాడు పక్కవాడికి ఆనందంగా తీసి ఇస్తాడు. ఆపిల్ జ్యూస్ తాగేవాడు పక్కవాడికి మరో గ్లాసు ఇవ్వాలని ప్రయత్నించడు. దురలవాటుని పంచడంలో సరదా ఉంది. పెంచడంలో 'రంజు' ఉంది.***

లక్ష్మీపతి రోజూ నిద్రపోవడానికి కొత్త కొత్త స్కాచ్ లను వాడాడు సుధాకర్. నందితతో కొత్త కొత్త ఆనందాలను పంచుకున్నాడు.

ఆమెకి ఖరీదైన బహుమానాలు ఇచ్చినప్పుడల్లా, లక్ష్మీపతికి ఖరీదైన బహుమతులందాయి. క్రమంగా అతని స్థాయి పెరిగింది. అప్పుడప్పుడు నందిత సుధాకర్ ఆఫీసుకి ఫోన్ చేసి అతని బెంజ్ కారు తెప్పించుకుంటోంది.

శని, ఆదివారాలు ముగ్గురూ కలిసి పాండిచ్చేరి వెళ్ళారు. పల్లవన్ తాంగల్ వెళ్ళి పక్షుల్ని చూశారు. మహాబులిపురం గోల్డెన్ బీచ్‌లో ముగ్గురూ కలిసి షాంపేన్ తాగారు. ముందు షాంపేన్ వగరుగా, పొగరుగా కనిపించింది నందితకి. కానీ అలా తాగడం బాగుంది. తాగే బృందం బాగుంది. తాగాక మత్తు బాగుంది. అయితే ఆ మత్తు లక్ష్మీపతికి ఎక్కువ కావాలి. అతనికి ఎక్కువ కావడం సుధాకర్‌కీ, నందితకీ కావాలి. ఇది నగర సంస్కారం తలకెక్కించిన మత్తు. ప్రతి వికారానికీ ఓ త్రోవ ఉంటుంది. లక్ష్మీపతి మెట్టెక్కి పై అంతస్తుకి ఎగబాకడానికి ఆయన చెల్లించే ఖరీదు ఈ మత్తు. అయితే అతను దీన్ని దురదృష్టంగా భావించడం లేదు. అది అతని అదృష్టం.

ఈ కథలో రెండు మెలికలున్నాయి.

***ధనవంతుడు పేదవాడైతే, కాస్త ప్రయత్నంలో పేదరికానికి అలవాటు పడతాడు. కానీ పేదవాడు ధనవంతుడైతే మళ్ళీ పేదరికానికి దిగి రావడానికి అంగీకరించలేడు. ముఖ్యంగా మధ్యతరగతి జీవితంలో గడిపే వ్యక్తికి పై అంతస్తు రుచి వదలలేనిది, వదలాలని లేనిదీను.***

లక్ష్మీపతి స్థాయిని సుధాకర్ పెంచుతున్నాడు. లక్ష్మీపతి పెరగడంలేదు. కానీ తను పెరుగుతున్నాననుకుంటున్నాడు. నందిత సుఖాన్ని పెంచుకుంటోంది. ఇద్దరూ రెండు విచిత్రమైన కోరుకున్న కలల్లో బ్రతుకుతున్నారు.

పుట్టినరోజుకి బ్రేస్‌లెట్ కొనుక్కుంటానంది నందిత. పెళ్ళానికి బ్రేస్‌లెట్ కొనిచ్చే స్థాయిలో లేడు లక్ష్మీపతి.

''కొనుక్కో, నీకేం తక్కువ?'' అన్నాడు నవ్వుతూ.

''మీరు కొనాలి కదా?'' అంది నందిత.

లక్ష్మీపతి సుతారంగా పెళ్ళాం బుగ్గపుణికి, ''మై డియర్ పార్ట్నర్! ఇవాళ రాత్రి కాస్సేపు ఎక్కువ నిద్రపోతాను. బ్రేస్‌లెట్ సుధాకర్ కమిట్ అయ్యేదాకా నిద్రపోతాను. సరేనా?'' అన్నాడు.

నందిత ఆశ్చర్యపోయింది. కానీ విచిత్రం. షాక్ కాలేదు. ఈ వ్యవహారం ఏదో ఒక రోజు తెలుస్తుందని, తెలియక తప్పదనీ నందితకి తెలుసు. తెలిసినప్పుడు ''ఇదంతా నీ వల్లే''! అని తగాదా పెట్టుకుందామనుకుంది. అతనెంతగా తన ప్రవర్తనకి దోహదం చేశాడో ఎత్తి చూపుదామనుకుంది. కానీ ఆ విషయం అతనికి అప్పటికే తెలుసునని, తను ఇక నిష్ఠూరంగా మాట్లాడే అవకాశం లేదని తెలిసి కాస్త నిరుత్సాహపడింది.

సుధాకర్‌తో అంది ''మా ఆయనకి తెలుసు'' అని.

సుధాకర్ నవ్వి, ''నాకు తెలుసు'' అన్నాడు.

***ఏమైనా డబ్బు రుచి అన్నిటికన్నా గొప్పది. అంతకంటే అంతస్తు రుచి ఇంకా వెర్రెక్కిస్తుంది.*** ఆ వెర్రిలో ఉన్నాడు లక్ష్మీపతి. సుధాకర్‌కి ఆ అంతస్తుకి ఎదగడం కష్టమూ కాలేదు, నష్టమూ లేదు. ఇది మొదటి మెలిక.

ఇంతకీ సుధాకర్ భార్య ఏం చేస్తోంది? ఆవిడెవరు? సుధాకర్ భార్య పేరు మోనా. వాళ్ళ నాన్న మిలటరీలో కల్నల్. ఆయనకి మోనాలిసా అన్నా, రష్యన్ వోడ్కా అన్నా, బ్లడీ మేరీ అన్నా, 303 బోర్ తుపాకీ అన్నా, ఫ్రెంచి ముద్దు అన్నా చాలా ఇష్టం. ఆయన బంగ్లాదేశ్ యుద్ధంలో గాయపడి ఓ కాలునీ, రెండు పళ్ళనీ నష్టపోయాడు. ఒక విశిష్ట సేవా మెడల్‌నీ, డయాబిటీస్‌నీ సంపాదించుకున్నాడు. దరిమిలా ఆయన మిగిలిన కాలుకి శరీరం బరువై, వీల్ చెయిర్‌ని ఆశ్రయించుకున్నాడు. కూతురుకి మోనాలిసా పేరుపెట్టుకున్నాడు.

మోనాకి ఇద్దరు పిల్లలు. కనడం బాధ్యత కనక, ఇద్దరు అబ్బాయిల్ని కని, ఊటీ పబ్లిక్ స్కూలులో చేర్పించింది. పిల్లలు అప్పుడే పూసిన జినియా పువ్వుల్లాగా, కంపోస్టు వేసి పెంచిన కాలీఫ్లవర్‌ల లాగా కాస్త ఓవర్ సైజులో ఉంటారు. మోనా ఎక్కుపెట్టిన తుపాకీలాగా ఉంటుంది. చూడగానే మిలటరీ ఆయన కూతురనిపించదు. ఆవిడే మిలటరీ మనిషిలాగా ఉంటుంది. ఆమె ముఖంలో అవయవాలన్నీ నిర్దుష్టంగా ఒకటికి రెండుసార్లు గీతల్ని సవరించుకుని మరీ బ్రహ్మ సృష్టించాడనిపిస్తుంది. శరీరం పోత పోసిన ఉక్కులాగా ఉంటుంది. ఆలోచనలు ఫిరంగి గుండులాగా పేలుతాయి.

ఇలాంటి మనిషికి బొచ్చుకుక్కల మీదా, ఇటాలియన్ స్పాగెట్టీ మీదా, లిప్ స్టిక్కుల మీదా, బసోటా పార్టీల మీదా మనసుండాలి. కానీ ఆశ్చర్యంగా వెంకటగిరి చీరల మీదా, ఉల్లిపాయ పప్పుపులుసు మీదా, సెనగపప్పు బూరెలమీదా, భద్రాచలం యాత్రలమీదా మక్కువ ఎక్కువ. అలాగని, కేవలం సంప్రదాయాన్నే ప్రేమించే సనాతనం కాదు. తను నమ్మిన అలవాట్లను అతి క్రూరంగా పాటించే మోడరన్ లేడీ.

సుధాకర్ లాగా చిరుతిళ్ళు ఆమెకి అలవాటు లేదు. మృష్టాన్న భోజనం ఆమెకిష్టం. కార్లలో ముద్దుపెట్టుకోవడం ఆమెకి నచ్చదు. దారిలో, అందాకా ఓ పెగ్ సిప్ చెయ్యడం ఆమెకి అలవాటు లేదు. ఆమెకి భోజనం ఓ కార్యక్రమం. ఆనందం ఓ ఉద్యమం, సెక్స్ వేళపాటున సాగే ఓ అంశం. ఇక్కడే సుధాకర్‌కీ, మోనాకీ పొంతన కుదరలేదు. అయితే సుధాకర్ తెలివైనవాడు. భార్యతో తగాదా పడే రకం కాదు. పడాల్సిన అవసరమూ లేదు. కల్నల్‌గారు పోయాక ఆస్తంతా ఒక్కగానొక్క కూతురుకి వస్తుంది. కాగా, భార్యకి పద్ధతులున్నాయేకానీ, మూర్ఖత్వం లేదు. భార్యాభర్తల మధ్య స్వభావాల్లో వైవిధ్యం రాజీపడలేనంత ఇబ్బందికరమైన విషయం కాదు.

అయినా చాలామంది అమ్మాయిలతో రాజీపడడం తెలిసిన సుధాకర్‌కి ఇది కష్టమూ కాదు. సుధాకర్ గడుసువాడు. ఎదుటి వ్యక్తిని, ముఖ్యంగా అమ్మాయిలను ఆనందపరిచే ఇచ్చకాలు చెప్పడం తెలిసిన మనిషి అతను.

సుధాకర్ క్యాంపులు తిరగడం మోనాకి అలవాటే. పార్టీలూ అలవాటే. కానీ వరస తప్పకుండా ప్రతిరోజూ అర్ధరాత్రి ఇంటికి రావడం ఆమెని ఆశ్చర్యపరచింది. అంతకంటే అందుకు కారణం తెలుసుకోవాలని కుతూహలం కలిగింది. తెలుసుకోడానికి ఆమె మార్గాలు ఆమెకు ఉన్నాయి. ఆఫీసుకి బయలుదేరేముందు అతని కారు మీటరు రీడింగు చూసింది. రాత్రి వచ్చాక, రీడింగు గమనించింది. మరీ పాతిక కిలోమీటర్ల లోపుగానే కారు నడిచింది. సుధాకర్ వెదుక్కుంటున్నది ఆనందమే అయితే ఆ ఆనందం నగరం పొలిమేరలు దాటలేదు.

వాళ్ళ నాన్న పెళ్ళి అవుతూనే ఆమెకి ఓ ఫియట్ కొనిచ్చాడు. కానీ ఆ రోజు దాన్ని వాడదల్చుకోలేదు మోనా. ఓ స్నేహితురాలికి ఫోన్ చేసి, తన కారు ట్రబులిచ్చిందనీ, ఆవిడ కారు పంపమనీ అడిగి కారు తెప్పించుకుంది. సాయంకాలం మోనా భర్త ఆఫీసు దగ్గరకి వచ్చింది. కాస్త పక్కగా పార్క్ చేసింది. ఆఫీసులోకి వెళ్ళలేదు. ఆఫీసులో నుంచి ఠంచన్‌గా అయిదుగంటలకి బయటికి వచ్చి బెంజ్ ఎక్కిన భర్తని అనుసరించింది. కమాండరన్ చీఫ్ రోడ్డులో గీతా హోటల్ దగ్గర కారాగింది. భర్త వెళ్ళాక ఆ హోటల్ బయట ఉన్న కిళ్ళీకొట్టు దగ్గరికి వెళ్ళింది. ఈ కిళ్ళీకొట్టు దగ్గర భర్తకేం పని? కొట్లో జర్దా కిళ్ళీ సామాన్లున్నాయి. సిగరెట్లున్నాయి. ఫాన్సీ వస్తువులున్నాయి. సుధాకర్ ఇక్కడేం కొంటున్నాడు?

ఫాషన్ బుల్‌గా ఉన్న ఆమెని చూసి ఓనర్ సర్దార్ నవ్వాడు. లోపల్నుంచి కారు దగ్గరకి వచ్చాడు. "క్యా హై మేమ్ సాబ్?" అన్నాడు.

ఏం చెప్పాలో మోనాకి అర్థం కాలేదు. "మా ఆయన ఇందాకే ఢిల్లీ నుంచి వచ్చారు. ఆయనకి.." ఆగింది. కేవలం నోటికొచ్చిన మాటగానే అంది.

'సాబ్ ఏ బ్రాండ్ వాడుతారు మేడమ్? బ్లాక్ డాగ్, నెపోలియన్, కూర్వాయిజర్?'

అర్థమైంది. ఫారిన్ డ్రింక్స్

"ఇప్పుడొచ్చినాయనకి ఏమిచ్చావు?"

"టీచర్స్ మేమ్ సాబ్! ఆ సాబ్ కి రోజూ ఓ టీచర్స్ కావాలి. వన్ లీటర్ బాటిల్. "

"మా ఆయనకి ఫోన్ చేసి వస్తాను!" అని కారు స్టార్ట్ చేసింది.

ప్రతిరోజూ లీటర్ స్కాచ్ ఖర్చు చేసే కంపెనీలో గడుపుతున్నాడన్నమాట! ఆ తర్వాత ఎక్కువ శ్రమపడకుండానే రాత్రిపదకొండు గంటలకి బీచ్ రోడ్డులో బుహారీ రెస్టారెంట్ చెట్ల కింద, వెన్నెల నీడల్లో ఇద్దరి పెదాలూ కలవడం గమనించింది. నందిత చాలా అందంగా, అనుభవించదగినదిగా కనిపించింది. సుధాకర్ అభిరుచి ఆమెని బాధపెట్టలేదు. కానీ సుధాకర్ అవినీతి ఆమెను తాచుపాములాగా రెచ్చిపోయేటట్టు చేసింది. ఆ చీకటి ముద్దు ఆమెని మరింత కోతపెడుతూండగా, మూడు ఐస్ క్రీమ్‌లు పట్టుకుని మరో వ్యక్తి కారు దగ్గరికి రావడం గమనించింది. వెన్నెట్లో లక్ష్మీపతి సుధాకర్ కంటే స్థాయిలో తక్కువని అర్థమవుతోంది. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూండగా కారు కదలడం ఆమెలో విచిత్రమైన కదలికలను కలిగించింది.

మోనా అలకలు పోయే మనిషి కాదు. అల్లరి చేసే మనిషీ కాదు. జీవితాన్ని అల్లరి చేసుకునే మనిషీ కాదు. ప్రతి రాత్రీ నందిత దక్కించుకునే సెక్స్ తను నష్టపోయిన ఆనందమని ఆమెకి అర్థమవుతోంది. ఆ ఆనందం తన హక్కు.

సుధాకర్ అలాంటి ఆనందాన్ని మరో చోట వెదుక్కుంటున్నాడు.

ఆవిడ బుర్రకి మిలటరీ అలవాట్లున్నాయి. ఆమెలో మిలటరీ ఆవేశం ఉంది. భర్త మీద ప్రతీకారాన్ని మిలటరీ పద్ధతిలో ప్లాన్ చేసింది. ఓ రాత్రి లక్ష్మీపతి ఇంట్లో లేని రాత్రి సుధాకర్ తన వంతు ఆనందాన్ని ఆస్వాదించి ఇల్లు చేరేసరికి మోనా నైట్ గౌన్‌లో వరండాలోనే ఉంది. ఆమె చేతిలో ప్రిన్స్ హ్యూబర్ట్ పోలినాక్ రెడ్‌లైన్ ఉంది. శరీరం స్పష్టంగా కనిపించే రకం నైట్ గౌన్ వేసుకుంది.

"హల్లో డార్లింగ్!" అన్నాడు సుధాకర్.

"హల్లో డియర్!" అంది మోనా. అతని శరీరం మీద మరో స్త్రీవాసన తెలుస్తోంది.

బెడ్ రూములో సుధాకర్ అడుగుపెట్టగానే, "మీట్ మై బాయ్ ఫ్రెండ్!" అంది మంచం చూపిస్తూ.

మంచం మీద లక్ష్మీపతి ఆనందంగా - తన లుంగీ కట్టుకుని ఉన్నాడు. అతని చేతిలో టీచర్స్ స్కాచే ఉంది. అతని ముఖంలో తరచుగా కనిపించే చిరునవ్వే ఉంది.

"పతికి టీచర్ ఇష్టమట. నువ్వు అలవాటు చేసిందే కదా! గీతా హోటల్ పాన్ షాప్‌లోంచే తెచ్చాను. సర్దార్ ఎప్పుడూ మంచి సరుకే ఇస్తాడు - డిపెండబుల్!"

సుధాకర్ చాచి మోనాని చెంపమీద కొట్టాడు.

మోనాలో మిలటరీ రక్తం పొంగింది. ఆ రక్తానికి ఫ్రెంచి పోలినాక్ సహకరించింది. అంతకంటే బలంగా పక్క ఇంట్లోకి కూడా వినిపించేలాగా కల్నల్ గారి 303 తుపాకీలాగా, సుధాకర్ చెంప మీద కొట్టింది. ఆ దెబ్బకి లక్ష్మీపతి ఒడిలో పడ్డాడు సుధాకర్.

ఆ తర్వాత మరో గంటకి ముగ్గురూ రాజీ పడ్డారు. సుధాకర్, మోనా ఒకరిచెంపమీద ఒకరు తడువుకుని పగలబడి నవ్వుకున్నారు. నీతి ముసుగు తొలిగిపోయాక ఆనందానికి గణితమే కొలబద్ద, నీ ఆనందానికి నీకో కొత్తదారి కావాలి. నా ఆనందానికి నాకో కొత్తదారి కావాలి. అది అవసరమైనప్పుడు ఇదీ అవసరమే! అది సాధ్యమైనప్పుడు ఇదెందుకు సాధ్యం కాదు? ఇద్దరికీ ఒకే రూల్స్ వర్తించాలి. నువ్వు ఆపిల్ పండు తింటూ నన్ను తినొద్దనడం ఏం న్యాయం?

నాగరికత, జీవనసరళి, మారే సమాజం, అప్పటి పరిస్థితులు ఆ రెండు జంటల్నీ ఆనందంగా రాజీపడే పొరపాటు, ఆనందానికి రాజీపడే జంటలుగా తీర్చిదిద్దినా, మరో ఇరవై ఏళ్ళకి అది ఫాషనూ, సామాన్యమూ అయిపోయింది. ఇందుకు ప్రఖ్యాత రచయిత విక్రమ్ చందా మాటలే సాక్ష్యం!

"…that below the austere surface of Indian Conservatism is a fluid and lusty carnival of sex… but we live, sexually, this curious patch work arrangement of cynicism and naivete, of experience and innocence, of public posturings and not, so – hidden hedonism."

## 21

**సీత చాలా రోజులపాటు నందిత షాక్ నుంచి తేరుకోలేకపోయింది.** షాక్‌కి కారణం 'ఇలా జరుగుతోందే!' అని కాదు, 'ఇలా కూడా జరగవచ్చా!' అని. ***సమాజం తన కోర్కెల్ని తీర్చుకోవడానికి రకరకాలైన విశృంఖలత్వాన్ని ఎన్నుకుంటోంది. పాపభీతి, భయం,***

***అవినీతి, ధర్మవిరుద్ధం ఇలాంటి వన్నీ ప్రిటెన్షన్స్ అనిపిస్తున్నాయి. సంస్కారం, కట్టుబాట్ల స్థాయి నుంచి 'కోరిక'ని పాశవికపాశవిక స్థాయికి మానవుడు తీసుకుపోతున్నాడు.***

సీత కళ్ళముందు సరవ్వ, సుధాకర్, లక్ష్మీపతి, నందిత, మాల్యాద్రి అందరూ ఈ దిశలోనే పరుగులు తీస్తున్నట్లు కనిపించింది. సీతకి కోపంగా ఉంది. ఎవరి మీద? కోరికలు కొత్తదారులు వెతుక్కునే నాగరిక సమాజం మీదా? వెదుక్కోవడం తప్పని ఇంతకాలం బంధించిన సనాతన సంప్రదాయం మీదా? ఎక్కడో ఏదో పొరబాటు ఉంది. అది ఆమె మెదడుకు అందడంలేదు.

రేణూకి గొడవలేం లేవు. ప్రపంచాన్నంతటినీ జయించిన సామ్రాజ్ఞి ఆమె! దీప ఆమె సామ్రాజ్యం. ఆమె కిప్పుడు ఆనందం కలిగించే విషయాలు దీప వేసే తప్పటడుగులు. మాల్యాద్రి వేసే తప్పుటడుగులు.

"మొన్నరాత్రి ఏం చేశారో తెలుసా? ఓ రాత్రప్పుడు దీపని పక్కకి జరిపి నా పక్కకి వచ్చి పడుకున్నారు. జాకెట్టు తడుముతుంటే నిద్దట్లో పాపేమోననుకుని నేనే బటన్లు తప్పించాను. తీరా విస్కీ వాసనతో తుళ్ళిపడి లేచాను. ఈ మాటు పక్కకి వస్తే చంపుతానన్నాను!" ఇది రేణూకి పెద్ద జోక్!

***పండు పక్వానికి వచ్చాక చెట్టు ఆనందంగా దాన్ని వదులుకుంటుంది. దోరగా ఉండే కాయని చూస్తే చెట్టుకి వెక్కిరింపు - త్వరలో దాన్ని వదులుకోబోతున్నానని చెట్టుకి తెలుసు కనక. ఇది కష్టంగా వదులుకోవడం కాదు. గర్వంగా విడిచిపెట్టడం.*** సెక్స్ కోసం ప్రాధేయపడే భర్తని దూరంగా ఉంచడం రేణూ గ్లామరు.

ఓ రోజు హడావుడిగా వచ్చింది రేణూ.

"ఏమండీ మీకో విషయం తెలుసా?" అంది రహస్యంగా.

"ఏమిటి?"

"మా ఆయన మరో అమ్మాయిని మరిగాడు."

సీత షాక్ అయింది.

"ఏమిటండీ మీరనేది?"

చేతిలో ఉన్న షర్టును దులిపింది. మాల్యాద్రి షర్ట్ జేబులోంచి మల్లెపువ్వులు రాలాయి. నిజంగానే ఆశ్చర్యపోయింది సీత.

కొండలరావుకి సరవ్వతో సాంగత్యం ఉన్నదని తెలిశాక, నందిత సుధాకర్‌తో పరిచయాలు పెంచుకున్నాక, మాల్యాద్రి జేబులో మల్లెపువ్వులు అంత విడ్డూరమైన విషయమేమీ కాదు. కానీ విచిత్రమేమిటంటే, అలా చెపుతున్నప్పుడు రేణూలో నిరుత్సాహం కానీ, దుఃఖం కానీ, బాధకానీ ఏమీ ఉన్నట్లు కనిపించలేదు. పైగా, తన భర్తని మరో అమ్మాయి వాంఛించే అందగాడనో, సమర్ధుడనో చెప్పుకోవాలనే చిన్న గర్వం కనిపించింది.

ఓసారి బాత్ రూంలోంచి బయటికి వస్తుంటే, రేణూ రహస్యంగా వచ్చి, సీత ముక్కు దగ్గర ఓ రుమాలు పెట్టింది. నిస్సందేహంగా అది అమ్మాయి రుమాలు.

అంతకు మించి అమ్మాయిల సెంటుతో ఘుమ ఘుమలాడుతున్న రుమాలు. అయితే రేణూ అనుమానించడంలో ఆధారాలు లేకపోలేదన్నమాట. ఆలోచించగా, మాల్యాద్రిని తలుచుకుంటే ఒళ్ళు మండిపోయింది. కానీ రేణూకి మండిపోవడం లేదు.

"నీకు కోపంగా లేదూ? మీ ఆయన చెంప పగలగొట్టాలని లేదూ?"

నవ్వింది రేణూ. "మగవాళ్ళంతా ఇంతే బాబూ! మనం చూసీ చూడకపోతుంటేనే మర్యాద దక్కుతుంది!" ఇందులో సనాతనమైన స్త్రీ నిస్సహాయత లేదు. మగాడి విచ్చలవిడితనం గురించి సెన్సాఫ్ హ్యూమర్ ఉంది.

మరోసారి హెయిర్ రిమూవర్ చూపించింది రేణూ. "నేను చెప్పానా? ఆ సోకులాడికి అన్నీ కొని పెడుతున్నారాయన."

"మరి మీ వారిని నిలదీయలేకపోయారా?"

"నిలదీస్తే బుకాయిస్తారు. సాక్ష్యం చూపిస్తే మాట మారుస్తారు. ఎలాగైనా గెలుపు వాళ్ళదే!" ఇది సంప్రదాయానికి గర్వంగా (నిస్సహాయంగా కాదు) ఒదిగే భారతీయ మహిళ పోశ్చర్.

ఒకరాత్రి అనుకోకుండా మాల్యాద్రి సీతకి తటస్థపడ్డాడు. ఓ రోజు అర్ధరాత్రి లేచి కింక పెట్టేశాడు మధు. ఏం చేసినా ఏడుపు మానలేదు. కొండలరావు డ్యూటీలో ఉన్నాడు. లేచి, ఇంత చక్కెర నీళ్ళలో కలిపి పట్టింది. ఏడ్చి ఏడ్చి అలిసి తల్లి భుజం మీద పడుకుని వెక్కిళ్ళు పెడుతున్నాడు. నిద్రపుచ్చుతూ గానుగ చెట్టు కిందకి వచ్చి పచార్లు చేస్తోంది సీత. అప్పుడు వచ్చాడు మాల్యాద్రి. అప్పటికి రెండో ఝాము నిద్రలో ఉంది రేణు. వేగంగా తిరుగుతున్న ఫాన్‌కి గాలి గదిలో గింజుకులాడడం తెలుస్తోంది.

మాల్యాద్రి రావడం దూరం నుంచే అర్థమైంది సీతకి. అతని ఊపిరి బరువుగా ఉంది. కాళ్ళూ బరువుగానే పడుతున్నాయి. స్కూటర్ గేటు దగ్గరే ఆపి తోసుకు వచ్చాడు. బహుశా స్కూటర్ ఇంకా దూరంగా ఆగిపోయిందేమో! లేదా, ఆపవలసి వచ్చిందేమో! అతనొచ్చే టైముకి తను చెట్టు కింద ఉన్నందుకు విలవిలలాడిపోయింది సీత, తప్పు చేస్తున్న వాడిని చూసినప్పటి ఉద్విగ్నత కాదు. తప్పుచేస్తున్నవాడికి అనవసరంగా ఎదుటపడ్డామే నన్న ఇబ్బంది.

లోపలికి వెళుతున్నవాడు ఆగి, ఇప్పుడు గమనించాడు సీతని. ఎక్కడో మునిసిపాలిటీ దీపం తప్ప, అక్కడ వెలుగు లేదు. ఎదుటి పడక గది తలుపు వారగా వేసి ఉంది. అందులోంచి ఓ వెలుగుచార వరండాలోకి పరుచుకుంది.

"అబ్బాయి నిద్రపోవడం లేదా?" అన్నాడు ఆగి.

సీత సమాధానం చెప్పలేదు.

"నేను సహాయం చెయ్యనా?" అని ఆమె వైపు ఒకడుగు వేశాడు.

ఓ క్షణం తనని రేణూ అనుకున్నాడేమోనని అనిపించింది సీతకి.

"మీ ఆవిడ నిద్రపోతోంది - గదిలో!" అంది కంగారుగా.

మాల్యాద్రి నవ్వాడు. చీకట్లో కూడా ఆ నవ్వు అందంగా ఉంది. "నువ్వు సీతవని గుర్తుపట్టాను. రేణూ ఈ టైముకి నిద్రపోతుందని గుర్తుంది. ఓ అమ్మాయిని ఇంటి దగ్గర దించి వస్తుంటే టైరు పంచరయింది. నిద్రపట్టడానికి చాలా టైం పడుతుంది. మధూని ఇలా ఇయ్యి!"

సీతకి అతని నిజాయితీకి అభినందించాలో, సిగ్గు లేకుండా ఆడదాని గురించి చెపుతున్నందుకు అసహ్యించుకోవాలో ఓ క్షణం అర్థంకాలేదు. "నిద్రపట్టకపోతే మీ ఆవిడని లేపండి!" అని ఇంట్లోకి వెళ్ళబోయింది. కానీ లోపలికి వెళ్ళే వరండా గుమ్మం దగ్గర అతను నిలబడి ఉన్నాడు. సీత అటు అడుగువేయగానే కావాలని అతనికి అడ్డం వచ్చాడు.

"నేనంటే నీకెందుకంత అసహ్యం?" అన్నాడు.

ఆ ప్రశ్నకి క్షణకాలం బిత్తరపోయింది సీత.

"జేబుల్లో మల్లెపువ్వులు, సెంటు రాసిన ఆడపిల్లల రుమాళ్ళు పెట్టుకు తిరిగే మగాళ్ళని ఎవరూ పువ్వుల్లో పెట్టి పూజ చేయరు. అయినా నేను మిమ్మల్ని అసహ్యించుకుంటే మీకేం నష్టం?"

మాల్యాద్రికి ఇంకా నవ్వొచ్చింది. త్యాగరాజస్వామి వారి అలకలాగా ఉంది అతనికి. "నే పొగడకుంటే నీకేమి కొదువో?" అన్నారాయన శ్రీరాముల వారిని.

మగతనిద్రలో ఉన్న మధు లేచాడు. లేస్తూనే ఏడుపు మొదలెట్టాడు. సీత కూడా ఊహించనట్టుగా ఉన్న పాటున ఆమె చేతుల్లో మధుని తీసుకుని భుజం మీద వేసుకున్నాడు. ఒక్క క్షణం నిరుత్తరైంది. మధుని సముదాయించడం కంటే, ఆమె అదాటుగా లోనికి వెళ్ళిపోకుండా బిడ్డని చేతుల్లోకి తీసుకున్నాడనిపించింది సీతకి. ఏమైనా కొండలరావు వచ్చినా మేలే! ఈ మనిషి ముందు తన శ్రేయస్సు కంటే, అతని సమక్షంలో ఉండడమే తనకో చెప్పరాని చికాకు కలిగించింది.

"సీతా! నేను శ్రీమహావిష్ణువునో, అవతార పురుషుడినో కాదు. కానీ నా జీవితంలో సరవ్వలేదు."

సీత చర్రున తాచుపాములాగా లేచింది. "మా ఆయన్నేం కించపరచనక్కరలేదు. ఆయన జీవితంలో పదిమంది సరవ్వలున్నా, మీరు ఆయన కాలిగోటికి సరిపోరు. ఆయన దేవుడు!"

"ఈ ఇంటిలో మరో దేవత కూడా ఉంది. ఆవిడ పేరు రేణూ!" ఒక్క క్షణం తన పెళ్ళాన్ని తనే వెక్కిరిస్తున్నాడేమోననుకుంది సీత.

"ఏం? మీ బలహీనతల్ని తెలిసి కూడా నోరుమూసుకుని పడిఉన్నందుకా?"

"సీతా! నీకు చాలా పొగరుంది. నీ గురించి నీకు అహంకారం ఉంది. కానీ చాలా సందర్భాలలో - నిజానికి అన్ని సందర్భాలలో ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవడం తెలియదు. యూ ఆర్ ఎ ఫూల్!" అన్నాడు.

సీతలో కోపం తాచుపాము విషంలాగా తలకెక్కుతోంది. "యూ..!" అని అరిచి మీదపడి రక్కాలని ఉంది అతన్ని.

"రేణూ చాలా విచిత్రమైన టైపు. తను సెక్సీగా ఉండడం ఎలాగో నువ్వు నేర్పించావని ప్రతిక్షణం నాకు గుర్తుచేస్తూ నాతో మంచం మీద గడిపింది రేణూ. నమ్ముతావా? రేణూ అమాయకురాలేం కాదు. తనకి ఆకర్షణ లేదని తెలిసి, తనలో సెక్స్ నన్ను కవ్వించలేదని తెలిసి, ఆకర్షణ ఎలా పెంచుకోవాలో నీ దగ్గర నేర్చుకుని - అంతవరకు ఫరవాలేదు. ప్రతిక్షణం తన శరీరంలోని ఆకర్షణ నీ శరీరంలోని ఆకర్షణ అని నాకు గుర్తు చేస్తూ మరీ సెక్స్ అనుభవించింది".

సీత ఒళ్ళు చల్లబడిపోయింది. అతని పట్ల ఆవేశం దుఃఖంగా మారేటట్లుంది. ఒళ్ళు చెమటలు పట్టాయి.

"తన పెదాల్ని తాకిస్తూ, నీ పెదాల్ని గుర్తుచేసేది. తన నడుం చుట్టూ నా చెయ్యి తిప్పుకుని నీ నడుముని వివరించేది. తన జాకెట్టు విప్పుతూ నీ.."

"స్టాపిట్!" అని అరవాలనుకుంది సీత. కానీ గొంతు జీరబోయింది. ఎవరో తనని మోసం చేస్తున్నట్టనిపించింది. కానీ రేణూ చాలా గడుసుది. తనలో లేని కొత్త సెక్స్‌ని, తన సమక్షంలోనే అతని మనస్సులో సృష్టించుకుంది. తన భర్త కౌగిట్లోనే ఆ సెక్స్‌ని పండించుకుంది. అందమైన ఫలితాన్ని 'దీప' రూపంలో సంపాదించుకుని, ఆ సెక్స్‌కి కారణమైన మనిషిని దూరంగా తన్నేసింది.

"రేణూ తెలివైనదని చెప్పడానికే ఇది చెపుతున్నాను. అంతేకాదు. ప్రతిక్షణం నా పడకగదిలో నీ పట్ల ఆకర్షణని ఎంత పకడ్బందీగా, ఎంత సుస్పష్టంగా, ఎలా బలంగా సృష్టించడం జరిగిందో, నేనెంత ఆవేశాన్నీ, సెక్స్‌నీ అనుభవించానో - దానికి మా దీపే సాక్ష్యం. సీతా! నిన్ను చూడకుండా, వీలైతే నీకు దూరంగా పారిపోవాలని ఎంతగా ప్రయత్నిస్తున్నానో నీకు తెలియదు."

సీత స్థాణువైపోయింది.

"ఇది రేణూ నా చుట్టూ అల్లిన తియ్యని కుట్ర. వద్దు, నన్ను ఆపకు. చెప్పనీ! ప్రతీ రాత్రీ రేణూ అనే వ్యక్తి శరీరం మీద నిన్ను కేవలం నిన్నే రేప్ చేస్తున్నాను. ఇది నీకు దూరంగా ఉండడానికే! నీకు అన్యాయం జరగకుండా ఉండడానికి నేనెంత ప్రయత్నం చేస్తున్నానో తెలియజెప్పడానికి మాత్రమే మాట్లాడుతున్నాను."

సీతకి అక్కడినుంచి పారిపోవాలని కూడా అనిపించలేదు. తన చుట్టూ చీకటి ఉండటం ఆమెకి మేలే చేసింది. ఆ మెట్ల మీద అలాగే కూలబడిపోయింది. ఆ మెట్ల చివర మాల్యాద్రి కూడా కూర్చున్నాడు. మధు అతని భుజం మీద హాయిగా నిద్రపోయాడు.

"ఇప్పుడు రేణూకి నా అవసరం లేదు. నాకు తెలుసు. కానీ రేణూ కారణంగానే నాకు నీ అవసరం ఉంది. తన ప్రయోజనానికి నల్లమందు దక్కకుండా చేస్తే అతని పరిస్థితి ఏమవుతుంది? నేను పెద్దమనిషిని. నీతో ఈ విషయాలు చెప్పనక్కరలేదు. నీకీ విషయాలు తెలియనక్కరలేదు. కానీ నా నుంచి నిన్ను కాపాడడానికి నేనెంత శ్రమపడుతున్నానో, నన్ను ప్రతిక్షణం ఓ పురుగులాగా, స్త్రీలోలుడులాగా భావించే నీకు తెలియడం అవసరం. అది నా ఇగోని నేను కాపాడుకోడానికి."

సీత లేవబోయింది. మొదటిసారిగా చెయ్యిపట్టుకు కూర్చోపెట్టాడు. "లేవకు, ఇంకాస్త నువ్వు వినాలి. నువ్వే వినాలి."

"నా జేబులో మల్లెపూలు రేణూ వేసినవి. ఆ సెంటు పాకెట్ రుమాలూ, హెయిర్ రిమూవర్ తనవి. తను నాలాంటి భర్తని పొందడంలో ఎంత అదృష్టవంతురాలో నీకు తెలిసేట్టు చేస్తోంది. అంత గొప్ప మగాడిని తను తృణీకరిస్తోందని నువ్వు భావించాలి. రేణూ చాలా విచిత్రమైన సైకో. *ఆలోచనల్లోనే అందమైన సాలెగూడులు నిర్మించగల మనిషి"*.

"మీ జీవితంలో మరో మనిషి ఉన్న విషయం నిజం కాదంటారా?" చీకటి కనుక అడగగలిగింది.

"నిజమే, నా జీవితంలో చాలా కేర్‌ఫుల్‌గా, క్రూరంగా పెంచిన ఒకే ఒక మనిషి నువ్వే. అంతకు మించి మరో అమ్మాయి లేదు."

సీత లేచింది. "ఇందాక స్కూటర్ మీద వచ్చి దిగిన అమ్మాయి?"

మాల్యాద్రి లేచాడు. బరువుగా నిట్టూర్చాడు. "ఆవిడా?" అంటుంటే అతని గొంతు వణికింది. 'మా మిత్రుడు మధ్యాహ్నం బస్సు ఢీకొట్టి చచ్చిపోయాడు. అతని భార్యకి, శవాన్ని గంట కిందటే ఆసుపత్రి వాళ్ళు అప్పగించారు. శవంతో ఆటోలో వెళ్ళలేదు గనుక నా స్కూటరు మీద దిగబెట్టాను."

వాళ్ళిద్దరి మధ్య నిశ్శబ్దం పేరుకుపోయింది. నిజానికి గడ్డ కట్టింది. సీత నిశ్శబ్దంగా మధూని అందుకుంది.

రెండడుగులు ముందుకు వేసిన సీతని ఆపాడు మాల్యాద్రి.

"సీతా! మరొక్కమాట!"

ఆగింది.

"నాకు సన్నీ తెలుసు. కాదు. సన్నీకి నీకూ మధ్య జరిగిందంతా తెలుసు. నిన్ను అసహ్యించుకోడానికి అది కూడా నాకు సహకరించలేకపోయింది. "

సీత నెత్తిమీద పిడుగు పడ్డట్టయ్యింది.

సీతకి తన గదిలోకి రావడం గుర్తులేదు. మధూని మంచం మీద పడుకోబెట్టడం గుర్తురాలేదు.

ఉన్నట్టుండి తలుపు దగ్గర అలికిడి అయింది. కొండలరావు వచ్చి ఉంటాడు. తటాలున లేచి కూర్చుంది. గుమ్మం దగ్గర మాల్యాద్రి నిలబడి ఉన్నాడు. మొదటిసారి భయం ఎరగని సీత భయపడింది. అతనికి తెలిసి తన గతం అతని ఉద్దేశాన్ని మరింత బలపరిచిందేమో! ఆమె గతం ఆమెని పిరికిదాన్ని చేసింది. అతను తన భుజం మీద చెయ్యేస్తే ఏం చెయ్యాలి?

మాల్యాద్రి గుమ్మం దాటి లోపలికి అడుగుపెట్టలేదు.

"సీతా! నీ గురించి నాకూ, నా గురించి నీకూ ఇంత తెలిశాక ఒకే ఒక రిక్వెస్టు. దయచేసి ఈ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోండి. ఏ కారణం చెప్పయినా కొండలరావుని ఒప్పించు. వీలైనంత త్వరగా ఆ పని జరగాలి. నాకోసం, నీకోసం ఏ కారణం చేతయినా అలా జరగని నాడు నీ కారణంగా - ఒక్క నీ కారణంగా నేను ఈ దేశం వదిలి వెళ్ళిపోవాలి. ఐ ప్రామిస్ యూ!"

తలుపులు మెల్లగా దగ్గరకు లాగి వెళ్ళిపోయాడు మాల్యాద్రి.

●●●

## 22

ఆ రోజు రాత్రి మాల్యాద్రితో సంభాషణ జరిగిన తర్వాత పది పదిహేను రోజులు దాకా సీత ఇంట్లోంచి బయటికి రాలేదు. మాల్యాద్రికే కాదు, రేణూకు ఎదురుపడటానికి ఆమె మనస్సు ఎదురాడింది.

***ఇంగ్లీషులో ఓ సంప్రదాయం ఉంది. తల్లి చూస్తుండగా బిడ్డని ముద్దుపెట్టుకోవడం సాధారణంగా చెయ్యరు. చెయ్యకూడదంటారు. కారణం తల్లి సమక్షంలో బిడ్డని ముద్దు పెట్టుకోవడం తల్లిని పెట్టుకోవడమేనని.***

నిజానికి "నువ్వు చాలా అందంగా ఉన్నావు!" అంటూ బిడ్డని ముద్దు పెట్టుకోవడం తల్లికి ఆ మాట చెప్పడమేనని. అందుకని దీపని చూసినా సీతకి చాలా సిగ్గు ముంచుకొచ్చింది. దీప పుట్టుకకి కారణమైన వారి మధురమైన క్షణాలలో తన ఆలోచన ఉంది. ఇంకా చెప్పాలంటే తన ఆలోచనే ఉంది.

రేణూ, మాల్యాద్రి జాడలేని టైము చూసుకు మరీ స్నానం చేసివచ్చి, తన గదిలోకి పారిపోయేది సీత. నిజానికి ఆలోచనల్లో తనలో తాను కుచించుకుపోయే స్వభావం కాదు సీతది. ఇది ఇంట్రావెర్ట్ లక్షణం కాదు. తనని ఎవరో మగాడు గర్వంగా రేప్ చేసి, తనకి తెలియకుండా రేప్ చేసి, తనకి సాక్ష్యం చూపించినట్లు భావించింది.

సీత జీవితంలో ఒక వ్యక్తికి తను దూరంగా ఉండాలనుకుంటే అది మాల్యాద్రికి. అతని నవ్వు, అతని సొగసూ, అతని ఆత్మవిశ్వాసం, అన్నిటికీ మించి అతని సామర్థ్యం తనని వెక్కిరిస్తున్నట్టనిపించింది.

***జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు కొన్ని పర్యవసనాలకి అందమైన, సుతారమయిన లింకులు ఏర్పడి ఉంటాయి. అవి అప్పటికి వింతగా, విపరీతంగా కనిపించవు. చాలా ఏళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు విడ్డూరంగా కనిపిస్తాయి.***

సీత తర్వాతి జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన - అక్కడికి దాదాపు 1600 మైళ్ళ దూరంలో శంబల్ పూర్‌కి సమీపంలో ఉన్న జుజుమురా అనే చిన్నపల్లెటూరులో ఓ చిన్న శరీరంలో జరుగుతోంది. ఆ శరీరం పేరు బబితి బోయీ.

బబిత తండ్రి సైకిలు రిపేరర్. చిన్నతనంలో సైకిళ్ళు దొంగతనం చేసి, ఏ పార్టుకాపార్టు విప్పి ఆ సైకిళ్ళ ఓనర్లూ, పోలీసులు గుర్తుపట్టేలోపుగానే పార్టులు అమ్మేసి సొమ్ము చేసుకుని, పాతికేళ్ళు నిండకుండానే టి.బి.ని డయాబెటీస్‌నీ సంపాదించుకున్నాడు. పార్టులిప్పి అమ్ముకోవడం చేసే ఓపిక కొన్నాళ్ళకి లేకపోవడంతో విప్పిన పార్టులు అతికించే పనికి కుదురుకున్నాడు. ఆ రోజుల్లోనే అతని దొంగతనం నైపుణ్యానికి మురిసిపోయిన ఓ మామగారు అల్లుడిగారి చేతిలో సైకిలు నష్టపోయి, ఆ సామర్థ్యం కారణంగానే ముగ్ధుడై తన కూతురునిచ్చి పెళ్ళిచేశాడు.

బీడీలు, భంగూ, గంజాయి, అడపాతడపా సారా అలవాటున్న రోజుల్లోనే బబిత పుట్టింది. ఈ అలవాట్లు గురించి తలుచుకోవడం ఎందుకంటే, తుమ్మ మొక్కకి వేపకాయలు కాయవని చెప్పడానికి, సామ్యం పొరపాటు. వేపచెట్టుకి మందారపువ్వు పూయదని చెప్పడానికి.

బబితకి ఎక్కడలేని అందం వచ్చింది. అంతకు మించి అందాన్ని మించి ఉబికే శరీరం వచ్చింది. వాళ్ళ నాన్న చురుకుతనం వచ్చింది. వాళ్ళ నాన్న దొంగతనం నేర్పంతా ఆ కళ్ళల్లోకి వచ్చింది. ***లోకంలో చాలా ప్రమాదకరమైన శక్తి ఏది? తన సామర్థ్యం ఏమిటో***

***తను తెలుసుకుని, ఆ సామర్ధ్యంతో ఎదుటివారి మీద దెబ్బతీయవచ్చునని తెలియడం, తీసే మనస్తత్వం ఉండడం. ఈ ఒక్క కారణానికే అమెరికా, రష్యాలు ప్రపంచంలో అంత ప్రాముఖ్యాన్ని సాధించాయి. ఒకరిని నాశనం చేసే శక్తి మరొకరికి ఉండడం, నాశనం చెయ్యాలనే దురద ఉండటం. ఆ నాశనంలో అందరికీ వాటా ఉంటుందని అందరికీ తెలియడం.***

ఇలాంటి ప్రమాదకరమైన లక్షణాలు బబితలో ఉన్నాయి. తన దగ్గర పొంగే యవ్వనం ఉన్నదని తెలుసు. దాని రుచికోసం ఎదుటివాళ్ళు ఉవ్విళ్ళూరుతారని తెలుసు. ఉవ్విళ్ళూరించడం తనకి చేతనవునని తెలుసు. అలాంటి ఆయుధాన్ని 'సంప్రదాయం' ఉలిపిరి కాగితాన్ని చుట్టి పెద్దలు చాలా తరాలు, చాలా శతాబ్దాలు దాచిపెట్టారు. అందువల్ల అవినీతికీ, అవినీతిలో పడిన సెక్స్‌కీ అందమైన మేలి ముసుగు దొరికింది. ఈ ముసుగు విదేశాల్లో లేదు. వాళ్ళకి అవసరం లేదేమో. లేదా వాళ్ళు ఆ 'ఉలిపిరి' కాగితాన్ని త్వరగా చింపేసుకున్నారేమో. లండన్ పికడిల్లీ ట్యూబ్‌లో ప్రయాణం చేస్తూంటే, ఫ్రాన్స్ అండర్ గ్రౌండ్ ప్లాట్ ఫారం మీద నడుస్తుంటే, జురిక్ గారేలో ప్రయాణం చేస్తుంటే శరీరం కదులుతూ, స్తనాలు ఎగురుతూ, ఆ ఎగరడాన్ని ఆనందంగా ప్రదర్శిస్తూ, ప్రదర్శన జనానికి చేరుతోందో లేదోనని పరికిస్తూ, పరికించడాన్ని గర్వంగా ఎంజాయ్ చేస్తూ...!

ఆ మధ్యనే రాజస్థాన్ కాలేజీలో ఓ అమ్మాయిని కొందరు గాంగ్ రేప్ చేసి చంపేశారు. రాకేల్ మంచి అమ్మాయి. అందమైన అమ్మాయి. మంచి కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయి. కానీ అండర్ గ్రౌండ్ రైల్‌లో అమ్మాయిల 'సంస్కారం'లో పెరిగిన అమ్మాయి. బాంగ్‌కాక్‌లో బంజిత్ సవాంగ్ డీ అనే అమ్మాయి ఇంగ్లండులో బ్రియాన్ క్లైగ్ అనే 5 సంవత్సరాల వృద్ధుడిని పెళ్ళి చేసుకుని వేరే వ్యవస్థలోకి పారిపోవాలనుకుంటోంది. అతనితో అతని గదిలో ఆనందాన్ని అనుభవించాక ఆ అమ్మాయి చెప్పిన మొదటి వాక్యం "బ్రియాన్ పెద్ద మనిషి. నన్ను ప్రేమగా చూసుకుంటాడన్న నమ్మకం ఉంది."

వైవాహిక జీవితంలో భర్తలో 'పెద్దమనిషి' తనంతో రాజీపడే, పడాల్సిన 75 ఏళ్ళ వృద్ధునిలో కేవలం 'రక్షణ'నే కోరుకునే దశకి ఆడపిల్ల పారిపోతోందా? జుజుమరాలో బబిత మనస్సులో, శరీరంలో, శరీరాన్ని ప్రదర్శించే ఆకర్షణ, ఆలోచన మొలక, బ్రిటన్ ట్యూబ్‌లో రాకేల్‌లో పరిణతి, హాంకాంగ్ బంజిత్‌లో ఆది పరాకాష్ట.

అందాన్నీ, కోరికనీ స్వేచ్ఛగా ప్రదర్శించుకోవచ్చుననే వ్యవస్థకి ఈ పరిశీలన ఓ సమీక్ష. విమర్శకాదు. పాఠకులు గమనించాలి. దేశాలు తిరిగే నా అవగాహనని నా పాత్రల్లోంచి ఒక్కసారి బయటికొచ్చి చెప్పకుండా ఉండలేకపోతున్నాను. ఇవి కాకమ్మ కథలు కావు. ఈ ఆడపిల్లల ఫోటోలు నా దగ్గర ఉన్నాయి.

బబిత ఒరిస్సా సంప్రదాయంలోంచి జూరిక్ సంప్రదాయానికి అర్థాంతరంగా మెడసాచిన ఆడపిల్ల. పన్నెండేళ్ళ వయసులోనే తొందరగా పద్దెనిమిదేళ్ళ శరీరాన్ని 'సిద్ధం' చేసుకున్న అమ్మాయి. బబిత ఎక్కుపెట్టిన ఆయుధంలా తన వయస్సుని రెడీ చేసింది. ఆ వయస్సులో ఉన్న ఏ కుర్రాడైనా, ఏ వయస్సువాడినైనా రెచ్చగొట్టి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టే పదునైన యవ్వనంగల బబిత ముందు బలాదూరు. అలాగని సంఘమిత్ర పోలీసు జులుం చూపించలేదు. నిజానికి బబితే అతనిమీద యవ్వనం జులుం చూపించింది. అప్పటికి సంఘమిత్రకి దీపాల్లేని సైకిళ్ళకి రుసుంలు, భంగు తాగి పేకాట ఆడేవాళ్ళ దగ్గర మామూళ్ళులాంటి ఎంగిలి తిళ్ళు మాత్రమే తెలుసు. అతన్ని తనవైపు గేలం వేసి లాగింది బబిత.

ఓ సాయంకాలం ఊరవతల స్మశానం పక్కన డొంకల దగ్గర తన సైకిలు ఆపి, యూనిఫారం చొక్కా తీసి నేలమీద పరిచి, తన జీవితాన్ని గర్వంగా పరచిన బబితని భయం భయంగా జుర్రుకున్నాడు సంఘమిత్ర. మర్నాడే సంఘమిత్ర ఆమెని రేప్ చేసినట్టు వార్త బయటికొచ్చేసింది. వార్తకి మూలకారణం ఎవరు? బబితే! ఎందుకని? ఆ వయస్సులో ఆమెని ఆకర్షించే మరొక మత్తుమందు ప్రచారం. ఆమె యవ్వనానికీ, పదిమంది ఆవురావురుమని చూడాల్సిన ఆమె వయస్సుకీ సంఘమిత్ర అరెస్టయ్యాడు. అతని ఉద్యోగం పోయింది.

ఆర్నెలలు గర్వంగా రోడ్డు మీద తిరిగింది బబిత. ***జీవితంలో కొందరు గాంధీలు కావాలనుకుంటారు. కానీ చాలామంది గాడ్సేలు అయితే చాలునని అనుకుంటారు. కొందరికి ఏమి అవ్వాలో తెలియదు. మరి కొందరికి ఎందుకో తెలియదు. ఇంకొందరికి తెలియదన్న విషయం తెలియదు. ఆఖరివర్గం ఎక్కువ కనుక ఈ లోకంలో ఎక్కువ తగాదాల్లేవు.***

రేపు కేసులు చాలా రుజువు కావు కనుక. సంఘమిత్ర పాత రికార్డ్‌లో ఏ మచ్చాలేదు కనుక అతన్ని బర్తరఫ్‌తో వదిలిపెట్టి, జైలు నుంచి విడుదల చేశారు. "ఫలానా అమ్మాయిని రేప్ చేసిన కానిస్టేబుల్ గారూ!" అని నలుగురూ అన్నారు. కొందరు వెక్కిరించారు. కొందరు గేలి చేశారు. ఎక్కువమంది తప్పుక్కున ఉమ్మారు.

కానిస్టేబుల్ గిరిలో పరిపక్వత వచ్చినవాడైతే ఆ కోపంతో, ఆ అవమానంతో బబితమీద ఆసిడ్ పోసేవాడు లేదా కాళ్ళు విరగగొట్టేవాడు. సంఘమిత్ర రెండూ చెయ్యలేదు. కానీ ఎవరూ ఊహించని మరోపని, ఈ సమస్యకు తిరుగులేని పరిష్కారాన్ని చూశాడు. ఓ రాత్రి ఎక్కడైతే తన చొక్కా పరిచి బబితని అనుభవించాడో అక్కడ నీడపట్టిన చెట్టుకి ఉరిపోసుకున్నాడు.

సంఘమిత్ర చావు ఎక్కువమందిని ఆశ్చర్యపరచినా, ఒక్క విషయం అందరి మనసుల్లో రూఢిగా మిగిలిపోయింది. సంఘమిత్ర తప్పనిసరిగా రేప్ చేశాడని, ఆ అవమానంభరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని... ఈ కారణంగా మళ్ళీ బబిత గ్లామరు పెరిగింది. ప్రజల సానుభూతి ఆమెకు ఆ వయస్సులో ఆశించని బోనస్! బబిత నాలుగు అంగుళాలు ఎత్తున రోడ్డుకి తగలకుండా నడిచింది.

ఈలోగా బబిత వయస్సు రెచ్చిపోతోంది. పదహారేళ్ళు దాటేసరికి ఇరవై యేళ్ళ పరిపక్వత, త్వరగా గిడసబారిపోయే లక్షణాలూ కనిపించాయి. ***అనుభవం ఎలాంటివాళ్ళకైనా పాఠం నేర్పుతుంది. కొందరికి నిప్పుని పట్టుకుని కాలాక, నిప్పుని ముట్టుకోరాదు అనేది పాఠంగా నిలుస్తుంది. కొందరు పక్క జామతోటలో కాయలు కోసి తింటూండగా పట్టుబడ్డాక నలుగురూ చూసేటట్టు తినరాదు అనేది పాఠంగా నిలుస్తుంది.*** బబిత అనుభవంలో పాఠం పోలీసుల వల్ల తనకేం ప్రమాదం ఉండదని.

కానిస్టేబుల్ బిష్ణోయీ చాలా తెలివైనవాడు. పిల్లలు గలవాడు. వయస్సులో రుచికరమైన ముద్దుకంటే, కడుపులో చోటుచేసుకునే పట్టెడు అన్నం రుచి మరిగినవాడు.

అంతకుమించి ఆరు కడుపులు రోజూ నింపాల్సిన బాధ్యత గలవాడు. ఆ బాధ్యతని పాటిస్తున్నవాడు.

సంఘమిత్రకి లేని గడుసుతనం బిష్ణోయీకి మరొకటుంది. కాగా బిష్ణోయీ వయస్సులో కాస్త పెద్ద. బబిత అందం పాతికేళ్ళ మగతనాన్ని ఊరించినట్టుగా నలభై ఏళ్ళ మనిషిని ఊరించలేకపోయింది. బిష్ణోయీ పోలీసు బుద్దులు బాగా వంటబట్టిన మనిషి. అందువల్ల బబిత శరీరాన్నీ, దురదనీ సద్వినియోగం ఎలా చేసుకోవాలో తేల్చుకున్నాడు. ఆ శరీరానికి మోజుపడే డబ్బున్న నలుగురి కుర్రాళ్ళని పోగుచేశాడు. వాళ్ళతో పాటు డబ్బున్నా ఖర్చు పెట్టనక్కరలేని స్థానిక ఎమ్మెల్యే కొడుకుని జతచేశాడు. అందరి దగ్గరా దాదాపు ఏడెనిమిది వందలు జమచేశాడు. అయిదుగురి వల్ల ఆమె ప్రాణానికి ప్రమాదం రాకుండా ఆమె చేత విస్కీ తాగింపచేశాడు.

మర్నాడు గాంగ్ రేప్ వార్త బయటికి పొక్కింది.

కానీ బిష్ణోయీ ఎమ్మెల్యే కొడుకుని అడ్డుపెట్టుకుని ఎవరిమీదా కేసు బుక్ చెయ్యకుండా జాగ్రత్తపడ్డాడు. అందువల్ల సంఘమిత్ర నష్టపోయినట్టు ఉద్యోగాన్నీ, ప్రాణాన్నీ నష్టపోలేదు. అయితే ఈ కేసు ఇంతటితో ఆగలేదు. తన కొడుకుని బజారు కీడ్చిన 'లంజ' (ఒరియా భాషలో అన్నారు ఎమ్మెల్యేగారు) ఎవరని ఆయన రంకె వేశాడు. దానికి బిష్ణోయీయే ముందుకు దూకాడు. ఆ బేరంలో మరో అయిదారు వందలు. కిట్టుబాటయ్యాయి. ఇన్నిటికి కారణమైన బబితను దగ్గర ఉండి శరీరానికి కీడురాని విధంగా, పోలీసోడి దెబ్బల్లాగా కొట్టించాడు బిష్ణోయీ. అంతేకాదు. ఆ రాత్రి బబిత తండ్రి సైకిలు షాపుకి ఎవరో నిప్పంటించారు. సారా తాగుతున్న తండ్రిని ఇరవై నాలుగు గంటల్లో ఊరు వదిలిపొమ్మని బెదరించారు

బబితకి జీవితంలో మొదటిసారిగా భయమేసింది. ఆ రాత్రి గ్యాంగ్ రేప్‌కు గురయినందుకు పెద్దగా అలసిపోలేదు. అన్నిసార్లూ తన ఆటే చెల్లదని అర్థమైంది. మర్నాడు తాను విస్కీ హాంగోవర్‌లో, పులిసిన శరీరంలో ఉండగానే, మిగిలిన సామాన్లు పట్టుకుని తండ్రీ, తల్లీ మచ్‌ఖండ్‌కి బయలుదేరారు.

మచ్‌ఖండ్‌లో సైరంధ్రి కోసం వాకబు చేశాడు బబిత తండ్రి. ఆ ఊరు వదిలిపెట్టి చాలా రోజులైందని తెలిసి, వెదుక్కుంటూ సైరంధ్రి ఉన్నచోటికి వచ్చారు. నిజానికి సైరంధ్రి చాలా దూరపు బంధువు వాళ్ళకి. తండ్రి ఆమెకు తమ్ముడు వరస అవుతాడు. మేనకోడలు అందాన్ని చూసి షాక్ అయింది సైరంధ్రి. అప్పటికి చిన్నమ్మ అనారోగ్యంతో తీసుకుంటోంది. బబిత తండ్రికి సైకిళ్ళు దొంగతనం చెయ్యడం, సైకిళ్ళు రిపేరు చెయ్యడం తప్ప మరేమీ రాదు. తెలిసిన వాళ్ళతో మాట్లాడి ఓ దుకాణంలో చిన్న ఉద్యోగం ఇప్పించింది.

ఆ చిన్న ఊరు బబిత విన్యాసాలకు చాలదు. ఈ ఊరు వచ్చాక ఏ కారణాల వల్ల సైకిల్ షాపు కాలిపోయిందో, ఎందుకు ఊరు కదిలి రావలసి వచ్చిందో బాగా అర్థమైంది తండ్రికి. ఓ రోజు సారా తాగి బబితని చావబాదాడు. ఆ చావగొట్టడంలో బిష్ణోయీ తీసుకున్న జాగ్రత్తలు తీసుకోకుండా సైకిలు చైనుతో చావబాదాడు. కుడికన్ను దగ్గరనుంచి నుదుటి వరకు చర్మం చిట్లి రక్తం ధారలు కట్టింది. అయితే పొగరుగా ఉన్న శరీరం కనుక బబిత త్వరగా కోలుకుంది. క్రమంగా కుడివైపు మచ్చని బ్యూటీస్పాట్‌లాగా ఎలా మలుచుకోవచ్చునో కొత్తదారులు వెదికింది బబిత.

చిన్నమ్మ ఖాయిలా పడ్డప్పటినుంచీ సీత మీదకి మనస్సు పోయింది సైరంధ్రికి. ఎక్కడ ఉందో వాకబు చేయాలని, ఆమె అడ్రసు సంపాదించాలని శతధాప్రయత్నించింది. కానీ లాభం లేకపోయింది. ఎవరో కుందయ్యగారి కూతురు కూడా మద్రాసులో ఉంటోందని చెప్పారు. ఆ అడ్రసు దొరికింది. మద్రాసు వంటి ఊరిలో నందిత అడ్రసు దొరికినంత మాత్రాన సీత జాడ తెలుస్తుందన్న నమ్మకం లేదు. కానీ సైరంధ్రి స్థాయికి ఆ గుర్తు చాలు.

బబిత ఆ ఊరు వచ్చినప్పటి నుంచీ మద్రాసులో ఉన్న సీత గురించి వింటూనే ఉంది. మద్రాసు అనగానే బబితకి తెలిసిన విషయం సినిమాలు. తన అందానికి అనువైన గమ్యం సినిమాలేనని రహస్యమైన నిర్ణయానికి వచ్చేసింది. రావడమే తడవుగా కార్యాచరణకి పూనుకుంది. రోజూ సైరంధ్రికి ప్రత్యేకంగా సేవలు చేస్తూ, తనని మద్రాసు తీసుకెళ్ళమని బతిమాలడం ప్రారంభించింది. 'కాకా' అనే తురకపిల్లడి దగ్గర తెలుగు నేర్చుకోవడం మొదలుపెట్టింది. కాకా కాకలు తీరిన కమీషన్ వ్యాపారి. మొదటి పాఠం ప్రారంభించగానే బబిత జాకెట్టు మీద చెయ్యివేశాడు. బబిత ఇవ్వగల దక్షిణ అదే. ఆ చేతిని తనే కాస్తమీదకి నడిపింది. తెలుగు సినీ నటీమణులకు రావలసినంత క్లుప్తమైన, అస్తవ్యస్తమైన తెలుగు భాష బబితకి ఒంటబట్టే నాటికి కాకా ఆమె శరీరం మీద అధికారాన్ని సాధించాడు. సైరంధ్రి బబితను వెంటబెట్టుకుని మద్రాసుకి సీత దగ్గరకి వెళ్ళాలనే నిర్ణయానికి వచ్చింది.

## 23

***అరటిపళ్ళ గెల మీద చెయ్యి వెయ్యనిదే ఎవరూ*** *అరటిపండుని బేరం చెయ్యరు. అది సహజం. గడుసయిన కొనుగోలుదారుడు, తలవంచే వ్యాపారి ఉంటే ఓ అరటి పండుని ఫలహారం చేసి కానీ బేరాన్ని కుదుర్చుకోడు. ఫలహారంతో సరిపెట్టుకునే వారూ ఉంటారు.*

బబిత ఈ మధ్యకాలంలో మద్రాసు చేరిన అరటి పళ్ళగెల. మద్రాసు గురించి కానీ, సినీ రంగం గురించి కానీ ఏ మాత్రం తెలీని వ్యక్తి. ఏమాత్రం తెలీని వ్యక్తుల్ని ఏ దశలో, ఏ స్థాయిలో బేరాలకు పెట్టాలో తెలిసిన మధ్యవర్తులు కోకొల్లలు. సెంట్రల్‌లో దిగిన ప్రతి అమ్మాయికీ తారాపథంలో నిలిచిన తారలే కనిపిస్తుంటారు. ఖరీదైన కార్లూ, చలవ గదులు, వెనకే నడిచే తెలుగురాని అసిస్టెంటు

అమ్మాయిలూ, మధ్య మధ్య అక్కరలేకపోయినా పళ్ళరసం ఇచ్చే జరీ లంగా కుట్టుకున్న పిటపిటలాడే కుర్రపిల్లలూ, పేజీ తిప్పినా కొరకబడని రాబర్ట్ లూడ్లమ్, అయాన్ రాండ్ నవలలూ, చెమటలు పోయకపోయినా మరనొక్కితే చర్రుమని తిరిగే ఫాన్‌లూ, వచ్చీరాని తమిళభాషలో తిట్లూ ఇవన్నీ కళ్ళలో మెదులుతూ ఉంటాయి.

చాలా తేలికగా, చాలా సరదా అయిన భాషలో తెరమీద హీరోయిన్ అయే లక్షణాలు ఎంత దగ్గర్లో ఉన్నాయో కళ్ళకు కట్టినట్టు చెప్పే కంపుకొట్టే చొక్కాలతో మధ్యవర్తులూ సిద్ధంగా ఉంటారు. కొందరు మధ్యవర్తులు పరమ నిష్ఠాగరిష్ఠులైన అయ్యప్ప భక్తులయి ఉంటారు. వారు ఒకపూటే భోంచేస్తూంటారు. నలభయ్యో రోజు ముగియగానే విస్కీకోసం ఆవురావురుమని ఎదురుచూస్తూంటారు. వారు సినీతారలకి సర్వాన్నీ దక్కేటట్టు చెయ్యగల ప్రశాంతమైన చిరునవ్వుని చంద్రస్వామిలాగా ఇస్తారు. మద్రాసు జీవితంలో ఓ సుఖం ఉంది. కళ్ళముందు స్వర్గం కనిపిస్తోన్నా ఏ ఒక్కరోజూ బోరు కొట్టకుండా చాలా సుఖంగా చాలా ఉషారుగా, ఒక్కోక్కప్పుడు మత్తుగా - కానీ ఎప్పుడూ ఆశాజనకంగా సాగిపోతుంటుంది. ఇప్పుడూ కలిసినాయన ఆరేళ్ళ కిందట ఫలానా అమ్మాయిని వెంకటగిరి నుంచి తీసుకుకొచ్చి పరిచయం చేశాడు. ఫలానా అమ్మాయి ఆకాశంలో ఉంటుంది. ఇతను నారాయణస్వామి కేఫ్‌లో ఓ పూట ఇడ్లీలు తింటూనే ఉంటాడు.

సినిమాల్లో చేరాలనుకునే అమ్మాయిలకి రాత్రులు విశాలంగా, కొత్తగా, కొండొకచో గొప్పగా ఉంటుంటాయి. పగళ్ళు ఎప్పుడూ చీకటి కోసమే ఎదురుచూస్తుంటాయి.

మద్రాసులో భవిష్యత్తును వెదుక్కునే అందమైన ఆడపిల్ల వేసే ప్రతి అడుగు 'ఆశ' అనే అద్భుతమైన మెట్టుమీద పడుతూంటుంది. ఆ మెట్లు తరగవు. అందం తరుగుతూంటుంది.

సైరంధ్రికి తెలీదు. బబితకి అసలు తెలీదు. అమెరికాలో బాగా డబ్బుంది. అక్కడికి వెళితే బాగా డబ్బు సంపాదించుకోవచ్చు.. అన్న మన ఇండియన్స్ ఆలోచనే బబితది.

కొండలరావుది ఈ ప్రపంచం కానేకాదు. అయినా సీత కోరగా బబితతో ఓ సినీమా కంపెనీకి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఏ సినిమా కంపెనీ?.. తను మిల్లుకి వెళుతున్నప్పుడు.. దారిలో చాలా కార్లు ఆగివుండే ఓ సినిమా కంపెనీ బోర్డు చూశాడు. శరవణ భవ ఫిలింస్, కంపెనీ ముందు ఇద్దరూ ఆటోలో దిగారు.

కంపెనీ ప్రొప్రయిటరు, ప్రొడ్యూసరు పంచాపకేశ. కోయంబత్తూరు మనిషి. నటీమణులని చూస్తే ఎలాంటి వాడికయినా మాట్లాడే ఉత్సాహం వస్తుంది. బబిత తెలుగు నటి అని గ్రహించగానే, పంచాపకేశన్ కోయంబత్తూరు తెలుగులో "శీను కొత్తగా కవిత్వం రాస్తున్న రోజుల్లో.. ఔను మీకు శీను అంటే తెలియదు. శ్రీశ్రీ అప్పట్లో నేను శీను అని పిలిచేవాణ్ణి. తర్వాత కూడా ఆ ఆత్మీయతని అలాగే ఉంచమని శాసించాడు. ఇలాగ ఇష్టంలేని పనులన్నీ ఇష్టులతో చేయించేవాడు. 'మహాప్రస్థానం'తో ఆంధ్రాకాశం ఎరుపెక్కింది. సాటి కవులకి కన్నెర అయింది. అనుకోకుండా చిన్న స్టేషన్లో మెయిలు ఆగింది. పైజమా, బనీనుతో శ్రీ శ్రీ ఫ్లాట్ ఫారం మీద పిడికిలి బిగించి సిగరెట్ కాలుస్తూ.. నమ్మలేకపోయాను. నమస్కారం, శ్రీశ్రీగారూ!' అన్నాను. నన్ను గుర్తించారు. కోపంగా చూసి రైలు ఎక్కారు. నా దురదృష్టం రైలు బయలుదేరి అరనిమిషంలో సగం అందేసుకుంది. ఎలక్ట్రిక్ ఇంజన్లు కదా! శ్రీశ్రీ కాదు.. గుమ్మంలో నిలబడి, 'మీరు పొయిట్రీవేపు రాపోవడం వల్లే శ్రీ శ్రీ మిగిలేడు. నమస్కారం! అని బిగ్గరగా అరిచాడు. శ్రీ శ్రీ మహాకవి మాత్రమే కాదు. మహామనీషి" శ్రీశ్రీగారు ఉన్న రోజుల్లో మెయిల్ లైను ఎలక్ట్రిఫికేషన్ అయిందో లేదో తెలుసుకుంటే సేఫ్టీ అండ్ డిగ్నిటీ.

"ఓసారి వేదం వారి వద్ద అతి ప్రాచీన చంపూకావ్యం ఉంటే మరీ పెద్దది కాదు కానీ అంతా కలిపి మూడు వందల పద్యాలు చదివి ఇస్తానని తీసుకున్నా. జార్జి టౌన్ నుంచి త్యాగరాయనగర్ వచ్చేలోగా ట్రాంబండిలో మొత్తం చదివేశా. ఇంటికి వచ్చి చూద్దును కదా పుస్తకం చేతిలో లేదు. వేదం వారితో చీవాట్లు తప్పవనుకున్నా. ఇహ మరి ఏం చేస్తాను. ఓ బౌండు బుక్కు తీసుకుని చచ్చినట్టు మొత్తం

తు.చ. తప్పకుండా నా దస్తూరిలో రాసేశా. భయం భయంగా ఆ బైండుతో ఆయన దగ్గరకు వెళ్ళా. లిఖిత ప్రతి చూసి, 'భేష్!' ఆ గ్రంథం శిథిలావస్థలో ఉంది. ఏమి చెయ్యడమా అనుకుంటున్నా. నీ వల్ల మంచి సాయం జరిగిందోయ్!' అని ఆశీర్వదించారు. తిట్లు తప్పినందుకు హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఎందుకు చెప్పొచ్చానంటే వేదం వారికి పుస్తకాలంటే ప్రాణం.

మీరేదేనా ఫీచర్ వారం వారం రాయాలని నన్ను అడిగినప్పుడు నిర్ఘాంతపోయాను.

'తెలుగు పాఠకులు సామాన్యులు కాదు. మంచి అభిరుచి గలవారు. గొప్ప సంస్కారం ఉన్నవారు. నాకున్న అల్పజ్ఞానంతో నేనేమి రాయగలను?" అని తప్పించుకో ప్రయత్నించాను.

'మీరు రాసి తీరాల్సిందే!' అన్నారు ఎడిటర్ గారు. వజ్రాల వేటలో ఆయన నిధి. చివరగా ఒక్క ముక్క. తెలుగు పాఠకుల టేస్టు గొప్పది. "

తెలుగులో మాట్లాడటం మొదలెట్టాడు. బబిత బరంపురం తెలుగు మొదలెట్టింది. ప్రస్తుతం శరవణన్ కొత్త సినిమాకు పథకాలు వేస్తోంది. పంచాపకేశన్ అత్తగారు ఎంత లేదన్నా మరో నాలుగైదు వారాల్లో చచ్చిపోతుంది. అప్పటికి మనకి ఇరవై మూడు లక్షల ఆస్తి కలుస్తుంది. మొదటి చిత్రంగా బేతాళకథలు తీయాలని ఆయన కోరిక. బబితని చూసినప్పట్నించే బేతాళ కథల్ని మూడు భాషల్లో తీయాలనే ఆలోచనలోకి వచ్చాడు. ఆ సినిమాలో బేతాళుడు వేషం వేయించి సినీరంగ ప్రవేశం చెయ్యాలని తండ్రి కోరిక. ఈలోగా కోయంబత్తూరు జవుళి మిల్లుల టోకు దూది అమ్మే వ్యాపారం చేస్తున్నాడు. నిజానికి శరవణన్ ఫిలింస్ ఆఫీసు నిండా పత్తిబస్తాలు ఎక్కువగా ఉన్నాయి.

దూది వ్యాపారానికి, సినిమా వ్యాపారానికి ఉమ్మడిగా కుదిరిన కుర్రాడు నరిసప్పుడు చాకులాగా కుదురుచుట్టూ దారం లాగా తిరుగుతున్నాడు. నరిసప్పుడు ఊరు బొబ్బిలి. వాడు పుట్టినప్పట్నుంచీ సినీనటుడు కావాలని కలలు గని, ఆరో క్లాసులోనే చదువు ఆగిపోగా, లోకల్‌గా థియేటర్లలో సినీమా పబ్లిసిటీ రిక్షాల్లో అనౌన్స్ మెంట్ చేసి చేసి, పప్పుచారూ, కోడివేపుడు చెయ్యడం ప్రాక్టీసు చేసి, రెండు వందల రూపాయలు పెట్టుబడితో మద్రాసు పారిపోయి వచ్చాడు. నరిసప్పడులో ఏ కోశానా సినీనటుడయ్యే లక్షణాలు లేవు. ఆ విషయం తేల్చుకోడానికి రెండువందల రూపాయలు ఖర్చయ్యే టైం మాత్రం పట్టింది. ఆ రోజుల్లోనే కోయంబత్తూరు నుంచి వచ్చినప్పుడల్లా వంటపనీ, ఆఫీసుపనీ చూసిపెట్టే నౌఖరు కోసం పంచాపకేశన్ వెదుకుతున్నాడు. నరిసప్పుడు దొరికాడు.

ఇప్పుడు బబితని చూడగానే బబిత గొంతులో ఒరియా యాసని గుర్తుపట్టి వాడికి వచ్చిన ఎంగిలి ఒరియాలో పలకరించాడు. పారిస్‌లో పరిగి పాలెం రైతులు కలుసుకున్నట్టు బబిత, నరిసప్పడు ఆగి ఆగి ఒరియాలో మాట్లాడుకున్నారు.

పంచాపకేశన్‌కి రమ్ మీద ఉన్న మోజు ఆడపిల్లల మీదంతగా లేదు. అందుకని "మళ్ళీ కబురు పెడతాను" (ఇదీ ప్రపంచంలో ప్రతీ చోటా వినిపించే తేటగీతి మకుటంవంటి నినాదం) అని లేచాడు. కొండలరావుకి ఈ వాతావరణం, ఈ ప్రసంగం ఏమీ ఎక్కడం లేదు.

నిర్మాత పెళ్ళాంతో ఫోన్‌లో మాట్లాడటానికి లోపలికి వెళ్ళగానే స్వీట్లు గ్లాసులో రెండు కప్పుల కాఫీ అందించాడు నరిసప్పడు. నరిసప్పడికి కొండలరావు బొత్తిగా అనుభవంలేని బ్రోకరులాగా కనిపించాడు.

"ఏమయ్యా! నీకేమయినా బుద్దుందా? ఈ తొట్టికంపెనీ కెందుకు తీసుకొచ్చావు పార్టీని?" అని కొండలరావుని మందలించాడు.

కొండలరావు తెల్లబోయాడు. సినీమా కంపెనీల్లో నిర్మాతలు నేలబారుగా మాట్లాడతారనీ - ప్యూన్లూ, మేనేజర్లూ, నిర్మాతల్లాగా మాట్లాడతారనీ ఆయనకి తెలీదు.

"నేను ఇప్పట్లో సినీమా తియ్యనయ్యా! ఆరునెలలదాకా నాకు డేట్లు అవసరం లేదు" అని సినీమా కంపెనీలో అనేవాడు ప్రొడక్షన్ మేనేజరే అయి ఉంటాడు.

ఏమయినా శరవణ ఫిలింస్‌కి వెళ్ళడం వల్ల బబితకి ఓ మేలు జరిగింది. నరిసప్పడు తైనాతీగా ఆమె వ్యవహారాలు చూసుకునే పనిలో పడ్డాడు. నరిసప్పడు అనుభవంలో చాలా మంది చేత పప్పుచారు తాగించాడు. చాలామందికి కోడిమాంసం వండిపెట్టాడు. కోడిమాంసం తినేముందు చాలామంది నిర్మాతలు ఏం సేవిస్తారో తెలుసు. కోడిమాంసం తిన్నాక చాలామంది అలవాట్లేమిటో కూడా వాడికి తెలుసు. నరిసప్పడుకి తాగినిద్రపోయే సినీ ప్రపంచం పరుపుల్లో ఏ పొరల్లో ఏ నోట్లుంటాయో కూడా తెలుసు. ఏ నోట్లు ఎలా ఖర్చవుతాయో తెలుసు.

నరిసప్పడు బబిత వ్యవహారాలు చూసుకోవడం ప్రారంభించినప్పట్నుంచీ ఆమె జీవితంలో చెప్పలేని మార్పు వచ్చింది. ఇక ఏ సినీ కంపెనీకి తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. నరిసప్పడు లాగూ వదిలేసి జీన్స్‌లోకి బదిలీ అయిపోయాడు. బీడీ వదిలేసి విల్సు సిగరెట్లు రుచి మరిగాడు. నరిసప్పడులో ఒక గొప్పతనం ఉంది. బబిత కలలో కూడా సినీమా వేషాలకి పనికిరాదని బబితకంటే ముందు గ్రహించాడు. జీవితంలో రెండు రకాల విజయాలున్నాయి. తమ సామర్థ్యం తెలిసి, ఆ సమర్థత మేరకు అవసరాల్ని కుదించుకునేవారు. బబిత అసమర్థతని త్వరగా గుర్తించిన ఘనత నరిసప్పడిది.

అయితే బబిత కంటున్న సాధ్యం కాని కల, సాధ్యం కాదని తెలియడానికి కొంతకాలం పట్టింది. ఈలోగా చాలా రాత్రులు ఆమె చెవిలో చాలామంది కొత్త హీరోలూ, పంచరంగుల కలలు విరబూశారు. చాలా రాత్రులు సినీమాలు మారేవి. కలలు మారేవి, కానీ కథల ఇతివృత్తాలు ఒకటే! చెవి ఒకటే! కలలు సృష్టించే వ్యక్తుల అలవాట్లు ఒకటే! అవసరాలూ ఒకటే! బబిత మనస్సులో ఆశ చాలా గొప్పది. దానికి తన శరీరం చాలా చిన్న ధరగా భావించింది. అయితే ఆ కల పండిననాడు ఈ శరీరం ఎన్ని రకాల సుఖాలు పంచుకోబోతుందో, ఆమె మనస్సులో ప్రత్యేకమైన అరలో ప్రత్యేకమైన ఆలోచనలున్నాయి. ఆ అరని ప్రతిరాత్రీ ప్రతి వ్యక్తీ అలంకరించడం మాత్రమే జరిగింది.

మద్రాసులో కల చెరిగిపోవడానికి ఎక్కువ కాలం అక్కరలేదు. చెరిగిపోయిందని తెలియడానికి ఎక్కువ కాలం కావాలి. తెలిసిన జీవితంతో రాజీపడటానికి ఇంకా ఎక్కువ కాలం కావాలి.

ఒకానొక రోజు రాత్రి ఒకానొక హోటల్ రూములో సినీమాలకి సంబంధం లేని, శరీరంతో మాత్రమే సంబంధమున్న శ్రీలంక తమిళుడు అర్ధరాత్రి తను తాగి, తాగనందుకు బబితని కొట్టి, ఏడుస్తున్న బబితని చూసి ముచ్చటపడి, ఆనందించి, ఆమె తొడల్ని సిగరెట్టు పీకతో కాల్చి.. ఆనందాన్ని మరింత పెంచుకున్నప్పుడు.. ఆ గదిలోంచి బయటపడిన బబిత.. తెల్లవారు ఝామున మొదటిసారి కాలిచెప్పుతో నరిసప్పడుని హోటల్ మెట్లమీద పడేసి చావగొట్టింది.

ఆమె కలలో అది మొదటి అపశృతి. ఇంతకూ సైరంధ్రి ఏం చేస్తోంది? తనకు తెలీని సినీమా ప్రపంచంలో ప్రతీ రాత్రీ కరెన్సీ నోట్ల కట్టలతో ఇంటికి తిరిగొచ్చే ఆడపిల్ల ప్రయోజకురాలవుతోందని భావిస్తోంది. కొండలరావు ఏం చేస్తున్నాడు? బబితతో సినిమా కంపెనీలు తిరిగే ఇబ్బంది తప్పినందుకు ఆనందిస్తూ నైట్ డ్యూటీలు చేస్తున్నాడు. సీత ఏం చేస్తోంది? ఆ ఇంట్లో ఉండే పీడకలని మరింతగా మరికొంతకాలం పెంచిన బబిత మీద కోపాన్ని పెంచుకుంటోంది. సైరంధ్రీ, ఆ అమ్మాయీ వెళ్ళిపోయే రోజుకోసం ఆతృతగా ఎదురుచూస్తోంది. ఆ ఇంట్లో ఎవరికీ మద్రాసు సినీమా వాతావరణం గురించి తెలీదు. విచిత్రంగా బబితకే తెలీదు. ***అజ్ఞానం ఒక్కొక్కప్పుడు విచిత్రమైన ఆత్మశాంతిని కలిగిస్తుంది.***

నరిసప్పడు బబిత కొట్టినందుకు బాధపడలేదు. పైగా ఆనందించాడు. బబిత కాలిచెప్పు తగిలి పగిలిన దవడని శ్రీలంక తమిళుడికి చూపించి అంత రిస్కు తీసుకున్నందుకు మరో రెండు వందలు నష్టపరిహారం పుచ్చుకున్నాడు. కలియబడి అతని సీసాలోంచే

ఒక క్వార్టరు విస్కీ తాగాడు. ఖరీదైన సినీతారల్ని, ముఖ్యంగా పాపులారిటీ ఉన్న నటీమణుల్ని (బబిత మాటే నరిసప్పడు చెప్పేది) ఎలా మచ్చిక చేసుకోవాలో ఆ 'పాసింజరు'కి వివరిస్తూ మరో రెండువందలు సంపాదించాడు. తను ఏభై లక్షలతో సినీమా తియ్యడానికి మద్రాసు ఎలా వచ్చిందీ, తన తండ్రి ఇంఫాల్ టీ ఎస్టేట్లలో లక్షలు ఎలా సంపాదించిందీ వివరంగా శ్రీలంక తమిళుడికి చెప్పాడు. మద్రాసులో బతికి చెడిన ప్రతీవాడికీ ఒక కథ ఉంటుంది. బతక నేర్చిన వాడికి తను తీయని సినీమాకి తనదయిన కథ ఒకటుంటుంది. ఇది రివాజు.

తరువాత వారం రోజులు బబిత ఇంట్లోంచి బయటకి వెళ్ళలేదు. సినీమా ఛాన్సులు తగ్గిపోతున్నాయని సైరంధ్రి బాధపడింది. ఊరికి వెళ్ళే రోజులు దగ్గిర పడుతున్నాయనుకుని సీత ఆనందించింది.

బబిత వచ్చినప్పటినుంచీ ఆ ఇంటినీ, ఇంట్లో మనుషుల్నీ పట్టించుకోలేదు. నిజానికి పటించుకునే వ్యవధి ఆమెకి దొరకలేదు. ఇప్పుడు.. ఆ ఇంట్లోనే మరొకరు అద్దెకి ఉంటున్నారని గ్రహించింది. శరీరం బలసిన, అంత అందంగా లేని రేణూకి అందమైన భర్త ఉన్నాడని గ్రహించింది. అంతకు మించి అతను దాదాపు రోజూ తాగి వస్తాడని గ్రహించింది. ఆమె సినీ అనుభవంలో తాగి, ఇంటికి ఆలస్యంగా వచ్చే మగాడు, సాధారణంగా సినీమా మనిషై ఉంటాడని ఆమె భావించింది. బబిత చూసిన చిన్న నుయ్యిలో అనుభవాన్ని పంచడానికి వేరే కప్పలు కూడా లేవు.

ఇప్పుడు బబిత సినిమాల్లో అవకాశం సంపాదించుకోవడానికి కొత్త రూటుని ఆశ్రయించాలనుకుంది. ఆ రూటు పేరు మాల్యాద్రి.

మాల్యాద్రి ఒకటి రెండు సార్లు బబితని చూశాడు. చూడగానే రాష్ట్రేతర సంప్రదాయం కనిపించే సైరంధ్రినీ చూశాడు. సీత బంధువులు వచ్చారని రేణూ చెప్పింది. అంతకు మించి ఏ వివరాలూ మాల్యాద్రికి తెలీవు.

ఆ రాత్రి సంఘటన తరువాత సీత ఈ ఇంట్లో ఉండదనీ, తప్పనిసరిగా కొండలరావు చేత ఇల్లు ఖాళీ చేయిస్తుందని అతని నమ్మకం. ఏ రోజు ఇంటికి వచ్చినా ఖాళీ అయిన ఆ పోర్షను గురించి భార్య చెపుతుందనుకుంటూ ఉండేవాడు. నిజానికి ఇంత ఇల్లు తన స్తోమతుకు కూడా ఎక్కువ. వాళ్ళు ఖాళీ చేస్తూనే ఆలశ్యం లేకుండా తనూ ఖాళీ చెయ్యాలి.

కానీ ఎందుకని ఇల్లు ఖాళీ చెయ్యడం లేదు? మగబుద్ధి చాలా భయంకరమైంది. రాత్రి సంఘటన తరువాత కూడా ఇల్లు ఖాళీ చెయ్యకుండా ఇక్కడే అనుక్షణం తను కలిసే స్థితిలోనే సీత ఉండటం... ఉండటానికి ఇష్టపడటం.. అతని మనస్సులో కొత్త ఆలోచనలకి ఆస్కారం కల్పించింది.

మాల్యాద్రి అనారోగ్యంగా ఆలోచించే మనిషి కాదు. ఏవి అనారోగ్యకరమైన ఆలోచనలు! నందిత మీద సుధాకర్వా? బబిత మీద మొదటి పోలీసువా? బబితని వ్యభిచారం వేపు నడిపే నరిసప్పడివా? రాత్రి పడకగదిలో ఒంటి మీద బట్టలూడదీసినప్పుడల్లా తన ఆలోచనలు సీతమీద కేంద్రీకరించేటట్టు చేసిన రేణూవా?

నీతి.. ఆహారంలాగే.. అలవాట్లలాగే కాలాన్ని బట్టీ.. అవసరాన్ని బట్టీ.. పరిస్థితుల్ని బట్టీ, ఆలోచలని బట్టీ.. ఇలా ఎన్నయినా చేర్చవచ్చా? మత్స్యకన్యని చూసి మనస్సు చెదిరిన శంతనుని దగ్గర్నుంచి, మేనకని చూసి కన్ను చెదిరిన విశ్వామిత్రుడి వరకు.. మాల్యాద్రినీ. శ్రీలంక తమిళుడినీ మరిచిపోతే ఇంక నీతికి బలమేముంది?

ఆలోచనలు పాకుడు రాళ్ళుగా మాల్యాద్రి మనస్సుని కిందకి లాగుతూండగా మరో విచిత్రమైన సంఘటన అనూహ్యంగా జరిగిపోయింది.

## 24

**భక్తులు పుణ్యాన్ని సంపాదించడానికి తిరుమలస్వామికి తలనీలలు ఇస్తారు.** ఇందులో లోపం లేదు. ఏది ఉన్నా, లేకపోయినా సృష్టిలో అందరికీ వెంట్రుకలు ఉంటాయి. ప్రతివాడూ ఇవ్వగలిగిందీ, ఇస్తే పుణ్యం వస్తుంది అన్న నమ్మకాన్ని ఇన్ని లక్షలమంది అనునిత్యం ప్రచారం చేస్తూండగా, ప్రతివాడికీ తేలికగా సాధ్యమయ్యేదీ తలనీలాలే. చేసిన పాపాల్ని బట్టి, లేదా ఆశించే పుణ్యాన్ని బట్టీ కొందరు అదృష్టవంతులు నిలువుదోపిడీలూ, నోట్లకట్టలూ వేస్తారు. ఏమైనా వాళ్ళు మైనారిటీ!

స్వామి భక్తులకిచ్చే పుణ్యం మాట ఎలా ఉన్నా, స్వామికి తలనీలాలు ఇవ్వగలిగినందుకే చాలామంది భక్తులు ఆనందంగా ఉంటారు. అలాంటి అదృష్టవంతురాలు బబిత. ***జీవితంలో చాలా రంగాలలో చాలా విజయాలకి దగ్గర తోవలుండవు.*** అలాంటి రంగాల్లో సినిమా రంగం ఒకటి. అయితే చాలా సులువుగా దగ్గర తోవలు వెతకగలిగే, దగ్గర తోవల్లాగే కనిపించే దొంగతోవలున్న రంగం ఒకే ఒక్కటి – సినిమా రంగం. ఆ తోవల్లో సెక్స్ ఒకటి. కొందరికది మార్గం. మరికొందరికి గమ్యం. చాలామందికి అది మాధ్యమం.

బబితకి ఎక్కువ సంస్కారం లేదు. ఉత్సాహం అక్కరలేనంత ఉంది. పైగా నరిసప్పుడు చేతుల్లో మోసపోయానన్న ఉక్రోషం ఉంది. అయితే అలా మోసపోవడానికి తనే కారణమన్న ఆలోచన లేదు. ఏమైనా, ఏదో ఒక మార్గం గుండా సినిమాల్లో 'దూరి' అది సాధ్యమనిపించుకోవాలని ఉంది. ఇది మళ్ళీ తనని తానే మోసం చేసుకోవడమని ఎవరూ చెప్పలేదు.

మాల్యాద్రి తన రొటీను తాగుడు పూర్తి చేసుకుని రాత్రి ఇల్లు చేరేటప్పటికి గానుగచెట్టు నీడలోంచి బయటికి వచ్చింది బబిత. విటుడి కోసం ఎదురుచూస్తున్న అభిసారికలాగా తెల్లటి చీరలో, మద్రాసు సినిమా సంప్రదాయంలో అక్కరలేనన్ని ఎక్కువ పువ్వులు జడకి వేలాడుతూండగా, ఫ్రెంచి సెంటు వాసనలు గుప్పుమనిపిస్తూండగా, చీకటిలోంచి చీకటిలోకి వచ్చింది. మాల్యాద్రి ఒక్క క్షణం షాకయ్యాడు. నిజానికి బబితని మాల్యాద్రి ఎప్పుడూ తేరిపార చూడలేదు. కొండలరావు ఇంటికి సీత బంధువులెవరో వచ్చారని తెలుసు కానీ ఎవరో, ఎందుకొచ్చారో తెలియదు. కాగా, రాత్రి ఇలా దర్శనమిచ్చిన ఈ పిల్లని చూసి అతనికి మతిపోయింది.

"మీతో మాట్లాడాలి, అంకుల్!" అంది బబిత.

ఆ మాట వినగానే అతనికి రెండు అర్థమయ్యాయ్. ఈ అమ్మాయికి తెలుగు మాట్లాడడం సరిగ్గా రాదని, ఏం మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడాలో బొత్తిగా తెలియదని.

***సంస్కారం ఉన్న మనిషికి సభ్యత తెలిసిన వ్యక్తి సమక్షంలో సిగ్గుతోసుకొస్తుంది.*** తాగిన సంస్కారవంతుడికి (తాగితే సంస్కారం ఏమిటి?) ఎదురుగా పరమాచార్య వస్తే, అమ్మాయి ఎదురుపడితే..!!?

"రేపు మాట్లాడదాం" అని ముందుకు నడవబోయాడు.

"ఇప్పుడే మాట్లాడాలి, అంకుల్! అందుకే మీ కోసం నిలబడ్డాను" అని అతని భుజం పట్టుకుని ఆపింది బబిత. ఆ చొరవకి ఆశ్చర్యపోయాడు మాల్యాద్రి. అది సినిమా చొరవ. అది మాల్యాద్రికి కొత్త. స్టాండు వేసిన స్కూటరు మీద కూర్చున్నాడు 'చెప్పు!' అంటూ.

"మీరెలాగైనా నాకు సినిమాల్లో ఛాన్సు ఇప్పించాలి!" అంది.

మాల్యాద్రి మరింత షాక్ అయ్యాడు. అతనికి నవ్వొచ్చింది. ఒక్క క్షణం ఈ అమ్మాయి తనతో వెక్కిరింతగా మాట్లాడుతోందా అని ముఖంలోకి తేరిపార చూశాడు. ఆ మసక చీకటిలో వజ్రాల్లాగా మెరుస్తున్న ఆమె కళ్ళు మాత్రం తెలిశాయి. నవ్వేశాడు.

"నాకు సినిమాలతో సంబంధముందని ఎలా అనుకున్నావు?"

"నాకు తెలుసు"

ఏం తెలుసునో బబిత చెప్పలేకపోయింది. ఆ ప్రశ్న మాల్యాద్రి అడిగినప్పుడు ఆయన గురించి తనకేమీ తెలియదని అర్థమైంది.

"మీకు చాలామంది ప్రొడ్యూసర్లతో పరిచయం ఉండే ఉంటుంది!"

ఇప్పుడీ అమ్మాయి గురించి తెలుసుకోవాలనిపించింది. "నీ పేరు?"

"బబిత"

"మీ నాన్న ఏం చేస్తాడు?"

"సైకిలు మెకానిక్"

"నువ్వు సినిమాల్లో నటించగలవని ఎందుకనిపించింది?"

"నా కనిపించలేదు. మా ఊళ్ళో నన్ను రేప్ చేసిన ఓ కుర్రాడు చెప్పాడు - నేను సినిమాల్లో పనికివస్తానని"

మాల్యాద్రి మరింత ఆశ్చర్యపడ్డాడు. బబితకి అబద్ధాన్ని ఆలకించడం తెలీదు. నిజానికి రంగులు దిద్దడం తెలీదు. ఈ రెండూ ముఖ్యంగా తెలీనివాళ్ళకి సినిమా రంగం పడదు. ఈ రెండూ ఉండాలని కాదు. సాధారణంగా ఉంటాయని. ***హీరోయిన్ రాకపోయినా పదిగంటలకి 'నీరసం' వచ్చిందనాలి. లేకపోయినా 'నీతి' గురించి మాట్లాడాలి. రోజూ తెలిసినా 'సెక్స్' స్పెల్లింగ్ అడగాలి. తెలియకపోయినా అన్నీ తెలిసినట్టు నటించాలి.*** ఈ బబిత మొదటి పరీక్షలోనే ఫెయిలవుతోంది.

ఆ అమ్మాయి మీద జాలేసింది మాల్యాద్రికి. సినిమా ప్రపంచంలో బొత్తిగా అవసరంలేని గుణాల్లో అదొకటి. ఎవరూ ఎవరిమీదా జాలిపడరు. 'జాలి' ఏ కోశానా అక్కరలేని రంగం అది. రోజూ జంతువుల్ని వేటాడి తినే పులి అడవిలో నోటిదాకా వచ్చిన జంతువుని చూసి జాలిపడుతుందా? ఎవరి ఆహారం వారిది. ***సానుభూతిని పుష్కలంగా నటించే నటనారంగంలో 'సానుభూతి' ప్రయోజనం లేదు.***

"చూడమ్మా! నాకు సినిమాల గురించి ఏమీ తెలియదు. సినిమాతో ఏమీ సంబంధం లేదు. నీకు నా గురించి ఎవరైనా చెపితే పొరపాటు చెప్పారు!" స్కూటరు దిగాడు.

ఒక్కసారి భోరుమంది బబిత. నడిసముద్రంలోకి తీసుకొచ్చి, "నాకేమీ సంబంధంలేద"ని చేతులు కడిగేసుకుంటే వచ్చే నిస్సహాయతలాంటిది బబితకి తోసుకొచ్చింది. దానికి కారణం మాల్యాద్రి కాకపోవచ్చు. కానీ ఎన్నో ఒడిదుడుకుల తర్వాత ఆ నిర్వేదానికి అక్కడ ఆటవిడుపు లభించింది. మాల్యాద్రికీ ఆమెని చూస్తే జాలేసింది. దుఃఖంలో మనిషి ఆలంబన కావాలి. ఆదరించే భుజం కావాలి. మాల్యాద్రి ఆలోచించకుండానే ఆమె భుజం మీద చెయ్యివేశాడు. వేసీ వెయ్యగానే అతని గుండెమీద పసిబిడ్డలాగా వాలిపోయింది బబిత. ఇది చాలా సహజమైన పర్యవసానం, కానీ, ఈ సంఘటన వెనువెంటనే ఒకటి రెండు పరిణామాలు జరిగాయి.

ఏడిచే ఆడపిల్లని చూసి మాల్యాద్రి ఆ క్షణంలో ఆర్ద్రమయ్యాడు. అంతకుమించి అతని మనస్సులో మరో ఆలోచన లేదు. ఆలోచనకి ఆస్కారమూ లేదు. అయితే ఏడుస్తున్న ఆడపిల్లని కేవలం ఆర్ద్రతతో ఓదార్చడం, ఓదార్చే మనిషి తటస్థపడటం బబితకి కొత్త. ఆమె చిన్న జీవితంలో ఒరుసుకునే శరీరాల మధ్య ఒకే రకమైన 'గ్రామరు'కి ఆమె అలవాటుపడింది. దాన్ని 'గ్లామరు' చేసుకుంది. ఏడుస్తూ అతని గుండెలమీద వాలడం ఇన్స్టింక్ట్ కాదు. వాలగా అతని చెయ్యి ఆమె భుజం మీద పడటం ఆమెకి ఇన్స్టింక్ట్ కాదు. అలవాటు. దానికి ఒకే రకమైన అర్థం ఆమెకి తెలుసు. ఎప్పుడైతే మాల్యాద్రి చెయ్యి ఆమె భుజం మీద పడిదో, ఆమె సమస్యకి సమాధానం పూర్తిగా అర్థమయినట్టు అనిపించింది. రోగం ఏమిటో తెలీక తల బద్దలుకొట్టుకుంటున్న డాక్టరుగారికి రోగమూ, దానికి కావలసిన మందూ సులువుగా అర్థమైనప్పుడు కలిగే విజయగర్వంలాంటిది ఆమెలో తోసుకొచ్చింది. అయితే సముద్రంలో నిస్సహాయంగా కుంగిపోతున్న నిర్వేదం నుంచి, అన్ని సమస్యలకూ సమాధానం దొరికిన విజయగర్వానికి మనస్సు ప్రయాణం చెయ్యడానికి ఎంత వ్యవధి

కావాలి? మామూలు సంస్కారానికైతే ఒక జీవితకాలం. సంస్కారాన్ని ఆ అనుభూతికే అలవాటు చేసుకున్న వ్యక్తికి? క్షణకాలం. బాధతో సడలిన ఆ శరీరంలో కోరికను రెచ్చగొట్టే గట్టిదనాన్ని, బిగువుని సంధించడానికి ఎక్కువ టైం వృథా చెయ్యలేదు.

'అమ్మదొంగా! నువ్వూ మగాడివేగా? నాకేమీ తెలియదంటూనే నా కోసం, నా శరీరం కోసమేగా ఈ నాటకం?' అన్న పెంకి చూపు ఆ చీకట్లో అతని మీద విసిరింది. కన్నీటికి, ఆర్ద్రతకీ మధ్య సతమతమవుతున్న మాల్యాద్రికి ఆ చూపు అందలేదు - ఆ చూపు కోసం ఆయన ఎదురుచూడడం లేదు కనుక.

ఆ చీకట్లోనే శరీరాన్ని భాణంలాగా బిగించి, ఓ చేత్తో తడిసిన కళ్ళను తుడుచుకుని, అతని చేతికీ, తన భుజానికీ మధ్యనున్న స్థలాన్ని తన శరీరంతో నింపి, పక్కగా ఉన్న రొమ్ముల్ని అతని గుండెలకి ఆనేటట్టుగా ఊపిరి బిగించి, అతని ఎత్తుకి కాస్త మునివేళ్ళ మీద నిలబడి ఎగబాకి, రాయల్ ఛాలెంజ్ వాసనతో మెత్తబడిన ఆ సిగరెట్టు పెదవుల మీద గట్టిగా ముద్దుపెట్టుకుంది. ఆ ముద్దు చీకట్లో తుపాకీలాగా పేలింది. ఆ శరీరం దూకుడుకు మాల్యాద్రి ఒక్క క్షణం తూలాడు. అరక్షణంలో జరిగిన ఈ విపరీతమైన మార్పుకి తట్టుకోలేక ఆ చీకట్లోనే కొయ్యబారిపోయాడు.

***దుర్మార్గాన్ని మనస్సునిండా నింపుకున్న హంతకుడికి బాపూజీకి పెట్టే నమస్కారంలో సౌజన్యం తోసుకురాకపోవచ్చు. కానీ సౌజన్యమే వ్యక్తిత్వంగా గల బాపూజీకి గాడ్సే మీద కోపమో, కసో రావడానికి ఆయన జీవితకాలం సరిపోలేదు. తనని చంపిన వ్యక్తిని క్షమించడానికే అతని మిగిలిన జీవితం సరిపోయింది.***

నిర్వేదాన్ని కోరికగా బబిత తర్జుమా చేసుకున్నంత త్వరగా ఆర్ద్రతని ఆకలిగా మాల్యాద్రి మార్చుకోలేకపోయాడు. కాగా, అతనా ప్రయత్నంలో లేడు. ఆ క్షణంలో ఆమె శరీరం వాసన, మల్లెపువ్వు పరిమళం, ఆమె పెదాల తియ్యదనం అన్నీ అసహ్యంగా అనిపించాయి. ఎవరో తనమీద పన్నిన కుట్రలాగా అనిపించింది. ఆవేశంగా ఆమె శరీరాన్ని దూరంగా తోసేశాడు "ఛీ!" అంటూ.

మెట్ల మీద కూలబడిన బబిత చివుక్కున లేచింది. "మీరేం చెపితే అది చేస్తాను అంకుల్! నాకీ ఉపకారం చేసిపెట్టండి!" అంది. ఆ తర్వాత మాల్యాద్రి అక్కడ ఎక్కువసేపు నిలబడలేదు. ఆమె వైపు చూడనైనా చూడకుండా తన పోర్షన్‌లోకి మాయమైపోయాడు.

●●●

రాత్రి నిద్రపట్టలేదు మాల్యాద్రికి. బబిత మాటలే జ్ఞాపకం వస్తున్నాయి. పొద్దున్నే కాఫీ తీసుకొచ్చి ఇస్తూ "అప్పుడే నిద్రలేచారా?" అంటూ పలకరించింది రేణు.

రాత్రి జరిగిన సంఘటన భార్యకి చెప్పాడు. రేణూ ఒక్క క్షణం ఆశ్చర్యపోయి "అయ్యో! ఇలాంటి విషయాలు పెళ్ళానికి చెప్పకూడదండీ!" అంటూ కడుపులో పొడిచింది. "ఇన్ని తెలిసిన అమ్మాయి ఈ పాటికే సినిమాల్లో దొచ్చుకుపోవలసింది. ఇంకా ఎందుకు ఛాన్సులు కలిసిరాలేదో మరి!" అంటూ అదేదో పెద్ద జోక్ విన్నట్టు, శరీరమంతా కదిలేలాగా పది నిమిషాలు తలుచుకు తలుచుకు మరీ నవ్వింది.

పెళ్ళాం హితవుని చెవిని పెట్టి నోరు మూసుకుని ఉండాల్సింది మాల్యాద్రి. కానీ ఎందుకనో బబితకి ఏదో చెప్పరాని అన్యాయం జరగబోతోందని, తెలిసి తెలిసి ఉపకారం చెయ్యకపోవడం అన్యాయమనీ అతనిలో 'పెద్దమనిషి' తత్వం పీకింది. ఆఫీసుకి బయలుదేరబోతుండగా సీత మధూని ఎత్తుకుని గోరుముద్దలు తినిపిస్తూ కనిపించింది. గానుగ చెట్టుకిందకి కొడుకుని ఎత్తుకు రావాలని బయటికి వచ్చి, మాల్యాద్రిని చూసి చటుక్కున లోపలికి పోబోయింది.

మాల్యాద్రి స్కూటర్ స్టార్టు చెయ్యబోతున్నవాడల్లా ఆగాడు. "సీతా!" అని పిలిచాడు.

మాల్యాద్రి తనని ఏకవచనంతో పిలవడం తనమీద తేళ్ళూ, జెర్రులూ పాకించినట్టుంది. కానీ ఆగింది.

"మీ ఇంట్లో దిగిన అమ్మాయి మీకేమవుతుందో నాకు తెలియదు. ఎందుకొచ్చిందో నాకు అంతకన్నా తెలియదు. కానీ ఆ అమ్మాయిని ఓ కంట కనిపెట్టి ఉండటం మంచిది"

సీత నివ్వెరపోయింది. ఆ అమ్మాయికీ, మాల్యాద్రికీ ఏం సంబంధం? ఆ అమ్మాయి మంచిచెడ్డల గురించి చెప్పాల్సిన అవసరం అతనికేముంది? అసలు అతనికేం తెలుసు?

"మీ సంగతి మీరు చూసుకోండి. ఆ అమ్మాయి సంగతి మీకనవసరం."

"యూ ఆర్ రైట్! న్యాయంగా నాకేం సంబంధం లేదు. కానీ మీకు సంబంధం ఉంది కనుక. రాత్రి జరిగిన భాగోతం చెప్పాలనిపించింది."

నోరు విప్పి ఆశ్చర్యంగా మాల్యాద్రిని చూసింది సీత.

"ఆ అమ్మాయెవరో తప్పుతోవలో పడుతోంది. సినిమాల్లో చేరాలని ఆత్రం ఉందనుకుంటాను. నిన్న రాత్రి నన్ను పట్టుకుని, నా పెదాల మీద గట్టిగా.."

సీత చేతిలోని అన్నం పళ్ళెం ధడాల్న నేలమీద పడింది. "స్టాపిట్! మీరేమనుకుంటున్నారు. మీరు నవమన్మధుడు, డాన్ జువాన్, ప్రిన్స్ చార్మింగ్ అనుకుంటున్నారా? ఆడాళ్ళందరూ మీ వెనక పడడానికి మీరు ఆకాశం నుండి దిగివచ్చాననుకుంటున్నారా? మీరు లేకపోతే ఈ ప్రపంచం.."

"సీతా!"

"షటప్! పాపం, అభం శుభం తెలీని ఆ పిల్లని పట్టుకుని లేనిపోని నిందలు వేస్తారా? వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను. బబిత తన మానాన తన పని చూసుకునే అమ్మాయి. చాలా మర్యాదైన పిల్ల. ఆ పిల్లని పట్టుకుని.. ఛీ! ఛీ!.."

ఈ కేకలకి లోపల్నుంచీ సైరంధ్రీ, మాల్యాద్రి వాటాలోంచి రేణూ బయటకి వచ్చారు.. వరండా అంతా కంచంలోంచి అన్నం చెల్లాచెదరై ఉంది. మధూ ఏడుస్తున్నాడు. జరిగిందేమిటో సైరంధ్రికి అర్థం కాలేదు. పిల్లాడు ఆగం చేస్తున్నాడనుకుంటూ సీత చేతిలోంచి అందుకుంది.

మాల్యాద్రి సీత ఇలా ఆవేశపడుతుందని ఊహించలేకపోయాడు. క్షణంలో జరిగిన తతంగానికి అతనూ నివ్వెరపోయాడు.

"ఏమిటండీ? ఏం జరిగింది? ఏమిటి, సీతా?"

"మీ ఆయన లేనిపోని గొప్పతనాన్ని నెత్తిన వేసుకుని అందరి మీదా అభాండాలు వేస్తున్నాడు. ఆయన మన్మథుడూ, నలకూబరుడూ అయితే మాకేం ఒరిగింది లేదు. కానీ కనిపించిన వాళ్ళందరిమీదా నిందలు వేస్తే భరించేదిలేదు."

రేణూ రాయిలాగా నిలబడిపోయింది.

"ఏమండీ! సీతనేమన్నారు?" అంది బలహీనంగా.

సంజాయిషీ చెప్పుకోవలసిన కుర్రాడిలాగా నిస్సహాయంగా నిలబడిపోయాడు మాల్యాద్రి.

"అసలు జరిగింది అదే ఆ అమ్మాయి నిన్నరాత్రి"

ఇప్పటికి విషయం రేణూకి అర్థమయింది. కానీ ఆ విషయాన్ని మాల్యాద్రి సీతకెందుకు చెప్పాల్సివచ్చిందో, చెప్పినా సీత ఎందుకంత ఆవేశపడాల్సి వచ్చిందో అర్థం కాలేదు.

రేణూ బలహీనంగా అంది - "అవునండీ! ఆయన నాతోనూ చెప్పారు. బబిత నిన్న రాత్రి ఆయన్ని"

"అబద్ధం! పచ్చి అబద్ధం! నేను నమ్మను! అదంతా ఈ పురుషపుంగవుడు కల్పించిన కట్టుకథ!" అరిచింది సీత.

తడి జుత్తు ఆరబెట్టుకుంటూ, ఒదులుగా నైటీ వేసుకుని సీత వాటాలోంచి బయటకి వచ్చింది బబిత.

"ఆంటీ!" అంది. అంతా ఆమెను ఆశ్చర్యంగా గమనించారు.

"ఐయాం సారీ ఆంటీ! నిన్న రాత్రి నేను నిజంగానే ఆయన్ని ముద్దుపెట్టుకున్నాను సారీ, అంకుల్!"

వరండాలో ఉన్నట్టుండి పిడుగుపడినా అందరూ అంత నిర్విణ్ణులు కారు. ముఖ్యంగా సీత, నిశ్చేష్టురాలైపోయి బబితని చూస్తూ నిలబడింది. ఆ క్షణంలో ఆ పిల్ల నేరం కంటే, ఆమె నిజాయితీ సీతని కొరడాతో చరిచినట్టనిపించింది. వరండాలో చెల్లాచెదురైన అన్నం మెతుకులు గాజుముక్కల్లాగా అనిపించాయి.

మరో క్షణంలో సీత, రేణూ ఆఖరికి బబిత కూడా వరండాలోంచి నిశ్శబ్దంగా నిష్క్రమించారు.

స్థాణువులాగా ఆ వరండాలో నిలిచిపోయింది ఒకే ఒక వ్యక్తి - మాల్యాద్రి.

## 25

**వారం తిరగకుండా మూడు పనులు** వరసగా జరిగిపోయాయి. మాల్యాద్రి ఇల్లు ఖాళీచేసేశాడు. తప్పనిసరిగా కొండలరావు ఇల్లు ఖాళీ చెయ్యవలసి వచ్చింది. ఎందుకంటే అంత ఇంటికి అద్దె కట్టుకోలేడు.

అదీకాక, ఇల్లు అద్దెకి తీసుకున్నది మాల్యాద్రి. అతను వెళ్ళిపోవడంతో తన స్థానమూ పోయినట్టే. అప్పటికప్పుడు ఇల్లు దొరకాలంటే కష్టమే. తను పనిచేస్తున్న మిల్స్‌లో ఓ సహచరుడి చిన్న పోర్షన్‌లో ఒక వాటా ఇచ్చాడు. అక్కడ తనూ, భార్య, బిడ్డ ఉండడానికే ఇబ్బంది.

రెండు రోజుల్లో నరిసప్పుడు మళ్ళీ బబిత కొలువులో కుదురుకున్నాడు. అలా చెప్పడం పొరపాటు. బబిత నరిసప్పడిని ఆశ్రయించింది. ఇదివరకు వ్యభిచారానికి సినిమా రంగంలో ప్రవేశం సాకు. ఇప్పుడూ ఎవరి పాత్రల్ని వాళ్ళు అర్థం చేసుకున్నారు. వ్యభిచారానికి ఏ సాకూ లేదు. అయితే, సినిమాలు లేకుండా ఖాళీగా ఉన్న ఏ నటీమణినయినా అడగండి రెండు పిక్చర్లు త్వరలో ప్రారంభం కాబోతున్నాయనీ, ఓ వేషం మొన్ననే ఫైనలైజ్ అయిందనీ అంటారు. ఇది పండుకొమ్మని పట్టుకువేలాడే ఆఖరి ఆధారం అందామా? ఇంకా సుఖంగా 'ఆత్మవంచన' అంటే పోతుంది. ***పరాజయాన్ని అంగీకరించడం కష్టం. ఒప్పుకోవడం కంటే చెప్పుకోవడం ఇంకా కష్టం. జీవితంలో ఫెయిలవడానికి దమ్ముకావాలి. అది లేనప్పుడే ఆత్మహత్యల గురించి ఎక్కువ వింటాం. జీవితంలో ఏం చెయ్యాలో తెలియని వాళ్ళే ఆత్మహత్యలకి పూనుకుంటారు.*** అయితే బబిత కథ ఈ రామాయణానికి పిడకలవేట అనుకోవడానికి వీల్లేదు.

బబిత వల్ల అనుకోకుండా జరిగిన సంఘటన ఏమిటంటే మాల్యాద్రి, కొండలరావు కుటుంబాలు విడిపోవడం. రూఢిగా జరిగిన విషయం ఏమిటంటే, మాల్యాద్రికి నూటికి నూరుపాళ్ళూ సీత మీద ఆలోచనలు లగ్నం కావడం. దానికి కారణం సీత విరుచుకుపడడమే. జరిగిన సంఘటన సీత అంతగా విరుచుకుపడాల్సిన అవసరం లేదు. సీత అలా ఆవేశపడడంలో మాల్యాద్రి మీద ఆమె ఎంత పొజెసివ్‌గా ఉందో మాల్యాద్రికి అర్థమైంది. ముద్దు పెట్టుకోవడం నిజమని తెలిసినప్పుడు తను మాల్యాద్రిని తిట్టినందుకు కాదు, అది నిజమైనందుకు సీత చాలా గింజుకులాడింది.

అయితే ఇద్దరి మనసులకీ బలమైన చెలియలి కట్టలున్నాయి. సీత ఇదివరకటి సీత కాదు. బబిత అంతకన్నా కాదు. మాల్యాద్రికి ఆకర్షణ, సెక్సు అంత ముఖ్యమైనవేం కావు. కానీ అతని మనసులో సీత పేరిట చిన్న గదికి అలంకరణ సాగుతోంది. ఆ కారణంగానే ప్రయత్నించి కూడా కొండలరావు ఎక్కడ ఉన్నాడో వాకబు చెయ్యలేదు మాల్యాద్రి. సీత విరుచుకుపడ్డాక రేణూకి ఆమె మీద ఉన్న గౌరవం కాస్తా తుడిచిపెట్టుకు పోయింది. నిజానికి ఇల్లు ఖాళీ చెయ్యడానికి ఎక్కువ పట్టుదల చూపిన మనిషి రేణూయే. మాల్యాద్రి కూడా అందుకు అభ్యంతరం తెలుపలేదు.

మరి సీత? మాల్యాద్రి ఆలోచనలు తన మనసులోంచి పూర్తిగా చెరిపేయడానికి ప్రయత్నం చేస్తోంది. ఇల్లు మారడం దైవికంగా ఆమెకు కలిసి వచ్చింది. అయితే దైవికమైనవీ, తప్పించుకోలేనివీ చాలా సంఘటనలు రాబోయే కాలంలో ఎదురు చూస్తున్నాయని ఆమెకి తెలీదు.

మాల్యాద్రికి చక్కని ఇల్లు అద్దెకి దొరికింది. తన మిత్రుడు ఒక ఎకరం స్థలాన్ని కొని అందులో గొప్ప ఇల్లు కట్టాలని కలలు కంటూ, అందాకా నైరుతి మూలన ఓ చిన్న ఔట్ హౌస్ వేసి, కాల్రక్రమేణా అసలు ఇల్లే కట్టలేక, ఆ చిన్న ఔట్ హౌస్నే ఇల్లు చేసుకుని, దరిమిలా నైరోబీలో ఉద్యోగం రాగా, ఆ ఇంటిని మాల్యాద్రికి అప్పగించాడు. రెండు చిన్న గదులు, ఓ వంట గది, చిన్న నడవా - అదీ ఇల్లు. ముందు అంతా ఖాళీ. ఓ వేపచెట్టు, రెండు గన్నేరు చెట్లు, ఓ కొబ్బరి చెట్టూ, గుబురుగా పెరిగిన తులసిమొక్కలూ ఇదీ ఆవరణ. ఆ ఇంటికి వచ్చాక పొరపాటునయినా కొండలరావు ఇంటి గురించీ, సీత గురించీ వాకబు చెయ్యాలని మాల్యాద్రి ప్రయత్నించలేదు.

అయితే, ఆ ఇంట్లో దిగిన నాలుగైదు వారాలకి ఇంటిని వెతుక్కుంటూ కొండలరావు వచ్చాడు. మాల్యాద్రి వెళ్ళాక కొన్ని రోజులైనా ఉన్నాడు కనుక, మాల్యాద్రికి వచ్చిన ఉత్తరాలు ఇచ్చిపోవాలని వచ్చాడు. అప్పుడు మాల్యాద్రి ఇంట్లో లేడు. రేణూ మాత్రం ఉంది. రేణూతో ఎప్పుడూ కొండలరావు ఎదురుపడి మాట్లాడలేదు. ఎప్పుడైనా దీపని ఎత్తుకుని పలకరించేవాడు.

ఉత్తరాల్ని అందుకుని, "సీతగారు ఎలా ఉన్నారు?" అని పలకరించింది రేణూ.

"బాగానే!" అన్నాడు కొండలరావు.

"ఎందుకనో మావారంటే సీతగారికి మొదట్నుంచీ ఒళ్ళుమంట. నేను గమనిస్తూనే ఉన్నాను. మీకూ అద్దె ఎక్కువ. అందరికీ మంచిదని నేనే ఖాళీ చేయించాను. ఇప్పుడు దిగిన ఇల్లు బావుందా?" అంది.

"ఒక వర్కరు ఇంట్లో ఉంటున్నాం. ఆపద్ధర్మంగా ఉండనిచ్చాడు. సర్దుకోవడానికి బాగేమిటి?" అన్నాడు కొండలరావు.

"ఆ సినిమా అమ్మాయి"

"ఈ ఊళ్ళోనే ఎక్కడో ఉంది. ఈ మధ్య కారులో చూశాను. నన్ను బజారులో ఆపి, కారుకొన్నానని కారు చూపించింది."

టీ కలిపి ఇచ్చింది రేణూ.

"ఈ రెండు మూడువారాలూ పాత ఇంటికి వెళ్ళలేదు. మరేవైనా ఉత్తరాలు వచ్చాయేమో ఒకసారి మాల్యాద్రిగారిని వెళ్ళమనండి!" అనేసి వచ్చేశాడు.

లేబరు కాలనీలో ఉండటం వల్ల ఇష్టం ఉన్నా, లేకపోయినా తరచు యూనియన్ వ్యవహారాల్లో తలదూర్చడం తప్పనిసరయింది కొండలరావుకి. సీతకి కూడా జీవితంలో ఓ గొప్పస్థాయి నుంచి ఉన్నట్టుండి దిగజారినట్టనిపించింది. లేబరు కాలనీ జీవితం హడావిడిగా నడుస్తుంది. ఇల్లు కూడా బజారులాగా ఉంటుంది. అందరూ అందరి ఇళ్ళ గురించి మాట్లాడుకుంటారు. ఇంట్లో రహస్యం మొదట వీధిలోనే తెలుస్తుంది. వీధి కొళాయి దగ్గర, రేషన్ షాపు వరండాల్లో మనుషుల శీలపరీక్షలు జరుగుతాయి. వెరసి లేబరు కాలనీలో జీవితం నలుగురితో సమిష్టి పోరాటం.

అందరిలోకీ ఏ కాస్తో చదువుకున్నవాడు కొండలరావు. అందరిలోకీ నెమ్మదస్తుడు. కాస్త ఆలోచించే మనిషి. లేబరు తగాదాల్లో గొంతు ఎక్కువగా వినిపిస్తుంది. చదువులేకపోవడం వల్ల అనుమానం ఎక్కువగా కనిపిస్తుంది. ***లేబరు నాయకత్వానికి పెట్టుబడి విశ్వాసం. విశ్వాసం సడలితే మిగిలేది ఆవేశం. ఇంకాస్త ముందుకి పోతే - హింస.***

తనకి తెలియకుండానే వచ్చిన కొద్దిరోజుల్లోనే కొండలరావు యూనియన్ వ్యవహారాలలో తలమునకలై పోయాడు. ఇది సీతకి బొత్తిగా నచ్చని విషయం. కొండలరావుకి అంత ఇష్టంకాకపోయినా, అందులో నలుగురూ దూర్చారని మొదట్లో సీత భావించింది. కానీ ప్రతి రాత్రీ పదకొండూ, పన్నెండు వరకు రాని భర్తనీ, ప్రతిసారీ పడగ్గదిలో కొట్టే విస్కీ వాసననీ, ప్రతిసారీ చుట్టూ పదిమందిని వేసుకుని తిరిగే హంగూ, ఆర్భాటాన్నీ చూసి కొండలరావు ఎంతో కొంత  ఆ రుచి మరిగాడనే గ్రహించింది.

తప్పనిసరిగా లేబరు కాలనీలో తలదాచుకోవడం జరిగింది కానీ, ఏదో పాసగని, అర్థం లేని వ్యర్థమైన జీవితం గడుపుతున్న భావన సీతకి. ఇదివరకటి జీవితాన్ని తెలియకుండానే స్థాయి పెంచి అలంకరించినవాడు మాల్యాద్రి. ఈ వాతావరణంలో తలమునకలయ్యాక మాల్యాద్రి ఒక్కసారీ అటువేపు రానందుకు ఆనందించింది. రాకూడదని మనసా, వాచా కోరుకుంది.

ఉన్నట్టుండి ఒక రాత్రి కొండలరావుని మోసుకొచ్చారు యూనియన్ మనుషులు. కొండలరావు చేతిమీదా, భుజం మీదా ఆసిడ్‌తో శరీరం కాలింది. మిల్లులోంచి వస్తూండగా రాత్రి షిఫ్టులో కొండలరావంటే ఇష్టంలేని యూనియన్ మనుషులు ఇద్దరి సైకిళ్ళని ఆపి మీద ఆసిడ్ పోశారు. మరో వర్కరుకి చెంపకాలింది. ముందున్న అతను గావుకేక పెట్టేలోగా కాస్త తలతిప్పుకోవడానికి కొండలరావుకి వ్యవధి దొరికింది. ముఖానికి అడ్డుపెట్టుకున్న చెయ్యి, ఒక్క ఉదుటున పక్కకి తిరిగినందువల్ల భుజమూ కాలాయి. మొదటి వర్కరుని ఆసుపత్రిలో ఉంచారు. కొండలరావుకి మాత్రం ప్రథమ చికిత్స చేసి ఇంటికి చేర్చారు. ఆ రాత్రి దాదాపు తెల్లవారు ఝామున నాలుగు గంటల దాకా ఇంటి ముందు వర్కర్ల కుటుంబాలు జాగారం చేశాయి. కొండలరావుకి జరిగేనష్టం కన్నా, కుటుంబాల పరామర్శ, ఆసిడ్ పోసిన వాళ్ళ మీద ఆకాశం పగిలేలాగా వాళ్ళు పెట్టే శాపనార్థాలతో కాలనీ కాలనీ అంతా దద్దరిల్లిపోయింది. ఇంత ముమ్మరం, ఈ రద్దీ సీతకి కొత్త. అందరూ వెళ్ళాక గొడని ఆనుకుని మొదటిసారిగా భోరుమని ఏడ్చేసింది.

కొండలరావు లేచి సీతని ఓదార్చాడు. మొదటిసారిగా ఈ ఉద్యోగం, ఈ జీవితం వీటన్నిటికీ ముగింపు రాసి మరేదైనా దారి వెతుక్కోవడం మంచిదనిపించింది. ఆ మాటే కొండలరావుతో అన్నది. కొండలరావు నవ్వాడు. ''మరేం భయంలేదు సీతా! ఈ పని ఎవరు చేశారో ఆ లంజా కొడుకులు మాకు తెలుసు. వాళ్ళ సంగతి తేల్చందే మేం నిద్రపోం!''

సీత వణికిపోయింది. కొండలరావులో అంత ఆవేశం చూడడం ఆమెకదే మొదలు.

ఆ సంఘటన తర్వాత కాలనీలో వాతావరణం మారిపోయింది. కొండలరావు పూర్తిగా మారిపోయాడు. ఎక్కువ చదువూ, ఎక్కువ సామర్థ్యం, ఎక్కువ ఆస్కారం ఏమీ లేని వ్యక్తికి ఉన్నట్టుండి తను బతికే సమాజంలో ప్రాముఖ్యం వచ్చేసరికి ఏమవుతాడు? సమాధానం - కొండలరావు అవుతాడు. ఇది అనుకోకుండా కొండలరావుకి దక్కిన పాపులారిటీ. ఊహించకుండా దక్కిన నాయకత్వం. ఆ తర్వాత కొండలరావు ఇల్లే ఒక వర్గానికి కార్యాలయమైపోయింది. తాము ఉంటున్న ఒక పోర్షన్ పక్కనున్న రెండు గదుల్ని వెంటనే ఖాళీ చేయించారు. రాత్రీ, పగలూ తేడా లేకుండా అక్కడ మంతనాలు సాగాయి. ఇరవై రోజులు తిరగకుండా కొండలరావు ఒక వర్గానికి నాయకుడయ్యాడు. ఆ నాయకత్వం అతని జీవితంలో ఓ స్వర్ణ యుగం. ఓ చారిత్రాత్మక ఘట్టం. ఓ అపూర్వమైన అవకాశం, ఓ వరం.

అప్పుడప్పుడూ రాత్రి రెండూ, మూడు గంటల వరకు మంతనాలు సాగాయి. ఇరవై రోజులు తిరగకుండా కొండలరావు ఒక వర్గానికి నాయకుడయ్యాడు. ఆ నాయకత్వం అతని జీవితంలో ఓ స్వర్ణయుగం. ఓ చారిత్రాత్మక ఘట్టం. ఓ అపూర్వమైన అవకాశం. ఓ వరం.

అప్పుడప్పుడు రాత్రి రెండూ, మూడు గంటలవరకు మంతనాలు సాగేవి. చాలా గొంతులు ఆవేశంతో కేకలు వేసేవి. చక్కటి అరవంలో రకరకాల బూతులు వినిపించేవి. చాలామంది ఎవరో తెలియని వ్యక్తుల మీద కసినీ, ఆవేశాన్నీ వెళ్ళగక్కేవారు.

సీతకి నెమ్మదిగా ఆరోగ్యం దెబ్బతినడం ప్రారంభించింది. మొదటిసారిగా ఈ జీవితం మీదా, ఈ జీవనం మీదా ఓ ఏహ్యాభావం ఏర్పడడం ప్రారంభించింది. ఆశ్చర్యంగా ఆ వైముఖ్యాన్ని కొండలరావు గుర్తించాడు. మొదటిసారిగా తనని అర్థం చేసుకోలేని తన భార్యని అతను మనసారా క్షమించాడు. సీతకి తనకోసమే బతికే భర్త కావాలి. తన బిడ్డని ఎత్తుకుని సముదాయించే తండ్రి కావాలి. ఆ గంజాయి వనంలో కొండలరావే తులసిమొక్క. ఆ అవకాశాన్ని కొండలరావు వదులుకోదలుచుకోలేదు.

మొదటిసారి తనని అర్థం చేసుకోలేని భర్త దొరికాడని కొండలరావుతోనే అంది. మొదటిసారి అర్హత చాలని భార్యని కట్టుకున్నానని సీతతో అన్నాడు కొండలరావు. సీతకి ఏడుపు రాలేదు. కోపం వచ్చింది. ఈ ఆలోచన పురుషాధిక్యతలో ఓ భాగం. ఏ ఆధిక్యతా లేని పురుషుడిలో ఏదో ఒక పెద్దరికం దక్కినప్పుడు పక్క వ్యక్తి పట్ల కలిగే చిన్నచూపు అది. భార్య పెరుగుతున్న భర్త ఆధిక్యతను పంచుకుంటుంది. కొత్తగా దక్కిన ఆధిక్యతని, నిలదొక్కుకోవాలని భర్త - భార్య అర్థం చేసుకోలేనంత పెద్దరికం అనుకుంటాడు అంటాడు.

మొదటిసారి మధు భవిష్యత్తు గురించి సీత భయపడింది. మొదటిసారిగా దారీ తెన్నూలేకుండా తను పోగు చేసుకున్న చదువుతో ఏదైనా ఉద్యోగం దొరుకుతుందా అని ఆలోచించింది. జె.ఎం.బారీ అనే ప్రఖ్యాత నాటక రచయిత ఓ గొప్పనాటిక రాశారు. ఊహించనంత పెద్దరికాన్ని సాధించిన భర్తగారు క్రమేపీ ఇంట్లో భార్య సాహచర్యాన్ని, స్నేహాన్నీ నష్టపోతుంటాడు. అతని ఔన్నత్యం ఓ పరాకాష్టని సాధించే స్థితిలో, భార్య తన కష్టంతో పన్నెండు పౌన్లు సంపాదించుకుని - ఓ టైపు మిషన్ కొనుక్కోవాలనే ఆలోచనని బలం చేసుకుంటుంది. దరిమిలాను అతన్ని విడిచి పెట్టి వెళ్ళిపోతుంది సొంత జీవనాన్ని వెతుక్కుంటూ. సంవత్సరాలు గడిచాక బ్రిటిష్ రాణి సమక్షంలో 'సర్' బిరుదుని పొందబోయే భర్తగారు తన శుభాకాంక్షలకి సమాధానాలు టైపు చెయ్యడానికి ఓ టైపిస్టు - మొదటి భార్యని పిలుస్తాడు. వస్తుంది. తనని కాదని ఎంత నష్టపోయిందో ఆమెకి గర్వంగా చెప్పి, ఈ అంతస్తుని పంచుకుంటున్న రెండో భార్యని పరిచయం చేస్తాడు. మొదటి భార్య నవ్వుకుని, వెళుతూ - "రెండో భార్య కూడా పన్నెండు పౌన్లు సంపాదించుకోవాలనే స్థాయికి వచ్చిం"దని 'సర్'ని హెచ్చరించి వెళుతుంది.

ఇంత కథ చెప్పడానికి నేపథ్యం సీత మొదటిసారిగా తనకు తాను సాధించుకోవలసిన ఉపాధి కోసం ఆలోచించింది.

ఈ సందర్భంలో వాళ్ళిద్దరి జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఉన్నట్టుండి మూడు రాత్రులు కొండలరావు ఇంటికి కూడా రాలేదు. ఎక్కడికి వెళ్ళాడో ఏమయ్యాడో కూడా ఎవరూ చెప్పలేకపోరు. సీత కంగారు పడిపోయింది. ఏం చెయ్యాలో తెలియక వికవికలాడింది. నాలుగో రాత్రి తెల్లవారుఝామున కొండలరావు వచ్చాడు మరో నలుగురితో. అతన్ని, అతనితో వచ్చినవాళ్ళనీ చూసి సీత నిర్విణురాలయిపోయింది. నాలుగు రాత్రులూ, నాలుగు పగళ్ళూ నిద్రహారాలు లేని వాళ్ళెలా ఉంటారు? నలభై గంటలు నేలమీద కూర్చోకుండా నిలబడి గడిపిన వాళ్ళెలా ఉంటారు? పదిరోజులు అడవిలో అవే బట్టలతో ఎండీ తడిసీ తిరిగిన వాళ్ళెలా ఉంటారు? అలాంటి అవతారాల్ని సీత ఎన్నడు చూడలేదు. కొండలరావుని చూసి పలకరించడానికే బెదిరిపోయింది సీత. పకలరిస్తే పలికే స్థితిలో లేడు. వాళ్ళు అయిదుగురూ సరాసరి పక్కగదిలోకి వెళ్ళి తలుపు బిగించుకున్నారు. తర్వాత సీతకి నిద్రపట్టలేదు.

తెల్లవారగానే ఎదురు పక్షం నాయకుడి శవం రొడ్డుపక్క తుప్పల్లో దొరికిందని అందరూ చెప్పుకున్నారు. ఆ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పోలీసులు ఒక్కుమ్మడిగా వచ్చి మూసిన తలుపుల్ని బలవంతంగా తెరిచి, అయిదుగురికీ బేడీలు వేసి తీసుకుపోయారు.

ఆ క్షణంలో కాలనీలో రేగిన హాహాకారాలు ఎన్నడూ చూడలేదు సీత. గుడిలో దేవుడు మాయమయినట్టుగా ఆడవాళ్ళు గుండెలు బాదుకుని ఏడుస్తూంటే భయంతో, ఏహ్యాభావంతో, వెగటుతో, ఓ రకమైన నిర్వేదంతో సీత వాంతి చేసుకుంది.

తలంతా దిమ్మెక్కిపోయింది. ఒళ్ళంతా చల్లబడిపోయింది. ఏం జరుగుతోందో కొంతకాలం అర్థం కాలేదు సీతకి. ఒంటరితనం ఎంత భయానకమో - మధూ, తనూ ఉన్న ఆ ఇల్లు పదే పదే గుర్తుచెయ్యసాగింది. ఎవరో పేరు తెలీని వాళ్ళంతా, అర్థం కాని భాషలో వచ్చి తనని ఓదార్చిపోతున్నారు.

కొందరు తమిళంలో ఆవేశపడ్డారు. కొందరు ఆడవాళ్ళు కావలించుకుని ఏడ్చారు. ఈ తతంగమంతా జరిగాక ఒక్కసారి ఇల్లు ఖాళీ అయిపోయింది. ఉన్నట్టుండి ఇంటిని నిశ్శబ్దం ఆవరించుకుంది.

సీతకి ఇల్లెలా గడవాలో తెలీదు. రేపు ఎలా గడుస్తుందో తెలీదు. ఈ క్లిష్టపరిస్థితికి పరిష్కారం ఏమిటో ఎప్పటికో తెలీదు ఏం చెయ్యాలో తెలియదు. ఏడుస్తున్న మధుకి అన్నం పెట్టాలని మరిచిపోయింది. పక్కింటి ఇల్లాళ్ళు ఆ పని వేళ తప్పక చేసుకుపోతున్నారు. మరి ఆమె సంగతి? భోజనం చెయ్యమని ఒకటి రెండుసార్లు అడిగారు. బలవంతపెట్టారు. ఆమె ముందు అన్నం కంచం పెట్టారు. ఆ తరువాత అడగడం మానుకున్నారు. క్రమేపీ రావడం మానుకున్నారు.

మూడోరోజు పోలీసులు వచ్చారు. ఇల్లంతా గాలించి ఓ కొడవలి, ఓ చురకత్తీ, ఓ తుపాకీ బయటకి తీశారు. వాళ్ళు అడిగిన ఏ ప్రశ్నలకీ ఆమె దగ్గర సమాధానం లేదు.

"ఎన్నాళ్ళబట్టి ఈ హత్యకు కుట్ర జరుగుతోంది?"

"ఈ ఆయుధాలు ఎవరు తీసుకొచ్చారు?"

"హత్య చేయాలన్న చర్చలు ఈ ఇంట్లోనే జరిగాయా?"

"జస్వంత్ అనే అతను ఎక్కడుంటాడో తెలుసా?"

సీత బిక్క చూపులు చూసింది. మరునాడు పోలీసు కుక్కలొచ్చాయి. మూడోరోజున మఫ్టీలో ఉన్న, బొత్తిగా భాష తెలియని సి.ఐ.డీలు వచ్చారు. ఇది మామూలు హత్యకాదు. దీనిలో యూనియన్, రాజకీయ నాయకులు, ముఠా తగాదాలు - అనీ ఉన్నాయి. ఈ వాతావరణంలో హత్య చేసేవాళ్ళు కొందరుంటే, హత్యని వాడుకునేవాళ్ళు కొందరుంటారు. ఓ రాత్రి తప్పతాగి ఒక మనిషి - హత్య అయిన ముఠామనిషి - సీత ఇంటిముందు కొచ్చి కేవలం గంటసేపు రకరకాల తిట్లు, రకరకాల భాషల్లో తిట్టాడు. మద్రాసులో ఏదైనా హడావుడి జరిగితే వినోదం చూడడం వ్యసనం. అందరూ కల్పించుకుని మాట్లాడడం సరదా. ప్రమేయం లేకపోయినా కథలుగా చెప్పుకోవడం పరిపాటి. అతని చేతిలో సోడాబుడ్డీ, మరో చేతిలో చిన్న కత్తి చూసి ఎవరూ ఏమీ మాట్లాడలేదు. కొండలరావులాంటి భర్త ఉన్నందుకు సీతని తిట్టాడు. త్వరలో ఆ కుటుంబాన్నంతా సర్వనాశనం చేస్తానన్నాడు. తన 'మొదలాలి'ని పొట్టన పెట్టుకున్నవాళ్ళందరి అంతు చూడనిదే నిద్రపోనన్నాడు. జేబులోంచి మధ్య మధ్య మందు సీసా తీసి తాగుతున్నాడు. మందు చాలా ఖరీదయినదే ముందు వెనక చాలా ఖరీదైన మనుషున్నారని అర్థమవుతోంది. మాటలో నేలబారుతనం తెలుస్తోంది. గంటసేపు నుంచీ అరుస్తున్నా ఎవరికీ అతన్ని వారించాలని అనిపించలేదు. ఎదిరించాలని అనిపించలేదు. పోలీసుల్ని పిలవాలనిపించలేదు. ఆ కేకలు, ఆ వీరంగం తమిళనాడు గుడిసెల వాతావరణంలో గొప్ప వినోదం. అవసరమైతే శివరాసన్‌నీ, వీరప్పన్‌నీ హీరోల్ని చేసే వర్గమది. ఆ వ్యక్తి మాట్లాడిన గంటలోనే సీతని సముదాయించిన అయిదారు మంది స్త్రీలు అవతలి పార్టీకి మారిపోయారు.

"తమ్ముడికి కోపం వచ్చింది, రాదా మరి?"

"తమ్ముడి మాటల్లో తప్పేముంది?"

"తమ్ముడు మంచివాడు కనకే మాటల్తో ఆగాడు".

మధూని గుండెలకి హత్తుకుని గదిలో ఓ మూలకి బల్లిలాగ కరుచుకుని కూర్చుంది. ఓ రాత్రికి కానీ ఇంటిముందు సద్దుమణగలేదు. ఏమైనా ఇంటిముందు వీరంగంతో కాలనీలో కొందరి సానుభూతి 'తమ్ముడి' వేపు మొగ్గగా, నిజంగా ఆమె పట్ల సానుభూతి ఉన్నవాళ్ళు ఆ సాయంకాలం ఆ ఇంట్లోకి రావడానికి భయపడ్డారు.

కొండంత కష్టం నెత్తిన పడినప్పుడు ఎలాంటి వారికయినా పూర్వాపరాలు తెలీవు. కరచరణాలు ఆడవు. అందునా సీత స్వతహాగా ఆత్మాభిమానం కల మనిషి, కొండలరావు ఆ తెరని అతి క్రూరంగా, అతి హఠాత్తుగా, అతి దారుణంగా చీల్చేశాడు. ఇప్పుడిక నిస్సహాయంగా సీత కుప్పకూలిపోయింది.

●●●

మాల్యాద్రి ఆ సమయంలో ఢిల్లీలో ఉన్నాడు. తనకి ఇల్లు ఇచ్చిన నైరోబీ స్నేహితుడు పాల్ రెడ్డి వ్యాపారం పనిమీద ఢిల్లీ వచ్చి ఉన్నపాటునే బయలుదేరి రమ్మని మాల్యాద్రికి ఫోన్ చేశాడు. మాల్యాద్రి ఇంకా తాత్సారం చేస్తుంటే అతనికీ, భార్యకీ ప్లేన్ టికెట్లు పంపించాడు. అమెరికాలో కంప్యూటర్ స్పేర్ పార్ట్స్ వ్యాపారం ప్రారంభించాలనీ, అందులో మిత్రుడు సలహా తీసుకోవాలని పాల్‌రెడ్డి ఉద్దేశం. అప్పటికే ఆ రంగంలో మాల్యాద్రి ఎంతో కొంత కృషిచేసి ఉన్నాడు. మొదటినుంచీ మెదడు మాల్యాద్రిదీ, ఖర్చు పాల్‌రెడ్డిదీ. ఇద్దరూ జోడుగుర్రాల్లాగా జీవితంలో సాగారు. ఐతే నైరోబీకి రెడ్డి దూకినప్పుడు వెంటనే రాలేనన్నాడు మాల్యాద్రి. అందుకు కారణం రేణూ నీళ్ళుపోసుకుని ఉండడం, ఆ పరిస్థితిలో ఆమెని వదిలి పై దేశాలు వెళ్ళడం ఇష్టం లేకపోవడం.

నైరోబీ వెళ్ళిన పాల్ రెడ్డికి ఒక్క విషయం మాత్రం అర్థమయింది. తన వ్యాపారంలో లోపం తన పక్కన మాల్యాద్రి లేకపోవడమని. తను వ్యాపరం చెయ్యదలిచిన చోటుకి మాల్యాద్రిని తీసుకుపోలేకపోతే మాల్యాద్రి ఉన్నచోటనే వ్యాపారం చెయ్యాలి. ఈ నిర్ణయానికి వచ్చాక కేవలం ఓ లక్ష డాలర్లు మాత్రమే నైరోబీలో నష్టపోయి ఢిల్లీ చేరాడు పాల్ రెడ్డి. పోయినదాని గురించి బాధపడడం వ్యాపారస్థుల లక్షణం కాదు. రావలసిన దాంట్లో పోయినది కూడా రాబట్టుకోవడం నేర్చుకోవాలి. ఆ విద్యలో సారంగతుడు పాల్‌రెడ్డి. అందుకని మాల్యాద్రికి వచ్చిన నష్టం కంటే, రాగలిగిన లాభం గురించి మూడు రోజులు రాత్రిబవళ్ళు నూరిపోశాడు. అయినా మాల్యాద్రికి మనస్సు మారలేదు. అతని మనస్సు వ్యాపారం, లాభం మీద కంటే ఇండియాని వదిలిపోవడం మీద ఉంది. అది సుతరామూ ఇష్టంలేదు. మూడు రోజులయ్యాక వ్యాపారంలో ఏం మార్పు చెయ్యాలో, ప్రస్తుతం చేస్తున్న వ్యాపారం మాని ఏ కొత్త వ్యాపారం ప్రారంభించాలో పాల్‌రెడ్డికి విశదంగా చెప్పి రైలెక్కాడు. ఈసారి విమానం టిక్కెట్లు ఇవ్వలేదు పాల్‌రెడ్డి. ఇవ్వమని అడగలేదు మాల్యాద్రి.

**పాల్ రెడ్డికి చెప్పలేదు కానీ, మాల్యాద్రి విదేశాలు వెళ్ళకపోవడానికి కారణం ముఖ్యంగా రేణూ.** తల్లికాకముందు సీత ద్వారా నవనాగరక స్త్రీత్వాన్ని అలంకరించుకున్న రేణూ, తల్లి అయ్యాక నూటికి నూరుపాళ్ళు సంప్రదాయంలో కూరుకుపోయిన తల్లిగా మారిపోయింది. ***సంతృప్తి ఒక్కొక్కప్పుడు మనిషి జీవితాన్ని, జీవన సరళినీ, దృక్పథాన్నే మార్చివేస్తుంది.*** ఆమెకి దీప పుట్టడం ఆలస్యమై ఉంటే, మాల్యాద్రిని పడగ్గదిలో ఆకర్షించే తపన అలాగే కొనసాగితే ఆ ప్రయత్నాన్నీ, ఆ ఆలోచననీ అలా అలా ఖండాంతరాలలో తనతో తీసుకుపోయేదేమో. అమెరికా వెళ్ళాలన్న కోరిక పదహారేళ్ళ అమ్మాయిలో ఉన్నంతగా 60 ఏళ్ళ వృద్ధురాలిలో ఉండదు. అది సహజం. విదేశాలు తిరగాలన్న కోరిక తన కోరికను పండించుకోవాలన్న పెళ్ళయిన, నాజూకు భార్యలో ఉన్నంతగా, కోరిక ఫలించిన, స్థిమితపడిన, ఒళ్ళునీ, తృప్తినీ పెంచుకున్న తల్లిలో ఉండకపోవచ్చు. ఆ తల్లి రేణూ!

కనక పరోక్షంగా మాల్యాద్రి ముందు కాళ్ళకి బంధం వేసింది. సహజంగా సాధనలో కొత్తదనాన్ని, కొత్తదనంలో ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ వెదుక్కునే మనస్తత్వం మాల్యాద్రిది. అతనికి విజయం రుచి తెలుసు. రూపాయి నోటు వాసనకి అలవాటు పడ్డాడు. ఎక్కడికో ఎగరాలని క్రమేపీ రెక్కల్ని పెంచుకుంటున్న మనిషి. లేకపోతే, ఒకే ఉద్యోగంలో కూరుకుపోకుండా కొత్తవేపు ఛాలెంజ్ వేపు మోర సారించడు. అయితే ఈ రోజుల్లో బంధకం అయిపోయింది రేణూ. ఇద్దరి మధ్యా క్రమంగా దూరం దూరం పెరుగుతోంది. స్వభావాల్లో, ఆలోచనల్లో, అభిరుచుల్లో, ఆదర్శాలలో, లక్ష్యాలలో ఆ దూరం వారికే క్రమేపీ బోధపడుతోంది.

తనకి చాలా ప్రియమైన గమ్యం వేపు నుంచి పలుపుతాడుతో బలవంతంగా లాగుతున్నట్టు గింజుకులాడి జి.టి. ఎక్కాడు మాల్యాద్రి. రహస్యంగా స్విస్ బ్యాంక్‌లో దాచుకున్న గల్లాపెట్టెని ఎవరో బద్దలు కొట్టి దోచుకుపోతున్నట్టు దూరమవుతున్న జి.టి.ని చూస్తూ నిలబడ్డాడు పాల్‌రెడ్డి.

రైలు ఖాజీపేట సమీపిస్తుండగా రేణూ నిద్రపోతున్న మాల్యాద్రిని లేపి, అర్జంటుగా టిఫిన్ కావాలని - అతను విసుక్కునేవరకూ ఒత్తిడి చెయ్యకపోతే వాళ్ళిద్దరి జీవితాలూ ఊహించని మలుపు తిరిగేవి కావు. దాదాపు రాత్రి పదకొండు అయింది అప్పటికి. ఏదో తినాలని యావ పుట్టింది రేణూకి. మాల్యాద్రి మత్తుగా నిద్రపోతున్నాడు. స్టేషన్ దగ్గరికి వస్తోందనగా లేపడం ప్రారంభించింది. అంతకుముందే నిద్రపోయిన మాల్యాద్రి విసుక్కుంటూ రైలు దిగాడు.

సాయంకాలం చేసి, చప్పగా చల్లారిన రెండు వడలూ, ఓ మిక్చర్ పాకెట్టూ కొని, తీసుకువచ్చి రేణూ చేతుల్లో పారేసి బెర్త్‌మీద దొర్లాడు. తీరా రేణూ ఆవురావురుమంటూ ఆ టిఫిన్ తింటూండగా మొదటిసారి ఆ వడల పార్సిలుకి కట్టిన న్యూస్ పేపరు కాగితం మీద వార్త చదివాడు.

'బి అండ్ సి మిల్స్‌యూనియన్ లీడర్ల అరెస్టు' అసలు ఆ వార్త ఆకర్షించడానికి కారణం కొండలరావు. మరో ఇద్దరి ఫోటో, కొండలరావు కళ్ళని - నిప్పుల్లాగా మెరిసే కళ్ళని - తేలిగ్గా గుర్తుపట్టాడు. తాము ఇల్లు మారాక కొండలరావుని చూడలేదు. బి అండ్ సి మిల్స్‌లో అతడు యూనియన్ కార్యకలాపాల్లో తలమునకలవడం తెలీదు. కాగా, ఒక హత్యలో అతను ఇరుక్కోవడం, అందునా హత్యానేరం మీద అరెస్టు కావడం, ఓ పేపర్లో అతని ఫోటో - పడడం ఇదంతా అర్థం చేసుకోడానికే అతను షాక్ అయ్యాడు. ఒక్క క్షణం తనకు తెలిసిన కొండలరావేనా అని తికమకపడ్డాడు. ఆ ఫోటో, బి అండ్ సి మిల్స్ ప్రసక్తి చదివిన కొద్దీ అనుమానం తీరిపోయింది.

తన చేతిలో పార్శిలుని లాక్కున్న భర్తని నిర్ఘాంతపోయి చూసింది రేణూ అర్థం కాక. మాల్యాద్రి ఆమె లోకంలో లేడు. సగం సగం చిరిగిన ఆ పేపర్లో తెలియాల్సినంత సమాచారం రేణూకి చెప్పాడు. "ఎవరైనా ఏమైనా చేశారంటే నమ్మొచ్చు కానీ కొండలరావుగారు" ఆగిపోయింది రేణూ.

"ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుందండీ!" అంది.

ఓ క్షణం అతని మెదడు మొద్దుబారిపోయింది. కాస్సేపు ఇద్దరూ మాట్లాడలేదు. ఉన్నట్టుండి ఇద్దరికీ ఒకే ఆలోచన దూసుకు వచ్చింది. "సీత?" ఇద్దరూ తుళ్ళిపడ్డారు.

"సీత ఏమయింది? ఆమె బిడ్డ?"

ఆ తర్వాత నాలుగైదు యుగాలు నడిచింది. తెల్లవారడానికి 50 గంటలు పట్టింది. రకరకాల ఆలోచనలతో మాల్యాద్రి మనస్సు రైలు కంటే ఎన్నో రెట్లు వేగంతో ముందుకు దూకుతోంది. ఓ రాత్రికి రేణూ నిద్రపోయింది.

ఇల్లు ఖాళీ చేసి వెళ్ళాక సీతని చూడలేదు మాల్యాద్రి. అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చినా, ప్రత్యేకంగా చూడాలనిపించలేదు. వాళ్ళింటికి వెదుక్కుంటూ వెళ్ళి కొండలరావునీ, సీతనీ చూడాలనే ప్రయత్నమూ చెయ్యలేదు. ఇప్పుడు సీత ఆలోచనలు, ఆమె పరిస్థితి గురించి సానుభూతీ అతని మనస్సంతా ముసురుకుంది. ఎవరో ప్రాణస్నేహితురాలికి ఇన్నాళ్ళూ అన్యాయం చేసినట్టూ, కోరి దూరమయినట్టూ అనిపించింది. అయితే లేబర్ కాలనీలో పరిస్థితులేవీ తనకి తెలీదు. కానీ ఈ సమయంలో తన కలా అనిపించలేదు. పూనుకుని తాను వాళ్ళిద్దరినీ కలిసి ఉంటే ఈ అనర్థం రాకుండా ఆపగలిగేవాడేమోననిపించింది. వేళమించి పోయాక కలిగే మనస్తాపం ఇది.

***జీవితంలో చాలాసార్లు, చాలా సందర్భాలలో అవకాశందాటిపోయాక వెనక్కి తిరిగి చెయ్యాలనుకుంటాం. వెనక్కి చూసుకుని చెయ్యలేదే అనివాపోతాం. సాధ్యమైతే వెనక్కి తిరిగి చేస్తే బాగుణ్ణనిపిస్తుంది. కానీ ఎప్పుడూ జీవితం వెనక్కి తిరగదు. అదే జీవితం క్రూరంగా హెచ్చరించేపాఠం!***

రైలు పది జీవితకాలాలు ఆలస్యంగా మద్రాసు చేరింది. మాల్యాద్రి ఇల్లు చేరాడే కానీ మనస్సంతా కొండలరావు మీదా, అంతకు మించి సీత మీదా ఉంది.

మంత్ర ముగ్ధుడిలాగా స్నానం చేసి బట్టలేసుకుని కొండలరావు వుంటున్న లేబర్ కాలనీకి బయలుదేరాడు. వెదకడం పెద్ద కష్టమేం కాలేదు. కారణం ఆ ప్రాంతాల్లో అందరి నోళ్ళళ్ళోనూ ఉన్న పేరు కొండలరావుది. అందరికీ తెల్సిన ఎడ్రసు కొండలరావుది. తీరా ఇల్లు చేరేసరికి ఇల్లు తాళం వేసిఉంది. కొండలరావు ఇంటికి వచ్చిన కారణానికి అందరూ అతన్ని వింతగా చూశారు, అనుమానంగా, భయం భయంగా, క్రూరంగా చూశారు. పోలీసులకి అంతుచిక్కని జస్వంత్ ఇతనేనేమోనని కొందరు అనుమానపడ్డారు. ఒకరిద్దరు సమాచారాన్ని పోలిసులదాకా చేరవేశారు.

సీతకోసం మాల్యాద్రి ఇంకా అక్కడ ఎదురు చూస్తుండగానే పోలీసు జీపు వచ్చి ఆగింది. మరో అరగంటలో మాల్యాద్రి పోలీసు స్టేషన్లో ఉన్నాడు. అక్కడ పోలీసులు అడిగే ప్రశ్నలు అతనికి ఎక్కువ అర్థంకాలేదు కానీ, ఎందుకు అడుగుతున్నారో, ఏం జరిగి ఉంటుందో స్థూలంగా అర్థమైంది.

ఇంతకీ సీత ఏమైనట్టు?

తన ప్రశ్నకి పోలీసుల ఎదురు ప్రశ్న వచ్చింది "బబిత ఎవరు?"

మాల్యాద్రి ఆశ్చర్యపోయాడు. "బబితకీ, ఈ హత్యకీ ఏం సంబంధం?"

"బబితకీ, సీతకీ ఏం సంబంధం?"

సమాధానం తనకీ అంతగా తెలియదు. కానీ అప్పుడర్థమైంది. బబిత వచ్చి సీతని తన కారులో ఎక్కించుకుని తీసుకెళ్ళింది.

***కష్టాల్లో ఇరుక్కున్న మనుషులకే కష్టాల విలువ అర్థమవుతుంది. నష్టపోయిన మనిషికే నష్టపోయిన వ్యక్తి దుఃఖం తెలుస్తుంది. సానుభూతిని ఆశించే స్థితిలో ఉన్న వ్యక్తికే సానుభూతిని కోరుకునే వ్యక్తి నిస్సహాయత అర్థమవుతుంది.***

మిన్ను విరిగి మీద పడ్డాక మొదటిసారిగా బబిత ఉపశమన వాక్యాలు మనస్సు పొలిమేరలదాకా పోయాయి. బబితకి ఎవరో చెప్పారు జరిగిన దుర్ఘటన గురించి, కారులో కొండలరావు ఇంటిని వెతుక్కుంటూ వచ్చింది. రాత్రి ఎక్కువైన స్కాచ్ హాంగోవర్, శరీరాన్ని పట్టుకు వేలాడుతున్న మస్క్ వాసనలూ వాటి నుంచి విముక్తమయ్యేలోగానే అతి దుర్భరమైన లేబర్ కాలనీలోకి కారు నడిచింది. ఒక్క క్షణం సీత బబితని గుర్తుపట్టలేదు. సీతకి సంబంధించినంతవరకు బబిత తన ఇంట్లో కాసేపు గడిపిన అతిథి. అందుకు కృతజ్ఞతగా బబిత

ఆమెని ఉన్నపళంగా నడిపించుకుని కారులో ఎక్కించుకుంది. బిడ్డను తను ఎత్తుకుంది. ఇలాంటి సమయంలో ఎలా సముదాయించాలో ఆ అమ్మాయికి తెలియదు.

బొచ్చుకుక్కలతో, రెండు ఎయిర్ కండిషన్ కార్లతో (ఒకటి తనది, రెండోది అబూదాబీలో పనిచేస్తున్న గోల్ వాల్కర్‌గారిది. గోల్ వాల్కర్ ఎవరు? అలాటి ప్రశ్నలు బబితే అడగదు. గోల్‌వాల్కర్ అంటే డబ్బు. ఓ రాత్రి చెమట. సుఖం - తనకి కాదు, అతనికి) అందంగా ఉన్న ఆ ముఖమల్ జీవితంలో సీతకి ఆశ్రయం దొరికింది కానీ, ఓదార్పు దొరకలేదు.

బబిత పెట్టిన ఖరీదైన భోజనం ఆమెకి సహించలేదు. అంత ఖరీదైన పాలు మధు తాగలేకపోయాడు. బబిత ముఖంలో సానుభూతి సీత మనస్సుని కాస్త కరిగించింది. కానీ కరుడుగట్టి పేరుకుపోయిన 'నిస్సహాయత' అనే రాతికోటని ఛేదించలేకపోయింది.

సాయంకాలమయ్యేసరికి ఆ వాతావరణం సీతకి ఇరుకుగా అనిపించింది. "నేను ఇంటికి పోతాను" అంది బబితతో.

"సైరంధ్రి ఆంటీకి టెలిగ్రాం ఇస్తాను" అంది బబిత.

"వద్దు! వద్దు! ఎవరికీ తెలియాల్సిన పనిలేదు" అంది సీత. ఎంత బతిమాలినా ఆ రాత్రికి ఉండనంది. భోజనం చెయ్యమంటే ప్రయత్నించినా చెయ్యలేకపోయింది.

చీకటిపడ్డాక, దాదాపు ఏడున్నర గంటల ప్రాంతంలో డ్రైవరునిచ్చి పంపించింది బబిత. మళ్ళీ వచ్చి కలుస్తానని చెప్పింది. ఏ సహాయం కావలసివచ్చినా తనతో చెప్పమంది. తన ఫోన్ నంబరు కాగితం మీద రాసి ఇచ్చింది. డబ్బు ఇవ్వబోతుంటే చాలా సున్నితంగా తిరస్కరించింది సీత.

లేబర్ కాలనీ నిర్మానుష్యంగా ఉంది. కారు కాలనీని సమీపిస్తుంటే తెలిసిన నరకంలోకి వస్తున్నందుకు సీతకి మనసు తేలికపడసాగింది. ఇంటి ముందు ఆగాక, 'మేడమ్' ఇచ్చిన పళ్ళ సంచిని ఆమెకి అందించబోయాడు డ్రైవరు. వద్దని వారించింది సీత. కారు వెళ్ళేదాకా నిలబడి లోపలికి అడుగుపెట్టింది. ఇంటి తాళం కోసం వెతుక్కుంటుండగా అప్పుడు చూసింది అతన్ని. బయట ఎలక్ట్రిక్ స్థంభం నీడలో కూర్చున్న మాల్యాద్రి కారు చప్పుడికి లేచి వచ్చాడు. అప్పటికే మూడు యుగాలుగా అక్కడే కూర్చుని ఉన్నాడు. తెల్లారితే ఆమె ఆత్మహత్య గురించో, ఏ నూతిలోనో తేలిన రెండు శవాల గురించో వినాల్సి వస్తుందని అతని మనస్సు శంకిస్తోంది. చీకట్లోంచి దూసుకు వచ్చిన కారు ముందు అతని దృష్టిలో పడలేదు. అంత ఖరీదైన కారుకీ, సీతకీ పొంతనలేదు. తీరా ఆ ఇంటి ముందు ఆగగానే ఆశ్చర్యపోయాడు. అందులోంచి దిగిన సీతని చూస్తూనే ఇంకా ఆశ్చర్యపోయాడు. మధు ఆమె భుజం మీద నిద్రపోతున్నాడు.

నీడలోంచి వెలుగులోకి వచ్చిన ఆమెని పలకరించడానికి మొదట భయపడ్డాడు. తరువాత తటపటాయించాడు. కారు వెళ్ళిపోయింది. వీధి తలుపు తెరచి, మధుని మంచం మీద పడుకోబెట్టింది సీత. గుమ్మం దగ్గరికి వచ్చాడు మాల్యాద్రి.

"సీతా!" అన్నాడు ఆర్ద్రంగా.

సీత తుళ్ళిపడింది. ఆ పిలుపుకి ఆమె శరీరంలో అవయవాలన్నీ స్పందించాయి. మాల్యాద్రి గుమ్మంలో కనిపించాడు. ఎన్నో రోజులుగా నష్టపోయిన సానుభూతి, ఉపశమనం, ఓదార్పు ఆ క్షణంలో ఆమెకి ఎంత అవసరమో తెలిసి వచ్చింది. ఇన్నాళ్ళు తను దేనికోసం ఎదురు చూస్తున్నదో దానికి సమాధానం దొరికినట్టయింది.

ఒక్కసారి పసిపిల్ల అయి, బేల అయి, మూర్తీభవించిన మంచుముద్దయి అతన్ని చేతుల్లోకి దూసుకువచ్చి వాలిపోయింది. అతన్ని లతలాగా పెనవేసుకుని కట్టలు కట్టలుగా తోసుకువస్తున్న దుఃఖాన్ని ఆపడానికి ఏ మాత్రం ప్రయత్నం చెయ్యకుండా భోరుమంది. ఆ క్షణంలో మాల్యాద్రికూడా తల్లిని అక్కున చేర్చుకుంటున్న పసివాడయి ఆమెతోపాటు గుండె పగిలేలాగా ఏడ్చాడు.

అదొక వరదవెల్లువ.

అదొక ఆవేశ తరంగం.

అదొక అమృతఘడియ - వారిద్దరికీ!

## 26

వాళ్ళిద్దరి మధ్యా మాటల్లేవు. ప్రశ్నలులేవు. సమాధానాలు లేవు. ఆలోచనలు లేవు. ఊహించనంతగా నరాలు బిగుసుకుపోయినప్పుడు, ఊహించని సంక్షోభంలో మనస్సు కకావికలయినప్పుడు, అవకాశం దొరికినప్పుడు అసంకల్పితంగా శరీరం, మనస్సు వెదుక్కునే ఆటవిడుపు అనూహ్యం.

ఆ క్షణంలో ఇద్దరి కళ్ళూ వర్షించాయి. ఇద్దరి శరీరాలు ఏకమయ్యాయి. ఎన్నో ఏళ్ళు. ఆ శరీరాలకి అర్థమయిపోయిన భాషలో, అలవాటయిన వ్యావృత్తిలాగ, అదేదో క్షణంలో వాళ్ళ సమస్యలకి అదే పరిష్కారం లాగ ఇద్దరూ ఏకమయిపోయారు. అది కోరికల పర్యవసానం కాదు. శరీరపు అవసరాలకి దగ్గర దోవ కాదు. ప్రలోభం కాదు. సృష్టికార్యంకాదు. అది 'లిబిడో'- జీవన స్రోతస్విని.

దప్పికతో వేదననుభవిస్తున్న ఆర్తుడి సేదతీర్చినట్టి, భుగభుగమండే వేడిగాడ్పులతో సతమతమయిన పాంథుడికి చలివేంద్రలాగ, అన్నార్తుడికి కబళం అందించినట్టు, చీకటి గుయ్యారంలో వెలుగురేఖని తోపించినట్టు వారిద్దరికీ ఆ రాత్రి క్షణమయింది. మధురాతి మధురమయిన క్షణమయింది.

ఇలాంటి సందర్భంలో కవిత్వం రాయడం వల్గారిటీ. అయితే ప్రఖ్యాత నాటక రచయిత ఆర్థర్ మిల్లర్‌ని ఎవరో అడిగారట - "టెన్నిసీ విలియమ్స్ వాస్తవంగా, నేలబారు సంభాషణలు ఆయన నాటకాల్లో రాస్తారు. జీవితానికి అద్దం పట్టినట్టుంటాయి. కానీ మీ సంభాషణలు కవితాత్మకంగా ఉంటాయి. ఎందుకని?" అని

ఆర్థర్ మిల్లర్ సమాధానం చెప్పాడట. "బురదలో పొర్లాడే పంది పరిస్థితి యధాతథంగా వాక్యాల్లో రాయడం జరిగితే అది తప్పనిసరిగా కవిత్వం అవుతుంది."

ఊహించని, కానీ తప్పనిసరయే ఆవేశతరంగం, ఉప్పెన, జీవితాన్ని తిరగరాసే సంఘటనల వాక్యరూపం. కవిత్వమే అవుతుంది. తప్పదు. తప్పేదిలేదు. తప్పులేదు.

తెల్లారేసరికి ఇద్దరూ అలసిపోయారు. ఆలోగా ఒక్కమాటయినా సీతకి ఎదురయిన సమస్య గురించి మాట్లాడిందిలేదు. మాల్యాద్రి అడిగింది లేదు. స్ఫటికం స్పర్శ తగలగానే శరీరంలో వేడిమాయమయిపోయినట్టు మాల్యాద్రి సమక్షంలో ఆమె మనస్సులో క్లేశమంతా పటాపంచలమయిపోయింది. పొద్దుటే కాఫీ చేసి ఇచ్చింది మాల్యాద్రికి.

"సీతా! నువ్విక్కడ ఉండబోవడంలేదు!" అన్నాడు మాల్యాద్రి వెళుతూ.

"ఎక్కడ ఉండాలి?" అని సీత అతన్ని అడగలేదు. అడగాలనిపించలేదు.

సముద్రంలో కొట్టుకుపోతున్న మనిషికి దొరికిన కొయ్యదుంగ ప్రయాణాన్ని గురించి ప్రశ్న అనవసరం.

కాని మాల్యాద్రి మనస్సులో ఆ రాత్రి చాలా ప్రశ్నలకి సమాధానాలు దొరికాయి. అతని మెదడులో ఓ నిర్దుష్టమైన ప్రణాళికకి రూపం కదిలింది. మాల్యాద్రి ఆలోచనల్లో మెలోడ్రామాలేదు. తికమకలు లేవు. ఈ విషయంలో సీతదీ మాల్యాద్రిదీ సమభావం.

పదిపన్నెండు రోజుల తర్వాత మొదటిసారిగా రిమాండులో ఉన్న కొండలరావుని కలిసే ఏర్పాటు చేశాడు మాల్యాద్రి. సీతని తనే స్వయంగా తీసుకెళ్ళాడు. కొండలరావు పోలిక పట్టలేనంతగా మారిపోయాడు. కళ్ళు లోతుకుపోయి, తిండి సరిగా లేక, దిగాలుపడి, నీరసంగా, జరిగినదానికి కుంగిపోయి ఉంటాడని ఊహించింది సీత. కానీ కొండలరావు అందుకు భిన్నంగా ఉన్నాడు. తన జీవితంలో సీత

అనే భార్య, మధు అనే కొడుకు ఉన్నారా అని ఆశ్చర్యపోయేంతగా మారిపోయాడు. ఎంతోకాలం కిందట, పూర్వాశ్రమంలో మనుషుల్ని చూసినట్టు వాళ్ళిద్దరినీ చూశాడు.

ఆమె ప్రక్కన మాల్యాద్రి ఉండటం అతనికి తృప్తి కలిగించిన విషయం. తన భార్యకీ, బిడ్డకీ ఈ సంఘటన కారణంగా దూరమైన చింత కొండలరావులో కనిపించలేదు. తను దూరమయినా, ఆమె అజాపజా చూడగలిగిన వ్యక్తి అండదొరికినందుకు తృప్తి ఎక్కువ కనిపించింది. కొండలరావులో కనిపించిన మార్పు తను చేసిన పనిమీదా, నడుస్తున్న బాటమీదా, పూసుకున్న కార్యభారం మీద, నిలుపుకున్న ఆదర్శం మీదా ఎంత నిర్దుష్టమయిన విశ్వాసం ఉన్నదో అతని కళ్ళూ, అతని మాటలూ చెప్పక చెప్పాయి. అతను ఓ హత్య జరిగాక పదిరోజులు రిమాండులో ఉన్న మనిషిలాగా లేడు. ఈ మహావిజయాన్ని సాధించిన తర్వాత పూలరథంలో ఊరేగుతున్న మనిషిలాగా ఉన్నాడు. ఈ కొండలరావు సీతకి తెలీదు. మాల్యాద్రికి అంతకన్నా తెలీదు.

నాథూరాం గాడ్సే, బియంత్ సింగ్, శివరాసన్ ఓ దారుణమయిన హత్యచేసేముందు, చేసిన తర్వాతేలా ఉంటారు? సూటిగా సమాధానం చెప్పాలంటే కొండలరావులాగా ఉంటారు. అతను తన చేతులతోనే చేశాడా, చేయించాడా, చేస్తే కుట్రలో భాగం పంచుకున్నాడా? ఈ ప్రశ్నలకి అంత సుళువుగా సమాధానం దొరకదు. కానీ చేసినందుకు పశ్చాత్తాపం పడడంలేదు. ఇలా జరిగినందుకు విచారం లేదు. సీతకి మాత్రం బురదపాము ఉన్నట్టుండి త్రాచుపాములాగా పడగ ఎత్తినట్టుగా అనిపించింది.

"మాకు తెలిసిన చాలామంది మిత్రులున్నారు. మంచి లాయర్ని మాట్లాడతాను!" అన్నాడు మాల్యాద్రి.

"అవసరంలేదు. ఆపని అప్పుడే జరిగిపోయింది. యూనియన్ లాయరున్నాడు!" అన్నాడు కొండలరావు ముక్తసరిగా.

"జరిగినదానికి చాలా విచారంగా ఉంది కొండలరావుగారూ!" అన్నాడు మాల్యాద్రి.

"నాకు లేదు" అన్నాడు కొండలరావు.

"మీరు అరెస్టు అయ్యాక - సీత బొత్తిగా డీలా పడిపోయింది. ఈ పదిరోజులూ."

"నాకు తెలుసు"

"మీ స్నేహితులు ఆవిడకు సహాయపడలేదు."

"వాళ్ళపనులు వాళ్ళకున్నాయి."

తనతో ఇన్నాళ్ళూ కాపురం చేసిన మనిషేనా ఇతను అనిపించింది సీతకి. ఆమెకి అప్రయత్నంగా కళ్ళనీళ్ళు తిరిగాయి.

మాల్యాద్రికీ ఏదో ఇరుకైన వాతావరణంలోకి వచ్చినట్టనిపించింది. పరకాయ ప్రవేశాన్ని నమ్మితే, కొండలరావు శరీరంలో మరో వ్యక్తి ఎవరో ఆపని చేశారని నమ్మాలనిపించింది అతనికి.

లేవబోతుంటే - మధు తలని అప్రయత్నంగా నిమిరాడు కొండలరావు. సీత గుండె నీరయింది.

"సీతూ! మలయప్పన్ అనే ఆయన నీకు రెండువేలు తెచ్చి ఇస్తాడు. మీ ఊరుకి వెళ్ళు. ఎప్పుడు రావాలో నేను మళ్ళీ చెప్తాను!"

ఎక్కడికి వెళ్ళమంటారు అని అడగలేదు సీత. ఎలా చెప్తావయ్యా అని వాకబు చెయ్యలేదు. నువ్వెక్కడుంటావో నాకు తెలిసేటట్టు చెయ్యి అని కొండలరావు అడగలేదు.

***ఒక్క సన్యాసమే మనుషుల మధ్య సంబంధ బాంధవ్యాలని తెంచేస్తుందంటారు. కానీ ఓ గొప్ప ఆదర్శం - తను నమ్మిన గొప్ప ఆదర్శం - ఆ బాంధవ్యాలని ఇంకా సుళువుగా తెంచేస్తుంది. లేకపోతే, రాజీవ్ గాంధీ పాదాలకి నమస్కారం చెయ్యబోయిన 'ధానూ' సాహసానికి, పూనా జైల్లో తన జీవిత సహధర్మచారిణి కన్నుమూసినప్పుడు గాంధీ కంటిలో నుండి జారిన ముత్యంలాంటి కన్నీటి***

***చుక్కకీ అర్థంలేదు. రెండు ఉదాహరణలూ ఆదర్శానికి రెండు తీరాలు. పొంతన లేనివి. కానీ ఆదర్శపు ఔన్నత్యంలో ఒకదానికొకటి తీసిపోనివి.***

ఏమైనా ముందు రోజు రాత్రి మాల్యాద్రి మనస్సులో రూపం దిద్దుకున్న ప్రణాళికకి ఈ సందర్భం ఊతాన్ని ఇచ్చినట్టయింది. సీత జీవితాన్ని తను తిప్పబోయే మలుపులో సీతకేమీ అన్యాయం చెయ్యలేదని పోలీసు నిర్బంధం నుంచి తిరిగివస్తూ మాల్యాద్రి అనుకున్నాడు.

సీత మనస్సు మాత్రం వికలమయింది. తన మనిషనుకున్నవాడు తనకి తీరని ద్రోహం చేసినట్టనిపించింది.

తరువాత పదిపదిహేను రోజులు మాల్యాద్రి తనకి కనిపించలేదు. అయినా ఈసారి బెదిరిపోలేదు సీత. ఎక్కడున్నా మాల్యాద్రి ఉనికి తనకి గొడుగు పడుతుందని తెలుసు. ఆమెని ఒకరోజు బయటికి తీసుకువెళ్ళి ఫోటోలు తీయించాడు. అతను పెట్టమన్నచోట అవేమిటో అడగకుండా, కారణం ఏమిటో తెలుసుకోకుండా కాగితాల మీద సంతకం చేసింది.

మలయప్పన్ అన్న ప్రకారం రెండువేలు తెచ్చి ఇచ్చాడు. కొండలరావు చేతివాచీ ఒకటి వెళుతూ ఆమె చేతిలో పెట్టిపోయాడు. ఈ కేసు ఏం జరగబోతోందని సీత అడగలేదు. మలయప్పన్ చెప్పడానికి ప్రయత్నించలేదు.

మర్నాడు ఇంటిముందు హడావుడిగా ఓ కారాగింది. కారులోంచి నందిత అమాంతం దూకి సీతని పిట్టలాగా ఒడిసిపట్టుకుంది. "సారీ, సీతూ, వెరీ సారీ! వాట్ హేపెండ్?" అంటూ.

నందితని చూడగానే సీతకి ఆనందం కలిగింది. ఇది తనకు తెలిసిన చిన్నప్రపంచం. ఇందులో ఓ నందిత, ఓ బబిత, ఈ మాల్యాద్రి.

"ఈ రెచెడ్ హౌస్‌లో ఎలా ఉంటావు? నాతోరా!" అంటూ అప్పటికప్పుడు సూట్‌కేసు సర్దించి, ఫ్లాట్‌కి తాళం వేయించి కారెక్కించుకుంది నందిత. మాల్యాద్రికి తన అడ్రసు ఇవ్వాలి. తాళానికి చిన్న చీటీ తగిలించింది నందిత.

నందిత స్థాయి పెరిగింది. ఇల్లు విశాలమైంది.

"నీ గురించి ఎనిసార్లు అనుకున్నానో తెలుసా? పేపర్లో ఈ వార్త చదివేసరికి హడలిపోయాను. నిన్నెలా పట్టుకోవాలో తెలియలేదు. నాలుగయిదుసార్లు కాలుకాలిన పిల్లిలాగ ఆ ఇంటికి తిరిగాను. ఓ రోజు ఆ సినిమా అమ్మాయి బబిత నీ అడ్రసు ఇచ్చింది" అంది.

లక్ష్మీపతి కూడా చాలా సానుభూతితో పలకరించాడు. సీత మనసు విప్పి జరిగినదంతా నందితతో, లక్ష్మీపతితో చెప్పుకుంది. ఏ సమస్యయినా మనస్సుదాకాపోనివ్వని మనస్తత్వం లక్ష్మీపతిది. ***ప్రతీ సమస్యకీ దగ్గర దోవ స్ఫురిస్తుంది వాళ్ళకి. వాళ్ళు నిజంగా అదృష్టవంతులు.***

***"కాశ్మీర్ సమస్య ఎన్నటికీ తెగడం లేదండీ!" అన్నామనుకోండి.***

***"రాబోయే మార్చిదాకా ఆగండి సార్! నవాజ్ షరీఫ్‌కి ఏడో ఇంట్లో శనిగాడొస్తాడు. తారున చస్తాడు. కాశ్మీర్‌ని వాళ్ళే మనచేతుల్లో పెట్టేస్తారు!"***

***"డయాబెటీస్ ఎక్కువగా ఉండదండి"***

***"రోజూ నల్లమైసమ్మ కోవెలకి వెళ్ళిరెండు నక్కదోసకాయలు తినండి. రోగం పటాపంచలయిపోతుంది!"***

***"మావాడికి మెడిసన్ సీటు కోసం"***

***"వద్దుసార్, నా మాట విని బి.ఎస్.సిలో చేర్పండి. వచ్చే ఏడు మంగుళూరులో సీటు వెదుక్కుని వస్తుంది!" అంటాడు.***

సీత సమస్యకీ అంతే సులువుగా సమాధానం వెదికాడు సుధాకర్. నందితలాగే సుధాకర్‌తో పడకగది స్నేహం కలిపిన ఓ ఆఫీసరు గారి భార్యద్వారా ఈకేసుని విచారణ చేస్తున్న జడ్జిగారి భార్యతో పరిచయం ఏర్పరచుకున్నాడు. జడ్జిగారి భార్య ఇలాంటి వికారాలు లేని

మనిషి. పెద్దముత్తయిదువ. భర్త కోర్టుకు వెళతాడని, డబ్బు సంపాదించి ఇంటిని పోషిస్తున్నాడనీ తెలుసు. అంతకంటే ఇంకేమీ తెలియవు. 45 ఏళ్ళ సంసారిక జీవితంలో ఇంకేమీ తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. అయితే ఆఫీసరుగారి ప్రమేయంతో మొదటిసారిగా జడ్జిగారితో కేసు విషయం ప్రస్తావించింది. జడ్జిగారు ఆశ్చర్యపోయారు. పత్రికలనీ, ప్రజలనీ, తననీ ఆశ్చర్యపరిచిన అతిక్లిష్టమైన కేసు ఇదే ఈ కేసు వంటగదిలో తన భార్య వరకు రావడం అతన్ని ఆశ్చర్యపరచింది. అయితే విసుక్కోకుండా, తిట్టకుండా చెప్పవలసిన రీతిలో, చెప్పగలిగినంత భార్యకి చెప్పి, ఇంకెప్పుడూ అలాంటి విషయాలు అడగవద్దని ముఖం వాచేలాగ చీవాట్లు పెట్టాడు.

హోటల్ పడకగదిలో సుధాకర్ మీద కాలేసుకుని సుతారంగా అతని ముక్కు మునిపళ్ళతో కొరుకుతూ ఈ విషయాన్ని తెలియజేసింది ఆఫీసరుగారి భార్య.

స్థూలంగా విషయం ఇది. ఇప్పట్లో ఈ కేసు ఓ దారికి రాదు. నేరస్థుల తరపున సాక్ష్యం ఇంకా బలంగా లేదు. ఒక్కటి మాత్రం నిజం. ఇప్పట్లో నేరస్థులు జైలు నుంచి బయటికి రారు.

ఈ కథలో ఒక నీతి.. అవినీతిలో కూడా అప్పుడప్పుడు ఓ చిన్న ప్రయోజనం ఉండకపోదు. ఇది లక్ష్మీపతి అవినీతి నిరూపించిన సత్యం.

సీత కళ్ళ ముందు భవిష్యత్తుకి తెరపడింది. అటుపక్క ఏం జరగనుందో, ఏం జరగడానికి తను ఎలాంటి ప్రయత్నం చెయ్యాలో అర్ధం కాలేదు. తను మచ్ఖండ్‌లో పెళ్ళి చేసుకుని మద్రాసు వచ్చాక మొదటిసారిగా ఇంటి గురించీ, ఇంటికి వెళ్ళడాన్ని గురించీ ఆలోచించింది. సైరంధ్రి సంరక్షణలో తన తల్లి ఎలా ఉందా అని ఆలోచించింది. ***ఆడపిల్లకి కష్టంలో పుట్టిల్లు గుర్తువస్తుంది.*** సీతకి లోకంలో అన్ని తలుపులూ మూతపడ్డాక వెళ్ళగలిగిన స్థలం అదొ క్కటేననిపించింది. కుందయ్యగారికి ఫోన్ చేసి, తన తల్లి ఎక్కడ ఉన్నదీ వాకబు చెయ్యమని నందితతో చెప్పింది సీత.

ఈ ప్రశ్నలన్నిటికీ బలమయిన సమాధానం మరొకపక్క సిద్ధమవుతోందని సీతకి తెలియదు. ఈ కష్టంలో ఉన్నట్టుండి తన జీవితంలో తొంగిచూసి, ఓ ఉద్ధుతాన్ని తట్టుకుని, తనకి చేతనయిన సహాయం చేసి మాల్యాద్రి కూడా మాయమయ్యాడనుకుంది. అతనిమీద సీతకి కోపం రాలేదు. ఆనాడు ఆమె శరీరం, తద్వారా ఆమె హృదయం తొక్కిన పరవళ్ళు ఆమె జీవితంలో మధురమైన ఘట్టం. అందుకు ఆమె మనస్సులో పశ్చాత్తాపమూ లేదు. నిజానికి ఆలోచనా లేదు. ఆ తర్వాత మాల్యాద్రి ఆమె జీవితంలో ఎన్నటికీ కనిపించని పరిస్థితుల్ని చేజేతులా తెచ్చిపెట్టుకున్న కొండలరావుని మాత్రం క్షమించలేదు. ఎంతో దూరం తనతో ప్రయాణం చేస్తానని నమ్మకం కల్పించి, చెయ్యిపట్టుకు నడిపించి క్రూరంగా మధ్యలో వదిలేసిన నమ్మకద్రోహిలాగ కొండలరావు ఆమెకి కనిపించాడు. అందుకు లక్షకారణాలు ఉండవచ్చుగాక. వాటిలో ఏ కారణమూ ఇప్పటి తన నిస్సహాయతకి సజాయిషీ చెప్పలేదు. సమర్ధించదు.

కొండలరావు జ్ఞాపకాన్ని మనస్సు పెద్ద కుంచెతో చెరిపే ప్రయత్నాలు చేస్తోంది. తన దగ్గర ఉన్న డబ్బిచ్చి మచ్ఖండ్ చేరడానికి టిక్కెట్టు తెప్పించుకుంది సీత. ఎల్లుండి ప్రయాణం.

ఆ సాయంకాలం - చాలా రోజుల తర్వాత కనిపించాడు మాల్యాద్రి.

''నువ్వు ఎల్లుండి ప్రయాణం అవుతున్నావు సీతా!'' అన్నాడు.

సీత ఆశ్చర్యపోయింది. 'మీకెలా తెలుసు?' అంది తెల్లబోతూ.

మాల్యాద్రి చిరునవ్వు నవ్వాడు. ''నాకు తెలిసినవి చాలా నీకు తెలీదు. ఎల్లుండి నీ ప్రయాణం మీ ఊరికి కాదు. నాతో అమెరికాకి. నువ్వూ, మధూ కూడా, ఏర్పట్లన్నీ జరిగిపోయాయి. ఇది పాస్ పోర్టు. ఇవి మనిద్దరి టిక్కెట్లు.''

సీతకి ఒక్కక్షణం చుట్టూ ఉన్న ప్రపంచం కనిపించలేదు.

# 27

**అమెరికా వెళ్ళాలనే ఆలోచన మాల్యాద్రికి మొదటినుంచీ లేదు.** ఆ ఒక్క కారణానికే అతనూ, పాల్ రెడ్డి విడిపోయారు. ఏ కారణం చూపించి పాల్‌రెడ్డి మాల్యాద్రిని ఒప్పించలేకపోయాడు.

అయితే సీత ఒంటరితనం మాల్యాద్రిని ఆలోచించేటట్టు చేసింది. నిజానికి అది అతని బాధ్యత కాదు. కొండలరావుది. ఆమె ఒంటరితనం తనని న్యాయంగా బాధపెట్టనక్కరలేదు.

ఇరవై సంవత్సరాలు ఒకే బస్సుస్టాపులో బస్సు ఎక్కుతూంటాం. ఒకే మనిషిని చూస్తుంటాం. ఎప్పుడూ పలకరించుకోలేదు. మాట్లాడుకోలేదు. మాట్లాడాలనే అవసరం కానీ, ఆలోచనకానీ రాలేదు. కానీ ఉన్నట్టుండి ఆమ్‌స్టర్ డామ్‌లో, భాష తెలీని ప్రాంతంలో మనం పర్సు పోగొట్టుకుని, ఏం చెయ్యాలో తెలీక నిస్సహాయంగా కళ్ళనీళ్ళు తిరిగిన క్షణంలో ఎదురు పేవ్‌మెంట్ మీద ఆ మనిషి కనిపించాడనుకోండి. పలకరించం. వెళ్ళి అమాంతం వాటేసుకుని భోరుమంటాం.

అదే జరిగింది మాల్యాద్రికీ, సీతకీ! అయితే, అంతకంటే ఎక్కువ జరిగింది వీరిద్దరి మధ్య. వారి మనస్సులో ఏర్పడిన సాన్నిహిత్యం కేవలం బస్సు స్టాపులో అపరిచిత వ్యక్తి పరిచయం లాంటిది కాదు. మాల్యాద్రి మనస్సులో చాలాకాలంగా సీత ఉంది. సీత మనస్సులో మాల్యాద్రిపట్ల ఆకర్షణ - కోపం, అసహనం రూపంలో ఉంది. వాళ్ళిద్దరి మధ్యని సంఘర్షణలకి మరో పేరు వారి మనస్సులో ఒకరి పట్ల ఒకరికి ఏర్పడిన ఆకర్షణ. అందుకనే మనుషులకు తెలీని ఆవేశం వాళ్ళిద్దరినీ ఏకం చేసింది. వారిద్దరి మధ్యా సెక్స్‌కి అర్థం అదే! అంతే. ఇంత చెప్పడానికి కారణం సీత ఒంటరితనానికి పరిష్కారాన్ని తన బాధ్యతగా మాల్యాద్రి తీసుకోవడానికి నేపథ్యాన్ని వివరించడమే.

మొదట ఆమెకి కావలసిన సాంఘికమైన భద్రత ఏర్పరచాలనుకున్నాడు. స్త్రీకి కావలసిన మొదటి సాంఘిక భద్రత ఏమిటి? భర్త, కాపురం! మంచి లాయర్‌ని ఏర్పాటు చేసి, కొండలరావు ఇరుక్కున్న సంక్షోభంలోంచి అతన్ని బయటికి లాగాలనుకున్నాడు. కానీ అతను షాక్ అయిన విషయం ఏమిటంటే కొండలరావు ఆ సంక్షోభంలో ఇరుక్కోలేదనీ, అతను కోరుకుని, ప్రేమించి అందులో తలమునకలయ్యాడన్నది. అంతేకాదు. అతనికి తను పూనుకుని చేసే ఏ సహాయం ఆశించే స్థితిలో లేడని. అదిగో.. అప్పుడు సీతకి నిజమైన సహాయం కావాలనీ, ఆ సహాయం ఆమె భర్త నుంచి శాశ్వతంగా రాబోవడం లేదనీ అర్థమయింది.

దీప పుట్టాక రేణూ తన నుంచి ఆశించేది ఏదీలేదని తెలిశాక, తను ఏం నష్టపోయాడో సీతని కలిసిన ఈ క్షణంలో తెలిసివచ్చింది. కష్టంలో సీతకి తన శరీరం ఇచ్చింది ఊరట అయితే, తనకి ఆమె శరీరం ఓ హెచ్చరిక చేసింది. జీవితంలో తను ఏం నష్టపోతున్నాడో గుర్తుచేసింది. రేణూ జీవితాంతం తల్లిగానే ఉండడాన్ని కోరుకుంది. ఆ బలమయిన కోరిక, తద్వారా వచ్చే తృప్తిలోనూ సెక్స్ ఉంది (ఫ్రాయిడ్‌ని అడగండి. తెలుస్తుంది). కానీ తాను అలాంటి తృప్తిని కోరుకోవడం లేదు. తనకి జీవితంలో ఇంకా చాలాకాలం భార్య కావాలి. ఆమె సాహచర్యం కావాలి. ఆమె శరీరం కావాలి. తను అనుకునే స్నేహితుడు కావాలి. ఇంకా చాలా కావాలి. ఆ క్షణంలో ఇవన్నీ సీతే కావాలనిపించింది. అనిపించడంకాదు. నమ్మకం కుదిరింది.

కాని, ఎలా? ఈ సమాజంలో - ఇంకా - పెళ్ళయిన స్త్రీ పట్ల ప్రేమకి భవిష్యత్తు లేదు. గమ్యం లేదు. కాగా, సీత ఆత్మాభిమానం గల మనిషి, ఇంకొకరికి ఉంపుడు కత్తెలాగ జీవించడం ఆమె ఊహించలేనిది. తన ఉద్దేశమూ కాదు. అయితే, ఆమె చుట్టూ ఉన్న

ప్రపంచం ఆయాచితంగా ఖాళీ అయిపోయింది. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని దగ్గర ఉన్న రేణూ ఖాళీ చేసేసింది. ప్రస్తుతం ఆమె లోకంలో ఇద్దరే ఉన్నారు. రేణూ, దీప! సమస్యలు విడిపోతున్నాయి. కానీ దారి కనిపించడంలేదు.

ఈ సమయంలో ఉన్నట్టుండి పాల్ రెడ్డి ఫోన్ చేశాడు. ఈసారి సింగపూర్ నుంచి ఫోన్ చేశాడు. మళ్ళీ నైరోబీ వెళుతున్నానని, మాల్యాద్రి లేకుండా మరోసారి ఏమీ తెలీని కొత్తచోట కొత్త వ్యాపారం ప్రారంభించడం ఇష్టంలేదని, మరేం గత్యంతరం లేదు గనుక పోయిన చోటే మళ్ళీ వ్యాపారం సాగించాలని నిశ్చయించుకున్నానని. రాత్రి మందు తాగి డిన్నర్ తీసుకుంటూ సరదాగా మాల్యాద్రి జ్ఞాపకం వచ్చి ఫార్చూనా హోటల్ నుంచి ఫోన్ చేశాడు. తెల్లారితే లుఫ్తాన్సాలో ప్రయాణం. పాల్‌రెడ్డితో మాట్లాడి ఫోన్ పెట్టేశాక మాల్యాద్రికి నిద్రపట్టలేదు. తనని నమ్ముకొని వచ్చిన పాల్‌రెడ్డికి సహాయం చెయ్యలేక పోయినందుకు బాధగానే ఉంది. అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు దేశాన్ని వదిలి వెళ్ళే ప్రసక్తే లేదు. పడుకున్నాడు.

తెల్లవారు ఝామున నాలుగు గంటలకి నిద్రలో అటునుంచి ఇటు పొర్లుతూండగా ఆలోచన వచ్చింది. అమెరికా..!! తన ప్రశ్నకి సరైన సమాధానం.. పెళ్ళికీ, సీతతో జీవితానికీ, గడపబోయే రేపుకీ అన్నిటికీ - అన్నిటికీ హడావుడిగా లేచి ఇంటర్నేషనల్ కాల్‌కి టెలిఫోన్ ఎక్స్చేంజికి పరిగెత్తాడు. సామాన్లు సర్దుకొని ఎయిర్ పోర్టుకి వెళుతూ హోటల్ లాంజ్‌లో దొరికాడు పాల్ రెడ్డి. మాల్యాద్రి గొంతు విని ఆశ్చర్యపోయాడు.

"ఇదేంటి ఈ టైంలో? ఇంకో రెండు గంటల్లో ఫ్రాంక్‌ఫర్టుకి బయలుదేరుతున్నాను. ఇప్పటికే గంట లేటు. షాంగీకి వెళ్ళాలి."

"మీరు వెంటనే ఇండియా రావాలి."

"నేనా.. ఎందుకు? నా ప్రయాణం ఏర్పాట్లూ.. అన్నీ!"

"నో నో వెంటనే రండి. ప్లీజ్! నేను. నా ప్లాను మారింది. నేను అమెరికా వస్తాను."

"వాట్!" గావుకేక పెట్టాడు పాల్ రెడ్డి.

అంతే. ఆ సాయంకాలానికి మద్రాసులో దిగాడు.

మాల్యాద్రి తాజ్‌లో గదికి వచ్చేసరికి బ్లాక్ లేబుల్ సగం ఖాళీ అయింది. మాల్యాద్రిని చూస్తూనే అమాంతం కావలించుకున్నాడు. "టెల్ మీ. మీ ప్లాన్స్‌ని మార్చేసిన కారణం ఏమిటి? ఏం జరిగింది?"

"మార్చేసిన మనిషి పేరు సీత. ఇండియా భాషలో చెప్పాలంటే నేను మరొకరి పెళ్ళాంతో అమెరికాకి లేచిపోతున్నాను."

పాల్ రెడ్డి షాక్ అయి చూశాడు. మాల్యాద్రి నవ్వుతూ కథంతా చెప్పాడు. పాల్ రెడ్డికి మతిపోయింది. "ఈ జిగ్ సా పజిల్‌లో నాకు అర్థంకానివి రెండు ఉన్నాయి" అన్నాడు చివరికి.

"ఏమిటి?"

"నీ భార్య, సీత కొడుకు మధు."

మాల్యాద్రి నవ్వాడు. "ఈ కథలో మలుపుకి ఆ ఇద్దరే ముఖ్యకారకులు. నా భార్య ఇండియా వదలదు. దీపకి దూరం కాదు. భర్త దూరమయినా పరవాలేదు. ఆమెకి సెక్యూరిటీ కావాలి. సీతకి నిలవనీడ కావాలి. మధూకి సెక్యూరిటీ కావాలి. బిడ్డ కారణంగానే సీత ఇప్పుడున్న పరిస్థితిలో ఆకులా అల్లల్లాడిపోతోంది. సీతని, ఆమె చేతుల్లో ఉన్న బిడ్డతో సహా..నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను."

పాల్‌రెడ్డి కాసేపు మౌనంగా ఉండిపోయాడు. 'మరి సీతతో ఇదంతా చెప్పారా?'

"చెప్పినా ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఆమెకి ఒక్కటి తెలుసు. నేను పొరపాటు చెయ్యనని. తనకేది మంచిదో అదే చేస్తానని. ఎప్పుడో. బహుశా అయిదారు నెలల తర్వాత అమెరికాలో ఆలోచించడం ప్రారంభిస్తుంది. అప్పటికి ఆమెకి తన పరిస్థితీ అర్థమవుతుంది. అమెరికాలో జీవితమూ అర్థమవుతుంది."

పాల్‌రెడ్డికి ఇంకా నమ్మకం కుదరడం లేదు. మాల్యాద్రి అమెరికా రావడం అతని రొట్టె తిరిగి నేతిలో పడినట్టే! కానీ, అతను తన భార్య గురించీ, మరొకరి భార్య గురించీ తీసుకుంటున్న నిర్ణయాలు అంత సూటిగా, నీటుగా ఉన్నట్టనిపించలేదు. ఆ మాటే అన్నాడు. మాల్యాద్రి నవ్వాడు. అతని ముఖంలో చెప్పలేనంత ధైర్యం, నమ్మకం కనిపిస్తున్నాయి.

" పోనీ, మీ ఆవిడతో ఈ విషయాన్ని చర్చించారా?"

"మా ఆవిడకి నేను దేశం వదిలిపోవడం నచ్చదు. మరొకరి పెళ్ళాంతో వెళ్ళడం అసలు నచ్చదు. సీతతో వెళ్ళడం సుతరామూ నచ్చదు. ***కంచం ముందు కూర్చునే ముందు మన ఆకలి, మనరుచీ, మన ఆరోగ్యం చూసుకోవడం స్వార్థం కాదు. అవసరం!*** కాగా, మా ఆవిడకేది అవసరమో నాకు తెలుసు."

ఇది నేరస్థుడి సంజాయిషీ! తను పాల్ రెడ్డిని ఒప్పించలేకపోతున్నాని మాల్యాద్రికి అర్థమవుతోంది. ఎంతచెప్పినా, తను రేణూని నొప్పించబోతున్నాననీ అర్థమవుతోంది. ఎంత ధైర్యంగా ఉన్నా, సీత ఎదురు తిరగవచ్చుననీ మనస్సు చెపుతోంది.

మాల్యాద్రి స్వభావంలో ఆత్మవిశ్వాసమూ, మాములుగా నడిచే దోవకి భిన్నమయిన మార్గాన్ని వెదకడమూ, ఆ మార్గానికి సుగమమయిన దారి ఏర్పరచుకోవడమూ సామాన్య కోణాలు. ఆ కోణాలే అతన్ని సాఫ్ట్‌వేర్ రంగంలోకి కొత్త పుంతలు తొక్కించాయి. అయితే, ఈ టెక్నిక్, ఈ స్వభావం జీవితానికి వర్తిస్తుందా?

తాను ప్రత్యేకంగా పూనుకుని, దగ్గర ఉండి సీత పాస్ పోర్టు తెప్పించాడు పాల్‌రెడ్డి. మధుపేరు తల్లి పాస్ పోర్టులో ఎండార్స్ చేయించాడు. మాల్యాద్రి ఒక నిర్ణయానికి వచ్చాక, జరగాల్సిన పనులు జరిపించడం పాల్‌రెడ్డికి కష్టం కాదు. మాల్యాద్రి కోరిన ఏర్పాట్లన్నీ చేసేసి, న్యూయార్కు టిక్కెట్లు అతని చేతిలో ఉంచి, చాలా ఆనందంగా అమెరికా బయలుదేరాడు పాల్‌రెడ్డి. మరో ఇరవైరోజుల్లో మాల్యాద్రి, సీత, మధు, న్యూయార్క్ జె.ఎఫ్.కె.లో ఉంటారు. పాల్‌రెడ్డికి ఇంకా అనుమానంగానే ఉంది. ఈ ప్రణాళికలో ఇద్దరు తల్లులు, ఇద్దరు బిడ్డల ప్రమేయం ఉంది. ఒక తల్లికి తన భర్త శాశ్వతంగా దూరమవుతాడని తెలియాలి. మరో తల్లికి తాను మరొకరి భర్తతో తన భర్తకి పుట్టిన బిడ్డని తీసుకుని మరోదేశం శాశ్వతంగా వెళ్ళిపోతున్నానని తెలియాలి. ఈ ఇద్దరు తల్లులూ అమెరికా స్త్రీలో, జర్మనీ స్త్రీలో అయితే కాస్త ఫరవాలేదు. కానీ, ఇద్దరూ సంప్రదాయంలో వేళ్ళున్న భారత స్త్రీలు, మాల్యాద్రి ధైర్యం ఏమిటి?

ప్లాను ఎలా సాగుతున్నదీ, రూఢిగా బయలుదేరేదీ లేనిదీ తనకీ ఫోన్ చెయ్యమని పదేపదే చెప్పి ప్లేన్ ఎక్కాడు పాల్‌రెడ్డి.

****

మాల్యాద్రి చెప్పినమాట విని నివ్వెరపోయింది సీత. తను అమెరికా వెళ్ళడం ఏమిటి? అదీ మాల్యాద్రితో. పెళ్ళయిన ఈ తక్కువ వ్యవధిలోనే సీతలో ఇదివరలో కనిపించిన సాహసం, తిరుగుబాతు వెనకడుగు వేశాయి.

"ఛీ...ఛీ" అనేసింది.

మాల్యాద్రి ఆశ్చర్యపోలేదు. సీత భుజం పట్టుకు కూర్చోబెట్టి వివరంగా చెప్పాడు. భర్తకి దూరమయిన సీత.. నా అనేవాళ్ళు లేక, ఏ ఆధారమూ లేకుండా బిడ్డతో పాత వాతావరనంలో కొత్తజీవితం పారంభించాలి. సీత జీవితంలో త్వరగా, అసంకల్పితంగా చీకట్లు ముసురుకున్నాయి కానీ - వృద్దాప్యాన్నో, అలసటతో విశ్రాంతినో ఆశించే వయస్సు కాదు.

"మరి రేణూ?"

నవ్వాడు మాల్యాద్రి. "రేణూ పర్మిషన్ ఇస్తే నాతో వస్తావా?!"

"రేణూకి అన్యాయం చెయ్యడం నాకిష్టం లేదు"

"రేణూకి జరగాల్సిన న్యాయమేమిటో నాకు తెలుసు. ***భర్త అంటే కొందరికి గొడుగు. కొందరికి ఉపాధి. కొందరికి వినోదం, కొందరికి అవకాశం. కొందరికి ఆత్మవిడుపు. కొందరికి ఆధారం. కొందరికి స్టేటస్ సింబల్. కొందరికి బ్యాంక్ అకౌంట్..***" వేదిక మీద ఉపన్యాసంలాగా మాట్లాడాడు మాల్యాద్రి.

ఏం చెప్పాలో తర్ఫీదై వచ్చినవాడిలాగా కనిపించాడు. "మరి నాకేమిటి?" తీరా అడిగాక, తనకే నవ్వొచ్చింది.

"నీకు భర్త పెద్ద ఛాలెంజ్. నీ ఆసక్తినీ, ఆర్తినీ, కోరికనీ, అవసరాన్నీ అన్నిటికీ మించి నీ ఇగోనీ తట్టి పలకరించే ఓ ప్రతియోధుడు."

"నా కర్థంకాలేదు" అంది సీత భయం భయంగా.

"కాకపోతే ఏం నష్టం లేదు" లేచాడు మాల్యాద్రి. 'ఇక్కడినుంచి నువ్వేం తీసుకురానక్కరలేదు - మధూని తప్ప! ***అన్నీ నీకిస్తాను. నిన్ను నువ్వు నాకియ్యి చాలు*** '

సీత కళ్ళనిండా నిండాయి. ఆమె పసిబిడ్డలాగా తన తలని అతని గుండె మీద ఆన్చింది. ఆమె తల కూడా నిమరలేదు మాల్యాద్రి. ఆమెకి కావలసిన ఓదార్పు ఇప్పట్లో తన స్పర్శకాదు - అమెరికా టిక్కెట్లు. దానికి ఈ ఆర్ద్రత కేవలం స్పందన మాత్రమే! కొన్ని సందర్భాలలో కన్నీళ్ళు కనుకొలకుల్లోంచి బయటికి దూకేయాలి.

"రేపు కావాలంటే కొండలరావు దగ్గరికి నిన్ను తీసుకు వెళతాను" అన్నాడు గుమ్మం దగ్గర ఆగి.

"కావాలి. వెళ్ళాలి" అంది సీత.

కానీ, కావాలని కొండలరావు కోరుకోలేదు. అప్లికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూ సంపాదించి, తీరా బైటకి వచ్చాక వాళ్ళని చూడడానికి కొండలరావు అంగీకరించలేదు. సీత మనస్సు కలుక్కుమంది. ఆఖరిసారి మధూని తండ్రికి చూపించాలనుకుంది. తనతో జీవితాన్ని, శరీరాన్ని పంచుకున్న అతని కళ్ళల్లో లేశమయినా నీటితెర కనిపిస్తే తన కాళ్ళకింద భూమి భయంతో కంపిస్తుందనుకుంది. అలాంటిదేం జరగలేదు.

సీత మనస్సులో ఆఖరి శంక ఆ విధంగా తొలిగిపోయింది. ఆమె మనస్సు చాలా త్వరలో కొత్తజీవితం వేపు లాగేస్తోంది. అక్కడేముంది?

****

లండన్ హీత్రో ఎయిర్ పోర్టు నుంచి ఇండియాకి ఇంటికి ఫోను చేశాడు మాల్యాద్రి. తను దేశం వదిలి పెట్టాకే రేణూకి దూరమయినట్టు తెలుస్తుంది. అప్పటికి ఇండియాలో రాత్రి రెండయింది. రేణూ ఫోన్ ఎత్తింది. నిద్రపోలేదని ఆమె గొంతు చెపుతోంది.

మాల్యాద్రి గొంతు గుర్తుపట్టి, "యూ స్కాండ్రెల్!" అని గావుకేక పెట్టింది.

కొంతసేపు మాట్లాడనిచ్చి, తను సిద్ధం చేసుకున్న వాక్యాలని ఫోనులోకి ఒంపాడు "చూడు రేణూ, నేను చేసిన పనివల్ల నీకేం ఇష్టం లేదని నీకు ముందు ముందు తెలుస్తుంది. బీరువాలో పాస్ బుక్కు, చెక్కుబుక్కు ఉన్నాయి. బాంకులో నాలుగు లక్షలు ఉన్నాయి. రెండు ఫిక్సెడ్ డిపాజిట్లు. మూడేళ్ళకి ఒక లక్ష. అయిదేళ్ళకి మరొక లక్ష అవుతాయి. వాటి. ముట్టుకోకుండా అలాగే ఉంచితే, దీప

చదువుకి ఇరవై లక్షలు నీ చేతిలో ఉంటాయి. దీప పెళ్ళికి పాతిక లక్షలు నేనిస్తాను. నీకు తృప్తి కలిగించే ఒక్క విషయం చెపుతాను. నేను నీకు విడాకులు ఇవ్వడంలేదు. సీతని పెళ్ళి చేసుకోవడంలేదు. ఎందుకంటే, నీకు భర్త అవసరంలేదు. సీతకి పెళ్ళి అవసరంలేదు." ఫోన్ పెట్టేశాడు.

## 28

**విజయనగరంలో పోగుచేసుకున్న విజ్ఞానం అమెరికాలో కలిసివచ్చింది సీతకి.** డెన్వర్ చిన్న ఊరు. తెలుగువాళ్ళు బొత్తిగా లేని ఊరు. అక్కడ మాల్యాద్రి, పాల్‌రెడ్డి వ్యాపారానికి ప్రాతిపదిక వేసుకున్నారు. ఓ పెద్ద ఉప్పెనకి ముందు సూచనగా కొండలరావు ఎలా తన ప్రపంచంలోకి పారిపోయాడో, విచిత్రంగా అంతకంటే ఎక్కువగా మాల్యాద్రి తన ప్రపంచంలోకి పారిపోయాడు. అయితే, సీతకి అది విచిత్రంగా, ఇబ్బందిగానూ అనిపించలేదు. కారణం. కొండలరావు ప్రవాసం వెనక పెద్ద ఖూనీ ఉంది. మాల్యాద్రి ప్రవాసం వెనక పెద్ద వ్యాపారం ఉంది.

ఎక్కడో అట్లాంటిక్ మీద ఎగురుతున్న క్షణాల్లోనే మాల్యాద్రి తనకి తానే బారసాల చేసుకున్నాడు. మాల్యాద్రిని మరిచిపోయి 'బాబీ' అయిపోయాడు. ఎందుకు? గతాన్ని వదిలిపెట్టడానికి అది కేవలం సంకేతం.

మనదేశంలో దక్కే పదేళ్ళ అనుభవం అమెరికాలో ఒక్క సంవత్సరంలో వస్తుంది. అందులో ముఖ్యమయింది అంట్లు తోమడం, ఇల్లు ఊడ్చుకోవడం, దొడ్డి కడుక్కోవడం వగైరా వగైరా! ఏ కాలుష్యమూలేని వాతావరణం, డబ్బూ ఆ అనుభవాలన్నిటినీ సమర్థిస్తుంది. అమెరికలో జీవనం ఓ వ్యసనం. దానికి అలవాటు పడ్డవాడు బయటపడలేడు.

ఆరునెలలు తిరగకుండా సీత కారు డ్రైవింగు నేర్చుకుంది. మరో నాలుగు నెలల్లో బాబీ, సీతా రెండు కార్లు కొనుక్కున్నారు. మధూని కిడ్స్ ప్లేస్‌లో చేర్చారు. పాల్‌రెడ్డి ఇండియానా పొలీస్‌లో స్థిరపడ్డాడు. డెన్వర్‌కి రెండున్నర గంటల దూరం. పాల్‌రెడ్డి బ్రహ్మచారి. రెండు గదుల అపార్టుమెంట్ కొన్నాడు. వారాంతాల్లో పాల్‌రెడ్డి దగ్గరకి వెళ్ళడం రొటీన్ అయిపోయింది. సీత కారు డ్రైవ్ చేస్తూంటే, బాబీ పక్కనే కూర్చునేవాడు. మధూ వెనకసీట్లో నిద్రపోయేవాడు. క్రమేపీ వారాంతాలకోసం ఇద్దరూ ఎదురుచూసేవారు.

సరిగ్గా నాలుగేళ్ళలో సాఫ్ట్‌వేర్ వ్యాపారానికి ఒక రూపం వచ్చింది. అయితే, ఇండియానా పొలీస్ అందుకు అనువైన స్థలం కాదు. అప్పటికి నాన్సీ పుట్టింది. మధూ జీవితంలో ఎదురైన మొదటి శత్రువు నాన్సీ. తల్లిప్రేమనీ, అభిమానాన్ని, ముద్దుని నాన్సీతో పంచుకోవడం సుతరామూ నచ్చేదికాదు మధూకి. నాన్సీని బాధపెట్టడానికి అతని చిన్న బుర్రలో రకరకాల ఆలోచనలు వచ్చేవి. ఓసారి పెరంబ్యులేటర్ చక్రాల స్క్రూలు తిప్పేశాడు. నాన్సీపట్ల మధూ శత్రుత్వాన్ని సీత గుర్తిస్తే తల్లి దగ్గర పోగొట్టుకున్న ప్రేమని భర్తీ చెయ్యాల్సిన అవసరాన్ని బాబీ గుర్తించాడు. ఆ తర్వాత మధూకి ఆలోపం కనిపించలేదు.. క్రమంగా మధూ తండ్రికి కొడుకయిపోయాడు.

అమెరికా వచ్చిన అయిదో ఏట బాబీ పిట్స్‌బర్గ్‌కి మకాం మార్చాడు. ఈసారి పాల్‌రెడ్డి తనకూ, బాబీకి సరిపోయే ఇంటిని ఊరుకి సరిగ్గా ఎనిమిది మైళ్ళదూరంలో కొన్నాడు. పిట్స్‌బర్గ్ వ్యాపారరీత్యా ఎంపిక చేసిన స్థలంకాదు. అక్కడికి మారడానికి ముఖ్యకారణం సీత. సీత ఆ పట్టణాన్ని కోరుకోడానికి ముఖ్యమైన కారణం.. వెంకటేశ్వరస్వామి.

219హ్యారో డ్రైవ్.

కొండకొన మీద నిలబెట్టిన పెద్ద రాయిలాగ భవనం నిలబడి ఉంది. ఉధృతమైన గాలి వీస్తే పక్కనున్న లోయలోకి జారిపోయేటట్టుంది. అటుచూస్తే అయిదారు తెరలలో పరచిన ఆకుపచ్చ. మీద నీలపు ఆకాశం. పిట్స్‌బర్గ్‌లో ఆ ప్రాంతం ఏ కోనసీమ సౌందర్యాన్నో గుర్తుతెస్తుంది.

చాలా రోజుల తరువాత సీత చీరకట్టుకుంది అమెరికాలో. గడిచిన పదహారు గంటల్లో పదహారు సంవత్సరాల జ్ఞాపకాలు మనస్సులో ముసురుకున్నాయి. కొండలరావుని చూడగానే ఈ పదహారేళ్ళూ ఏదో నేరం చేసినట్టూ, అతనికి తీరని అన్యాయం చేసినట్టూ మనస్సు గింజుకులాడింది.

ఫోన్‌లోనే కొండలరావు విషయమ బాబీకి చెప్పింది. వాక్యం పూర్తికాగానే అటుపక్క ఫోన్ ఒక లిప్తకాలం మూగవోయింది. బాబీ బాధపడుతున్నాడా?

"ఎలా ఉన్నాడు కొండలరావు? ఇంటికి రమ్మని ఆహ్వానించకపోయావా? పిట్స్‌బర్గ్‌లో ఎక్కడ దిగాడో తెలుసా పోనీ?" ఇన్ని ప్రశ్నలు వేశాడు.

సీత నవ్వింది. "యూ ఫూల్! నువ్వతని పెళ్ళాన్ని లేపుకువచ్చావని గుర్తుందా?"

"అదే నా బాధ, సీతా! అంత ఘోరం చేసినందుకు అతను నాతో తగాదా పడితే, చొక్కా పుచ్చుకుంటే మనస్సు కాస్త ప్రశాంతంగా ఉండేది. నిన్ను లేపుకుపోవడం అంత సులువని తెలిస్తే, అన్నేళ్ళు ఆలస్యం చేసేవాడిని కాదు."

బాబీతో మాట్లాడుతుంటే, అతనితో జీవితం గడుస్తూంటే ఒక్కనాడూ తప్పుచేసిన బాధ కలగలేదు. అదేదో సహజమైన చర్యలాగా, మొదట్నుంచీ బాబీతో గడపడానికే తను పుట్టినట్టు అనిపించింది. తన జీవితంలో ఈ పదహారు సంవత్సరాలూ ఏ ఒడుదుడుకులూ లేని అపూర్వమైన దశ. శీనూ పుట్టాక, "నాకు మరో కూతురు కావాలి, సీతా" అన్నాడు బాబీ.

"మరో అమ్మాయిని ఈసారి ఇండియాకి లేవదీసుకుపో. నేను చావలేను" అంది సీత అతని పెదాల్ని చప్పరిస్తూ.

"ఏఁ! కనే ఓపిక లేకా, నా మీద కోరికలేకా?"

సీత నవ్వింది. "కోరికలు పిల్లల్ని కంటే నేను ముసలిదాన్నయిపోయేదాకా కంటూనే ఉంటాను. శీనూ పుట్టాక నా వర్క్ అంతా దెబ్బతింది. జామిలీ కాస్త నన్ను ఒడ్డున పడేస్తోంది. లేకపోతే ఇంకా చచ్చేదాన్ని. పిల్లలింక చాలు, బాబీ! మిసెస్ మార్గరేట్ ఈ వీకెండ్ ఆపరేట్ చేస్తానంటోంది."

అప్పుడిక పిల్లలు పుట్టడానికి ఫుల్ స్టాప్ పెటారిద్దరూ. సీతని ఆపరేట్ చేసుకోనివ్వలేదు బాబీ. తనే వేసక్టమీ చేయించుకున్నాడు.

ఇది పాత కథ. ఇప్పుడు కొండలరావు కనిపించగానే మళ్ళీ పాతరోజులు పునరావృతమైనట్టనిపించింది. ఎయిర్ పోర్టులో స్నేహితుడు చెప్పిన అడ్రెస్ గుర్తుంది 219 హ్యారో డ్రైవ్. కారు తీసుకు బయలుదేరింది.

వరండాలో ఆ చలిలో గోచీ కట్టుకుని ఆసనాలు వేస్తున్నాడు కొండలరావు. అతని పక్కనే రెండు పామరెనియన్స్ ఆడుకుంటున్నాయి. లోపల ఎవరో వంట చేస్తున్న శబ్దం వినిపిస్తోంది. ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి శ్రావ్యంగా తిరుప్పావై పాడుతోంది.

పక్కన ఉన్న రైలింగ్ మీద కూర్చుంది సీత. కాస్సేపటికి కొండలరావు చూసి, చటుక్కున కూర్చున్నాడు.

"పండూ! ఎంతసేపైంది వచ్చి?" అన్నాడు. సీతని అక్కడ చూసినందుకు ఆశ్చర్యపడలేదు.

"ఇందాకే ముందు నన్ను 'పండు' అని పిలవడం మానండి. అంత ప్రేమని తట్టుకోలేకపోతున్నాను."

నవ్వాడు కొండలరావు. అప్పుడు గమనించింది. కొండలరావు ఇదివరకు తనకు తెలిసిన మనిషిలాగా లేడు. అతనిలో ఏదో లోపం ఉంది.

"నామీద కోపం లేదా మీకు?" అడిగింది సీత ఉన్నట్టుండి.

"ఎందుకు? నేనేగా నీకు కోరి దూరమైంది."

తుళ్ళిపడింది. లేచి లుంగీ కట్టుకున్నాడు.

"ఈ చలిలో ఈ యోగాసనాలు చాలా ప్రమాదం. ఇలాంటి బట్టలు చాలవు. ఉలెన్స్ వేసుకోండి" అంది సీత.

నవ్వాడు కొండలరావు. "సీతా! చలి నన్ను బాధపెట్టడం మానేసి చాలారోజులైంది. ఎందుకు నీకు దూరమైనానో అడగవేం? ఆ రోజుల్లోనే నాకు కడుపు నరాలలో కాన్సర్ అని తేల్చారు డాక్టర్లు."

సీత షాక్ అయింది. "నాకు.. నాకు ఎప్పుడూ చెప్పలేదేం?"

కొండలరావు సీత తల నిమిరాడు. "చెపితే పదహారు సంవత్సరాలు ఆనందంగా బతక గలిగేదానివా? నేను యూనియన్ గొడవల్లో దిగడానికి కారణం నువ్వు. నీకు దూరం కావాలని, వీలయితే నిన్ను దూరం చేసుకోవాలనుకున్నాను."

"ఎందుకు...ఎందుకు?" ఏడుపొస్తోంది సీతకి.

"నువ్వంటే ప్రేమ కనక. నేను అపూర్వంగా ప్రేమించే మరో మనిషి ఉన్నాడు. మధు!" ఆగి, "మధూ ఎలా ఉన్నాడు? "

సమాధానం చెప్పలేకపోయింది. గొంతులో ఏదో అడ్డుపడింది.

"కావాలనే యూనియన్ హత్యకేసులో ఇరుక్కున్నాను. నేను చేసింది తక్కువ. అనుభవించింది ఎక్కువ. నువ్వు జైలుకి రావడం నాకిష్టంలేదు. మధూకి నా చావు తెలియడం ఇష్టంలేదు. మీ ఇద్దరి కోసం చాలా రాత్రులు నిద్రపోలేదు. నీ నుండి పారిపోవాలి. ఎలా..ఎలా?" సీతవైపు తిరిగి.

"నిన్ను మల్యాద్రి ఆదుకుంటూంటే వెయ్యిదేవుళ్ళకి మొక్కుకున్నాను. నీ పక్కన మాల్యాద్రిని చూశాక, నా అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. అతను నీకు సహాయం చేస్తాడని నాకు నమ్మకం. ఇక నిన్ను నా ముఖం కూడా చూడనివ్వలేదు. కానీ నువ్వెలా అమెరికా వెళ్ళావో నాకు తెలుసు. ఆ రోజు నువ్వు వయొలెట్ కలర్ ఆర్గండి వాయిల్ చీర కట్టుకున్నావు. నీ తలలో కనకాంబరాలు ఉన్నాయి. మధుకి నీలం రంగు జీన్స్ వేశావు. మాల్యాద్రి గ్రే సూటులో ఉన్నాడు. ఎయిర్ పోర్టులోకి వెళుతూ, వెయింగ్ మిషన్ దగ్గర ఆగి, నీ బరువు చూసుకున్నావు."

సీత తెల్లబోయి అతన్ని చూసింది. "ఇదంతా మీకెలా తెలుసు?"

"తెలుసుకోవాలనే ఆలోచన ఉంటే కష్టం కాదు, పండూ! నీ విమానం ఆకాశంలోకి లేచి, ఈ దేశంలో బాంధవ్యాన్ని తెంచుకునేదాకా నీ వెనక నా ఆలోచనలు పరిగెత్తుతూనే ఉన్నాయి."

సీతకి తను ఏడుస్తున్నట్లు కేవలం చెక్కిళ్ళే సాక్ష్యం చెప్పాయి.

"ఎందుకీ పనిచేశారు.. ఎందుకు?"

"అప్పుడప్పుడు నాకు నేనే ఆ ప్రశ్న వేసుకుంటూంటాను. సీతా! కాన్సర్‌తో నేనిన్నాళ్ళూ బతుకుతాననుకోలేదు. డాక్టర్లూ అనుకోలేదు. బతుకుతానని తెలిస్తే ఇన్నాళ్ళూ నిన్ను దూరం చేసుకునేవాడిని కాదు. చచ్చిపోయే తండ్రి వల్ల మధూకి ఉపయోగం లేదు. నువ్వు వాడిని బాగా పెంచగలవని నాకు తెలుసు. చెప్పు.. మధూ ఎలా ఉన్నాడు?"

చెప్పలేకపోయింది. మరో పదేళ్ళు ప్రయత్నించినా ఈ దుఃఖం నుంచీ బయటపడి చెప్పలేదేమో?

"నిన్న నిన్ను ఎయిర్ పోర్ట్‌లో చూడగానే గతుక్కుమన్నాను. నిన్ను కలుసుకోవలని నాకు లేదు. నా జ్ఞాపకాలు మళ్ళీ నీ జీవితంలోకి రావడం నాకిష్టం లేదు. ఇప్పుడైనా వచ్చావు కనక. నువ్వు మాల్యాద్రితో వెళ్ళిపోవడం నేరంలాగా భావిస్తావేమోనని, తప్పుచేసినట్టు కుంగిపోతావేమోనని నిజం చెపుతున్నాను. నువ్వేం బాధపడనక్కర లేదు సీతా!" అన్నాడు.

లోపల్నుంచి తడిసిన తలకి తువాలు చుట్టుకుని ఓ ముసలావిడ వచ్చింది. "ఈవిడ మిసెస్ నటరాజన్. వీళ్ళ నాన్నగారి దగ్గర మా నాన్న కారు డ్రైవింగ్ చేసేవాడు. వీళ్ళాయన ప్లేన్ ఆక్సిడెంట్లో పోయి 19 సంవత్సరాలైంది. ఇద్దరు కొడుకులు. ఇద్దరూ ఇక్కడే పని చేస్తున్నారు. నన్ను రమ్మని సంవత్సరాల తరబడి పోరుతూంటే వచ్చాను" అన్నాడు కొండలరావు.

మిసెస్ నటరాజన్‌కి తెలుగురాదు. తమిళం కూడా అంతంత మాత్రం. కొండలరావుని చిన్నతనం నుంచీ తెలుసు.

"ఎవరీవిడ?" అంది మిసెస్ నటరాజన్ సీతని చూస్తూ.

సీత కన్నీళ్ళు దాచుకుని తలెత్తింది. చిన్ననాటి స్నేహితుడి భార్యని ఇక్కడ కలుసుకోవడంలో అర్థమేమిటి? ఆ ప్రశ్నకి తన సమాధానం ఏమిటా అని మనస్సులో తికమకపడుతోంది.

పరిస్థితిని అంతవరకూ రానివ్వలేదు కొండలరవు. "మా మిత్రుడి భార్య ఎయిర్ పోర్ట్‌లో కలిశారు" అన్నాడు.

మరొకసారి రహస్యంగా సీతకళ్ళు నిండాయి.

లోపలికి పిలిచి పొంగల్, కాఫీ ఇచ్చింది.

"నీ భార్య నిన్ను వదిలేసి వెళ్ళిపోయిందన్నాడు మా బాలూ?"

కొండలరావు నవ్వాడు. "లేదు. నేనే నా భార్యని వదిలించుకున్నాను" అన్నాడు.

"ఎన్నాళ్ళుంటారు?" అడిగింది సీత.

"కాన్సర్ ఉండనిచ్చినన్నాళ్ళు"

మిసెస్ నటరాజన్ అంది: "నేనే కొండని రమ్మన్నాను. ఇక్కడ మా అబ్బాయికి తెలిసిన స్పెషలిస్టు ఉన్నాడు. పదహారేళ్ళు బతకనిచ్చిన రోగం కాన్సర్ కాదేమోనని నా అనుమానం. ఏమయిన ఈ రోగం అంతు చూసేవరకు కొండని ఈ దేశం నుంచి పోనివ్వను" అంది.

వెళ్తానని లేచింది సీత. బయటిదాకా వచ్చాడు కొండలరావు.

"మధూని ఒక్కసారి చూడాలని ఉంది. తీసుకువస్తావా?" అడిగాడు గేటు దగ్గర.

"నాలుగురోజుల్లో వస్తాడు. వచ్చాక తీసుకువస్తాను."

"వాడికి నా సంగతి తెలుసా?"

"ఏమీ దాపరికాలు లేవు. మీరున్నారని తెలుసు" అంది.

శనివారం వస్తానని కారెక్కింది.

శనివారం వచ్చింది. శుక్రవారం మధూ వచ్చాడు. శనివారం ఉదయం తండ్రిని చూడడానికి వెళ్తున్నామని చెప్పింది. మధూ ఆనందపడ్డాడు. బాబీ తనూ వస్తానన్నాడు. ఇప్పుడు వద్దంది సీత.

మధూ, సీత 219 హ్యారోడ్రైవ్‌కి వచ్చారు. గేటుదాటి లోపలికి రాగానే ముందు వచ్చినప్పుడు కొండలరావు యోగాసనాలు వేసిన చోట అయిదారుమంది ఉన్నారు.

యోగాసనాలు వేసిన చోటే ఇప్పుడు కొండలరావు శరీరం ఉంది. శనివారం తొలిజాము గడియల్లో కొండలరావు చచ్చిపోయాడు.

## 29

మధూకి జ్ఞానం వచ్చాక తండ్రిని మొదటిసారీ, ఆఖరిసారి చూడడం అదే

***అమృతం అదెంత మధురమయిన - హఠాత్తుగా చేతుల్లోకి వస్తే దాని రుచి అందదు. ఏ అనుభూతికయిన వ్యవధి కావాలి. అనుభూతి ఆలోచనలోకి రావాలి.***

***అనుభూతికి మనస్సు సిద్ధం కావాలి. భగవంతుడి కోసం ఆలయానికి ప్రయత్నంలో వెళ్ళే ఉద్దేశం అదే***

తండ్రిని చూడగానే మధూకి దుఃఖం పొంగిరాలేదు. హృదయం ఆర్ద్రం కాలేదు. ఇదేమిటి? ఇంత వికారంగా ఉన్న మనిషి తన తండ్రా అని ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. మనస్సు అతనికి తెలియకుండానే అతన్ని వెనక్కి లాగింది.

భారతీయ సంప్రదాయానికి అమెరికాలో చోటులేదు. పోయిన తండ్రికి కొడుకు తలకొరివి పెట్టడం లాంటివి వినడానికి, చెప్పుకోడానికీ మాత్రమే అమెరికాలో అవకాశం దొరుకుతుంది. కొండలరావు శరీరం ఆ మధ్యాహ్నమే అమెరికా ఎలక్ట్రిక్ క్రమిటోరియమ్‌లో పట్టెడు బుగ్గయిపోయింది.

●●●

కొండలరావు కన్నుమూసే సమయంలో ఈ కథని మలుపు తిప్పే మరొక ముఖ్యమయిన సంఘటన జరుగుతోంది.

జనరల్ ఎలక్ట్రిక్‌లో ఒక విభాగానికి సంబంధించిన నాలుగు మిలియన్ల కాంట్రాక్టుకి పాల్‌రెడ్డి ప్రయత్నాలు ఎట్టకేలకు సత్ఫలితాన్ని సాధించబోతున్నాయి. అందుకుగాను రాబోయే పది పదిహేను రోజుల్లో చాలా దశలలో జి.ఇ డైరెక్టర్లతో పాల్‌రెడ్డి, అంతకు మించి బాబీ చర్చలు జరపాల్సి ఉంది. ఇదే సమయంలో ఇండియాలో తమ కంపెనీని విస్తరించడానికి - హైదరబాదులో బేరం చేస్తున్న కోటీ నలభై అయిదు లక్షల స్థలం అగ్రిమెంటు చెయ్యాల్సిన సమయం వచ్చింది. పాల్‌రెడ్డికీ, ఆ మాటకి వస్తే బాబీకి ఈ రెండూ తమ వ్యాపారంలో పెద్ద మలుపు. జి.ఇ. కాంట్రాక్ట్ తమ కంపెనీకి తిరుగులేని నిలకడ ఇస్తుంది. అంతేకాదు ఇండియాలో నెలకొల్పే వ్యాపారానికి భారీ ఎత్తున సహాయపడుతుంది.

అయితే అటు తిరిగి, ఇటు తిరిగి ఈ రెండు పనులూ, దాదాపు ఒకే టైములో చెయ్యాల్సి వచ్చింది. పాల్‌రెడ్డికి ఎటూ దిక్కుతోచలేదు. తనూ, బాబీ తప్పనిసరిగా డెట్రాయిట్‌లో రెండువారాలు ఉండాలి. తనుకానీ, బాబీ కానీ నెలరోజులు పైన ఇండియాలో ఉండాలి. అజీర్ణ రోగికి షడసోపేతమయిన భోజనం రెండుచోట్ల ఏర్పాటు చేసినట్టనిపించింది.

పాల్‌రెడ్డి గింజుకుపోయాడు. బాబీకీ ఎటూ ఆలోచన తోచలేదు. రెండింటిలో ఒకటే సాధ్యం. కానీ రెండు సాధ్యమయితే తప్ప రెండూ వ్యాపారాలు నిలదొక్కుకునే ఆస్కారం లేదు. డెట్రాయిట్లో వ్యాపారాన్ని నిర్వహించే స్తోమతు కావాలి. అది పాల్‌రెడ్డి! వ్యాపారాన్ని సాధ్యం చేసే మెదడు కావాలి - అది బాబీ! ఇండియాలో ఇద్దరికీ ప్రాతినిధ్యం వహించే అధికారం కావాలి - అది ఎవరు కావాలి?

జుత్తు పీక్కుంటున్న పాల్‌రెడ్డికి మధు కనిపించాడు. మధూకి పద్దెనిమిదేళ్ళు. ఇప్పుడిప్పుడే కంప్యూటర్స్‌లో దూరాడు. ఏనాటికయినా మధు జీవితానికి తమ వ్యాపారమే గమ్యం కావాలని పాల్‌రెడ్డి బాబీతో అనేవాడు. అయితే ప్రస్తుతం వచ్చిన సమస్యనెలా ఈ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు తీరుస్తాడు?

రాత్రంతా ఒక బాటిల్ స్మిరనోఫ్ తాగాడు పాల్‌రెడ్డి. సమస్యల్లోంచి ఆటవిడుపు అతనికి డ్రింకు. సమస్యలకి పరిష్కారమూ డ్రింకే. అతని లివర్‌కి సమస్యా డ్రింకే.

తెల్లవారు ఝాముున మాగన్నుగా తెలీకుండానే నిద్రపట్టింది. సోఫాలోనే వాలిపోయాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకి తుళ్ళిపడి లేచాడు. మెదడంతా కడిగేసినట్టు తేలికగా, పవిత్రంగా ఉంది. షవర్ కింద తలపెట్టగానే స్వర్గం కనిపించింది. అతనికి ఆ క్షణంలో సమస్య గుర్తురాలేదు. సమస్యకి పరిష్కారం స్ఫురించింది. అంతే షవర్ లోంచి దూకి, తడిమొలతోనె హాలుకి అడ్డంగా పరుగెత్తి ఫోన్ రిసీవర్ అందుకున్నాడు.

బాబీకి ఫోన్ చేసి, "మధు ఎక్కడ?" అన్నాడు.

బాబీకి ఒక్క క్షణం అర్ధం కాలేదు. ఉన్నట్టుండి పాల్‌రెడ్డి ఆవేశంగా మధూ గురించి వాకబు చెయ్యడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇక్కడే ఉన్నాడు. బయటికి చెప్పడం లేదు కానీ, కొండలరావు చచ్చిపోవడం అతన్ని కాస్త కలవరపరిచింది. ఎందుకూ?"

"మధు పాస్‌పోర్టు వెంటనే కావాలి. ఇండియా ఈ వారంలో వెళ్ళడానికి సిద్ధంగా ఉండమను"

"మధుని మన కంపెనీకి డైరెక్టర్‌ని చేస్తున్నాను. "

"ఏం కంపెనీ?"

చెపుతున్న కొద్దీ ఆవేశం పెరుగుతోంది పాల్‌రెడ్డికి. "అప్పుడే పేరు కూడా పెట్టాను. ఇండియాలో ప్రారంభించే కంపెనీ పేరు "పాల్ అండ్ బాబ్ అండ్ మాడ్" ఎలా ఉంది?"

బాబీకి నవ్వొచ్చింది. "పాల్ రెడ్డి ఓ విధంగా మూర్ఖుడు. అనుకున్న పని సాధించేదాకా నిద్రపోడు. బాబీని పట్టుదలగా ఇండియా నుంచి అమెరికాకి తరలించాడు. అంతే పట్టుదలగా మధూని అమెరికా నుంచి ఇండియా తరలించడానికి ఆలోచన వచ్చిందే తడవుగా ప్రయత్నాలు ప్రారంభించాడు.

విషయం తెలిసి సీత షాక్ అయింది. అంతకు మించి మధూ కంగారు పడిపోయాడు. కొండలరావు జ్ఞాపకాలూ, అతని చావూ వాటి నుంచి సీత ఇంకా తేరుకోలేదు. తేరుకోలేదు కూడా. ఇంతలోనే మధూని దూరం చేసుకోవడం.

"మధూకి ఇండియా బొత్తిగా తెలియదు. భాష కూడా సరిగ్గా రాదు. వ్యాపారంలో అనుభవం లేదు. అలాంటిది - ఉన్నపాటునే ఇంత పెద్దపని నెత్తిమీద పెట్టడం అన్యాయం. పాల్‌రెడ్డి ఈజ్ మాడ్?" అంది.

"హి ఈజ్ మాడ్ ట్రై అండ్ కన్విన్స్ హిమ్" అన్నాడు బాబీ.

పాల్‌రెడ్డి ఎవరి మాటా వినే మూడ్‌లో లేడు. మాట్లాడేకొద్దీ రెచ్చిపోయాడు.

ఏం జరుగుతోందో అర్ధమయ్యేలోగానే మధూ న్యూయార్కులో విమానం ఎక్కాడు. నిస్సహాయంగా విమానాశ్రయంలో నిలబడిన సీతనీ, బాబీని, నాన్సీని చూసి మొదటిసారిగా కళ్ళనీళ్ళు తిరిగాయి.

"మాడీ నీకిష్టం లేకపోతే ఇప్పుడయినా చెప్పు. పాల్‌రెడ్డితో మాట్లాడి"

పాల్‌రెడ్డి చేతులనిండా రకరకాల, పిచ్చి పిచ్చి వస్తువులన్నీ పట్టుకువచ్చాడు. అన్నీ మధూ చేతుల్లో పెట్టి "పాల్‌రెడ్డికి చెముడు వచ్చింది. ఏమీ అర్ధంకావడంలేదు. ఈ ప్లేన్ ఆకాశంలోకి లేచాక మనశ్శాంతితో నిద్రపోతాడు" అన్నాడు.

మధూ నవ్వాడు. "ఐ యాం సారీ అంకుల్. నాకు కళ్ళనీళ్ళు వచ్చింది వెళ్ళలేక కాదు. మమ్మీని, డాడీని వదిలి వెళ్ళాల్సి వచ్చినందుకు. కంపెనీ డైరెక్టరుగా ఐ డోంట్ డిస్సప్పాయింట్ మెంట్ యూ" అన్నాడు.

పాల్‌రెడ్డి గర్వంగా మధూని కావలించుకున్నాడు. జేబులోంచి తీసి, "మా కంపెనీ డైరెక్టరుగారికి చైర్మన్ ఇచ్చే గిఫ్ట్" అంటూ చేతికి కార్టియర్ వాచీ తొడిగాడు. బంగారం, వజ్రాలతో ఉన్న వాచీ చూసి బాబీ, సీత, మధూ నిర్ఘాంతపోయారు.

"రెడ్డీ యూ ఆర్ మాడ్?" అన్నాడు బాబీ.

పాల్‌రెడ్డి నవ్వాడు. "నేను బిజినెస్ మాన్‌ని. ఇది నా పెట్టుబడి.లాభం రాదని తెలిసేచోట వ్యారం చెయ్యను. యూ షటప్" అన్నాడు.

●●●

విమానం బయలుదేరడానికి ఆఖరి అనౌన్స్‌మెంట్ వచ్చేటప్పటికి అందరి కళ్ళలోనూ కంటతడి ఇంకిపోయింది. అందరి ముఖాలూ వికసించాయి. ఆ వికాసాన్ని ఎంత కష్టపడి, ఎంత ఖర్చుపెట్టి సాధించాడో పాల్‌రెడ్డికి తెలుసు. ఎయిర్ ఇండియా జంబో పాల్‌రెడ్డి గుండెల మీద నుంచి ఆకాశంలోకి ఎగిరి మేఘాల్లో మాయమయి పోయింది.

ఇండియా చేరినప్పటినుంచీ సీత, బాబీ ఊహించనంతగా మధూ కంపెనీ పనులు చురుకుగా చక్కబెట్టాడు. పాల్‌రెడ్డి ఎన్.ఆర్.ఇ ఎకౌంటుకి అవసరమయిన డబ్బు బదిలీ చేయించాడు.

దాదాపు ప్రతీరోజూ మధూ ఫోన్ చేస్తున్నాడు. ఎక్కువగా ఫోన్ కాల్స్ పాల్ రెడ్డికి వస్తున్నాయి. చాలా తృప్తిగా పాల్‌రెడ్డి, బాబీ డెట్రాయిట్‌కి బయలుదేరారు.

నాన్సీకి మధూ ఇండియా వెళ్ళడం సుతరామూ ఇష్టం లేదు. మొదట తల్లితో తగాదా పెట్టింది. అలిగింది. మధూ నాన్సీకంటే అయిదేళ్ళు పెద్ద. కానీ ఆలోచనలో, స్నేహంలో, అంతకుమించి మమతని పంచడంలో ఇరవై ఏళ్ళ పెద్దరికాన్ని చూపగలడు. మనిషి చాలా గట్టి. మనస్సు చాలా మెత్తన. బాధపడితే నెలల తరబడి అంత అంతర్ముఖుడవుతాడు. ఎవరయినా బాధపడితే నిటారుగా స్నేహితుడయి నిలుస్తాడు. అమెరికా వాతావరణం, పెంపకం, మధూని వయస్సు కంటే ఎత్తున నిలిపింది. ఆ ఇంట్లో మధూలేని లోటు ఎక్కువ బాధపెట్టింది నాన్సీని.

"మధూ మళ్ళీ ఎప్పుడొస్తాడు?" అని అడిగింది తల్లిని.

"ఆ మాడ్‌ఫెలో - పాల్‌రెడ్డి తలుచుకుంటే ఎప్పటికీ రాడు" అంది సీతం.

ఆ రాత్రే మధూతో ఫోన్‌లో చెప్పింది నాన్సీ "నీ కంపెనీ దివాలా తియ్యాలని మనసారా కోరుకుంటున్నాను" అని.

మధూ నవ్వాడు. "నేను సెటిలయ్యాక నిన్ను కొడైలో బోర్డింగు స్కూల్లో చేర్పిస్తను" అనుభవం ముదిరిన తండ్రిలాగ చెప్పాడు.

పదివేల మైళ్ళవతల ఆ మాట వింటూనే గర్వపడిపోయింది నాన్సీ.

సీత నవ్వుకుంది.

ఇంక అయిదురోజుల్లో పార్టీతో కంపెనీ స్థలానికి సంతకాలు జేరుగుతాయని చెప్పాడు మధూ. డెట్రాయిట్‌లో పాల్‌రెడ్డి ఎగిరి గంతేస్తున్నాడు.

ఉన్నట్టుండి మధూ దగ్గర్నుంచి ఫోన్‌కాల్స్ రావడం ఆగిపోయింది. రెండురోజులు సీత పట్టించుకోలేదు.

మూడోరోజు రాత్రి డెట్రాయిట్ నుంచి బాబీ ఫోన్ చేశాడు. "మధూ నీతో మాట్లాడాడా?" అంటూ

"లేదు ఎందుకు?"

"అక్కడినుంచి ఫోన్ రాలేదు. పాల్‌రెడ్డి కంగారు పడుతున్నాడు. ఎల్లుండి అగ్రిమెంట్ జరగాలి. హోటల్ రూముకి ఫోన్ చేస్తే సమాధానం లేదు."

సీత కంగారు పడడం ప్రారంభించింది. వెంటనే ఇండియాకి ఫోన్ చేసింది. రూములో ఫోన్ మోగుతోంది. ఎవరూ రిసీవర్ ఎత్తలేదు. మళ్ళీ రెసెప్షన్‌ని అడిగింది. "రెండురోజులుగా రూముకే రావడం లేదంటున్నారు" చెపుతుంటేనే సీత గొంతు పూడుకుపోయింది.

"హైదరాబాదులో నాకు తెలిసిన ఫ్రెండొకడున్నాడు. ఫోన్ చేసి ఏమయిందో కనుక్కోమంటాను" అన్నాడు బాబీ.

ఆ అవసరం లేకపోయింది. మరో రెండుగంటలకి ఇండియా నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో తన పేరు సుల్తాన్ బ్రహుద్దీన్ అని చెప్పాడు. వచ్చీరాని తెలుగు, ఉర్దూ కలిపి మాట్లాడాడు. బ్రహుద్దీన్ స్థలం అమ్మే పార్టీ. మధూ భయంకరమయిన జ్వరంతో నిమ్స్‌లో ఉన్నాడు. తమ ఆఫీసులో కూర్చున్నప్పుడే ఉన్నట్టుండి విరుచుకుపడిపోయాడు. దాదాపు స్పృహలేదు. ఇదీ విషయం.

తరువాత ఏం జరిగిందో సీతకి అంతగా తెలీదు. పాల్‌రెడ్డి డెట్రాయిట్ నుంచి చాలామందికి ఫోన్‌కాల్స్ చేశాడు.

సీత మరునాడు మధ్యాహ్నం బయలుదేరి లుఫ్తాన్సాలో ఇండియాకు బయలుదేరింది.

## 30

**ఆసుపత్రి మంచం మీద ఆక్సిజన్ గొట్టాలతో ఉన్న** మధూని చూడగానే సీతకి దుఃఖం ఆగలేదు. ఆసుపత్రి వరండాలో సుల్తాన్ ఆమెని చూసి, ఆమే సీత అయియుంటుందని పలకరించాడు. అప్పటికీ ఇంకా మధూకి స్పృహ రాలేదు. అంత హఠాత్తుగా తీవ్రంగా జ్వరం రావటానికి కారణం కానీ, ఆ జ్వరం స్వరూపం కానీ ఇంకా డాక్టర్లకు అంతుపట్టలేదు. కేవలం రోగం ఛాయల్ని బట్టి వైద్యం కొనసాగిస్తున్నారు. అంతే!

సుల్తాన్ సీతని మధు ఉంటున్న హోటల్‌కి తీసుకెళ్ళాడు. హోటల్ నుంచి డిట్రాయెట్ ఫోన్ చేసి బాబీకి పరిస్థితి వివరించింది.

"డోంట్ బి షేకెన్. అవసరామైతే నేనూ వస్తాను" అన్నాడు బాబీ ధైర్యం చెపుతూ.

మధు వస్తువులన్నీ గదంతా ఉన్నాయి. ఒక్కొక్కటీ తీసి సర్దింది. హేంగర్‌కి ఉన్న రెండు సూట్లూ డ్రైక్లీనింగ్‌కి వేసింది. ఎక్కడ చూసినా రిగ్లీ చూయింగ్ గమ్ పాకెట్లు. రిగ్లీ అంటే మధూకి ప్రాణం. నవ్వుకుంది. అన్నీ తీసి ఓ ప్లాస్టిక్ బాగ్‌లో వేసింది. టేబుల్ మీద అగ్రిమెంట్ కాగితాలున్నాయి. మధూ కోలుకునేవరకూ వాటి అవసరంలేదు. సుట్‌కేసు సొరుగులో ట్రావెలర్ చెక్స్, సూట్‌కేసు నిండా చిందరవందరగా వందరూపాయల దొంతర్లూ ఉన్నాయి.

సూట్‌కేసు మూత వెయ్యబోతూండగా అప్పుడు చూసింది. సూట్‌కేసు మూతకి ఉన్న సొరుగులోంచి ఎర్రటి గుడ్డ కొట్టవచ్చినట్టు కనిపించింది. దాన్ని బయటకు లాగితే పుట్టలోంచి కుబుసం విప్పిన తాచుపాము వచ్చినట్టు బయటికి వచ్చింది. అది ఆడపిల్ల వేసుకునే చున్నీ.

సీత నిర్ఘాంతపోయింది. మధూ సూట్ కేసులో రహస్యంగా దాచిన చున్నీ.. ఇండియా ఆడపిల్లలు మధూకి ఈ తక్కువ వ్యవధిలోనే పరిచయమయారంటే నమ్మశక్యం కావడంలేదు. కాగా, ఈ చున్నీ చలా పాతబడి ఉంది. వయస్సు మీదపడిన పాత జ్ఞాపకంలాగ పల్చగా.... కానీ, ప్రమాదంగా ఉంది.

సీత అలాగే నిశ్చేతనంగా కూర్చుండిపోయింది. ఆ చున్నీ ఏదో తెలీని భయాన్ని సూచిస్తోంది. ఎక్కడో తన పాతజ్ఞాపకాలలోకి మనస్సు పెట్టి వెదికింది.

ఉన్నట్టుండి ఫాన్ గాలికి రివ్వున లేచి చున్నీ ముఖానికి అతుక్కుంది. ఓ భయంకరమైన జ్ఞాపకం గతంలోంచి దూసుకుని లేచింది. ఆ జ్ఞాపకం స్ఫుటంగా తెలుస్తున్నకొద్దీ ఆమె మనస్సులో ఆందోళన పెరిగింది. ముఖం చెమటలు పట్టింది పాత జ్ఞాపకాలతో.

సన్నీ.. అవును.. సన్నీతో ముడివడిన జ్ఞాపకం అది. ఊపిరి తిరగలేదు. కారు ఊరు దాటి అయిదారు మైళ్ళు వెళ్ళాక సరుగుడు తోటల మధ్య ఎర్రరంగు కెంపులగా మెరిసింది. అది సీతే అయియుంటుందని సన్నీకి తెలుసు. కారాపి దిగాడు. అసంకల్పితంగా సీటు

మీదున్న కెమెరా తీసుకున్నాడు. అతని రాకను సీత గమనించలేదు. శూన్యంలోకి చూస్తూ కళ్ళు విప్పి నిద్రపోతున్నట్టుంది. పక్కనుంచి సీత మరీ రెచ్చగొట్టేటట్టు కనిపించింది. కొన్నిగంటల క్రితమే రుచి చూసిన ఆ పెదాలూ, అంతకు మించి పొగరుగా ఉన్న స్తనాలూ.. దగ్గరకు వచ్చినా గమనించలేదు.

వెనకనుంచి రెండు స్తనాలమీద శఠగోపం పెట్టినట్టు చేతులు బిగించాడు. ఒక్కసారి కెవ్వుమంది సీత. తుళ్ళిపడి ఎగిరి లేచింది. సన్నీని చూసి కోపం తెచ్చుకోలేదు. కళ్ళు స్తిమితపడ్డాయి. ఏకాంతంలో అతని చర్య అనూహ్యం కాదు కానీ, తనకి అవాంఛితం. దూరంగా జరిగింది.

"భయపడ్డావా?"

మాట్లాడలేదు. కెమెరా తీసి ఆమెమీద ఫోకస్ చేశాడు. ఆమె శరీరంలో వంపులు కనిపించే వేపుకి తనే తిరిగాడు. ఎర్రని చున్నీ నిప్పులాగా ఆమె రొమ్ముల్ని వెలిగిస్తోంది. దగ్గరికి వచ్చి రొమ్ముల పక్కనుంచి చున్నీని నడిపాడు. ఆమె చలించలేదు. ఇంకొంచెం ధైర్యం వచ్చింది. రొమ్ములకీ, శరీరానికీ మధ్య లేచిన లాల్చీని శరీరానికి అతికించాడు. ఆమె మీది పెదవి మీద చెమట పట్టింది. కళ్ళు నీళ్ళతో నిండాయి. ఎందుకని?

కెమెరా తళుక్కుమంది. మళ్ళీ దగ్గరికి నడిచాడు సన్నీ. ఈసారి ఇద్దరిమధ్యా దూరం కరగనివ్వలేదు సీత. అతను వస్తున్నకొద్దీ దూరాన్ని పెంచింది. తను నిలబడిన చోటుకి సన్నీ వచ్చేసరికి సీత చెట్ల వెనక మాయమయింది. పరిగెత్తే ఆత్రంలో చున్నీ సరుగుడు కొమ్మకి తగులుకుంది. దాన్ని అందుకోవాలంటే సన్నీ చేతికి దొరకాలి. ఆ క్షణంలో దాన్ని వదిలిపారిపోవాలనే నిశ్చయించుకుంది. ఆ చున్నీ ఇరవై సంవత్సరాల తర్వాత భయంకరమైన జ్ఞాపకంగా విశ్వరూపం దాలుస్తుందని ఆమె ఊహించలేకపోయింది.

సూట్ కేసు సొరుగులోనే ఆ రోజు తీసిన తన ఫోటో కనిపించింది. ఈ ఫోటో, చున్నీ మధు సూట్ కేసు దాకా ప్రయాణం చేశాయంటే మధూని సన్నీ కలిసుండాలి. కలిస్తే ఏం జరిగింది? సన్నీ ఏం చెప్పి ఉంటాడు? చున్నీ ఇవ్వడంలో ఉద్దేశం ఏమిటి? సన్నీ ఎక్కడున్నాడు? పిచ్చిదానిలాగా గదంతా కలయదోడింది. పాల్‌రెడ్డి మధూకి బహూకరించిన బ్రీఫ్ కేసులో ట్రావెలర్స్ చెక్స్, చెక్ బుక్కూ కనిపించాయి. చెక్కుబుక్కులో 50వేల రూపాయలకి సన్నీ పేరిట చెక్కు సంతకం పెట్టాడు మధూ. అతను ఆసుపత్రిలో చేరిన మర్నాడు ఆ చెక్ సన్నీకి అందజేయవలసి ఉంది. ఇప్పుడు కథంతా సీతకి బోధపడిపోయింది. అంతకు మించి మధు అనారోగ్యానికి కారణమూ అర్థమైంది.

భయంకరంగా తలనొప్పి ప్రారంభమైంది. సుల్తాన్‌కి వెంటనే ఫోన్ చేసింది. రిజిస్ట్రేషన్ రెండు మూడు రోజులు ఆగాల్సి ఉంటుందనీ కావల్సిన డబ్బు 50వేలు తక్కువ అవుతుందనీ, అమెరికా నుంచీ రావాలనీ సుల్తాన్‌తో అన్నాడట మధూ.

"మధూ తిరిగే టాక్సీ ఎక్కడ?"

"మీ దగ్గరకి పంపిస్తాను" అన్నాడు సుల్తాన్.

డ్రైవర్ ముస్తాఖ్ చాలా ముసలాయన. మధూ మంచితనం, సామర్థ్యం గురించి చాలాసేపు చెప్పాడు. జబ్బుపడక ముందు రెండురోజులుగా చాలా డీలాపడివున్నాడు. జ్వరం ఎక్కువ కాక ముందు ఓసారి కారాపి, తలుపు తియ్యడానికి ఇటు వచ్చేసరికి, ముందు సీటు మీద తలపెట్టుకుని ఏడుస్తున్నాడట.

"మధూ ఎక్కడికి వెళ్ళాడు?"

"ట్రూప్ బజారులో ఏదో ఇంటికి"

సీత కాలికింద నేల సడలినట్టనిపించింది. మధూ పరిస్థితిని తలుచుకుని ఆమె మనస్సు ద్రవించిపోయింది. అసలు ఈ వ్యాపారానికి మధూ ఇండియా రావలసి వచ్చినందుకు, పంపడానికి కారణమయిన పాల్‌రెడ్డి మీద కోపం తెచ్చుకుంది.

హాస్పిటల్‌కి ఫోన్ చేసింది. మధూకి ఇంకా తెలివిరాలేదు. కొన్ని గంటలసేపు చుట్టూ ఏం జరుగుతూందో తెలియకుండా ఆ గదిలో అలానే ఉండిపోయింది సీత.

***కొన్ని నిజాలు తెలిస్తే తప్పులేదు. తెలియాల్సిన పద్ధతిలో తెలియకపోతే అవి గుండెల్లో శతఘ్నులవుతాయి. శూర్పణఖ ముఖతః లక్ష్మణుడి శీలాన్ని వింటే సౌమిత్రి అంత దుర్మార్గుడు రామయణంలో ఎక్కడా కనిపించడు. దుర్యోధనునికి భీముడికి కారెక్టర్ సర్టిఫికెట్ ఇవ్వమంటే అదెలా ఉంటుందో ఊహించవచ్చు.***

కొండలరావుకి కొడుకు, బాబీకి పెంపుడు కొడుకుగా అమెరికాలో పెరిగిన పద్దెనిమిదేళ్ళ కుర్రాడు ఉన్నట్టుండి తన తల్లి చున్నీ కథని ఫోటో సాక్ష్యంగా సన్నిలాంటి వ్యక్తినోట విన్నప్పుడు, దరిమిలాను అతనికి 50వేలు ఇవ్వడానికి సిద్ధపడినప్పుడు, తత్కారణంగా తల్లితో మాటమాత్రమైనా మాట్లాడకుండా స్పృహరాని అపస్మారంలో పడిపోయినప్పుడు ఏం జరిగి ఉంటుందో కారణాలు వెదకనక్కర్లేదు.

మధూతో మాట్లాడాలని మనస్సు తహ తహలాడింది. మధూ మనస్సు ఎంతవరకు కలుషితం అయిందో తెలుసుకోవాలి. అయినా, మధూతో ఏం మాట్లాడుతుంది? అతను విన్న కథని తనపరంగా ఏ విధంగా సవరిస్తుంది?

జీవితంలో చాలా భయంకరమైన ఛాలెంజ్ తన ప్రవర్తనకి సంజాయిషీని తన బిడ్డలకి చెప్పుకోవడం. అదిన్నీ దురభిప్రాయం మనస్సులో నాటుకున్నాక చెప్పవలసి రావడం. అది ఏ స్త్రీ చెయ్యడానికి ఆశించని డామేజ్ కంట్రోల్.

తల్లి అవినీతి కొడుక్కి ఆ అవినీతికి కారణమైన వ్యక్తి ముఖతః తెలిసినప్పుడు ఏ విధమైన సంజయిషీ ఆ బాధనుంచీ అతన్ని విముక్తం చెయ్యగలదు? ఏం చెపితే మధూకి నిజం అర్థమవుతుంది?

మధూతో మాట్లాడాలని మనస్సు యాతన పడింది. వయస్సులో ఉన్న ఆడపిల్ల, జీవితంలో మంచిచెడులను తూకం వెయ్యడం తెలిని వయస్సులో లోనయిన వ్యామోహానికి గుర్తు సన్నీతో ప్రణయం. ఓ తప్పటడుగు నుంచి నెర్వస్‌గా తప్పించుకోవడానికి, అదే వయస్సులో వేడిని దాటి జీవితాన్ని చూసి, లోతుపాతులను ఎరిగి, కావల్సిందేదో గుర్తుపట్టి, కొంత నష్టపోయి, కొంత దక్కించుకుని, కష్టానికీ, సుఖానికీ ఓ స్నేహితుడు కావాలన్న స్పృహతో ఆ స్నేహితుడిని, హితుడిని.. వెరసి భర్తనీ సంపాదించుకున్న స్థాయి మూడోది. బాబీతో జీవితానికి సంకేతంగా మూడుముళ్ళూ లేవు. శుభలేఖలు లేవు. సప్తపది లేదు. కానీ అందులో ప్రేమ ఉంది. స్నేహం ఉంది. అవగాహన ఉంది. ఆరాధన ఉంది. వెరసి రెండు జీవితాల సమన్వయం ఉంది. ఇదీ స్థూలంగా సీత సిద్ధం చేసుకొన్న సంజాయిషీ.

ఇది సీత రెండో సమస్యకి మొదటి సమాధానం. ఇంకా మొదటి సమస్య అలా ఉండనే ఉంది. సన్నీ ఎక్కడున్నాడు? ఏ భయాన్ని మధూకి చూపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు?

మధూ పరిస్థితి రాను రాను దిగజారింది. మూడోరోజు డెట్రాయిట్ నుంచీ బాబీ, పాల్‌రెడ్డి ఇద్దరూ ఫోన్ చేశారు. ఇటు పక్క సీత ఏడుస్తోంది. ఏం కష్టం వచ్చినా తనని ఆదుకునే ఆ రెండు చేతులూ బాబీవి భూమండలానికి అవతలివేపు ఉన్నాయి.

''బాబీ! ఐ నీడ్ యూ! మధూ ఈజ్ డైయింగ్'' అని ఏడ్చింది ఫోన్‌లో.

బాబీ కదిలిపోయాడు. త్వరలో అక్కడ ఉంటానని ఫోన్ పెట్టేశాడు.

రెండో రోజున హాస్పిటల్ వరండాలో నడుస్తున్న సీతని ఎవరో పలకరించారు. ''సీతా!'' అంటూ, తలెత్తి అతన్ని చూసింది. కానీ వెంటనే పోల్చలేకపోయింది. సన్నీ తల సగంపైగా బట్టతల అయింది. పొట్ట బాగా పెరిగింది. శరీరం బరువయింది. కానీ, ఆ కళ్ళల్లో

చిలిపితనం, సుఖం పట్ల, సుఖం సంపాదించడం పట్ల ఊహించలేనంత ఆత్మవిశ్వాసం, పట్టుదలా.. అవును, సన్నీ చాలా మారాడు. అతనిలో పాత స్వభావం కాస్తంత కూడా మారలేదు.

"ఐయాం సారీ, సీతా మధూ మంచి కుర్రాడు. ఇలా మంచం పడతాడనుకోలేదు" అన్నాడు.

సీత ఏం మాట్లాడలేదు.

సిగరెట్టు వెలిగించాడు. "సీతా! నువ్వేం మారలేదు. ఇప్పటికీ రుచిగానే కనిపిస్తున్నావు" పగలబడి నవ్వాడు. ఆ నవ్వుకి ఆసుపత్రి వరండా ప్రతిధ్వనించింది. చాలామంది ఆగిచూశారు. దగ్గరికి వచ్చి, "మధూని చాలా తప్పుగా అడిగాను. వ్యాపారం దెబ్బతింది. డబ్బు అవసరమే. కానీ నిన్ను చూసుంటే చెక్కుని కాదు. 'నిన్ను' అడిగేవాడిని" ఈసారి గుర్తుపెట్టుకు మెల్లగా నవ్వాడు.

సీత నరనరాల్లోనూ రక్తం ఎగిసి మెదడుకి ఎగదన్నింది. ఆ గదిలో అపస్మారంలో పడుకున్న మధూ స్థితికి ఈ దౌర్భాగ్యుడు కారణం.

జేబులోంచి విజిటింగ్ కార్డు తీశాడు సన్నీ. "ఇదీ నా అడ్రెస్. మధూ సూట్ కేసులో ఎక్కడో ఓ చెక్కు ఉండాలి. నువ్వు తీసుకురా. తీసుకురాకపోయినా ఫరవాలేదు. నువ్వురా." వెళ్తూ ఆగి. "చీకటి పడకుండా మాత్రం రాకు. సీతా" అని వెళ్ళిపోయాడు.

●●●

అమెరికాలో కొన్ని సౌకర్యాలున్నాయి. ఎక్కడిపడితే అక్కడ రివాల్వర్‌లు దొరుకుతాయి. అయితే, సీతకి ఇంతవరకూ వాటి అవసరం లేదు. వాటిని ఉపయోగించే శక్తీలేదు. ఇప్పుడు రెండోది వచ్చింది. మొదటిది కావాలి.

నిద్రపోతున్న మధూ నుదుటిమీద ముద్దుపెట్టుకుంది. గాడ్సే మనస్సులోనూ మహాత్ముడిని చంపిన రోజు ఇలాంటి నిర్లిప్తత ఉండి ఉంటుంది.

ఒక్కసారి మధూతో మాట్లాడగలిగితే బాగుండేది. తనుపోతే తనగురించి మధూకి సంజాయిషీ చెప్పగలిగేవారెవరూ ఉండరు. కానీ, మధూయే పోతే?!

డాక్టర్ గది దగ్గర ఆగింది. "అర్థంకాని రోగానికి చేతనయిన చికిత్స చేస్తున్నాం మేడమ్. రేపు లేచి కూర్చోవచ్చు. సంవత్సరాల తరబడి అలాగే ఉండొచ్చు. ఇంక ఎప్పటికీ లేవకపోవచ్చు."

సీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన కారణంగా మధూ జీవితం ఇలా అర్థాంతరంగా ముగిసిపోవడం దురదృష్టం.

●●●

తనకి చాలా ఇష్టమయిన ఐస్‌క్రీమ్ అడ్రెస్ వెదుక్కుంటూ వెళ్ళి రెండు తింది. అప్పటికి అమెరికాలో తెల్లవారుఝామున రెండవుతుంది. నిద్రనుంచి బాబీని లేపింది.

"సీతా! ఎలా ఉన్నావు?" అన్నాడు బాబీ.

సీత మాటకంటే ముందు దుఃఖం తోసుకువచ్చింది. అది ఏ మాత్రం తెలీకుండా ఉండటానికి శతధా ప్రయత్నించింది. 'గాడ్ ఇది ఆఖరుసారి బాబీతో మాట్లాడటం. నా ఆఖరి ఫోన్ కాల్‌ని దుఃఖంతో నాశనం చెయ్యనివ్వకు.'

సీత మాట వినిపించకపోయేసరికి కంగారుపడ్డాడు బాబీ. "సీతా! ఆర్ యూ ఆల్ రైట్?" పక్కమీద నుంచి లేచి కూర్చున్నాడు.

"బాబీ నీతో మాట్లాడాలనిపించి ఫోన్ చేశాను."

"ఓకే.. ఓకే మరో రెండు మూడు గంటల్లో ఎయిర్ పోర్ట్‌కి బయలుదేరుతున్నను. మధూ ఎలా ఉన్నాడు?"

"తెలీదు"

''వాట్''

''డాక్టర్లకే తెలీదు''

ఆ క్షణంలో సీత పక్కన లేనందుకు గింజుకుపోయాడు బాబీ. ''సీతా! కొన్ని గంటల్లో నీ దగ్గర ఉంటాను. డోంట్ లూజ్ హోప్. అంతా సవ్యంగానే జరుగుతుంది. ఓకే!''

''ఐ లవ్ యూ బాబీ''

''సీతా కంగారుపడవుగా''

''ఐ లవ్ యూ బాబీ''

''సీతా సే దట్ యూ విల్ బి''

''ఐ లవ్ యూ, బాబీ'' ఫోన్ కట్ అయిపోయింది.

●●●

చీకటి కోసం ఎదురుచూస్తూ సీత హోటల్ గదిలో కూర్చుంది. ఆ చీకటి సన్నీ కోరుకున్న చీకటి. ఆ చీకటి తను ఎదురుచూస్తున్న చీకటి.. తన జీవితంలో ఆఖరి చీకటి.

సరిగ్గా తను చచ్చిపోయేవేళకి బాబీ ఇండియాలో దిగుతాడు. తను ఎలా చచ్చిపోవాలో నిర్ణయించుకుంది. సన్నీ మూడో అంతస్తు అపార్టుమెంటులో ఉంటున్నాడు. మూడో అంతస్తుమీద నుంచీ దూకడం కష్టం కాదు. కానీ, సన్నీని ఎలా చంపడమో నిర్ణయించుకోలేదు. కానీ, సన్నీ ఎదురుగా నిలిచాక ఆమెకి అతన్ని చంపే ఉద్దేశమూ, శక్తీ అవకాశం రాకపోదు. సన్నీ బలవంతుడూ కాదు. ***కోరికకి లొంగిపోయే ఏ వ్యక్తీ బలవంతుడు కాడు.***

●●●

బాబీ అభిమానించే చీర కట్టుకుంది. ప్రత్యేకమయిన శ్రద్ధతో తనని తాను అలంకరించుకుంది. కళ్ళు విప్పి చూడడానికి కూడా దుర్భరంగా ఉండే తన శరీరం చుట్టూ కనీసం చూడముచ్చటైన ఒకటి రెండు అంశాలైనా ఉండవా? నవ్వుకుంది.

బయలుదేరుతుండగా గదిలో ఫోను మోగింది. ఒక్కసారి తుళ్ళిపడింది. ఫోన్ వణుకుతున్న చేతులతోనే ఎత్తింది. 'భగవాన్ నా నిర్ణయాన్ని, లక్ష్యాన్ని ఏ వ్యక్తీ సడలించకుండా ఉండుగాక'.

అటునుంచి ఆసుపత్రి నర్స్ ఆవేశంగా మాట్లాడుతోంది. ''మేడమ్ మధూ కళ్ళు విప్పాడు. అర్జెంటుగా ఆసుపత్రికి రమ్మంటున్నారు డాక్టరుగారు.''

నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. ఇప్పుడూ మధూతో ఏం మాట్లాడాలనుకుందో మరిచిపోయింది.

ఆసుపత్రి గదిముందు డాక్టర్లు ఇద్దరు ముగ్గురున్నారు. అందరూ గదిలోకి వచ్చిపోతున్నారు. సీతకి భయమేసింది. లోపల ఏం జరిగింది? వీలయితే అక్కడినుండి పారిపోవాలని మనస్సు పీకింది.

''మేడమ్!'' డాక్టర్ ఆత్రతగా పలకరించాడు.

''మేడమ్ మధూ కళ్ళు విపుతున్నాడు. మీరు పలకరిస్తే''

ఇండియాకు వచ్చాక మొదటిసారి మధూలో కదలిక చూసింది. ఆపుకుందామన్నా దుఃఖం ఆగలేదు. ఇన్నివేల సంవత్సరాల సృష్టిలో పతివ్రత, పతిత, కులట, వేశ్య, జారిణిలేదు. ఆ ఆర్తికి అవినీతి అంటదు.

''మమ్మీ'' అన్నాడు మధూ.

మైగాడ్ సన్నీని ఈ మూడ్‌లో చంపలేను. మధూ బుగ్గ నిమిరింది. 'మధూ' అందామనుకుంది. పెదాలు ప్రయత్నించాయి. కానీ, మాతృహృదయం ద్రవించి, ఆ చిన్న గొంతులోంచి మాటను బయటకు రానివ్వలేదు.

"మమ్మీ సన్నీ సన్నీ నాకంతా"

సీత శరీరంలో రక్తమంతా కన్నీరైపోయింది. 'భగవంతుడా! ఏ తల్లికీ కొడుకు ఇప్పుడూ మాట్లాడబోయే మాట వినే శాపాన్ని ఇవ్వకు.'

మాట్లాడడానికి మధూకి ఓపిక చాలడంలేదు. పెదాలు తడుపుకున్నాడు. స్పృహ వచ్చిన పేషెంట్ ఆలోచనలు అంత నిర్దుష్టంగా ఉండటాన్ని అబ్బురపాటుతో గమనిస్తున్నారు డాక్టర్లు.

"సన్నీ మాట్లడాక నిన్ను కలుసుకోవాలనిపించింది. ఐ లవ్ యూ మమ్మీ అని చెప్పాలనిపించింది. నిన్ను గట్టిగా పట్టుకుని ఎక్కడికైనా ఎత్తుకుపోవాలనిపించింది." ఆపి ఆపి అన్నాడు.

సీతకి ముందు ఏమీ కనిపించడంలేదు. కళ్ళు నీళ్ళతో తెరలు కట్టాయి.

అంత ఆలోచన, చెప్పడానికి అతను చేసిన ప్రయత్నాన్ని శరీరం తట్టుకోలేక పోయింది. ఉన్నట్టుండి మధూ శరీరం ఆపాదమస్తకం వణికింది. ఇంజక్షన్ సిరెంజిలు పట్టుకుని డాక్టర్లు పరుగులు తీశారు.

సీత లేచింది.

●●●

ఇప్పుడింక సన్నీని చంపడం సులువు.

అంతకుమించి ఇప్పుడిక చచ్చిపోవడమూ సులువే .

ఆసుపత్రి పోర్టికోలో చల్లటి గాలితెర ముఖాన్ని కొట్టింది. ఆర్ద్రమైన హృదయాన్ని మెల్లగా కూడదీసుకుంది. రిక్షాని పిలిచి ఎక్కింది. చాలా ఖరీదయిన అపార్టుమెంట్స్‌లోనే ఉంటున్నాడు సన్నీ. మూడో అంతస్తు ఎత్తుగానే ఉంది. తనకి సౌకర్యంగా.

మధూ బతుకుతాడా? ఆ ఆఖరి మాటలు చెప్పడానికే స్పృహ వచ్చిందా? ఎమయినా ఈ పరిస్థితికి కారణం మేడమీద సెంటు రాసుకుని ఎదురుచూస్తోంది. సీత పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

***ఆలోచించి చేసే హత్యకీ, అనాలోచితంగా చేసే హత్యకీ చాలా తేడా ఉంది.***

***ఆలోచించి సాధించే సుఖానికీ, అనాలోచితంగా కలిసి వచ్చిన సుఖానికీ ఉన్నంత తేడా.***

మనస్సులో ఎక్కడో సంస్కారం వెనక్కి లాగుతోంది. కానీ ఆవేశం, ఆ వేగం ముందుకు తోస్తున్నాయి. మెట్లు ఎన్నటికీ తరగడం లేదు. ఓ క్షణకాలం కిందకి చూస్తే తను చచ్చిపోవడానికి ఈ మాత్రం  ఎత్తుచాలనిపించింది. ఆ పని ఇప్పుడు చేస్తే? తన జీవితానికి ఓ గొప్ప ప్రయోజనం పోతుంది.

మూడో అంతస్తు నుంచి ఉత్తేజం కలిగించే సంగీతం వినిపిస్తోంది. సుఖాన్ని వేటాడే ఈ గుంటనక్క చేతుల్లో తన మొదటి ఆనందాన్ని ఎలా పంచుకోగలిగిందో అర్థం కాలేదు. ***ఆనందాన్ని అనుభవించే క్షణంలో మనిషికీ, పశువుకీ తేడాలేదు.*** అనుభవించడానికే క్రమేపీ ఆ తేడాలు తగ్గిపోతున్నయి. నరాలతీపుకి సంస్కారం దారులు ఇస్తోంది. ***యౌవనంలో విచక్షణకి చోటు ఇవ్వకపోవడం దేవుడిచ్చిన శాపం. లేక సంస్కారాన్ని వెనక సీటుకి బదిలీ చెయ్యడం మనిషి చూసుకుంటున్న కొత్తదారా?***

సంగీతం దగ్గరైంది. సీత ఊపిరి బరువెక్కింది. ఒక్క క్షణం గోడని ఆనుకుని ఆగింది. అప్పుడు.. అప్పుడే ఆమె భుజం మీద చెయ్యిపడింది. సీత తుళ్ళిపడింది. అంతకు మించి కెవ్వుమంది. అర్ధరాత్రి తీతువు పిట్ట అరిచినట్టు ఆ కేక ఆ వాతావరణంలోకి తుపాకీ ధ్వనిలాగ దూసుకుపోయింది.

తన భుజం మీద చెయ్యివేసిన ముఖాన్ని చీకట్లో వెదికింది సీత. ఆమె స్త్రీ. ఇది సీతకి ఆశ్చర్యం కలిగించే విషయం కాదు.

ఆమెకు తెలుగు సరిగ్గా రాదు. సీతకి ఇంగ్లీషు వచ్చునని ఆమెకి తెలుసు. మసకచీకట్లో కూడా ఆమె పాపిట్లో కుంకుమ రక్తంలాగా మెరిసింది.

"నా పేరు నిశి. ఆ గదిలో ఉన్న జంతువు భార్యని. వెళ్ళండి. వెంటనే వెళ్ళిపోండి. ఇంక అతని వల్ల మీకు గానీ, మీ అబ్బాయికి గానీ ఏమీ ప్రమాదం లేదు."

సీతకి అర్ధం కాలేదు. ఇంకా చీకట్లో వెర్రి చూపులు చూసింది.

నిశి వివరించడానికి కూడా ఎక్కువ ప్రయత్నం చేయలేదు. సీత చెయ్యిపట్టుకుని బరబరా ఈడ్చుకు వచ్చింది. "దట్ బాస్టర్డ్ ఈజ్ డెడ్!! గెట్ లాస్ట్" అని చీకట్లోకి మాయమైపోయింది.

## 31

**జెర్‌మాట్‌లో గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్** ఎక్కి చుర్ చేరుతారు మధూ, స్వర్ణ. స్విట్జర్లాండు చలి ఎముకల్ని కొరికే పులి. ఎటు చూసినా, మంచుపర్వతాలు అందంగా ఉంటాయి. రైల్లోంచి అందుకునేటంత దగ్గరగా ఆపిల్ చెట్లు బారులు తీరి ఊరిస్తూంటాయి. ఆపిల్ అంత సున్నితమైన పండు మరొకటి ఉండదేమో. చెట్టుకి పళ్ళుంటే, మరో వెయ్యిపళ్ళు చెట్టుకింద నేలమీద పడుంటాయి.

స్వర్ణ, మధూ అతి విచిత్రమైన పరిస్థితుల్లో, విచిత్రంగా దగ్గరయ్యారు. స్వర్ణ ఓ చిట్ ఫండ్ కంపెనీలో హైదరాబాదులో పనిచేస్తోంది. చిన్న మోపెడ్ మీద ఆఫీసుకి వెళ్ళి వస్తూంటుంది. చిన్న ఇంట్లో తండ్రితో అద్దెకుంటోంది. తల్లికి ఆమె కాలేజీలో చదువుతున్నప్పుడే హార్ట్ అటాక్ వచ్చింది. అదే ఆమెకి మొదటిదీ, ఆఖరిదీనూ. మధు ఆస్పత్రిలో చేరిన నాలుగో రోజునే స్వర్ణ మోపెడ్‌కి ఓ మేకపిల్ల అడ్డంగా వచ్చింది. స్వర్ణ కిందపడింది. మోచేతికీ, నుదురుకీ బలంగా దెబ్బలు తగిలాయి. ఆ సాయంకాలం ఆమెని ఆసుపత్రిలో చేర్చారు. ఆ రాత్రి మధూకి సీరియస్ అయింది. రక్తం ఎక్కించడం మంచిదని, అతని రోగమేమిటో తెలీని డాక్టర్లు అనుకున్నారు. ఎవరూ దగ్గరలేని ఆ పేషెంటుకి అనుకోకుండా రక్తం ఇవ్వడానికి అంగీకరించింది. కారణం అతనిది ఏ ప్లస్. తాను యూనివర్సల్ డోనర్. ఆ విధంగా వ్యక్తులెవరో ఒకరికొకరు తెలియకుండానే ఇద్దరి శరీరంలో ఒకే రక్తం చోటు చేసుకుంది. మర్నాడే స్వర్ణ ఇంటికి వెళ్ళిపోయింది.

పదిరోజుల తర్వాత మెడికల్ బిల్లుకి సంతకాలకి ఆసుపత్రికి వచ్చినప్పుడు యధాలాపంగా తాను రక్తం ఇచ్చిన పేషెంట్ గురించి అడిగింది. నర్సు అతనింకా అక్కడే ఉన్నాడంటూ స్పృహలో ఉన్న మధూని పరిచయం చేసింది. అప్పటికి సీత అతని పక్కన ఉంది. ఆ విధంగా ఇద్దరూ కలుసుకున్నారు.

మధూకి స్వస్థత చిక్కి ఆసుపత్రి నుంచి బయటకి వచ్చే సమయానికి అతని జీవిత భాగస్వామిని కూడా ఆ ఆసుపత్రిలోనే ఎంపిక చేసుకున్నాడు. సీతకి స్వర్ణ నచ్చింది. ఆమె అందం నచ్చింది. ఆమె సంస్కారం నచ్చింది.

బాబీ అమెరికా నుంచి వచ్చిన మరో పదిరోజులకి పాల్‌రెడ్డి వచ్చాడు. అప్పటికి పూర్తిగా కోలుకున్నాడు మధు. ముగ్గురూ బాబీ, సీత, పాల్‌రెడ్డి అమెరికా వెళ్ళిపోయే ముందు మధూకి భార్యని జతచేసి విమానం ఎక్కారు.

గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్ చుర్ దగ్గర ఆగిపోతుంది. అక్కడ జూరిక్‌కి రైలు మారాలి. జెనీవాలో తన పని చూసుకుని జూరిక్ ఫ్లాట్ ఫారం మీద మధూని, స్వర్ణనీ కలుసుకుంటానంది సీత. సీత (డబ్ల్యు.హెచ్.ఒలో) పని పూర్తయి వచ్చేసరికి చుర్ నుంచి వచ్చే మొదటి ఫ్లాట్ ఫారం మీద ఆగి ఉంది. అందులో నుంచి మధూ, స్వర్ణ దిగలేదు. తప్పనిసరిగా రైలు తప్పిపోయుంటుంది. తర్వాతి రైలు మరో రెండు గంటలకి. ఎలాగూ రెండు రోజులు జూరిక్‌లో ఉండాలనుకుంటున్నారు కనక టాక్సీ తీసుకుని రినైజాన్స్ జూరిక్ హోటల్‌కి చేరింది. బాబీ ఇచ్చిన ఫాక్స్ అందింది. ముగ్గురికీ కలిసి ఓ సూట్ చెప్పాడు బాబీ! "మిసెస్ మధూ!" అన్నాడు మానేజర్ రోల్ఫ్ శ్రాగర్ వచ్చీ రానీ ఇంగ్లీషులో. చాలాకాలం పాటు స్విట్జర్లాండులో చాలా భాగాలు జర్మనీలో ఉన్నాయి. అందరికీ సులువుగా వచ్చే భాష జర్మనీ. జెర్‌మాట్‌కి సమీపంలో ఇటలీ ఉంది. అలాగే జెనీవాకి సమీపంలో ఫ్రాన్స్ ఉంది. అన్నిచోట్లా దాదాపు ఆల్ప్సు ఉన్నాయి.

సీత నవ్వింది. "ఐయామ్ నాట్ మిసెస్ మధూ" అంది. మధూ తల్లినని చెప్పుకుంది. మధూపాల్, బాబ్ అండ్ మాడ్ మానేజింగ్ డైరెక్టర్. తన 28 ఏళ్ళ వయసులోనే బాబీ కూడా సాధించలేని అభివృద్ధిని వ్యాపారంలో సాధించాడు. పాల్‌రెడ్డి అతనికి గాడ్‌ఫాదర్. స్విట్జర్లాండ్ హాలీడేకి వెళుతున్నానంటే, బాబీ ఒక్కటే వత్తిడి చేశాడు అమెరికా నుంచి తల్లిని పంపిస్తానని. డబ్ల్యు.హెచ్.ఒ లో తన పనిని తెలివిగా జతచేసుకుంది సీత. నిజానికి నెలరోజుల తర్వాత తను వెళ్ళాల్సి ఉంది. కానీ, తనూ, జమిలీ రాత్రింబవళ్ళూ కూర్చుని ఫైళ్ళు సిద్ధం చేశారు.

స్విట్జర్లాండు ఎందుకు? స్వర్ణ మధూని పెళ్ళిచేసుకున్నప్పుడు నిజానికి చేసుకోవాలని ఒప్పుకున్నప్పుడు అతని పెరుగుదల అమెరికాలో ఉన్నా, అతని ఆలోచనలు ఇండియాలోనే ఉన్నాయని రూఢీ చేసుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తండ్రిని వదిలి అమెరికా రాననీ, ఆ షరతు మీదే ఈ పెళ్ళికి ఒప్పుకుంటున్నాననీ స్పష్టం చేసింది. కానీ, తండ్రి మరో ఏడేళ్ళకి ఈలోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు. అప్పటికి మధు ఇండియాలో స్థిరమైన 'రూట్స్' ఏర్పరచుకున్నాడు.

ఇద్దరూ కలిసి చేసుకున్న మొట్టమొదటి ఒప్పందం - కొంతకాలం పిల్లలు అక్కరలేదని. ఈ నిర్ణయానికి 'రూట్స్' నిశ్చయంగా అమెరికానే. ఆ రోజుల్లో స్వర్ణ కోరుకున్న మొదటి కోరిక. 'నాకు అమెరికా వెళ్ళాలని పెద్ద కోరిక లేదు. కాని, తప్పకుండా వెళ్తానని తెలుసు. అక్కడ ఎలాగూ అత్తగారూ, మామగారూ ఉన్నారు గనక. కానీ, కోరి ఎదురుచూసి వెళ్ళాలనుకున్న దేశం ఒక్కటే. స్విట్జర్లాండు' అంది. మధూ ఆ మాట మరిచిపోలేదు.

పెళ్ళయిన తొమ్మిదేళ్ళకి. తనది ఒక విధంగా బాల్య వివాహం. తనకీ, స్వర్ణకీ కేవలం పదినెలలే తేడా. ఇప్పుడు హాలిడే సాధ్యమైంది. అయితే స్వర్ణ పాస్‌పోర్ట్‌లో ఆమె చేస్తున్న మొదటి ప్రయాణం స్విట్జర్లాండుకే.

హోటల్ నుంచి ఎయిర్ పోర్ట్‌కి ఫ్రీ షటిల్ సర్వీసు ఉంది. సూట్‌లో స్నానం చేసి చాలా రోజుల తర్వాత ఫ్రాక్, స్కర్టూ వదిలేసి, కంచి పట్టుచీర కట్టుకుంది. తాను కోరి ముచ్చట పడి స్వర్ణకోసం చేయించిన చిన్న కాసుల పేరు మెడలో వేసుకుంది.

నాన్సీ ఎయిర్ పోర్ట్‌కి కారులో తీసుకు వచ్చింది. మునంగిహేల సారంగం కారుదాటాక మెల్లగా మొదలుపెట్టింది తన ప్రేమ వ్యవహారాన్ని చెప్పడం. బాబీ తనని ముందుగానే హెచ్చరించి ఉంచాడు ఆ విషయం. కార్న్‌హిల్‌లో పనిచేస్తున్న పటేల్ బొంబాయి కుర్రాడు. అందంగా ఉంటాడు. అయినా నాన్సీ డాక్టరేట్ పూర్తికాకుండా పెళ్ళిచెయ్యడం ఇద్దరికీ ఇష్టంలేదు.

"ఈ పెళ్ళికి ఒప్పుకోవడానికి మీ డాడీకి లంచం కావాలి" అంది సీత నవ్వుని దాచుకుంటూ.

"చెప్పు, మమ్మీ ఏదయినా ఇస్తాను."

"నీ డాక్టరేట్!"

నాన్సీ ఆనందపడిపోయింది. స్టీరింగు మీదనుంచి ఓ చెయ్యి తీసి తల్లిని పొదివి పట్టుకుని ముద్దుపెట్టుకుంది.

ఎయిర్ పోర్టులో దిగే ముందు ఒక్క మాట మాత్రం చెప్పింది. "బాబీ ఒప్పుకునేదాకా నో డేటింగ్ ప్లీజ్!" అని.

నాన్సీ నవ్వి, "మమ్మీ ఐయామ్ నాటే స్టుపిడ్ ఐయామ్ ఇండియన్ అండ్ ఐ షల్ బిహేవ్ లైక్ వన్" అని మళ్ళీ ముద్దుపెట్టుకుని, తను చెకిన్ కాగానే పారిపోయింది.

మూడేళ్ళ కిందట పాల్‌రెడ్డికి తీవ్రంగా గుండెపోటు వచ్చింది. అప్పటినుంచీ దాదాపు ఫ్లాటులోనే ఉండిపోవడం అలవాటు చేసుకున్నాడు. అయితే బాబీ అంటే రెడ్డికి కొండంత బలం. గుండెపోటు రాకముందే బాబీని తనతో వ్యాపారంలో సగం వాటాదారుని చేశాడు. ఇండియాలో మధూకి వ్యాపారంలో మూడోవంతు వాటా ఇచ్చాడు.

నలభైయ్యేడో పుట్టినరోజుకి సీతకి బేబీ బీయండబ్ల్యూ కారు కొనిచ్చాడు బాబీ. కారులో భార్యని స్టీరింగు ముందు కూర్చోపెట్టి తను పక్కకి వచ్చి కూర్చుని "మరో మంచి గిఫ్ట్ ఉంది సీతా!" అన్నాడు.

కారు ముందుకి దూకుతోంది. "ఏమిటి?" అంది సీత.

డాష్ బోర్డు తెరిచి హెయిర్ డై తీశాడు. సీతకి నవ్వు ఆగలేదు. "నన్ను గ్లామరస్‌గా తయారుచేద్దామనుకుంటున్నావా?" అంది.

రేర్‌వ్యూ మిర్రర్ సరిచేసి, "ఒక్కసారి నిన్ను చూసుకున్నావా ఎప్పుడైనా?" అన్నాడు.

చూసుకుంది. చెంపల దగ్గర జుత్తు తెల్లబడుతోంది. తలమీద అక్కడక్కడా తెల్లవెంట్రుకలు కనిపిస్తున్నాయి. "బాబీ! నేను ముగ్గురు పిల్లల తల్లినని మరిచిపోతున్నావు."

"నాకు మాత్రం ఇంకా ఇండియాలో సీతగానే చూడాలని ఉంది."

దూరంగా వెంకటేశ్వరుడి ఆలయం కనిపిస్తోంది.

"నాకు ఈ జీవితమే చాలా బాగుంది బాబీ. వయస్సు తోసుకురావడం తృప్తిగా ఉంది. ***ఆడది తల్లి కావడం అలసటకి నిదర్శనం కాదు. చెప్పలేని తృప్తికి***"

చాలాసేపు మాట్లాడలేదు. చాలాసేపు గడిచాక సిగరెట్టు వెలిగించి, "ఇంతసేపూ ఏం ఆలోచించావో చెప్పు?" అడిగాడు.

"ఈ ఫూల్. బాబీ నా జీవితంలో ఇంత ఆలస్యంగా ఎందుకు కలిశాడా అని ఆలోచిస్తున్నాను." ఎందుకో ఆమె కళ్ళు నిండాయి. "బాబీ ఐ హావ్ కమ్ ఎ లాంగ్ వే! ఎక్కడో గేదెలు కాసుకునే, ప్రపంచం ఏమిటో తెలీని ఆడపిల్ల. పిట్స్‌బర్గ్‌లో ఓ కార్పొరేట్ జెయింట్‌తో బియండబ్ల్యూ నడుపుతూ ఎస్ ఐ హావ్ కమ్ ఎ లాంగ్ వే!"

కారులో సెల్ మోగింది. శీను ఒహాయో నుంచి ఫోన్ చేశాడు. మొదటి సెమిస్టర్స్ అయిపోయాయి. రాత్రి బయలుదేరుతున్నానని.

"ఈసారి కారు కొనివ్వకపోతే నీ కారు ఎత్తుకుపోతాడు ఆ రాక్షసుడు జాగ్రత్త" అంది సీత ఫోన్ పెట్టేస్తూ.

"నాకు తెలుసు మేడమ్. ఆ రాస్కెల్ నీ పోలిక. అప్పుడే వాడి కారుకీ ఓ నిర్ణయం తీసుకున్నాను."

"అంటే?".. ఆశ్చర్యంగా చూసింది.

"నా కారు వాడికిచ్చేస్తాను."

"మైగాడ్! నీ కారు మీద ఎవరినీ చెయ్యివెయ్యనివ్వవు అలాంటిది నీ వోల్వో"

"శీను నాకు స్పెషల్. అందుకని"

"మరి నీకు.."

"నీ కారుని అప్పుడప్పుడు ఎరువు తీసుకుంటాను."

సీత బాబీ వీపు మీద చరిచింది. "యూ రోగ్. అందుకా నాకీ బియండబ్ల్యు ఇస్తున్నట్లు ఫోజు. నిజానికి నీ కోసం."

"ఆగాగు. కంపెనీకి బెంజి 220 డీసెల్ ఆర్డర్ చేశాం. నీ బోడి కారు నాకేం అక్కరలేదు"

గుడిముందు కారాగింది. ఇద్దరూ దిగారు.

●●●

జ్యూరిక్ ప్లాట్‌ఫారమ్ మీద రద్దీ ఎక్కువవుతోంది. ఎదురుగా ఆగిన రైలు కంపార్ట్‌మెంటుల్లోకి పాసింజర్లు ముసురుకుంటున్నారు. చలి మరీ ఎక్కువవుతోంది. శాలువా ఒంటికి మరింత దగ్గరగా లాక్కుంది సీత. మధూ రావడం ఆలస్యమైనందుకు విసుక్కుంది. కంచిపట్టు చలికి మరింత వణికిస్తోంది. ఏమీ తోచక బాగ్ తీసి టోంబోలిన్ చాక్‌లెట్ నోట్లో వేసుకుంది.

ఉన్నట్టుండి ఎవరో తనముందు నిలబడ్డారు. చూసింది. గుర్తురాలేదు. శరీరం బరువుగా ఉంది. చెవులకి పెద్దరింగులు. రక్తం ఒలికినట్టు ఎర్రటిచీర.

"యు...ఆర్" ఆగి, "సీత!" అని గావుకేక పెట్టి ఆవిడ సీతని కావలించుకుంది.

సీతకి ఆవిడెవరో ఇంకా గుర్తురాలేదు.

"మీకు నేను గుర్తుండనని నాకు తెలుసు. నేను మీ గురించి ఆలోచించినంతగా మీరు నా గురించి ఆలోచించి ఉండరు. నేను నిశి. ఆ రాస్కెల్ సన్నీ భార్యని."

సీతకి ఆ జ్ఞాపకం మనస్సులోంచీ కలచివేసినట్టనిపించింది. కానీ, నిశిలో ఏదో పొగరుంది, వేగం ఉంది, ఆవేశం ఉంది, అంతకు మించి జీవలక్షణం ంది.

"ఇక్కడేం చేస్తున్నారు?"

సీత చెప్పింది.

"చాలా సంవత్సరాల తర్వాత మళ్ళీ మిమ్మల్ని చూసినందుకు చాలా ఆనందంగా ఉంది. నిజానికి మిమ్మల్ని కలుస్తాననుకోలేదు. సన్నీ పోయాక ఆ ఎస్టేటంతా నాకొచ్చింది. ఇక్కడ మాన్ట్రో దగ్గర వెవేలో సెటిల్ అయాను. ఓసారి మా దగ్గరికి రాకూడదూ?"

సీత ఎందుకు రాలేదో వివరించింది.

సీతని చూసి నిశి ఉద్రేకపడిపోయింది. రైలు బయలుదేరేలోగా ఆమెకేదో చెయ్యాలని తాపత్రయం. చెయ్యి చూసుకుని చేతికున్న బ్రాస్‌లెట్ తీసి, వద్దంటున్నా సీత చేతికి తొడిగింది. సీత మొగమాటపడిపోయింది.

"జీవితంలో రెండే సంఘటనలు నాకు గుర్తుంటాయి. నాకిష్టం లేకపోయినా, సన్నీని పెళ్ళిచేసుకోవడం. చాలా ఇష్టంగా.. మీ కోసం.. మిమ్మల్ని అతని బారినుంచి రక్షించడానికి ఆ సన్నీని - ఆ రాస్కెల్ ఎలా పోయాడో తెలుసా? ఐ కట్ హిజ్ టెస్టికల్స్!" పగలబడి నవ్వింది అదేదో జోక్‌లాగా.

సీతకి తల తిరిగినట్టయింది. నిర్ఘాంతపోయి నిశిని చూస్తూ కూర్చుండిపోయింది.

రైలు కదులుతోందని ప్రకటన వచ్చింది. నిశి తప్పనిసరిగా లేచింది. ఒంగి సీతని రెండు చెంపలమీదా ముద్దుపెట్టుకుంది. "సన్నీ జీవితంలో మనసారా ప్రేమించిన మనిషి మీరే! నేను జీవితంలో మనసారా ఈర్ష్యపడిన మనిషి మీరే. మిమ్మల్ని ఎవరూ ప్రేమించకుండా ఉండలేరు. యూ ఆర్ స్పెషల్"

కంపార్టుమెంటు దాకా పరిగెత్తి, అంతలో వెనక్కి వచ్చింది. "ఆ కిటికీ దగ్గర కూర్చున్న అమ్మాయిని చూశారా?"

ఎర్రటి స్వెట్టర్‌లో ఊలు పిల్లిలాగా ఉంది పాప.

"నా కూతురు. సన్నీకే పుట్టింది. దాని పేరెమిటో తెలుసా?"

సీత ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎర్రసీత"

పరిగెత్తి రైల్లోకి దూకింది నిశి.

ఎర్రసీత ఆశ్చర్యంగా ఎర్రసీతని చూస్తోంది. ఈ ఎర్రసీత ఎర్రగా ఉంది. !!

●●●

## సమాప్తం

## ఎర్రసీత గురించి భువనచంద్ర

ఎక్కడో ఓ మారుమూల గ్రామంలో... ఓ గేదలు కాసేపిల్ల, 'అమెరికాలో' తేలేవరకూ సాగిన విచిత్ర పయనమే ఈ 'ఎర్రసీత' కథ. న్యాయానికి ఇది 'నవల'. కానీ 'కథ' అని ఎందుకన్నానంటే, ప్రతివాక్యం వెనుకా 'కథకుడే' కనిపిస్తాడు. ఈ నవల కాని నవలని చదువుతూ ఉంటే, సాక్షాత్తూ గొల్లపూడి మారుతిరావుగారే ప్రతిపదం వెనకా 'నిలబడి' కథ చెపుతున్నట్టుంటుంది. అయితే, భావచిత్రానికి మాత్రం ఏలోటూ లేదు. ఈ నవలలోని అన్ని పాత్రల్నీ మీ మనస్సనే అద్దంలో 'నిలువెల్లా' చూడొచ్చు. శైలి ఇనిమిటబుల్. అది కేవలం గొల్లపూడి మారుతీరావుగారికే చెల్లింది.. చెందింది అసలు 'నిజజీవితంలో' పాత్రలవంటి వ్యక్తులుంటారా?" అనే ప్రశ్న మీకు రావొచ్చు. ఉంటారు. ఉండితీరతారు. లేకపోతే మారుతీరావుగారు ఎందుకు రాస్తారు? ఓ అద్భుతమైన 'మానసిక పరిణామ'క్రమం ఈ 'ఎర్రసీతలో' మనకి ఆవిష్కారమౌతుంది. పట్టుదల. సెక్స్ ప్రేమగాని ప్రేమ. పెళ్ళిలాంటి పెళ్ళి. క్రమంగా 'ఆత్మపరిణయం' వైపు జీవితం మొగ్గి, అసలు స్త్రీ పురుషులకి కావల్సిందేమిటి? ప్రేమ % ఎంత? ప్రేమభావన % ఎంత? మనసుకి సుఖాన్నీ సంతృప్తినీ ఇచ్చేదేమిటీ? సెక్సా? రెండు మనసులకలయికా? ఇత్యాది అనేకానేక ప్రశ్నలకి 'కేవలం' సమధానమేగాక చక్కని చర్చ. వివరణ. విశ్లేషణాకూడా 'ఎర్రసీత'లో మనకి దొరుకుతుంది.

ఎర్రసీత, సన్నీ, సైరంధ్రి, నందిత, వీరాస్వామినాయుడు, మల్యాద్రి, రేణు, కొండలరావు, లక్ష్మీపతి, సుధాకర్, మోనా, బబిత, కొద్దిక్షణాలు ఈ నవలలో సంచరించినా తనదంటూ ఓ 'ముద్ర' వేసిన నిశి, ఇలా ఎన్నో పాత్రలు ప్రతి పాత్రా విశిష్టమైనదే 'తన'కంటూ ఓ ప్రాముఖ్యత ఉన్నదే

ఎవరి పాత్రగొప్పది?

తను 'హీరో'గా భావించినవాడు మరొక ఆడదాని ముందు హేళనంగా నవ్వాడని పట్టుదలతో చదువు'ని ఔపోసన పట్టి, ఓ అనామకుడ్ని పెళ్ళిచేసుకుని, 'హీరో'గార్ని 'చెప్పుదెబ్బ' ఎలా ఉంటుందో 'చెప్పు' పట్టుకోకుండానే చూపించిన ఎర్రసీతదా? –

'నా' అంటూ లేనివాడికి 'స్వర్గం' చేతికందితే? ఆ స్వర్గాన్ని తలమీదే పెట్టుకుని, చివరికి చెయ్యని నేరాన్ని నెత్తిమీద వేసుకుని, ఆ స్వర్గాన్నే దూరం చేసుకున్న కొండలరావుదా? –

ప్రతిక్షణం పక్కమీద కట్టుకున్న భార్యే, పక్కింటి ఆడదాన్నీ, ఆవిడ రహస్యాంగాల్నీ వర్ణించి వర్ణిస్తుంటే, మానసిక వ్యభిచారై ఆమె మీద ప్రేమని అనంతంగా పెంచుకుని కట్టుకున్నదాన్నీ బిడ్డనీ వదిలి పక్కింటి ఎర్రసీతతో అమెరికా వెళ్ళిపోయిన మాల్యాద్రిదా? -

ఇలా విశ్లేషిస్తూ పోతే ప్రతి పాత్రమీదా ఓ పుస్తకం వ్రాయాల్సి ఉంటుంది. మానసిక సంఘర్షణ - ఎటువంటి 'హిపోక్రసీ' లేని మానవత్వపు విలువ - విభిన్న మనస్తత్వాలు కలిగిన పాత్రలతో, పకడ్బందీగా నడిపించిన నవల ఈ ఎర్రసీత. 'మనోవిశ్లేషణ' మారుతీరావుగారి ప్రతికథలోనూ నవలలోనూ కనిపించి తీరుతుంది.

నవలా రచయితగా కంటే 'నాటక రచయిత'గా ఆయన లోకాన్ని చూసిన 'చూపే', ప్రతీపాత్రకీ ప్రాణం పోసిందాని నిర్ద్వందంగా చెప్పవచ్చు. దేశదేశాలూ తిరిగిన 'యాత్రికుడి'గా ఆయనకున్న అనుభవం, ఆంధ్రాలో పుట్టిన 'పాత్రల్ని' అమెరికాకి సునాయాసంగానూ అనాయాసంగానూ ప్రయాణింపజేసి చదువరులకి 'విదేశాల్ని' కూడా 'మనసుతో' వీక్షించే అదృష్టాన్ని కలుగజేస్తుంది. అతి విచిత్రంగా మలిచిన 'బబితా' 'నరసప్పడు' పాత్రలు కూడా ప్రతిరోజూ మనకి ఎదురయ్యేవే - ఈ నవల చదువుతుంటే కలిగే మరో అనుభవం ఏమిటంటే మారుతీరావుగారి ఇతర రచనల్లోలాగే, 'ఎర్రసీత'లో కూడా, చదివి నోట్ చేసుకుని, మళ్ళీ మళ్ళీ చదువుకుని ఆనందించదగ్గ 'కొటేషన్లు' చాలాఉన్నాయి. ఈ 'కొటేషన్సు' ఆయన మేధస్సులోంచి 'పుట్టు'కొచ్చినవే గానీ ఏ గ్రంథంనుంచో, గ్రంథాలయం నుంచో 'కొట్టు'కొచ్చినవి కావు.

***మచ్చుకి కొన్ని -***

"చదువుకునే వాళ్ళు రకరకాలు. విజ్ఞానం కోసం చదువుకునే వాళ్ళు. చదువుని 'ఆయుధం' చేసుకునేవాళ్ళూ.. చదువుని 'అవకాశం' చేసుకునే వాళ్ళు - చదువుని 'వినోదం' చేసుకునే వాళ్ళూ చదువుని అమ్ముకునే వాళ్ళూ.. ఇలా.."

"చాలామంది మేధావులికి బజారులో కూరలు బేరం చెయ్యడం రాదు. కానీ, కూరగాయలు అమ్ముకునేవాడికి 'మేధావి' అయ్యే అవకాశం వస్తే? అవాలనే కోరిక రెచ్చితే? అట్నించి నరుక్కురావడం అతివింతగా గొప్పగా ఉంటుంది" -

"భక్తిలో తన్మయుడైన భక్తుడికి దేవుడు ప్రత్యక్షమైతే, ఆదర్శానం కంటే భక్తి రుచే ఎక్కువగా మనసుకి నాటినట్టు".- (ఇందులో ఏముందనా? ఆలోచించండి. అద్భుతమైన అర్థం ఉంది.

"ప్రతివ్యక్తి 'చుట్టూ' ఉన్న చిన్న ప్రపంచంలో, తన 'రుచి'ని తాను ఎరగడం, తన 'ఆకలి'ని తాను అలంకరించుకోవడంలో గొప్పతనం ఉంది." -

'అవసరాన్ని' అలవాటు చేసుకోవడం సంప్రదయం!'

"స్త్రీకి మగాడు అవసరం. ఆ అవసరం తీరడానికి 'పెళ్ళి' అవసరం. పెళ్ళి 'నిలదొక్కుకోవడానికి స్త్రీ, మగాడికి అలవాటు పడటం అవసరం."

"మీ వారికి ఉప్మాలో జీడిపప్పు ఇష్టమా? స్నానాలగదిలో వీపు తోమడం ఇష్టమా? కాఫీని మీరు స్వయంగా తాగించడం ఇష్టమా? దీనికి ఎయిర్ కండీషన్డ్ గదులూ, లక్షల ఆస్తి అక్కరలేదు. ఈ మధురమైన సమన్వయం మనసులో ప్రారంభం కావాలి." -

"నాసిరకం సరుకు పక్కన అంతకన్నా కాస్త మెరుగ్గ ఉన్న మరో నాసిరకం సరుకు సులువుగా రాణిస్తుంది" -

"నీతి కూడా ఓ అలవాటు!" ***(ఫెంటాస్టిక్ మారుతీరావుగారూ)***

"ధనవంతుడు పేదవాడైతే కాస్త 'ప్రయత్నం'తో పేదరికానికి అలవాటు పడతాడు. కానీ పేదవాడు ధనవంతుడైతే మళ్ళీ పేదరికానికి దిగిరావడానికి అంగీకరించలేడు. మధ్య తరగతి జీవితం గడిపేవాడికి 'పై' అంతస్తు 'రుచి' వదలలేనిదీ, వదలాలని లేనిదీ!" -

'నీతి 'ముసుగు' తొలిగిపోయాక ఆనందనికి 'గణితమే' కొలబద్ద' -

'లోకంలో చాలా ప్రమాదకరమైన 'శక్తి' ఏది? తన సామర్థ్యం ఏమిటో తను తెలుసుకుని, ఆ సామర్థ్యంతో ఎదుటివారి మీద దెబ్బ తీయవచ్చునని తెలియడం. అలా దెబ్బతీసే మనస్తత్వం ఉండటం." -

"యవ్వనం అనే 'ఆయుధా'న్ని 'సంప్రదాయం' అనే ఉలిపిరి కాయితంలో చుట్టి మనపెద్దలు చాలా తరాలు. చాలా దశాబ్దాలు దాచిపెట్టారు. అందువల్ల అవినీతికీ, అవినీతిలో పడ్డ 'సెక్స్'కీ అందమైన 'మేలిముసుగు' దొరికింది" -

"సినిమాల్లో భవిష్యత్తు వెదుక్కునే అందమైన ఆడపిల్ల వేసే ప్రతి అడుగు 'ఆశ' అనే అద్భుతమైన మెట్టుమీద పడుతుంటుంది. ఆ మెట్లు తరగవు."

"పరాజయాన్ని అంగీకరించడం కష్టం. ఒప్పుకోవడం కంటే చెప్పుకోవడం ఇంకా కష్టం" -

"కష్టాల్లో ఇరుక్కున్న మనుషులకే కష్టాల విలువ అర్థమవుతుంది" ఇలా ఎన్నెన్ని ఉదహరించనూ?

అయ్యో! మారుతీరావుగారి రచనలు, పాత్రపేరుతో 'మనో విశ్లేషణ' చేస్తాయి. మీ మనస్సుని 'మీరే' విశ్లేషించుకునే స్థాయికి 'మిమ్మల్ని' పెంచటమే మారుతీరావుగారి జీవిత లక్ష్యం' అనిపిస్తుంది. 'ఎర్రసీతలో ఏం వుంది?' అనే కంటే 'ఏం లేదు?' అని అడగటం ఉత్తమం.

What You Learn is What You Earns రెండు చేతుల్తోటో సంపాయించుకోండి. 'జ్ఞానాన్ని' మనలోని 'మనని' ఐడెంటిఫై చేసుకోవడానికి 'ఎర్రసీత' చాలా గొప్ప రహదారిని చూపిస్తుంది.

చివరగా

నవల ఆఖర్లో పుట్టిన నిజమైన 'ఎర్ర'సీత, ఈ నవలకి 'సీక్వెల్'గా రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ

*భవదీయుడు*

*భువనచంద్ర.*